# సంగీత ప్రపంచం



డా॥ కె.వి.రావు

# అంకితం

పాటకు ప్రాణం పోసిన విశ్వవిఖ్యాత గాయకుడు, సంగీత దర్శకుడు **ఘంటసాల**గారికి,

వారి ధర్మపత్ని శ్రీమతి **ఘంటసాల సావిత్రి**గారికి



ఆత్మీయంగా, కృతజ్ఞతాపూర్వకంగా

ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

డా॥ కె.వి.రావు

# సంగీత ప్రపంచం

*(ఓంకారం నుండి ఆండ్రాయిడ్ వరకు)*

**రచన :**

**డా॥ కె.వి.రావు**

ఘంటసాల గానసభ

హైదరాబాద్ - 500 020

**సంగీత ప్రపంచం**
*(ఓంకారం నుండి ఆండ్రాయిడ్ వరకు)*
డా. కె.వి. రావు

**Sangeetaprapancham**
**Dr. K.V. Rao**

First Print : March, 2014

© Reserved

Price : **Rs. 180/-**

Copies : 500

**Dr. K.V. Rao**
28, 4th Floor, 1-1-79,
Bhagyanagar Apartments
Next to Sri Mayuri Cinema Hall,
RTC X Roads, Hyderabad - 500 020
Ph : 040 - 27630714, 9848742320

Sole Distributors : **Creative Links Publications**
1-8-725/A/1, 103-C
Balaji Bhagyanagar Apartments
Nallakunta, Hyderabad - 500 044
Cell : 98480 65658, 98485 06964
email : creativelinkspublications@yahoo.com

Printing :
**Sri Uday Printers**
D.No. 3-5-170/1/8/1/A
Narayanaguda, Hyderabad
Ph : 040 - 64511385

# ప్రపంచ వినోదం

'వినోదం' అనేది 'ఆఁ ఏముందిలే' అని చప్పరించి పారేసే వ్యర్థపదం కాదు. డబ్బులు సంపాదించే అనేక మార్గాలలో అతి ముఖ్యమైన పద్ధతి అని నచ్చచెప్పు కోవడానికి పనికివచ్చే పదబంధం కాదు. "విశేషమైన, వినూతనమైన విజ్ఞానంతో కలగలసిన ఆనందానుభూతిని అందించేది" అని దాని అసలు అర్థం. లలిత కళల పరమార్థం కూడా ఇదే.

వినోదానికి మనస్సే మూల స్థానం. మనస్సును ఆనంద పరచడమనేది అన్ని ప్రయోజనాలలో కెల్ల అతి ముఖ్యమైనది. అదే అన్ని ఒత్తిడుల నుంచి దూరంచేసి, వినూతన శక్తితో మనల్ని ముందుకు నడిపిస్తుంది. ఈ సామర్థ్యం లలితకళలకే ఎక్కువగా ఉంటుంది.

విన్న వెంటనే ఆనందం కలిగించే సంగీతం ఎన్ని పోకడలు పోయినా తన మూలాలను మరచిపోకుండా ఎదగ గలిగేట్టు చేయడం ప్రతి తరం మీద ఉండే ఒక గురుతర బాధ్యత. సంగీతంతో పాటు మిగిలిన కళలన్నీ మనకు ప్రకృతి ప్రసాదించినవే. ఆ ప్రకృతి నుండే మనం ఇంకా ఎన్నో సౌకర్యాలను, సాధనా సామాగ్రిని పిండుకుంటూనే ఉన్నాం.

అపౌరుషేయాలైన వేదాల నుండి ముచ్చటగా మూడు స్వరాలు పుట్టాయని ఈ పుస్తకం కూడా చెప్పుతున్నది. ఆ స్వరాలూ ప్రకృతి జన్యాలే.

మాటలు రాని మానవ లోకం నిశ్శబ్దంగా ఉన్నా 'నాదమయమైన ప్రకృతి' మనిషికి జోలపాడుతూ సంతోషపెడుతూనే ఉంది.

ప్రకృతిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ఆనాటి మానవుడు పశు పక్ష్యాదుల కలకంఠ కాకలీ ధ్వనుల నుండి స్వరాలను సేకరిస్తూనే ఉన్నాడు. 3, 4, 5 స్వరాలు కనుక్కున్నాక ఆరోసారి మయూరం నుండి క్రేంకార ధ్వని విన్న మనిషికి విపరీతమైన ఆనందం కలిగింది. కనుకనే ఆ స్వరానికి 'షట్‌జ' అంటే 'షడ్జమం' అనే పేరు పెట్టాడని కొందరి



శ్రీమతి ఘంటసాల సావిత్రి గారిని సత్కరిస్తున్న డా. పురుషోత్తమాచార్య

విజ్ఞుల అభిప్రాయం. సప్త స్వరాలు సమకూడాక మయూరధ్వని సంజనితమైన షడ్జమాన్నే మనిషి ఆధార స్వరంగా రూపొందించుకున్నాడు. ఎద్దు రంకెను రిషభంగా, మేక అరుపును గాంధారంగా, కొండకోనల్లో తిరిగే క్రౌంచ పక్షి పలుకును మధ్యమంగా, కోయిల కూతను పంచమంగా, గుర్రపు సకిలింతను దైవతంగా, ఏనుగు ఘీంకార ధ్వనిని నిషాదంగా ఏర్పరచుకున్న మనిషి వాటిని సప్త స్వరాలుగా రూపొందించుకున్నాడు.

చెట్టు కొమ్మలపై కూర్చుని "స్‌స్‌" అని వీస్తున్న గాలి అలలకు తోడుగా నెమలి, తన క్రీంకార ధ్వనిని మనిషి చెవిలో మెల్లగా ఊదింది. దాని పింఛంలోని కన్నులను రకరకాల కళల సమాహారానికి ప్రతీకగా భావిస్తున్నాం. నెమలి కూతలోని ప్రాణవాయువును ఆధారం చేసుకుని ఆ స్వరాన్ని 'స' అన్నాం. విచిత్రమేమిటంటే ప్రపంచంలో ఉన్న అన్ని సంగీత రీతులకు ఇంచుమించుగా ఈ 'స' కారమే ఆధార స్వరంగా రూపు దాల్చిందని పరిశోధకులు చెప్పడం ... ఆంగ్ల అక్షరమాలలో మొదటి రెండక్షరాలైన AB లను వదిలి 'C' తో స్వరాలు ప్రారంభం కావడం ఒక చిన్న ఉదాహరణ. C D E F G A B అనే అక్షరాలు పాశ్చాత్య సంగీత ప్రారంభ స్వరాలుగా ఉండడాన్ని గమనిస్తే మన భారతీయ సంగీత సృష్టికర్తలైన ప్రాచీన మహర్షుల క్రాంత దర్శనంలోని గొప్పతనమేమిటో సులభంగా తెలుస్తుంది.

మనలో చాలామంది 'ప్రపంచీకరణ లక్షణం' గురించి తెలుసుకోలేక ఆధునికత అనే భ్రమలో మునిగిపోయి భారతీయ సంగీత మూలాలకు అపచారం చేస్తున్నారేమోనని అనుమానించవలసి వస్తున్నది.

రెండు ఉదాహరణలు మనవి చేస్తున్నాను.

1. క్రీ.పూ. సంగీతం అంటే

*"గీతవాదిత్ర నృత్యానాం*

*త్రయం సంగీతముచ్యతే"*

అనే నిర్వచనాన్ని పాటించారు పూర్వీకులు. అంటే పాట, వాద్యం, నృత్యం మూడూ కలసిన ప్రక్రియే సంగీతం అన్నమాట. ఈ మూడిటిని వేర్వేరు వ్యక్తులు నిర్వహించారు ఆనాడు. కాని ఈ మూడూ కలిపి ఒక్కరే పాడుతూ, గిటార్ వాయిస్తూ నృత్యాన్ని నిర్వహిస్తూ దీన్నే 'ఆధునికత' పేరుతో వ్యవహరించడం మనందరికి తెలిసిందే కదా ! క్రీస్తు శకం ప్రారంభంలో సంగీత నిర్వచనం మారిపోయింది. శ్రుతి, రాగం, తాళం అనేవి సుశ్రావ్యంగా ఉంటేనే అది నిజమైన సంగీతం అనే దాన్ని మనం సరిగా అనుసరిస్తున్నామా ? అని ఆత్మపరిశీలన చేసుకోవలసి ఉంది.

2. అరవై ఏండ్ల క్రితం గ్రామఫోను రికార్డులను ప్లేచేస్తూ, దాని కనుగుణంగా నృత్యాలు చేస్తే వాటిని 'రికార్డింగ్ డ్యాన్స్ ట్రూపులు' అని తక్కువ చూపు చూసిన మనం ఈనాడు "స్కూల్‌డే, కాలేజ్‌డే, ఫ్రెషర్స్‌డే, బర్త్‌డే, న్యూకమర్స్‌డే, పెళ్ళిళ్ళు మొదలైన అన్ని సందర్భాలలోనూ సి.డి. ప్లేయర్లలో సినిమా పాటలకు గంతులేస్తూ "ఇదే లేటెస్ట్ ఫ్యాషన్" అనడం ఎంత ఆత్మవంచన అవుతుందో ఒక్కసారి ఆలోచించాలి.

అంటే మన భారతీయులు ఎప్పుడో ప్రవేశపెట్టిన ప్రక్రియలను పాశ్చాత్యులు ఇప్పుడనుసరిస్తే, వాటిని కాపీ కొట్టేసిన వాళ్ళకివి కొత్తగా కనిపించడం విడ్డూరమే కదా!

ఇలాంటి ఆలోచనలన్నిటినీ రేకెత్తింపజేసిన ఈ పుస్తకాన్ని డా. కె.వి. రావుగారు ఎంతో పరిశోధనాత్మకంగా రచించారు. రికార్డింగ్ పుట్టుక, దాని నేపథ్యం, స్వరూప వికాసం, సామాజిక అవసరం, సాంకేతిక విజ్ఞాన పరిణామాని కనుకూలంగా జరిగిన వినూతన కృషి, సంగీతపు విలువల పరిరక్షణ మొదలైన అంశాలన్నీ సాధికారికంగా ఈ గ్రంథంలో పేర్కొనడం గొప్ప విశేషం. హెచ్.యమ్.వి. (HMV) వారి కుక్కబొమ్మ కథ, సంగీత చరిత్ర, సప్త స్వరావిర్భావం, వాటి మూలాలను చక్కగా పొందుపరిచినారు.

రికార్డింగ్ సౌకర్యాలు పెరుగుతున్నకొద్దీ కొత్త కొత్త కళాకారుల ప్రతిభా నైపుణ్యాలు బహుముఖాలుగా పరిచయం కావలసి యుండగా సినిమాలకు, రికార్డులకు

అస్సలు సంగీత పరిజ్ఞానమే అక్కరలేదనీ, ఏదన్నా తేడా వస్తే కంప్యూటరే సవరించు కుంటుందిలే అనీ కొందరు నిపుణులిచ్చిన భరోసాతో సినిమా సంగీతరంగంలో తీవ్ర ధోరణుల ప్రాబల్యం పెరిగింది. దాంతో 'క్వాలిటీ' క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. శ్రుతి, లయ, ఉచ్చారణ, మాధుర్యం లాంటివన్నీ ఎవరికి వారికే ముద్దొచ్చే కాకి పిల్లలై పోతున్నాయి. నేటి యువతరానికి, రేపటి నూతన తరానికి చెవుల్లో హోరును నిర్బంధంగా నింపేస్తూ "ఇదే శ్రావ్యత" అనుకోమంటూ శాసించడం బాగా పెరిగిపోతున్నది. రికార్డింగులో ఏది ఎంత వినబడాలన్న 'లెక్కలు' ప్రక్కకు పెట్టేసి సాగిపోతున్న ఆధునిక 'రికార్డింగు ప్రక్రియలో అన్ని వర్గాల అభిరుచులు' అనే మర్యాద కూడా మాయమైపోతున్నది.


ఎడిసన్ గారి ఫోనోగ్రాఫ్ నుండి క్రమంగా గ్రామఫోన్, స్టీరియో, స్పూల్‌టేప్, కాసెట్, సి.డి., మెమరీకార్డ్, చిప్స్ లాంటి అనేకావతారాలెత్తిన సంగీత ధ్వని ముద్రణ యంత్రాలన్నీ మానవుని చేతిలో ఒదిగిపోతూ వాటి పని అవి చేస్తున్నాయి. వాటిని సక్రమంగా ఉపయోగించుకునే మేథాస్థాయిని మనిషి అందుకున్నా, దాన్ని "కళాప్రతిభ"ను ప్రకటించేందుకు కాక వ్యాపార మార్గాలతో సుసంపన్నం చేసుకోవడానికి వినియోగించడం ఎప్పుడైతే ఆగిపోతుందో అప్పుడే 'రికార్డింగ్ చరిత్ర'కు మనం సరియైన న్యాయం చేసినవాళ్ళమవుతాం.

ఓంకారం నుండి ఆండ్రాయిడ్ దాకా మనల్ని హాయిగా ప్రయాణం చేయించిన డా. కె.వి. రావు గారు ఎంతో ధన్యులు.

ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివితే, పండు తిన్న ఆనందమే కాక, పండును పండించిన సృష్టికర్తకు కృతజ్ఞతలు చెప్పుకునేంత పరమానందానుభూతి కూడా మనందరికి కలుగుతుందని విశ్వసిస్తున్నాను.

ఇంత మంచి పుస్తకానికి నాతో ఈ నాలుగు మాటలు రాయించిన పరమహితులు డా. కె.వి. రావు గారికి అభినందన పూర్వక అభివందనాలు తెలుపు తున్నాను.

రసజ్ఞ విధేయుడు



**(డా॥ యం. పురుషోత్తమాచార్య),** నల్గొండ

# మనసులోని మాట

నాకు చిన్న వయస్సు నుండి ఘంటసాల పాటన్నా, గ్రామఫోన్ రికార్డులన్నా అమిత ఇష్టం.

మాది గుంటూరు. మా నాన్నగారు కీ.శే. కర్లపాలెం హనుమంతరావుగారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో అప్పర్ డివిజన్ క్లర్క్‌గా పనిచేసారు. నాకు ముగ్గురు అన్నయ్యలు. నరసింహారావు, కామేశ్వరరావు, పాండు రంగారావు. ఇద్దరు అక్కయ్యలు. కీ.శే. శకుంతలాదేవి, ఇందిరాదేవి. నేను ఆఖరివాడిని.

అతి చిన్నవయస్సులో మా అమ్మ సావిత్రి గారు తన 38వ ఏటనే స్వర్గస్థులైనారు. నేనూ, మా చిన్నక్క ఇందిరాదేవి అమ్మ కావాలని గొడవ చేస్తుంటే మా నాన్నగారు, మా పెద్దన్నయ్య కొలంబియా కంపెనీ వారు తయారుచేసిన బాక్స్ మోడల్ గ్రామఫోన్, దానితో బాటుగా 30 గ్రామఫోన్ రికార్డులు 1950లో కొన్నారు.

ఆ గ్రామఫోన్ రికార్డులలో త్యాగరాయ భాగవతార్ (తమిళ భాషలో గొప్ప గాయకుడు) గానం చేసిన జయకృష్ణా ముకుందా మురారి, యమ్.ఎస్. సుబ్బులక్ష్మి పాడిన పాటలు, లైలా మజ్నూ, కీలుగుఱ్ఱం, స్వర్గసీమ, బర్సాత్, దులారి ... ఇలా తెలుగు, హిందీ పాటలున్నాయి. తర్వాత స్వప్నసుందరి, పల్లెటూరి పిల్ల (శాంతవంటి పిల్ల లేదోయి), బాలాంత్రపు రజనీకాంతరావు, భానుమతి గార్లు పాడిన పసిడి మెఱుంగుల తళతళలు మొదలైన రికార్డులు ఎన్నో కొనేవారు.

మా ఇంటి ప్రక్క భాగంలో యుద్దనపూడి శేషగిరిరావు గారు ఉండేవారు. ఆయన శ్రీ మాజేటి గురవయ్య హైస్కూలులో టీచర్. వాళ్ల పెద్దబ్బాయి కిష్టప్ప అప్పటికే కాలేజీలో చదువుతూ ఉండేవాడు. అతను తెలుగు, హిందీ సినిమాలలోని రికార్డులు, తెలుగులో ప్రైవేట్ గీతాల రికార్డులు (ఘంటసాల, రాజేశ్వరరావు, యమ్.యస్. రామారావు, రావు బాలసరస్వతీదేవి) విపరీతంగా కొంటూ ఉండేవాడు. వాళ్లింట్లో

HMVవారు తయారుచేసిన 'కీ' ఇచ్చే గొట్టము గ్రామఫోన్ ఉండేది. పిల్లలందరము కూర్చుని పాటలు వింటూ ఉండేవాళ్లము.

అలా ఎందరో గాయనీ గాయకుల పాటలు విన్నాను. నాకు ఘంటసాల గారి కంఠము అతిగా నచ్చింది. అలాగ ఘంటసాల పాట అన్నా, గ్రామఫోన్ రికార్డులన్నా విడదీయని అనుబంధము ఏర్పడింది.

మా ఇంటి వెనుక భాగంలో న్యాయపతి పద్మావతమ్మ గారు ఉండేవారు. భర్త చనిపోయారు. ముగ్గురు కుమార్తెలు కృష్ణవేణి, సీత, కళ్యాణి. కృష్ణవేణి గారి భర్త శేషాద్రిరావు తెనాలి రైల్వేస్టేషన్ మాష్టరు. గుంటూరు నుంచి తెనాలికి నేను మా అన్నయ్య, అక్కయ్యలు ఇంటర్‌క్లాస్‌లో (పరుపుల భోగి అనేవారు) గ్రామఫోన్, గ్రామఫోన్ రికార్డులు తీసుకువెళ్లి వినేవాళ్లము. అలాగే మా ఇంటికి దగ్గరలో ఉన్న మా పెద్ద మేనమామ దేశిరాజు కామేశ్వర రావు గారింటికి కూడా గ్రామఫోన్ తీసుకువెళ్లి పాటలు వినేవాళ్లము.

1955 ప్రాంతంలో 'నందనార్' హరికథ గ్రామఫోన్ రికార్డుల సెట్టుగా వచ్చింది. చుట్టుప్రక్కల వారు వచ్చి ఆ హరికథ రికార్డులు పెట్టించుకుని విని అయిపోగానే శివునికి నమస్కరించేవారు. ఇలాగ చిన్ననాటి మధురస్మృతులు ఎన్నో.

నా చిన్నతనంలో ఇళ్లలోను, హోటల్స్‌లోను హాస్యగీతాలు, మనోహర చిత్రంలోని సంభాషణలు, జానపద గీతాలు, నాటకాలు మొ. గ్రామఫోన్ రికార్డులు ఎన్నో పెట్టేవారు.

నేను పి.యు.సి., బి.యస్‌సి. గుంటూరు హిందూ కాలేజీలో, M.Sc., Ph.D విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేసాను.

నేను ఆంధ్ర విశ్వవిద్యాలయములో చదివేటప్పుడు అశోకవర్ధన హాస్టల్‌లో గ్రామఫోన్, రేడియో అమర్చిన రూమ్ ఉండేది. మధ్యాహ్నము లంచ్ టైములో ఒక గంట, సాయంత్రము 5 నుంచి 7 గంటల వరకు గ్రామఫోన్ రికార్డులు పెట్టేవారు. దీనికి ఒక ఉద్యోగి ఉండేవాడు. స్పీకర్స్ బయట ఉండి పాటలు ఎంతో దూరము వినిపించేవి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు పాటలు పెట్టేవారు. గ్రామఫోన్ రికార్డుల సెలక్షన్‌లో నేను ఒక మెంబరుగా ఉండేవాడిని.

M.Sc లో నా క్లాస్‌మేట్ సి. చంద్రశేఖర్ (తెనాలి) ఉండేవాడు. అతనికి గ్రామఫోన్ రికార్డ్స్ అంటే పిచ్చి. ధనవంతుడు. రికార్డులు తెగ కొనేవాడు.

ఆ రోజుల్లో విశాఖపట్టణంలో గ్రామఫోన్ రికార్డులు అమ్మే షాపులు చాలా ఉండేవి. వాటిలో 'రేడియో హోం' చాలా పెద్దది. ఫలానా గ్రామఫోన్ రికార్డులు వచ్చాయి అని చంద్రశేఖర్‌కి ఉత్తరం రాస్తే మేమిద్దరము వెళ్లి కొనేవాళ్లము.

ఫిజిక్స్ చదువుతున్న మిత్రుడు అందె గోపాలకృష్ణకు ఇంగ్లీష్ పాప్ సంగీతము అంటే పిచ్చి. స్నేహితులందరిని పిలిచి ఆ సంగీతపు రికార్డులు పెట్టి వినిపించేవాడు. పాప్ సంగీతము గురించి లెక్చర్స్ ఇచ్చేవాడు.

రెండు సంవత్సరములలోనే రసాయనిక శాస్త్రంలో డాక్టరేట్ కొరకు "థీసిస్" (Thesis) ను ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సబ్‌మిట్ (Submit) చేసి చరిత్రను సృష్టించాను.

నా థీసిస్‌ను పరీక్షించిన బ్రిటిష్ యూనివర్సిటీలలోని ముగ్గురు బ్రిటిష్ ప్రొఫెసర్ల సిఫార్సుతో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 'డాక్టరేట్' ప్రసాదించారు. ఈ మొత్తము ప్రక్రియ 2 సంవత్సముల 8 నెలలో జరగటము ఒక చరిత్ర. నా పరిశోధనలకు గైడ్ (Guide) గా వ్యవహరించిన కీ.శే. ప్రొ. వి. పాండురంగారావు గారిని ఎలా మరిచి పోగలను ?

నేను Ph.D పూర్తి చేసి బెంగుళూరు హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్‌లో ఆఫీసర్‌గా చేరాను (1972). అక్కడకూడా లంచ్ సమయంలో తెలుగు, తమిళము, కన్నడ, మలయాళము, హిందీ భాషలలో పాటలు, గ్రామఫోన్ రికార్డుల ద్వారా వినిపించేవారు. బెంగుళూరులో చాలామంది స్నేహితులు వచ్చి మా ఇంట్లో గ్రామఫోన్ రికార్డులు పెట్టించుకుని వినేవారు. ఘంటసాల గారి భగవద్గీత వాళ్లందరూ విపరీతంగా వినేవారు.

బెంగుళూరులో సెయింట్ మార్క్స్ రోడ్, కమర్షియల్ స్ట్రీట్, మహాత్మాగాంధీ రోడ్ ఇలాగ ఎన్నోచోట్ల గ్రామఫోన్ రికార్డులు అమ్మే పెద్ద పెద్ద షాప్స్ ఉండేవి. ఎన్నో మంచి మంచి రికార్డులు దొరికేవి.

నెల్లూరుకు చెందిన నారాయణరెడ్డి గారు బెంగుళూరు మినర్వా సర్కిల్‌లో గ్రామఫోన్ రికార్డుల షాప్ (చాలా పెద్దది)ను నిర్వహించేవారు. సాయంత్రం పూటల ఆ షాపులో కూర్చుని పాటల గురించి చర్చించుకునేవాళ్లము. ఇలాగ గ్రామఫోన్ రికార్డులతో అనుబంధము పెరుగుతూ వచ్చింది.

బెంగుళూరులో రెండుసార్లు నా గదిలో దొంగలు పడి గ్రామఫోన్ రికార్డులు ఎత్తుకెళ్లారు. అలాగ మంచి పాటల 78 RPM రికార్డులు చాలా పోగొట్టుకున్నాను. చాలా బాధాకరమైన విషయం.

నేను 1980 నుంచి 1995 వరకు (RPG) సంస్థలో (హైదరాబాద్) పనిచేశాను. HMV కంపెనీను RPG సంస్థ కొనుగోలు చేసింది. అందుకని కలకత్తాలోని డమ్‌డమ్‌లోని గ్రామఫోన్ కంపెనీను చూసే అదృష్టము కలిగింది.

గ్రామఫోన్ రికార్డుల తయారి నుంచి అనేక విషయాలు తెలుసుకున్నాను.

ఆ తర్వాత బిర్లా సంస్థ హైదరాబాద్ ఇండస్ట్రీస్, హైదరాబాద్‌లో రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసాను.

ఆ పదవిలో ఉన్నప్పుడు మా ఎక్సిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వంగల పట్టాభి గారి పర్యవేక్షణలో 'బిల్డింగ్ మెటీరియల్స్'లో చేసిన పరిశోధనలకు రీసర్చ్ డిపార్ట్‌మెంట్‌కు 2000 సంవత్సరములో జాతీయ పురస్కారం లభించింది. యాజమాన్యము ఈ బిల్డింగ్ మెటీరియల్‌ను తయారుచేసే ఫ్యాక్టరీలు నెలకొల్పి అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇది గర్వించదగిన విషయం.

'హాసం' హాస్య సంగీత పత్రికకు 'కన్సల్‌టెంట్'గా వ్యవహరించాను. యాజమాన్యము వారికి కృతజ్ఞతలు.

మదరాసు వెళ్లినప్పుడల్లా సెంట్రల్ స్టేషన్ ప్రక్కనున్న మూర్ మార్కెట్‌లో గ్రామఫోన్ రికార్డులు కొంటూ ఉండేవాడిని. నాకు గ్రామఫోన్ రికార్డుల మీద ఉన్న ఆసక్తిని గమనించిన వారు వారి వద్ద నున్న గ్రామఫోన్ రికార్డులను బహుమతిగా ఇచ్చారు. వారిలో రమేష్ (వరంగల్), గాయని రమణకుమారి, ఎన్. కృష్ణమూర్తి మొదలైనవారు. వారికి కృతజ్ఞతలు.

గ్రామఫోన్ రికార్డ్స్, HMV కంపెనీ మీద ఉన్న అభిమానంతో, భారతదేశంలోని HMV కంపెనీకి నూరు సంవత్సరాలు నిండిన సందర్భంలో వ్రాసిన వ్యాసం శత వసంతాల HMV 2003లో 'వార్త' దినపత్రికలో ప్రచురింపబడినది.

'హాసం' వారు 2006లో ప్రచురించిన 'హిందీ గేయ వైభవం -1' (మహమ్మద్ రఫీ పాటల అర్థాలు, సందర్భాలు)లో గ్రామఫోన్ రికార్డులపై ముందుమాటగా ఒక దీర్ఘ వ్యాసం వ్రాశాను. ఇది వ్రాయమని ప్రోత్సహించిన వ్యక్తి హాసం సంచాలకులు MBS ప్రసాద్. గ్రామఫోన్ రికార్డుల చరిత్ర గురించి ఒక పుస్తకము వ్రాయమని ప్రోత్సహించింది కూడా ప్రసాదుగారే.

గ్రామఫోన్ రికార్డుల చరిత్ర గురించి రాస్తూ శబ్దము రికార్డింగ్‌లో అనేక నూతన పద్ధతులు ప్రవేశపెట్టడం వలన వాటిని గురించి కూడా రాస్తే బాగుంటుందనిపించి వ్రాసాను. పుస్తకపు వ్రాతప్రతిని చదివిన ప్రసాద్ గారు ఆండ్రాయిడ్ గురించి కూడా వ్రాయండి. 'ఓంకారము నుంచి ఆండ్రాయిడ్ వరకు' ఉంటుంది అని సలహా ఇచ్చారు. MBS ప్రసాద్ గారికి కృతజ్ఞతలు తెలియచేయడం తప్ప ఏమి చేయగలను ?

ఈ పుస్తకము వ్రాయటానికి సంగీతానికి, నాటకాలకు, జానపద కళలకు సంబంధించిన పుస్తకాలు, మాగజైన్స్, దినపత్రికలు, వారపత్రికలు, నేను గ్రామఫోన్ కంపెనీ నుంచి సేకరించిన విషయాలు, నా దగ్గర ఉన్న వందల గ్రామఫోన్ రికార్డులు వాటి స్లీవ్స్ మీద ఉన్న విషయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

కొందరి కళాకారుల బొమ్మలు, జీవిత విశేషాలను ప్రధానంగా 'ఇంటర్నెట్' ద్వారా సేకరించాను. వ్యాసాలను, పుస్తకాలను రచించిన, ప్రచురించిన వారికి, పత్రికా సంపాదకులకు, నెట్‌లో ఎన్నో విషయాలను తెలియజేసిన రచయితలకు, వాటిని ప్రచురించిన వారికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నాకు గ్రామఫోన్ రికార్డుల గురించి ఎన్నో విషయాలను తెలియచేసిన రికార్డ్స్ కలక్టర్స్, ఆప్తమిత్రులు జె. మధుసూదన శర్మ గారికి (హైదరాబాద్), డి.యస్. శంకర్ (వక్కలంక) గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

గ్రామఫోన్ రికార్డుల చరిత్ర గురించి ఎన్నో అద్భుత విషయాలను ధారావాహికంగా "హిందూ" దినపత్రికలో తెలియచేసిన శ్రీ సురేష్ చంద్ వన్‌కార్ గారికి (సొసైటి ఆఫ్ ఇండియన్ రికార్డ్ కలక్టర్స్) ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ వ్యాసాలు ఈ పుస్తక రచనకు ఎంతగానో ఉపయోగించాయి. ఈ వ్యాసాలను ప్రచురించిన

'హిందూ' యాజమాన్యము వారికి, ఈ వ్యాసాలను నాకు అందచేసిన ఆప్తమిత్రులు రాజగోపాల్ (హైదరాబాద్) వారికి కృతజ్ఞతలు.

డి.టి.పి. చదివి తగిన సూచనలు ఇచ్చి పుస్తకము గురించి ముందుమాట వ్రాసిన ఆప్తమిత్రులు ఘంటసాల అభిమాని నల్గొండ నివాసులు డా. యం. పురుషోత్తమాచార్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నా అభివృద్ధికి ఎంతో శ్రమించిన నాన్నగారు, అమ్మమ్మ దేశిరాజు మాచమ్మ, మామయ్యలు కామేశ్వరరావు, సుబ్బారావు, అన్నయ్యలు, అక్కయ్యలకు ఎంతో ఋణపడి ఉన్నాను.

నన్ను, నా కుటుంబాన్ని ప్రేమానురాగాలతో చూచుకునే వదినలకు, బావగారికి, అన్నయ్యల పిల్లలకు, అక్కయ్యల పిల్లలకు ప్రత్యేక కృతజ్ఞతలు. మాకన్నా చిన్నవారైన మా పెద్దమామయ్య పిల్లలు ఈనాటికి సత్సంబంధాలు కొనసాగించుతున్నందుకు వారికి కూడా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

నాకు అన్నివిధాల అండగా వుంటున్న మా వియ్యంకులు వై.వి. రాఘవరావు, డా. బి. సత్యనారాయణ, అల్లుళ్ల వివేక్, డా. విశాల్‌కుమార్, పుత్రికలు శ్రీల, రమలకు కృతజ్ఞతలు. నాకు అన్ని విధాల సహకరిస్తున్న నా శ్రీమతి శారదకు కృతజ్ఞతలు.

శ్రీమతి ఘంటసాల సావిత్రిగారికి, ముద్దు నరసింగరావు, ఎన్.వి.ఎస్. చలపతి, శ్రీమతి పి. ఇందిరాదేవి (జర్నలిస్ట్) గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని సుందరంగా తీర్చిదిద్దిన శ్రీ ఉదయ్ ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తక పంపిణీదారులు నాకు అత్యంత ఆత్మీయులు అయిన మాటూరి సూరిబాబు, తాళ్ల శ్రీకాంత్ గార్లకు (క్రియేటివ్ లింక్స్ పబ్లిషర్స్) కృతజ్ఞతలు.

**డా॥ కె.వి.రావు**

# సంగీత ప్రపంచం

*(ఓంకారం నుండి ఆండ్రాయిడ్ వరకు)*

## భారతదేశ సంగీత చరిత్ర

ప్రపంచములోని కొన్ని దేశములలో ఒక ఆచారము ఉంది. వారు ఏదైనా పండు తినే ముందర "ఈ చెట్టు నాటి, ఈ ఫలములను అందించిన మహానుభావులందరికి నమస్కారములు" అని తలచుకున్నతర్వాతే తింటారుట. అలాగే వేదకాలము నుంచి మన భారతీయ సంగీతం దినదినాభివృద్ధికి ఎందరో మహానుభావులు కృషి చేసారు. ఆ మహానుభావులను మనము సంస్మరించుకోకపోతే సంస్కారహీనులమవుతాము. ఆ మహానుభావులను స్మరించుకోవాలంటే భారత దేశ సంగీత చరిత్రను తప్పక తిరగవేయవలసిందే. సంగీతచరిత్ర గురించి సంగ్రహముగా తెలుసుకుందాము.

ప్రపంచము నాదమయం. ప్రకృతి కూడా సంగీతం ఆలపిస్తూనే వుంటుంది. మందమైన గాలికి కదిలే ఆకుల చప్పుళ్లలో, జలజల పారే నీరు చేసే గలగల శబ్దంలో, పక్షుల కూతలలో ఇలాగ దేనిలో చూచినా మనకు సంగీతము వినిపిస్తుంది. ప్రతి జీవి కూడా సంగీతముచే ఆకర్షించబడుతుంది. ప్రపంచప్రజల భాష సంగీతం. మనసును కదలించేది, మనుష్యులలో చైతన్యాన్ని రగిలించేది, మనస్సుని ఉద్రేకింప చేయుటకు ఉపయోగించు భాష సంగీతం అని చెప్పవచ్చు. ఇది ఒక విద్య. ప్రపంచ విద్యలన్నింటిలో ఉత్కృష్టమైన విద్య. శబ్దములతో సంబోధించినట్టి విద్య. సంగీతము మానవుని యొక్క స్వంత తెలివి తేటలవలన అభివృద్ధి చేయబడినది.

మానవులకి సంతోషం వచ్చినా, దుఃఖం కలిగినా గుండె చప్పుడు పెదవుల మీద ప్రతిధ్వనిస్తుంది. రైతులు పొలాలను దున్నుతున్నప్పుడు, నాట్లు వేస్తున్నప్పుడు,

ధాన్యపుకుప్పలను నూరుస్తున్నప్పుడు, బరువులను పైకి ఎత్తుతున్నప్పుడు మొదలైన సందర్భాలలో మనకు వినిపించేది వారి కంఠాలనుంచి వచ్చే సంగీతమే. అంటే శ్రమజీవుల కష్టాలను మరచిపోయేలా చేసి కొత్తశక్తిని వారికి ఇచ్చేది సంగీతమే.

**సంగీతం పుట్టుక :** సర్వేశ్వరుడు పరబ్రహ్మమై గుణము, రూపము, పేరులేని వాడై ప్రకాశిస్తున్నప్పుడు రూపము, గుణము ఇత్యాదులు గల సంపూర్ణమైన ప్రపంచాన్ని సృష్టించాలనే కోరిక కలిగింది. ఆ సంకల్పములోనే ఓంకారము పుట్టింది. ఆ ఓంకారములోని అకార, ఉకార, మకారాలనే మూడు అక్షరములవల్ల సంగీతము పుట్టింది. ఈ మూడు అక్షరాలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపము. అందువలన ఓంకారం పరబ్రహ్మ స్వరూపం. ఆ ఓంకారమునందే సర్వజగత్తు పుట్టినదన్నమాట.

**వాయిద్యాల పుట్టుక :** పంచముఖుడైన (సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన) సదాశివుని ఒకనాడు పార్వతీదేవి సంగీత శాస్త్రము గురించి తెలియచేయమని కోరింది. అందుకు ఈశ్వరుడు పార్వతీదేవితో ఈ విధంగా చెప్పాడు.

సర్వలోకములకు సుఖము కలుగుట కొరకు తొలుతగా నా సద్యోజాత ముఖము వలన గాంధార స్వరము, భూమి పుట్టాయి. భూమిచే చర్మవాద్యములు సంభవించాయి.

వామదేవముఖము వలన దైవత స్వరము, జలమును జన్మించాయి. ఆ జలముచేత శంఖాది వాద్యములు ఆవిర్భవించాయి.

తత్పురుష ముఖము వలన పంచమ స్వరము, వాయువు పుట్టాయి. ఆ వాయువు చేత తంత్రీవాద్యములు ఉత్పన్నమైనవి.

ఈశాన ముఖము వలన మధ్యమ, నిషాద స్వరములు, ఆకాశము జనించాయి. ఆకాశము చేత శబ్దము పుట్టినది'' అని సంగీతశాస్త్రము గురించి శంకరుడు చెప్పాడు.

అఘోరముఖము వలన షడ్జ, ఋషభ స్వరములు, అగ్ని ఆవిర్భవించెను. ఆ వహ్ని చేత కాంస్య వాద్యములు ప్రభవించాయి.

సంగీతమునకు సరస్వతీదేవి ఆదిదేవతగా పరిగణించబడుతున్నది. భరత ఋషివర్యులే శంకరునిచే సృష్టించబడిన సంగీతాన్ని దేవతలకు నేర్పారు. ప్రపంచమునకును, గంధర్వలోకమునకు తిరుగుచున్న నారదమహర్షి, మరియు తుంబురుని వలన మానవులు సంగీతమును తెలుసుకున్నారు. భారతీయ సంగీతం వివిధ కాలములలో ఏ విధంగా అభివృద్ధి, మార్పు చెందినదో తెలుసుకొందాము.

**వేదకాలం :** వేదాలు ఎవరు రచించలేదు. సాక్షాత్తూ భగవంతుని కంఠము నుండి స్వంత ప్రేరణతో వినిపించబడినవి. వేదకాలంలో వేదమంత్రాలను అక్షరరూపంలో

మొదటిసారిగా వ్రాయటం ప్రారంభించినప్పుడు మూడు స్వరాలను మూలముగా భావించారు. ఈ ముఖ్య స్వరాలు అతిప్రాచీన భాష అయిన సంస్కృతము నుంచి తీసుకొనబడ్డాయి. వేదమంత్రాలు నిడివైన శ్లోకరూపంలో చెప్పబడ్డాయి.

వేదమంత్రాలను పాడేటప్పుడు హెచ్చుస్థాయిలో పాడిన దాన్ని 'ఉదాత్తము అని, తక్కువ స్థాయిలో పాడిన దాన్ని 'అనుదత్తము' అని, హెచ్చు, తగ్గుస్థాయిల కలయికను 'స్వరితము' అని పిలుస్తారు. హెచ్చుస్థాయిలో పాడిన స్వరము మీద చిన్న నిలువు గీత వ్రాస్తారు. తక్కువ స్థాయిలో పాడిన స్వరము క్రింద చిన్న అడ్డగీత రాస్తారు. అంటే ఈ నిలువు అడ్డగీతలు హెచ్చు, తగ్గు సమ స్థాయిలలో పాడే విధానాన్ని తెలియజేస్తాయన్నమాట.

ఉదాత్త, అనుదాత్తల కలయిక ఏ చిహ్నము ద్వారా సూచింపబడదు. అంటే స్వరలిపి (నొటేషన్స్) రాసే పద్ధతి అతి ప్రాచీనమైనదని తెలుస్తున్నది.

**సప్తస్వరాలు :** సంగీతకళకు పునాది అయిన మొదటి స్వరం ధ్వని శాస్త్రానికి సంబంధించిన కొన్ని సూత్రాలకు కట్టుబడి ఉంటుంది. దాన్ని 'షడ్జమస్వరం' అంటారు. ఈ స్వరానికి రంజింప చేసే స్వభావం ఉన్నది.

వేదపఠనంలో ఒకప్పుడు 'ఏకస్వర గాయక' పద్ధతిలో ఉండేది. ఆ తర్వాత కొంతకాలనికి మానవుని తెలివి వలన మరి ఒక స్వరం కనుక్కోవడంతో 'ద్విస్వర' గాయన పద్ధతి అమలులోకి వచ్చింది.

మరి కొంత కాలం తర్వాత మరో స్వరం కనుక్కోవడంతో "త్రిస్వర" గాయన పద్ధతి వాడుకలోకి వచ్చింది. అంటే సామవేదం నాటికి ఉదాత్త అనుదాత్త, స్వరితాలతో సామగానం అయింది.

కాలక్రమేణా మరి రెండు స్వరాలు చేరి 'అయిదు' స్వరాల సంగీతం రూపుదిద్దుకుంది. ఈ 'అయిదు' స్వరాల సంగీతం అతిప్రాచీనమైనది. ప్రపంచంలోని అన్ని సంగీతాలలోనూ ఒకప్పుడు ఈ 'అయిదు' స్వరాల సంగీతం అమలులో ఉండేది.

మానవుని తెలివితేటలు అభివృద్ధి అవుతూ ఉండటము వలన కొంతకాలానికి మరో రెండు స్వరాలు చేర్చి సప్తస్వరాలు కలిగిన స్థాయి ఏర్పడింది. అ సప్త స్వరాలు స, రి, గ, మ, ప, ద, ని. ప్రపంచములో ఏ సంగీతానికి అయినా ఉండేవి ఈ సప్తస్వరాలే.

# ప్రాచీన సాహిత్యంలో సంగీతం

రావణ బ్రహ్మ సంగీతవిద్యలో గొప్ప విద్వాంసుడు. తన ఆస్థానములో ఎందరో సంగీత కళాకారులను ప్రోత్సహించినట్లు తెలుస్తున్నది. రామలక్ష్మణులిద్దరు సుగ్రీవుని రాజ్యమునకు వెళ్ళినప్పుడు అనేక సంగీత వాయిద్యములతో అక్కడివారు గానం చేస్తే రామలక్ష్మణులు విన్నారుట. వాల్మీకి మహర్షి రచించిన రామాయణ కావ్యాన్ని శ్రీరామచంద్రుని కుమారులు లవకుశులు శ్రీరాముని ఆస్థానంలో గానం చేసారు. ఈ విషయములు 'రామాయణం' ద్వారా తెలుస్తున్నవి.

'భారతము'లో అనేక చోట్ల సంగీతము గురించి ప్రస్తావించబడింది. అర్జునుడు గొప్ప సంగీత విద్వాంసుడు అనియు, 'బృహన్నల' అనే మారువేషంలో విరాటరాజు కుమార్తెయగు ఉత్తరకు సంగీతము, నృత్యము నేర్పినట్లు తెలుస్తున్నది. శ్రీకృష్ణభగవానుడు గొప్ప సంగీత విద్వాంసుడేగాక గొప్ప నాట్యాచార్యుడని కూడా భారతము వలన తెలుస్తున్నది.

క్రీస్తు పూర్వము 400 సంవత్సరముల ముందు రచింపబడిన 'రిక్ప్రతిక్షయ' గ్రంథములో త్రిస్థాయిలు, సప్తస్వరాల విషయమై ప్రస్తావించినట్లు ఉన్నదట. కనుక కర్ణాటక సాంప్రదాయ సంగీతము పూర్వకాలము నుండి వస్తున్నట్లు తెలుస్తున్నది. చాలాకాలము భారతదేశమంతటా ఒకే రకమైన సంగీతము ఉన్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

క్రీ.శ. నాలుగవ శతాబ్దములో కాళిదాస కవి చాలా గ్రంథాలు రచించాడు. ఈ గ్రంథాలలోని శ్లోకాలను సంగీతపరంగా పాడినట్లు తెలుస్తున్నది. కాళిదాస కవి రచించిన నాటకాల వలన సంగీతముకూడా ఆ రోజులలో అభివృద్ధి చెందినది.

అయిదవ శతాబ్దములో భరతముని రచించిన నాట్యశాస్త్ర గ్రంథములో గాత్ర వాయిద్యాల సంగీతం గురించి వ్రాయబడినది. 22 శృతుల విషయమై, షడ్జ, గ్రామముల విషయమై ఇంకా అనేక విషయముల గురించి వ్రాయబడినట్లు తెలుస్తున్నది. ఈ గ్రంథాన్ని ఆ రోజులలో మూలగ్రంథముగా భావించారు. ఆనాటి సంగీతములో జతిజ్ఞానము బహుళ ప్రజాదరణ పొందినది. రాగజ్ఞానము అమలులో లేదు.

రాగము అంటే ఏమిటి? వాటిని సంగీతములో ఎలాగ ఉపయోగించుకోవాలి అనే విషయాన్ని మాతుంగముని ఆరవ శతాబ్దములో రచించిన 'బ్రహద్దేశి' గ్రంథములో వివరించారుట.

7వ శతాబ్దము నుంచి 12వ శతాబ్దములలో భారతదేశమందు మతప్రచారకులు మతోద్ధరణ కొరకు అనేక భక్తిపరమైన రచనలు చేసి సంగీతము ద్వారా వారి వారి మతములను అభివృద్ధి చేసారు. 'నారద శిక్ష' అనే గ్రంథముతో బాటు అనేక గ్రంథాలు రచింపబడ్డాయి.

ఈ కాలములో దేశాన్ని పరిపాలిస్తున్న హిందూరాజులు నాట్యానికి, సంగీతానికి ఎంతో ప్రాముఖ్యత నిచ్చి కళాకారులను ప్రోత్సహించటమే కాకుండా కళాకారులచే రాజ దర్బారులలో కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు.

12వ శతాబ్దానికి చెందిన జయదేవకవి 'గీతగోవిందము' అనే కావ్యాన్ని రచించి సంగీతానికి ఒక దారి చూపించాడు. ఈ "గీతగోవింద" కావ్యము రాధాకృష్ణుల మధ్యయున్న గాఢప్రేమను తెలియచేస్తుంది.

అప్పటినుంచి సంగీత లక్షణ లక్ష్యములు ఒక సులభమైన మార్గములో వ్రాయటానికి ప్రయత్నములు జరిగాయి.

ఈ విధంగా భక్తి సంగీతము అభివృద్ధి చెందుతున్న కాలంలోనే సంకీర్తన, నగరసంకీర్తన వంటి భక్తి సంగీత కాలక్షేపాలు ప్రవేశపెట్టబడినవి.

మనదేశాన్ని పరిపాలించిన మహమ్మదీయ రాజులు కళాకారులను గౌరవించారు. సంగీతాన్ని కూడా ప్రోత్సహించారు. రాజైన మహమ్మద్ గజనీ పర్షియన్ భాషలో పాడేవారు.

సూఫీ మతస్థులు ఇరాన్ దేశము నుంచి భారతదేశమునకు వచ్చినవారు. వారు వారి మత సంబంధమైన భక్తి బోధనలను గానం చేసేవారు. సూఫీలు ఐశ్వర్య, భోగవిలాసాలకు అత్యంత దూరంగా ఉండి సామాన్యజీవితమును గడిపేవారు. ఆధ్మాత్మిక సాధనలో మునిగి తేలుతూ ఉండేవారు.

పరమాత్మ అందరి హృదయాలలో విరాజిల్లుతుంటాడని, ఎవరి మనస్సు బాధపెట్టకూడదని, అందరూ కలసిమెలసి సహజీవనము చేయవలెనని వీరు బోధించెడివారు. వీరి సంగీతాన్ని మహమ్మదీయులు, హిందువులు బాగా ఆదరించారు.

## హిందూస్థానీ సంగీతము

పర్షియన్ దేశస్థులు హిందూదేశమునకు రావటము వలన ఉత్తర హిందూస్థానములో మన సంగీతములో మార్పులు వచ్చాయి. మార్పు వచ్చిన సంగీతాన్ని హిందుస్థానీ సంగీతము అని పిలిచారు.

ఈ సంగీతము 1210 నుంచి 1250 మధ్యకాలంలో ఉన్నతదశకు చేరుకుంది. కాని హిందుస్థానీ సంగీతము ఉత్తర భారతదేశములోను, కర్ణాటక సంగీతము దక్షిణదేశములోను సమాంతరముగా ఆదరించబడ్డాయి.

ఫిరోజ్ షా పరిపాలన కాలంలో నివసించిన 'సారంగదేవుడు' గొప్ప సంగీత విద్వాంసుడు. "సంగీత రత్నాకరము" అనెడి గొప్ప గ్రంథాన్ని రచించాడు.

ఈ గ్రంథములో నాదము, శ్రుతి, స్వరములు, గ్రామములు, మూర్ఛన మొదలైన విషయాలు అతి సులభంగా రచించబడ్డాయి.

సారంగదేవుడు కర్ణాటక, హిందుస్తానీ సంగీతములందు నిష్ణాతులు అని ఈ గ్రంథము ద్వారా తెలుస్తున్నది. ఈ గ్రంథము భారతదేశ సంగీతానికి మూలముగా భావించబడినది.

ఫిరోజ్ షా పర్షియా, అరేబియా, భారతదేశములోని గొప్ప కళాకారులను రప్పించి వారికెంతో ప్రోత్సాహమిచ్చాడు. ఈ కళాకారులలో స్త్రీలు కూడా ఉండటము విశేషము. ఈ కాలములో సంగీతము ఉచ్ఛ స్థితిలోకి చేరుకున్నది. ఇది 13వ శతాబ్దములో జరిగిన విషయము.

14వ శతాబ్దములో నివసించిన రాజు అల్లాఉద్దీన్ ఖిల్జి పరిపాలనలో కూడా సంగీతము ప్రోత్సహించబడి ఉచ్ఛస్థితిలోకి చేరుకున్నది.

అమీర్ ఖుస్రో అనెడి గొప్పకవి, సంగీత కళాకారుడు ఖిల్జి పరిపాలనలో మంత్రి పదవిలో ఉండేవాడు.

ఖుస్రో సంగీతములో విశేష కృషిచేసి కొత్త రాగాలను సృష్టించాడు. వాటిలో యమన్, తోడి, పూర్వి మొదలైనవి ఉన్నాయి. ఇతనే సితార్, తబల మొదలైన వాయిద్యాల సృష్టికర్త.

దక్షిణ భారతదేశంలో విజయనగరరాజు రాజా దేవరాజ్ ఆస్థానంలోని సంగీత కళాకారుడు గోపాలనాయక్ - సారంగ్, పీలు మొదలైన క్రొత్త రాగాలను కనుక్కొన్నాడు.

పదిహేనవ శతాబ్దములో 'జౌన్‌పూర్'ను పరిపాలించిన సుల్తాన్ హుస్సేన్ షిర్క్వి సంగీతాన్ని ప్రోత్సహించటమే కాకుండా సింధుభైరవి, జౌన్‌పురి, రామన్‌తోడి మొదలైన క్రొత్త క్రొత్త రాగాలను కనుక్కున్నట్లుగా తెలుస్తున్నది.

అక్బర్ చక్రవర్తి 16వ శతాబ్దానికి చెందిన రాజు. ఈతడు సంగీతమునందు ఆసక్తి కనపరచటమే కాకుండా గొప్ప గొప్ప సంగీత విద్వాంసులను ప్రోత్సహించాడు. వారిలో తాన్‌సేన్, బైజు, స్వామి హరిదాస్, తులసీదాస్, మీరాబాయి మొదలైన గొప్ప కళాకారులు ఉండేవారు. అక్బరు చక్రవర్తికి గాత్ర సంగీతములో, వాయిద్య సంగీతములలో ప్రవేశము ఉన్నదని చెబుతారు.

అక్బరు చక్రవర్తి పరిపాలనా కాలములో **(1542-1605)** దక్షిణ దేశములో పుండరీక విఠల్ అనే గొప్ప సంగీత కళాకారుడు ఉండెడివాడు. ఈతడు ఒరిస్సా రాష్ట్రములోని బరహాంపురమునకు చెందినవాడు. హిందుస్థానీ, కర్ణాటక సంగీతములలో ప్రావీణ్యుడు. ఈతడు నర్తనిర్ణయ, రాగమాల, రాగమంజరి, సద్రాగ చంద్రోదయం అనే నాలుగు గ్రంథాలు రచించాడు.

రాగమాల, రాగమంజరి గ్రంథాలలో హిందూస్థానీ సంగీతము గురించి వ్రాయబడింది. 'సద్రాగ చంద్రోదయం' గ్రంథములో కర్ణాటక, హిందుస్థానీ సంగీతముల గురించి రచించాడు.

పుండరీక విఠల్ తాను కనుక్కొన్న 22 శ్రుతులను అప్పటికే వాడుకలో ఉన్న 22 శ్రుతులలో ప్రవేశపెట్టాడు.

హిందుస్థానీ సంగీతము ఒక పద్ధతిలో లేక దినదినము క్షీణదశకు వస్తుండటం వలన రాజా బురహాన్ ఖాన్ హిందూస్తానీ సంగీతాన్ని ఒక దారిలో పెట్టమని పుండరీక విఠల్‌ను కోరాడు.

దక్షిణ భారతదేశంలో 'రామామాత్యుడు' అనే గొప్ప విద్వాంసుడు ఉండెడివాడు. ఆయన 'స్వరమేళ కళానిధి' అనే గ్రంథము రచించాడు. ఈ గ్రంథము ద్వారా కర్ణాటక సంగీతములో ఉన్న గొప్ప విశేషాలను వెల్లడి చేసాడు.

రాజమండ్రివద్ద 'సోమనాథుడు' అనే విద్వాంసుడు నివసించెడివాడు. ఈతడు 'రాగవిబోధ' అనే గ్రంథము 1609 ప్రాంతంలో రచించి కర్ణాటక సంగీతాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చాడు. సోమనాథుడు లక్ష్యలక్షణములందు మంచి పాండిత్యము కలవాడు.

పదిహేడవ శతాబ్దమునకు చెందిన షాజహాన్ చక్రవర్తి పరిపాలనలో కూడా సంగీతము అభివృద్ధి చెందింది.

ఆ కాలంలోనే 'అహోబిలుడు' అనే పండితుడు 'సంగీత పారిజాతము' అనే గ్రంథాన్ని రచించి కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవ చేసాడు.

శ్రీహరిదయనారాయణ దేవ అనే పండితుడు హరిదయ కౌతుకము, హరిదయ ప్రకాశము అను రెండు గ్రంథాలు రచించాడు.

మనదేశములో సంగీతానికి తీరని నష్టము చేసిన వ్యక్తి ఔరంగజేబ్. సంగీతమంటే ఏ మాత్రము ఇష్టము లేని వ్యక్తి. ఆస్థాన విద్వాంసులనందరిని పదవుల నుంచి తొలగించాడు.

## కర్ణాటక సంగీతము

ద్రావిడ ప్రాంతమునకు విదేశీయుల నుండి దండయాత్రలు లేనందున సంగీతానికి నష్టము కలుగలేదు. దక్షిణ భారతదేశంలో సంగీతానికి, వైదిక సంస్కృతికి, విదేశీయులవలన భంగము కలుగకుండా కాపాడిన వ్యక్తి విద్యారణ్య. ఈయనే 72 మేళకర్త రాగాల ప్రాముఖ్యతను వివరించినట్లు తెలుస్తున్నది. ఈ సమయంలోనే కర్ణాటక సంగీతాభివృద్ధికి పాటుపడిన వ్యక్తి, 'భావ భట్టు'. ఈతడు అనుపమసింహుడనే రాజాస్థానమున ఉండెడివాడు. ఈతడు 'అనుపమ సంగీత రత్నాకర', 'అనుపమ సంగీత విలాస', 'అనుపమ వికాస్' అను మూడు గ్రంథాలు రచించాడు.

ఆ కాలమందే పురందరదాసు అనే విద్వాంసుడు నివసించెడివాడు. వీరు సంగీతమునకు లక్ష్యసంబంధమైనటువంటి గీతముల వరకు ప్రథమ అభ్యాసపు

పాఠములు, అనేక రకములైన గీతములు రచించి కర్ణాటక సంగీతానికి గొప్పసేవ చేసాడు. పురందరదాసు కీర్తనలు ఎంత ప్రాముఖ్యమో చెప్పనవసరము లేదు. 72 మేళకర్త రాగాలను ఒక క్రమపద్ధతిలో వ్రాసిన వారు గోవిందామాత్య, వెంకటమఖి. 'వెంటకమఖి' తండ్రి గోవింద దీక్షితులు. ఈయన తాన అనపాచార్యుడనే గొప్ప పండితుని వద్ద విద్యనభ్యసించి పరిపూర్ణజ్ఞానము సంపాయించాడు. ఇప్పుడు మనము పాడుతున్న 72 మేళ కర్తరాగాలు, వాటికి జన్యరాగములు ప్రవేశపెట్టాడు ఈతడు. 12 స్వరస్థానములను ఆధారముగా చేసుకొని 'చతుర్దండి ప్రకాశిక' అనే గొప్ప గ్రంథాన్ని రచించి కర్ణాటక సంగీతాన్ని దక్షిణ భారతదేశంలో క్రమపద్ధతిలో పెట్టాడు. ఈ గ్రంథము కర్ణాటక సంగీతానికి అధికార గ్రంథముగా తీసుకొనబడుచున్నది.

తమిళులైన చోళరాజులు పాలించిన తంజావూరు, మధురై ప్రాంతాలు కాలక్రమాన విజయనగర సామ్రాజ్య ఆధీనంలోకి వచ్చాయి. 16,17,18 శతాబ్దాలలో ఈ ప్రాంతాల్ని తెలుగువారైన నాయక రాజులు పరిపాలించారు. వీరి రాజ్యంలో తెలుగుభాష అధికారభాషగా ఉండేది. తెలుగుభాష అధికారభాషగా ఉన్నందున ఉద్యోగ అవకాశాలు ఉంటాయనే కారణంగా మేధావులు, పండితులు, కళాకారులు తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలనుంచి తంజావూరు, మధురై ప్రాంతాలకు వలసపోయారు.

అలాగ వలసపోయిన వారిలో ప్రసిద్ధులు క్షేత్రయ్య, నారాయణతీర్థులు మొదలగువారు ఉన్నారు. వీరు కృష్ణానదీ తీరవాసులు. వీరు సంగీతపరమైన బాణీలు అనేకము రచించారు. వీరి కీర్తనలు తెలుగుమాట్లాడే ప్రాంతాలన్నింటికి వ్యాపించాయి. ఎందరో గొప్ప గొప్ప కళాకారులు రావటము వలన తంజావూరు నాట్య శాస్త్రానికి, సంగీత శాస్త్రానికి ముఖ్యప్రాంతమయింది. తెలుగు రాజులైన అచ్యుతనాయక, రఘునాథ నాయకుల ఆస్థానములోని తమిళ, ఆంధ్రపండితుల పరస్పర సహకారము వలన ఒక క్రమపద్ధతిలో కర్ణాటక సంగీతం చాలా అభివృద్ధి అయింది.

విజయనగర సామ్రాజ్య పతనమైన తరువాత నాయక రాజులు సర్వ స్వతంత్రులు అయి మరొక 150 సంవత్సరాలు తంజావూరు, మధురలను పాలించారు. ఆ తర్వాత మరాఠా రాజులు ఈ రాజ్యాలని పాలించారు. మరాఠా రాజులైన శరభోజి, శహాజీ మొదలయిన వారు కూడా కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహించి అభివృద్ధిలోకి తెచ్చారు.

1763 నుంచి 1787 వరకు 'తులజాజి' అనే మహారాష్ట్రీయుడు తంజావూరును పరిపాలించాడు. ఈతను కర్ణాటక సంగీతమునందు గొప్ప పాండిత్యము కలవాడు. సంగీత విద్వాంసులను ఆదరించి సంగీతమును మంచి అభివృద్ధిలోకి తీసుకువచ్చాడు. తులజాజి 'సంగీత సారామృతం' అనే గ్రంథము రచించాడు. కాశీనాథుడు అనే విద్వాంసుడు 'కళానిధి' అనువ్యాఖ్యానము, సంగీత రత్నాకరమునకు వ్యాఖ్యానము వ్రాసి మేలు చేసినవాడయ్యాడు.

హంపీ, విజయనగర రాజ్యపాలనలో కర్ణాటక సంగీతము మంచి ఉచ్ఛస్థితిలో ఉన్న సమయంలో మహమ్మదీయులు దాడిచేసి రాజ్యమును వశపరచుకొనుట వలన సంగీతాభివృద్ధికి చాలా నష్టము కలిగెను. ఆ పరిస్థితులలో తెలుగు రాజ్యము క్షేమంగా ఉండుటచే ద్రవిడ దేశపు గొప్ప గొప్ప పండితులు తెలుగు దేశమునకు వచ్చి సుఖముగా జీవనము చేసారు. అంతేకాక తెలుగు ప్రజలతో కలిసిమెలసి సంగీతమును అభివృద్ధిలోకి తీసుకువచ్చారు.

1620లో రామదాసు (కంచెర్ల గోపన్న) జన్మించి శ్రీరామచంద్రుని మీద భక్తితో అనేక కీర్తనలు రచించెను. ఇవి భద్రాచల రామదాసు కీర్తనలుగా దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందాయి.

1762 నుంచి 1765 సంవత్సరములలో ముగ్గురు మహానుభావులు, వాగ్గేయకారులు - శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు జన్మించి కర్ణాటక సంగీతానికి అపారమైన సేవలు అందించారు. వీరు సంగీత త్రిమూర్తులు అని పిలువబడుతున్నారు. ఇదేకాలంలో మరొక వాగ్గేయకారుడు రాజా తూము నరసింహదాసు (1790-1834) కూడా జన్మించాడు. ఈయన గుంటూరు ప్రాంతానికి చెందినవాడు. ఇతడు రామభక్తుడు. త్యాగరాజస్వామి కృతులు వినబడని శాస్త్రీయ సంగీత కచేరీలు ఉండవు. త్యాగరాజస్వామి శిష్యులు ఎందరో ఉద్భవించారు. వీరుకూడా ఎంతోమంది శిష్యులను తయారు చేసారు. అలాగ కర్ణాటక సంగీతము అభివృద్ధి చెంది ముందు తరాల వారికి అందించబడింది.

బ్రిటిష్‌వారి పరిపాలనలో సంగీతము అభివృద్ధి కాలేదు.

# 20వ శతాబ్దము - సంగీత చరిత్ర

20వ శతాబ్దంలో జానపద సంగీతం, రంగస్థల సంగీతం, లలిత సంగీతం, సినిమా సంగీతం మొదలైనవి అభివృద్ధిచెందాయి.

**శబ్దము :** శబ్దమును రికార్డింగ్ చేసి, భద్రము చేసి (Storing) తిరిగి వినిపించే ప్రక్రియలు వివిధ రకాలుగా అభివృద్ధి అయ్యాయి. వాటిని 1) గ్రామఫోన్ రికార్డులు 2) చలన చిత్రాలు 3) రేడియో 4) టేప్ రికార్డులు 5) టెలివిజన్ 6) వీడియో టేప్స్ 7) కాంపాక్ట్ డిస్క్ (CD) 8) కంప్యూటర్ అనే ఎనిమిది శకములుగా వర్గీకరణ చేయవచ్చు.

## గ్రామఫోన్ రికార్డుల శకము

శబ్దాన్ని రికార్డు చేసి, భద్రము చేసి, తిరిగి వినిపించే యంత్రాన్ని కనుగొనాలని యూరప్, అమెరికా దేశాలలోని ఇంజనీర్లు, శాస్త్రకారులు అనేక ప్రయత్నాలు, పరిశోధనలు చేశారు. ఈ ప్రయత్నం 19వ శతాబ్దంలో ముమ్మరంగా సాగింది.



ఎడిసన్

**ఎడిసన్ పరిశోధన :** థామస్ అల్వా ఎడిసన్ (Thomas Alva Edison) అనే శాస్త్రవేత, అమెరికాలోని న్యూయార్క్ పట్టణము దగ్గర ఉన్న 'హెనెగల్ పార్క్'లో తన పరిశోధనాలయాన్ని నిర్మించారు. ఇత్తడి, ఇనుముతో చేసిన బోలు (hollow) సిలిండర్, సిలిండర్ తిరగటానికి కావలసిన ఏర్పాటు, ఇనుముతో చేసిన కొమ్ము బూరాలాంటి గొట్టము (ఈ గొట్టము ఒకవైపు బాగావెడల్పుగా ఉండి రెండోవైపు సన్నముగా వుంటుంది), గొట్టము చివర సన్నముగా ఉన్న చోట పొర (డయాఫ్రమ్), డైమండ్ స్టయిలస్ (పిన్ను) మొదలగునవి వాడి ఒక యంత్రాన్ని తయారు చేసాడు. తర్వాత సిలిండర్ చుట్టూ తగరపు రేకు (టిన్ ఫాయిల్) చుట్టి, డైమండ్ స్టయిలస్‌ను తగరపు రేకుకు ఒక చివర తగిలేటట్లుగా ఉంచాడు.

సిలిండర్‌కు అమర్చిన హాండిల్‌ను సుమారుగా ఒకే వేగముతో తిప్పుతూ ఉండగా వెడల్పుగా ఉన్నవైపు గొట్టము దగ్గరగా తలపెట్టి గట్టిగా అరుస్తూ "మేరీ

హాడ్ ఎ లిటిల్ ల్యాంబ్" అనే నర్సరీ రైమ్ పాడాడు. అలా పాడుతున్నప్పుడు డైమండ్ స్టయిలస్ శబ్దతరంగాలను ఆధారముగా చేసుకుని అటు ఇటు కదులుతూ తగరపు రేకు మీద గాడి (groove) చేస్తూ ముందుకు ప్రయాణం చేసింది.


పాడటము అయిపోయిన తరువాత డైమండ్ స్టయిలస్‌ను తీసివేసి దానిస్థానములో ఇనుముతో చేసిన స్టయిలస్‌ను ఉంచి సిలిండర్ తగరపు రేకు మీద తాను ఎక్కడ నుంచి ప్రారంభించాడో అక్కడ ఏర్పడిన గాడిలో ఉంచాడు. సిలిండర్‌ను హాండిల్ సహాయముతో తిప్పుతూ ఉంటే ఇనుప స్టయిలస్ అంతకు ముందు డైమండ్ స్టయిలస్ ఏర్పరచిన గాడిలో ప్రయాణిస్తూ ఎడిసన్ పాడిన పాట వినిపించింది.

ఈ ప్రయోగము విజయవంతమగుటచే ఎడిసన్ తను చేసిన యంత్రాన్ని అభివృద్ధి పరచి రికార్డింగ్ చేసిన శబ్దాన్ని అనేకసార్లు విని, తను చేసిన యంత్రము ద్వారా రికార్డింగ్ చేయడమే కాక రికార్డింగ్ చేసిన శబ్దాన్ని తిరిగి వినవచ్చును అని రూఢి చేసుకున్నాడు.

ఎడిసన్ తను కనుగొన్న యంత్రానికి ఫోనోగ్రాఫ్ (Phonograph) అని నామకరణము చేసాడు. **1878**లో పేటెంట్ హక్కును పొందాడు. అయితే ఆ యంత్రానికి పెద్దవిలువ ఉండదనుకుని దానిమీద పరిశోధనలు ఆపుచేసి వేరే పరిశోధనల మీద దృష్టిపెట్టాడు. తన యంత్రంపై ఆ నాటి ప్రముఖుల స్వరాలను ఎడిసన్ రికార్డ్ చేసాడు. వారిలో ప్రముఖ రచయిత ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్, రాబర్ట్ బ్రౌనింగ్ మొదలైనవారు ఉన్నారు.

**ఫ్లాట్ డిస్క్ : 1878** నుంచి పది సంవత్సరాలలోపున సిలిండర్ యంత్రాలు, సిలిండర్ రికార్డులు ప్రపంచమంతా వ్యాపించాయి.

జర్మనీ దేశంలోని 'హనోవర్' నగరానికి చెందిన ఎమిలి బెర్లినర్ (Emile Berliner) అమెరికాకు వలసపోయి వాషింగ్టన్ పట్టణములో స్థిరనివాస మేర్పరచుకున్న శాస్త్రవేత్త. ఈతను ఎడిసన్ తయారు చేసిన "ఫోనోగ్రాఫ్"కు మెరుగులు దిద్దాలనే ఉద్దేశంతో పరిశోధనలు ప్రారంభించాడు. సిలిండర్స్‌కు బదులుగా ఫ్లాట్‌గా ఉండే



బెర్లినర్

"ఫ్లాట్ డిస్క్"ను రికార్డింగ్‌కు ఉపయోగించాలనే ఆలోచనతో ఎడిసన్ కనిపెట్టిన సిలిండర్‌కు బదులుగా 'జింక్' తో తయారుచేసిన ఫ్లాట్‌డిస్క్‌ను వాడి దాని మీద "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్" అనే నర్సరి రైమ్ పాడి రికార్డు చేసి తిరిగి వినిపించాడు.

ఈవిధంగా బెర్లినర్ పరిశోధనలు విజయవంతమయాయి. బెర్లినర్ "ఫ్లాట్ డిస్క్"ను ప్లే చేసే యంత్రాన్ని కూడా కనిపెట్టాడు. 'ఫ్లాట్ డిస్క్'కు 'గ్రామఫోన్ రికార్డు' అని, దాన్ని ప్లే చేయటానికి వాడే యంత్రాన్ని 'గ్రామఫోన్' అని నామకరణము చేసాడు. ఈ విజయంతో బెర్లినర్ తన పరిశోధనకు మంచి భవిష్యత్ ఉందని గ్రహించి దానిమీదనే దృష్టిని కేంద్రీకరించాడు. వీటికి పేటెంట్ హక్కులు అనేక దేశాలలో పొందాడు.

గ్రామఫోన్, గ్రామఫోన్ రికార్డులు, తన పేటెంట్‌కు సంబంధించిన ఇతర వస్తువులను అమ్మాలని అమెరికాలోని వాషింగ్‌టన్‌లో "బెర్లినర్ గ్రామఫోన్ కంపెని" అనే పేరుతో 1894లో స్థాపించాడు.

ఆ తర్వాత ఎల్‌రిజ్. ఆర్. జాన్సన్‌తో 'విక్టరి టాకింగ్ మెషిన్' కంపెనీ ప్రారంభించాడు బెర్లినర్.

అమెరికాలో బెర్లినర్ వ్యాపారప్రయోజనాలకు అనుకోకుండా అంతరాయం కలిగించింది. ఇంగ్లండు కేంద్రంగా వ్యాపారం చేయతలచి అతను 1897లో లండన్ నగరానికి వెళ్లి చూసి దాన్ని వ్యాపారానికి అనువైన ప్రదేశంగా గుర్తించాడు.


విలియం బారీ ఒవెన్

**యూరప్‌కు విస్తరణ :** బెర్లినర్ తన అనుచరుడు అయిన విలియమ్ బారీ ఒవెన్ (William Barry Owen)కు రికార్డింగ్ నిపుణులు అయిన సోదరులు ఫ్రెడరిక్ గైస్‌బర్గ్ (Frederic Gaisberg), విలియమ్ గైస్‌బర్గ్ (William Gaisberg)లను తోడిచ్చి లండన్‌లో గ్రామఫోన్ కంపెని నెలకొల్పమని చెప్పి పంపాడు. వీరు 1898లో లండన్ నగరము చేరి లండన్‌లోని సెసిల్ హోటల్‌లో కంపెని స్థాపించారు. గ్రామఫోన్, రికార్డులతో బాటుగా 'లాంబర్ట్' కంపెనీ తయారుచేసే టైప్‌రైటింగ్ యంత్రాలను అమ్మాలని తలచి వారు ప్రారంభించిన కంపెనీకి 'గ్రామఫోన్ & టైప్‌రైటర్' కంపెనీ అని నామకరణం చేసారు. గ్రామఫోన్‌లు తయారు చేయటానికి అవసరమైన

యంత్రసామగ్రిని అమెరికా నుంచి దిగుమతి చేసుకుని తయారుచేయ ప్రారంభించారు. 1898లో గ్రామఫోన్ కంపెనీ 'Angel' బొమ్మను ట్రేడ్‌మార్క్‌గా వాడారు. 1899లో ఈ ట్రేడ్‌మార్క్‌ను లండన్‌లో చట్టపరంగా రిజిష్టర్ చేసారు.



విలియం గైస్‌బర్గ్

స్నేహితులచేత లండన్‌లో సేల్స్ డివిజన్ పెట్టించిన బెర్లినర్ 1898లో తన సోదరుడు జోసెఫ్‌ను జర్మనీలోని తమ స్వస్థలమైన "హానోవర్" పట్టణంలో గ్రామఫోన్ రికార్డ్సు ప్రెస్సింగ్ ఫాక్టరీని నెలకొల్పమని పంపాడు. అక్కడ ప్రెసింగ్ చేసిన రికార్డులను లండన్ కంపెనీ ద్వారా యూరోప్‌లోని దేశాలన్నిటిలో అమ్మేవారు.

గైస్‌బర్గ్ సోదరులు లండన్‌లోనే వుంటూ ఆర్టిస్టులు దొరికినప్పుడల్లా రికార్డింగ్స్ చేసేవారు. ఆ రోజులలో లండన్‌లో నివసిస్తున్న భారతీయుల కంఠాలను కూడా రికార్డు చేసారు. ఈ రికార్డింగ్స్‌లో రామాయణం నుంచి పాటలు, ఖురాన్, గురునానక్ ప్రబోధాలు మొదలైనవి కూడా ఉన్నాయి.



ఫ్రెడరిక్ గైస్‌బర్గ్

1900 సం॥లో గ్రామఫోన్, గ్రామఫోన్ రికార్డులతో బాటుగా 'లాంబర్ట్' (Lambert) కంపెనీవారు తయారుచేసే 'టైప్‌రైటింగ్' యంత్రాలను కూడా తయారుచేసి అమ్మతలచి వారు ప్రారంభించిన కంపెనీకి "గ్రామఫోన్స్ అండ్ టైప్‌రైటర్స్ లిమిటెడ్" అని పేరు మార్చారు.

అదే సంవత్సరంలో బెర్లినర్ కెనడా దేశంలో కూడా అడుగుపెట్టాడు. అక్కడ పేటెంట్ హక్కు ఉండటము వలన ఆ దేశానికి వెళ్లి "బెర్లినర్ గ్రామఫోన్ కంపెనీ" ప్రారంభించాడు. అ కంపెనీద్వారా తాను తయారు చేసిన గ్రామఫోన్లు, రికార్డులు అమ్మటము ప్రారంభించాడు.

అమెరికాలో తిరిగి వ్యాపారము చేసుకునే అవకాశము బెర్లినర్‌కు కలిగింది.

అమెరికా, ఇంగ్లండు దేశాలలోని జోనోఫోన్ లేబుల్ సంస్థలు బెర్లినర్ సంస్థలతో

విలీనమయినట్లు తెలుస్తున్నది. ఇంగ్లండులోని సంస్థను బ్రిటీష్ జోనోఫోన్ కంపెనీగా పిలవబడేది. వీరు కూడా గ్రామఫోన్, రికార్డులు అమ్మేవారు.


"విక్టరీ టాకింగ్ మెషిన్ కంపెని" వారు 1912 వరకు 'జోనోఫోన్' లేబుల్ మీద రికార్డులు తయారు చేసి అమ్మారు. రికార్డింగ్ నాణ్యత తక్కువ కాబట్టి చౌకగా అమ్మేవారు.

## కుక్కబొమ్మ కథ

గ్రామఫోన్ రికార్డు అనగానే మనకు వెంటనే స్ఫురించేది గ్రామఫోన్ రికార్డు లేబుల్‌మీద గ్రామఫోన్ గొట్టానికి ఎదురుగా కూర్చుని పాట వింటున్నట్లుగా ఉన్న కుక్కబొమ్మ. ఈ కుక్క ఎంత అదృష్టము చేసుకొకపోతే ప్రపంచములోని ఎన్నో దేశాలలో విడుదల అయిన కోటానుకోట్ల గ్రామఫోన్ రికార్డుల మీద ప్రత్యక్షమై కొన్ని కోట్లమంది శ్రోతల హృదయలలో సుస్థిరస్థానాన్ని పొందుతుంది !

అసలు ఈ కుక్కబొమ్మ గ్రామఫోన్ రికార్డుల లేబుల్ మీదికి ఎలాగవచ్చింది?

ఇంగ్లండ్ దేశములోని బ్రిస్టల్ నగరంలో మార్క్ బరాడ్ అనే దొర ఉండేవాడు. 1884లో ఒక చిన్న కుక్కపిల్లను తెచ్చుకొని పెంచుకున్నాడు. అతి ప్రేమగా చూసుకునేవాడు. మార్క్ ఇంటికి వచ్చే అతిథుల కాళ్ల పిక్కలను ఈ కుక్కపిల్ల కొరుకుతూ ఆడుకునేది. అందుకని మార్క్ ఆ కుక్కపిల్లకు "నిప్పర్" (నిప్పింగ్ అంటే మెత్తగా కొరకడం) అని పేరు పెట్టుకున్నాడు.



నిప్పర్, ఫ్రాన్సిస్ బరాడ్

దురదృష్టవశాత్తు 1887లో మార్క్ మరణించాడు. మార్క్ ఆస్తి, తాను ఇంట్లో అతని కంఠస్వరాన్ని రికార్డు చేసుకున్న సిలిండర్స్, సిలిండర్ ఫోనోగ్రాఫ్, కుక్కపిల్ల అతని సోదరుడైన ఫ్రాన్సిస్‌కి చెందాయి. అతను గొప్ప కళాకారుడు, చిత్రకారుడు. తాను బ్రిస్టల్ నుండి లివర్‌పూల్ పట్టణానికి వలసపోతూ కుక్కపిల్లను కూడా తనవెంట తీసుకుపోయాడు. నిప్పర్ తన యజమాని అయిన మార్క్ మీద బెంగపెట్టుకుని ఉగ్రరూపం దాలుస్తూ ఉండేది. ఆహార పానియాలు ముట్టేది కాదు.

అది గ్రహించిన ఫ్రాన్సిస్ ఒకరోజున తన అన్నగారి కంఠస్వరం రికార్డు చేయబడిన సిలిండర్‌ను ఫోనోగ్రాఫ్ పై ప్లే చేసాడు. మార్క్ కంఠము వినబడగానే నిప్పర్ పరుగెత్తుకుంటూ వచ్చి ఫోనోగ్రాఫ్ గొట్టము ముందర కుదురుగా కూర్చుని గొట్టములో నుంచి వచ్చే యజమాని కంఠస్వరము వింది. నిప్పర్‌కు తన యజమాని యందున్న విశ్వాసానికి అబ్బురపడిన ఫ్రాన్సిస్ ఆ దృశ్యాన్ని పెయింటింగ్‌గా వేశాడు. 'హిజ్ మాస్టర్స్ వాయిస్' అని కాప్షన్ రాసి రిజిస్టర్ చేయించాడు. 1895లో తన పదకొండవ ఏట నిప్పర్ చనిపోయింది.

బెర్లినర్ తన స్నేహితులచే లండన్‌లో ప్రారంభించిన గ్రామఫోన్ కంపెని వారికి ఫ్రాన్సిస్ తను వేసిన పెయింటింగ్ అమ్మ చూపాడు. మానేజింగ్ డైరెక్టర్ విలియం బారీ ఓవెన్ పెయింటింగ్ కొనటానికి ఆసక్తి చూపిస్తూనే కొన్ని మార్పులు సూచించాడు. ఫోనోగ్రాఫ్, దానికి అమర్చిన నల్లని రంగులో గల గొట్టానికి బదులుగా (అవి ఎడిసన్ తయారు చేసిన సిలిండర్ మోడల్‌వి కదా) తన షాపులో ప్రదర్శించబడిన గ్రామఫోన్, దానికి అమర్చబడి తళతళ మెరుస్తున్న బ్రాస్ గొట్టాన్ని పెయింటింగ్ చేయమన్నాడు.

ఫ్రాన్సిస్ గ్రామఫోన్ కంపెని నుంచి రకరకాల మోడల్స్‌లో ఉన్న గ్రామఫోన్‌లు తీసుకు వెళ్లి బారీ చెప్పినట్లుగా పెయింటింగ్ వేశాడు. 1899లో గ్రామఫోన్ కంపెనీవారు కొన్నారు. 1900 సంవత్సరము నుంచి గ్రామఫోన్ కంపెనీవారు ఈ పెయింటింగ్‌ను వారి కంపెని లోగోగా వాడడం ప్రారంభించారు. 1910లో గ్రామఫోన్ కంపెనీవారు ఈ లోగోను ట్రేడ్‌మార్క్‌గా రిజిష్టర్ చేసారు.

1924లో ఫ్రాన్సిస్ కుక్క థీమ్‌తో మరో 24 పెయింటింగ్స్ వేసి గ్రామఫోన్ కంపెనీ వారికి ఇచ్చాడు. ఆ పెయింటింగ్స్ కూడా చాలా ప్రసిద్ధిచెందాయి.

## భారతదేశంలో గ్రామఫోన్ కంపెని

గ్రామఫోన్ కంపెనీవారు తమ వ్యాపారాన్ని ఆసియాకు కూడా విస్తరింప చేయతలచి భారతదేశము అనువుగా ఉన్న ప్రదేశమని ఆలోచించారు. కలకత్తా నగరం సౌకర్యముగా ఉంటుందనుకున్నారు. జాన్ వాట్సన్ హాడ్ అనే వ్యక్తిని బెర్లినర్ ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు పంపి కలకత్తాలో "గ్రామఫోన్ అండ్ టైప్‌రైటర్ లిమిటెడ్" సంస్థను నెలకొల్పమన్నారు. హాడ్ 1901 జూలై నెలలో కలకత్తా వచ్చి కార్యాలయము నెలకొల్పాడు.

అప్పటికే ఎడిసన్, పాతె కంపెనీలు తయారు చేస్తున్న సిలిండర్ యంత్రాలు, ఫోనోగ్రాఫ్స్, సిలిండర్ రికార్డులు కొన్ని భారతీయ సంపన్న కుటుంబాలలో ఉన్నాయి. భారతఉపఖండంలో రకరకాల భాషలు, సంస్కృతులు ఉన్నందున గ్రామఫోన్ వ్యాపారము బాగా అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఎక్కువ అని తలచిన హాడ్ ఇండియాలో కేవలం మార్కెటింగ్ విభాగమే కాక, రికార్డింగ్ చేయటానికి కావలసిన సదుపాయాలను కూడా నెలకొల్పవలసినదిగా బెర్లినర్‌కు సూచించాడు. దానికి బెర్లినర్ వెంటనే స్పందించి తనకు చాలా సన్నిహితుడైన ఫ్రెడ్ గైస్‌బెర్గ్‌ను ఇండియాలో రికార్డింగ్‌కు కావలసిన సదుపాయాలను కల్పించమని పంపాడు. గైస్‌బెర్గ్ రికార్డు ప్లేయింగ్ యంత్రాలతో బాటుగా 600 మైనపు అచ్చులు (WAX BLANKS) తీసుకొని బయలుదేరి అక్టోబరు 27వ తేది 1902లో కలకత్తా నగరము చేరాడు. ఒక హోటల్‌లో రికార్డింగ్ స్టూడియోను గైస్‌బర్గ్ నెలకొల్పాడు.

## భారతదేశంలో రికార్డు అయిన తొలిపాట

భారతీయులకు పాటపై మక్కువ ఎక్కువని గుర్తించిన హాడ్ పేరున్న ఆర్టిస్టుల చేత పాటలు పాడించి రికార్డింగ్ చేసి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేస్తే తమ రికార్డుల వ్యాపారము అభివృద్ధి చెందుతుందని ఆలోచించి పేరున్న కళాకారులలో ప్రసిద్ధిచెందిన గాయని 'గౌహర్ జాన్'ను ఎన్నుకుని నవంబరు 1902న తబల,

హార్మోనియమ్ మొదలైన వాయిద్య కళాకారుల సహకారంతో మొట్టమొదటి పాటను రికార్డుచేసాడు. ఇది భారతదేశ సంగీత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడిన రోజు.

## పాట

'పాట' అనే పదం ఎప్పుడు పుట్టిందో చెప్పటం కష్టం కానీ మానవుని పరిణామ చరిత్రలో మానవుల జీవితాన్ని అంటిపెట్టుకొనే అది పెరిగింది. పాటకు ప్రథమ గేయకర్తలు, స్వరకర్తలు అజ్ఞాత ఆదివాసులే అని తెలుస్తున్నది. ప్రముఖ కవి కీ॥శే॥ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు పాటను ఇలా నిర్వచించారు - "అన్ని కళల కన్నా గానం సద్య. మాట మనిషయితే, పాట పక్షి లాంటిది. అది అందుకోలేని ఎత్తులు లేవు, చొచ్చుకుపోలేని లోతులు లేవు. మాటలకందని అనుభూతులు వచ్చినప్పుడు వాటిని వ్యక్తపరుస్తుంటేనే గాని మనం బ్రతకలేనప్పుడు పాటే మనకి ఏకైక శరణ్యం. అందుకే మనిషి బాధనుగాని, ఆనందాన్ని పొందినప్పుడు స్వాంతన కోసం సంగీతాన్నో, సంగీత భావాన్నో ఊతగా తీసుకుంటాడు."

పాట వంటి మంచి మాటల పొందికకు కుదురైన బాణీ కూర్చడం ఎలా? సంగీతము వినిపించిన తరువాత అది ఆవిరిలాగ అంతరిక్షానికి ఎగిరిపోతుంది. దాన్ని మళ్ళీ మళ్ళీ పాడుకోవటానికిగాను, బాణీ గుర్తు పెట్టుకోవడానికి "స్వరలిపి" (మ్యూజికల్ నొటేషన్స్)ని ఉపయోగించుకున్నాడు మానవుడు.

## స్వరలిపి (NOTATIONS)

శతాబ్దాల తరబడి సంగీతాన్ని, సంగీత శబ్దాలను అవగాహన చేసుకోవడానికి "మ్యూజికల్ నొటేషన్స్"అనే పద్ధతిని వాడుకలోకి తెచ్చారు. "నొటేషన్స్" పద్ధతిని భారతదేశములోని కొంతమంది విద్వాంసులు పర్షియా, అరేబియా దేశాలలోని వారికి తెలియచేసినట్లు చరిత్రవలన తెలుస్తున్నది. తరువాత ఈ పద్ధతిని యూరప్ దేశ సంగీతములో ప్రవేశపెట్టబడినట్లు తెలుస్తున్నది.

**ప్రథమ గాయని గౌహర్ జాన్ :** తొలి భారతీయ గాయని గౌహర్ జాన్ తల్లి ఆర్మేనియా దేశస్థురాలు. తండ్రి అమెరికా దేశస్తుడు. ఇద్దరూ ఇండియాలో స్థిరపడిన యూదుమతస్తులు. వీరికి 1873లో కూతురు ఏంజలీనా జన్మించింది. విక్టోరియాకు

నాట్యము, సంగీతము అంటే ప్రాణము, ఇది నచ్చని భర్త విడాకులిచ్చాడు. అప్పుడు కూతురుతో కలిసి సంగీత నాట్యాలను ఆదరించే కలకత్తాకు వెళ్లింది. క్రిస్టియన్ మతము వదలి ఇస్లామ్ పుచ్చుకుని కూతురు పేరు గౌహర్ జాన్‌గా మార్చింది. కూతురుకు చిన్నతనం నుండి సంగీతము, నాట్యము మీద ఉన్న అసక్తిని గమనించిన తల్లి సంగీతము, నాట్యములేకాక పలుభాషలు కూడా నేర్పించింది.


గౌహర్‌జాన్

ఆ రోజులలో వివిధ భాషలలో కొన్ని వందల పాటలకు బాణీలు కూర్చుకుని, పాడి చరిత్ర సృష్టించిన గాయని - గౌహర్‌జాన్. వైవాహిక జీవితం విఫలం కావడంతో కలకత్తా విడిచి వెళ్లి అనేక నగరాలలో తిరిగి చివరకు 1930లో మైసూర్ రాష్ట్రంలో మరణించింది.

గౌహర్ జాన్ గ్రామఫోన్ కంపెనీకి గొప్ప “సెలబ్రిటి”! ఆవిడ ఫోటోను గ్రామఫోన్ రికార్డుల ప్రకటనలలో వాడుకున్నారు. గ్రామఫోన్ కంపెనీకి విపరీతంగా లాభాలు చేకూర్చిన గాయని ఆమె.

**వివిధ భాషల్లో రికార్డింగ్స్ :** ఆ రోజులలో భారతదేశములో యూరప్ దేశ సంగీతపు రికార్డులు ఎక్కువగా అమ్ముతుండేవారు. గ్రామఫోన్ కంపెనీ కలకత్తాలో ఉండటము వలన బెంగాలీ భాషలో ఎక్కువగా రికార్డింగ్స్ అవుతూ ఉండేవి. భారతదేశములో పలుభాషలు, వివిధ సంస్కృతులు ఉండటము వలన ఆయాభాషలలో రికార్డింగ్స్ చేసి తమ వ్యాపారాన్ని అభివృద్ధి పరచుకోవాలని గ్రామఫోన్ కంపెనివారు లక్నో, అలహాబాద్, ఢిల్లీ, బొంబాయి, మదరాసు, హైదరాబాద్ మొదలైన నగరాలలో రికార్డింగ్స్ ప్రారంభించారు. ఒక్క గాత్ర సంగీతమే కాకుండా ఫ్లూట్, సితార్ మొదలైన వాయిద్య సంగీతాన్ని కూడా రికార్డింగ్ చేసి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. మొదట పది సంవత్సరాలలో కొన్ని వేల పాటలు, కొన్ని వందలమంది కళాకారులచేత గుజరాతీ, తెలుగు, తమిళము, కన్నడము, మరాఠి, సింహళము మొదలైన భాషలలో రికార్డింగ్స్ చేసారు.

ఆ రోజులలో కొందరు ప్రముఖ విద్వాంసులు వారి పాటలను రికార్డింగ్

చేయటానికి ఇష్టపడేవారు కాదుట. వారి పాటలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయితే వారు చేసే సంగీత కార్యక్రమాలకు శ్రోతలు హాజరు కారని భయపడేవారు.

**పాతె ఫోనోగ్రాఫ్‌లు, రికార్డులు :** ఫ్రాన్సు దేశానికి చెందిన సోదరులు ఛార్లెస్ పాతె, ఎమిలీ పాతె పారిస్‌లోని బిస్టెన్‌లో రికార్డ్స్ వ్యాపారము ప్రారంభించారు. ప్రారంభంలో వారు ఎడిసన్, కొలంబియా వారి ఫోనోగ్రాప్స్, సిలిండర్ రికార్డులు అమ్మేవారు. కొంతకాలానికి తామే కొన్ని మార్పులతో ఫోనోగ్రాఫ్స్ తయారుచేసి అమ్మటం ప్రారంభించారు. ప్రీ-రికార్డెడ్ సిలిండర్స్‌కూడా అమ్మేవారు. 1896 కల్లా పారిస్‌లోనే కాక ఇతర దేశాలలో కూడా రికార్డింగ్ స్టూడియోలు ప్రారంభించారు. దాదాపుగా 15 సంవత్సరాలు సిలిండర్ రికార్డ్స్ తయారుచేసి అమ్మారు.

1905 నుంచి ఫ్లాట్ రికార్డులు తయారుచేయ ప్రారంభించారు. రికార్డింగ్ ఒక వైపే చేసేవారు. ఇంచుమించు అదే కాలంలో వాక్స్ రికార్డులకు బదులుగా 'షెల్లాక్' అనే పదార్ధముతో రికార్డులు తయారు చేయటము ప్రారంభించారు. ఈ రికార్డులు 90 ఆర్‌పిఎం (రివల్యూషన్స్ పెర్ మినిట్) స్పీడ్‌లో ఉండేవి. అంటే నిమిషానికి ఆ రికార్డు 90 సార్లు తిరిగేదన్నమాట.

గ్రామఫోన్ కంపెనీవారు గ్రామఫోన్ రికార్డుల మీద వుండే గాటును ఏటవాలుగా చేసేవారు. దీన్ని లేటరల్ గ్రూవ్ కటింగ్ అనేవారు. కాని పాతె కంపెనీవారు గాట్లను నిలువుగా కట్ చేసేవారు. దీనిని వర్టికల్ గ్రూవ్ కటింగ్ అనేవారు. ఈ గాట్ల వెడల్పు ఇతరులు తయారు చేసే రికార్డుల మీద ఉన్న గాట్ల వెడల్పుకన్నా ఎక్కువగా ఉండేది. అందుకని సఫైర్ పదార్ధముతో చేసిన గుండ్రని బంతి ఆకారంలో ఉన్న స్టయిలస్ (పిన్ను) ను వాడేవారు.



చార్లెస్ పాతె



ఎమిలీ పాతె

మాములుగా రికార్డు ప్లే చేయటానికి వాడే స్టీల్‌తో తయారు చేసిన స్టయిలస్ త్వరగా అరిగిపోయేది. ప్రతి గ్రామఫోన్ రికార్డు ప్లే చేసిన తరువాత మార్చాల్సి వచ్చేది. గుండ్రని ఆకారములో ఉన్న పాతే వారి స్టయిలస్ మన్నిక బాగుండేది కాబట్టి ప్రతి రికార్డుకు మార్చవలసిన అవసరము లేదు.

పాతె వారి గ్రామఫోన్ రికార్డులు ప్లే చేయాలంటే రికార్డు మధ్యలో ఉన్న లేబుల్ దగ్గర ఉన్న గ్రూవ్‌లో సౌండ్‌బాక్స్ ఉంచాలి. అది అక్కడ నుండి రికార్డు అంచుకు ప్రయాణము చేస్తుంది. కాని ఇతర కంపెనీవారు తయారు చేసిన రికార్డులలో అంచు చివర నుంచి లేబుల్ వైపు సౌండ్‌బాక్స్ ప్రయాణము చేస్తుంది.

ఆ రోజులలో ఫోనోగ్రాఫ్ యంత్రాలు, రికార్డులు ప్లే చేసే విధానాలు రకరకాలుగా ఉండేవి. అందుకని పాతె కంపెని వారు తమ యంత్రంతో బాటు రకరకాలైన ఎటాచ్‌మెంట్స్ యిచ్చేవారు. వీటి వలన పాతె ఫోనోగ్రాఫ్స్‌లో ఏ పద్ధతిలో తయారు అయిన రికార్డులు కూడా ప్లే చేయటానికి అవకాశము ఉండేది.

కొన్ని సంవత్సరాల తర్వాత పాతెవారు రికార్డు లేబుల్ నుంచి రికార్డు అంచులకు సౌండ్‌బాక్స్ ప్రయాణించే పద్ధతికి స్వస్తి చెప్పారు.

పాతె వారు తయారు చేసిన సిలిండర్ రికార్డులు ఫ్రాన్స్ దేశంలో చాలా ప్రసిద్ధి చెందాయి. ఇతర దేశాలలో పాపులర్ కాలేదు. అలాగే వారు చేసిన డిస్క్ రికార్డులు ఫ్రాన్స్‌లో అంత పాపులర్ కాలేదు. కాని అమెరికా ఇంగ్లడ్, ఇతర దేశాలలో పాపులర్ అయ్యాయి.

ఇతర దేశాలలో అమ్మకాల కోసము పాతె కంపెనీ వారు వర్టికల్ గ్రూవ్ కటింగ్ పద్ధతి మానివేసి లేటరల్ గ్రూవ్ కటింగ్ పద్ధతిలో గ్రూవ్స్ కట్ చేయటము ప్రారంభించారు.

పాతె కంపెని వారు 1927 నుంచి 'ఎకూస్టిక్ రికార్డింగ్' పద్ధతికి స్వస్తి చెప్పి 'ఎలక్ట్రికల్ రికార్డింగ్' పద్ధతిలో రికార్డింగ్ ప్రారంభించారు.

**షెల్లాక్ :** గ్రామఫోన్ రికార్డులు తయారు చేయటానికి కావలసిన ముఖ్యపదార్థము 'షెల్లాక్'. ఇది సహజ సిద్ధముగా దొరికే థర్మోప్లాస్టిక్. వేడిచేసినప్పుడు ద్రవరూపంగా మారుతుంది. కాని సాధారణ ఉష్ణోగ్రతలో గట్టిగా, బిరుసుగా స్థిరముగా ఉంటుంది.

ఇది 'లాసి ఫియర్ లక్కా' అనే కీటకం నుంచి ఉద్భవించి చెట్లకుండే సన్నని కొమ్మల మీద స్థిరంగా ఉంటుంది. గట్టిపొరగా ఏర్పడుతుంది. దీన్ని కొమ్మల నుండి గీకి వేరుచేస్తారు. దీన్ని వేడిచేసి పొరలుగా (షీట్స్) లాగా తయారుచేస్తారు. దీనిని 'షెల్లాక్' అంటారు.

షెల్లాక్ ఎక్కువగా బెంగాల్, బీహారు రాష్ట్రాలలో దొరుకుతుంది. విదేశాలకు భారీ మొత్తములో మనదేశము నుండే ఎగుమతి అయ్యేది. గ్రామఫోన్ రికార్డులు తయారు చేయటానికి షెల్లాక్‌తో బాటు కొద్దిపాళ్లలో కాటన్ పల్ప్, స్లేట్ పౌడరు, మైనము మొదలగునవి ఉపయోగిస్తారు.

**ఇండియాలో మొదటి రికార్డ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ :** భారతదేశములో గ్రామఫోన్ రికార్డులు అమ్మకాలు క్రమంగా పెరుగుతూ ఉండటము వలన, 'మాస్టర్స్'ను ప్రతిసారి రికార్డులుగా ప్రెస్ చేయటానికి ఇంగ్లండ్, జర్మనీ దేశాలకు పంపటము చాలా ఇబ్బందిగా ఉండేది. షెల్లాక్ ఇండియాలో సమృద్ధిగా దొరుకుతున్నందున గ్రామఫోన్ కంపెని వారు రికార్డ్స్ ప్రెస్సింగ్ ఫాక్టరిని మనదేశములోనే నెలకొల్పాలనుకున్నారు.

కలకత్తాకు దగ్గరలో షియాల్‌దా లో 1908లో మొదటి ఫాక్టరీని నెలకొల్పారు. ఆ ఫాక్టరీకి ఫ్రెడ్ గైస్‌బెర్గ్ ప్రారంభోత్సవము చేసాడు.

క్రమంగా రికార్డింగ్ స్టూడియోలు మదరాసు, బొంబాయి నగరాలలో నిర్మించారు. ఈ రెండు ప్రదేశాలలో ఆర్టిస్టుల చేత పాడించి రికార్డింగు చేసిన మాస్టర్స్‌ను రికార్డుల ప్రెస్సింగు కొరకు కలకత్తా పంపేవారు. ఇండియాలోనే ఫాక్టరీ పెట్టాక కళాకారులు పాడిన పాట చివర్లో వాళ్ల పేర్లు చెప్పే పద్ధతికి స్వస్తి చెప్పారు.

ఇంతకుముందు అయితే రికార్డింగ్ చేసిన వాక్స్ (WAX) మాస్టర్స్‌ను విదేశాలకు పంపి గ్రామఫోన్ రికార్డులుగా తయారుచేసి వాటిని మనదేశంలో అమ్మేవారు. అందుకని పాట పాడిన తరువాత పాట చివరలో కళాకారులు వారి పేరు చెప్పుకొనేవారు. దీనివలన పాడిన వారి గురించి రికార్డు లేబుల్ తయారుచేయటానికి సహాయపడేది.

భారతదేశములో డీలర్స్, ఏజెంట్స్, షాప్స్, డిస్ట్రిబ్యూటర్స్‌ను నెలకొల్పి గ్రామఫోన్

కంపెనీవారు తమ వ్యాపారాన్ని మూలమూలలా వ్యాపింపచేసుకుని అభివృద్ధి చేసుకున్నారు. వ్యాపారము బాగా అభివృద్ధి ఆగుటచే సినిమా సంగీతానికి ప్రజాదరణ రాకముందే 1928లో కలకత్తాలోని విమానాశ్రయానికి దగ్గరలో డమ్‌డమ్‌లో రెండవ ఫ్యాక్టరీని నెలకొల్పారు.

**వాద్య సంగీతపు రికార్డులు :** భారతదేశంలో వివిధ ప్రాంతాలలో బాండ్ వాద్య బృందాలు ఉండేవి. వీటిని ఆ ప్రాంతాలను పరిపాలిస్తున్న రాజులు పోషించేవారు. ఈ వాద్య బృందాలు అనేక ప్రదేశాలలో పర్యటిస్తూ కార్యక్రమాలను నిర్వహించేవారు. ఆ వాద్యబృందాలలో కొన్ని - భావనగర్ స్టేట్ బాండ్, తంజావూరు స్టేట్ బాండ్, మైసూర్ స్టేట్ బాండ్, సూరత్ స్టేట్ బాండ్ మొదలగునవి. ఈ బృందాల వాద్య సంగీతాన్ని రికార్డింగ్ చేసి 78 ఆర్‌పిఎం రికార్డులుగా గ్రామఫోన్ కంపెనీలు అమ్మేవారు.

ఇవేకాక ఇతర వాద్యకళకారులు వాయించిన వాద్య సంగీతాన్ని కూడా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసేవారు. వీటిలో నాదస్వరము, షెహనాయ్, వయొలిన్, సితార్, జలతరంగ్, హార్మోనియం మొదలైనవి ఉండేవి. ఆనాటి స్టేట్ బాండ్స్ వారి సంగీతపు రికార్డింగ్స్‌లో ఆ రాష్ట్రం పేరు చెప్పిన తరువాత వాద్యసంగీతము ప్రారంభించేవారు. శాస్త్రీయ సంగీతాన్ని వినిపించేవారు.

దక్షిణ భారతదేశములో అయితే త్యాగరాజకృతులను వాయించేవారు. గ్రామఫోన్ కంపెనీవారు ఈ వాద్యసంగీతాన్ని రికార్డులుగా విడుదల చేసారు. గ్రామఫోన్ రికార్డు లేబుల్ మీద సమాచారము యిలా ఉండేది. మచ్చుకు – “Played by the Karnataka Band of His Highness the Maharaja Of Mysore, GCSI” రికార్డు విన్నప్పుడు "His Highness the Maharaja Of Mysore " అని చెప్పి వాద్య సంగీతము ప్రారంభించేవారు. ఈ 78 ఆర్‌పిఎం రికార్డులో ఒకవైపు “ఎందరో మహానుభావులు” రెండోవైపు “ఎప్పుడు కృప కల్గును” అనే కృతులు వాయించారు. ఇలాగ రకరకాల వాద్యబృందాల రికార్డులు విడుదల చేసేవారు.

# రంగస్థల సంగీతం

భారతదేశములో వివిధ భాషలలో ఎన్నో నాటకాలు ప్రదర్శించబడ్డాయి. నాటక రంగానికి దాదాపుగా **150** సంవత్సరాల చరిత్ర ఉన్నది. నాటకాలలో సంగీతము ప్రవేశపెట్టడము వలన నాటకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. నాటక సంగీతం అనేక మంది గాయకులకు ఆధారం అయింది. **20**వ శతాబ్దములో విడుదల అయిన గ్రామఫోన్ రికార్డులలో అత్యధికభాగం నాటక సంగీతమే. ఈ నాటక సంగీత ప్రక్రియే పౌరాణిక చిత్రాలలో కూడా ప్రయోగింపబడింది.

ప్రారంభంలో బెంగాల్‌లో ఇంగ్లీషు నాటకాలు, సంస్కృత నాటకానువాదాలు ప్రదర్శింపబడుతూ ఉండేవి. క్రమేణా బెంగాలీ భాషలో నాటకాలు రచించి ప్రదర్శింపపడ్డాయి. కాళిదాసు రచించిన 'శకుంతలము' బెంగాలీ భాషలో అనువదింపబడి ప్రదర్శింపబడినది. క్రమేణా సాంఘిక నాటకాలు, చారిత్రాత్మక నాటకాలు రచించి ప్రదర్శింపబడ్డాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్ వాగ్గేయకారుడు. అన్ని రకాల సంగీతము గురించి తెలిపిన విద్వాంసుడు. వీరు గాయకులే కాదు, సంగీత దర్శకులు, నటులు కూడాను. నాటకాలు రచించి వాటిలో నటించారు. వీరి సంగీతం ఆ రోజులలో బహుళ ప్రజాదరణ పొందింది. రవీంద్ర సంగీతం అని పిలువబడేది. బెంగాలీ భాషలో "భక్త విఠల్", "బిల్వ మంగళ్", "చంద్రగుప్త", "కృష్ణార్జున" మొదలైన నాటకాలు ఎన్నో ప్రదర్శింపబడి బహుళ ప్రజాదరణ పొందాయి. ప్రజాదరణ పొందిన నాటకాలలోని పాటలు, సంభాషణలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

అన్నా సాహెబ్ కిర్లోస్కర్ రచించిన 'సంగీత శాకుంతలము' పూనాలో ప్రదర్శింపబడిన తొలి మరాఠి నాటకము **(1880)**. అ తర్వాత ఎన్నో ప్రసిద్ధమైన సంగీత ప్రధానమైన నాటకాలు ప్రదర్శింపబడ్డాయి. ఎందరో గొప్పకళాకారులు పాడిన పద్యాలు, సంభాషణలు వివిధ కంపెనీలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేశారు. మరాఠీ కళాకారులలో అత్యధికంగా పాడిన వారు - నారాయణ శ్రీపాద రాజహన్స్ **(1888-1967) !** ఇతను ఎవరో కాదు 'బాలగంధర్వ' పేరుతో ప్రసిద్ధుడు. **1898**లో లోకమాన్య బాలగంగాధర తిలక్ రాజహన్స్‌కు 'బాలగంధర్వ' అనే బిరుదునిచ్చారు.

వీరు కొన్ని వందలపాటలు పాడినట్లు తెలుస్తున్నది. వీరు పాడిన పాటలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి అమ్మకాలలో చరిత్ర సృష్టించిందట.

దీనానాథ్ మంగేష్కర్ (ప్రముఖగాయని లతా మంగేష్కర్ తండ్రిగారు), వినాయకరావు పట్వర్ధన్, పెంఢార్కర్ మొదలైన ఎంతోమంది నాటకాలలో గానం చేసిన పాటలను బొంబాయిలోని అనేక గ్రామఫోన్ రికార్డ్ కంపెనీలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు.

గుజరాతీ భాషలో అనేక నాటకాలు ప్రదర్శింపబడ్డాయి. ప్రముఖ గాయకుడు మాస్టర్ హిమ్మత్ రామ్‌మీర్ స్త్రీ పాత్రలు ధరించేవారు. ఇతనిని "బాలగంధర్వ ఆఫ్ గుజరాత్" అని పిలిచేవారు. వీరి పాటలు బేక, జోనోఫోన్, రామఫోన్, గ్రామఫోన్ కంపెనీలు రికార్డులుగా విడుదల చేసారు.

హచిన్స్ గ్రామఫోన్ కంపెనీవారు తమిళభాషలో ప్రదర్శింపబడిన చాలా నాటకాలను గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. వాటిలో "సతీ అనసూయ", "సుభద్రా పరిణయం", "కృష్ణ తులాభారము", "కృష్ణలీల", "రాజా దేసింగ్", "సీమంతాని", "అష్టరూప అమరావతి" మొదలైనవి ఉన్నాయి.

గానం చేసిన కళాకారుల పేర్లు గ్రామఫోన్ రికార్డు లేబుల్ మీద ముద్రించేవారు కాదు. "హచిన్స్ డ్రమటిక్ పార్టీ" అని ముద్రించేవారు. గ్రామఫోన్ రికార్డు కవరుల మీద "కాలక్షేపం సెట్స్" అని ముద్రించి దానికింద రుక్మిణీ కళ్యాణము, శిశుతొండార్ వగైరా అని కూడా ప్రకటించేవారు. రికార్డు కవర్స్ మీద కళాకారుల ఫోటోలు ముద్రించేవారు.

ప్రముఖుల కంఠాలను గ్రామఫోన్ కంపెనివారు రికార్డు చేసి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. వారిలో కె.ఆర్. సుందరాంబాళ్, జి.జి. కిష్టప్ప, సుబ్బయ్య భాగవతార్ మొదలైన ప్రముఖులున్నారు.

ఆధునిక తమిళ నాటకరంగాన్ని తీర్చిదిద్దిన వారు సమ్మాల్ సంబంధ మొదలియార్. న్యాయవాది అయిన వీరికి బళ్ళారి కృష్ణమాచార్యులుగారు స్ఫూర్తి. వీరు స్టేజిమీద రకరకాల సెట్టింగ్స్, సీనరీలు అమర్చి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేవారు. మొదలియార్‌గారు రచించిన "మనోహర" నాటకం **1954**లో చలనచిత్రంగా విడుదల

అయింది. శివాజి గణేశన్, కన్నాంబ, రాజకుమారి మొదలైనవారు నటించారు. ఈ చిత్రంలోని సంభాషణలు గ్రామఫోన్ రికార్డులు విడుదలగా అయి సంచలనాన్ని సృష్టించింది.

1950 దశకంలో 'రక్తకన్నీర్' నాటకం తమిళనాడులో చరిత్ర సృష్టించింది. నటులు ఎం.ఆర్.రాధా (హీరోయిన్ రాధిక తండ్రిగారు) తనదైన శైలిలో సంభాషణలు చెప్పి సంచలనాన్ని సృష్టించారు. ఇదే నాటకం 1953లో "రక్తకన్నీరు" సినిమాగా తమిళంలో నిర్మింపబడి సూపర్‌హిట్ అయింది. చిత్రంలో కూడా ఎం.ఆర్.రాధా నటించారు. ఈ చిత్రంతోనే ఎం.ఆర్.రాధా నటునిగా నిలద్రొక్కుకున్నాడు. ఎం.ఎర్.రాధా సంభాషణలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి విపరీతంగా అమ్ముడుపోయాయి.

కాళిదాసు శాకుంతలము మలయాళ భాషలో అనువదించబడింది. 'జానకీ పరిణయం', 'ఉత్తరరామ చరితమ్' మలయాళ భాషలో అనువదింపబడ్డాయి. ఈ నాటకాలలో సంగీతము కూడా ప్రవేశపెట్టబడింది. "లంకాదహనము", "పాదుకా పట్టాభిషేకము", "కబీర్‌దాస్ చరితం", "హరిశ్చంద్ర చరితమ్", "కుచేల గోపాలమ్" మొదలగునవి నాటకాలుగా ప్రదర్శింపబడ్డాయి. ఈ నాటకాలలో కర్ణాటక సంగీతము ఆధిపత్యము వహించింది.

కేరళ నాటక రంగానికి విశేషసేవలు అందించిన వారు - తిరువత్తార్ నారాయణ పిళ్ళై, కేలు నాయర్, కేశవ పిళ్ళై, అచ్యుత మీనన్ మొదలైనవారు. కోమన్ నాయర్, సి.వి.కె.నంబియార్, మలబార్ రామన్ నాయర్ మొదలగు గొప్ప రంగస్థలనటులు కేరళనాటక రంగానికి ఎనలేని సేవలు అందించారు.

నాటకాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయినట్లు తెలుస్తున్నది.

అనేక నాటక సమాజాలు ప్రారంభించబడి ఎన్నో నాటకాలు కన్నడ భాషలో ప్రదర్శింపబడ్డాయి. తరువాతకాలంలో గుబ్బి కంపెనీ కన్నడ నాటక రంగంలో మహత్తర దశను సృష్టించింది. ప్రఖ్యాత కళాకారులు గుబ్బి వీరణ్ణ, జయమ్మ, ప్రముఖ కన్నడ హీరో రాజ్‌కుమార్, నరసింహరాజు నటులు అయిన జి.వి.అయ్యర్ మొదలైన వారు

గుబ్బి కంపెనీ ప్రదర్శించే నాటకాలలో నటించి చిత్రసీమలో ప్రవేశించిన వారు. "పాదుకా పట్టాభిషేకము", "కృష్ణలీల", "కంసవధ", "శక్తివిలాస్", "కబీర్", "తుకారాం", "తులసీదాస్", "గౌతమబుద్ధ" మొదలైన ఎన్నో నాటకాలు ప్రదర్శింపబడ్డాయి. నాటకాలలో సంగీతం ప్రాధాన్యత వహించింది.

"రాజసూయ యాగ", "విరాట పర్వ", "కబీర్‌దాస్", "రామాంజనేయ", "సుభద్రా పరిణయ" మొదలగు ఎన్నో నాటకాలలోని సంగీతాన్ని హచిన్స్ గ్రామఫోన్ కంపెనీవారు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. ఓడియన్, ట్విన్ రికార్డింగ్ కంపెనీలు కూడా నాటకాలను రికార్డులుగా విడుదల చేసారు.

**తెలుగు రంగస్థల సంగీతం :** రంగస్థలము మీద ప్రదర్శింపబడిన తొలి తెలుగు నాటకము కందుకూరి వీరేశలింగంపంతులు గారు రచించిన "వ్యవహార ధర్మబోధిని" (1880).

1897లో గురజాడ అప్పారావుగారు వ్యావహారిక భాషలో రచించిన వచన నాటకం 'కన్యాశుల్కం' బహుళ ప్రజాదరణ పొందింది.

చిలకమర్తి నరసింహం గారు రచించిన పౌరాణిక నాటకం 'గయోపాఖ్యానము'లో పద్యాలు కూడా ఉండి ప్రదర్శించబడినది. ఈ పద్యాలు బహుళ ప్రజాదరణ పొందాయి.

19వ దశకం ప్రారంభంలో తబల, హార్మోనియం, వయోలిన్, మృదంగం మొదలైనవి నాటకాలలో చోటు చేసుకున్నాయి.

ప్రముఖ జంటకవులు తిరుపతి వెంకటకవులు నాటక రచనకు ఒక క్రొత్త ఒరవడిని సృష్టించారు. వారు 1911లో "పాండవోద్యోగం", 1914లో "పాండవ విజయం" నాటకాలు రచించారు. ఇందులోని పద్యాలు - 'అదిగో ద్వారక', 'జెండాపై కపిరాజు'. 'చెల్లియో చెల్లకో' మొదలైనవి ప్రతి ఊరిలోను మారుమ్రోగాయి. ఈ నాటకాలు విపరీతంగా ప్రదర్శింపబడి చరిత్ర సృష్టించాయి.

ఈ రెండు నాటకాలు కలిపి "కురుక్షేత్రం" పేరుతో ఒకే నాటకంగా ప్రదర్శించేవారు, ప్రదర్శిస్తున్నారు కూడా.

తరువాత బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు రచించిన "సత్యహరిశ్చంద్ర", ముత్తరాజు సుబ్బారావుగారి "శ్రీకృష్ణతులాభారము" సూపర్‌హిట్ అయిన నాటకాలు. ఈ పద్యాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

"శ్రీకృష్ణతులాభారం" నాటకంలో స్థానం నరసింహారావుగారు సత్యభామగా నటించి వారే రచించి పాడిన "మీరజాలగలడా నా యానతి" పాట విశేషంగా శ్రోతలచే ఆకర్షించబడింది. గ్రామఫోన్ రికార్డులు విపరీతంగా అమ్ముడు పోయాయి.

అలాగే కాళ్లకూరి నారాయణరావుగారు రచించిన "వరవిక్రయము", "చింతామణి" నాటకాలు కూడా ప్రదర్శింపబడి విజయవంతమయ్యాయి.

"ప్రతాప రుద్రీయం" "బొబ్బిలియుద్ధం", "రామదాసు", "రంగూన్ రౌడి" మొదలైన ఎన్నో నాటకాలు మహానుభావుల కలాల నుండి జాలు వారి ప్రదర్శింపబడ్డాయి.

బళ్లారికి చెందిన ధర్మవరపు రామకృష్ణమాచార్యులు ("బళ్లారి రాఘవ" గారి మేనమామ) పద్యనాటకాలు రచించి తెలుగు నాటకరంగానికి ఎనలేని సేవలు చేసారు. వీరు సంగీతజ్ఞులు. నాటకంలో పద్యాలు, పాటలు వినూత్న పద్ధతిలో ప్రవేశపెట్టారు. వీరు రచించిన "విషాద సారంగధర", "చిత్రనళీయము" చాలా ప్రసిద్ధి చెందాయి.

ఇదే సమయములో బళ్లారి నివాసి కోలాచలం శ్రీనివాసరావుగారు కూడా దాదాపుగా 30 నాటకాలు రచించి నాటకరంగానికి ఎనలేనిసేవ చేసారు.

**తెలుగు రంగస్థల నటీనటులు :** తెలుగు నాటక రంగానికి తమ నటన, గానంతో ఎంతోమంది ఎనలేని కీర్తిని తెచ్చారు. వారిలో బళ్లారి రాఘవాచార్య ప్రథములు. అబ్బూరి వరద రాజేశ్వరరావు, బందా కనకలింగేశ్వర రావు, కపిలవాయి రామనాధశాస్త్రి, ఉప్పులూరి సంజీవరావు, సి.యస్.ఆర్.ఆంజనేయులు, రామతిలకం, వేమూరి గగ్గయ్య, దైతా గోపాలం, చందాల కేశవదాసు, పసుపులేటి కన్నాంబ, జొన్నవిత్తుల శేషగిరిరావు, పారుపల్లి సత్యనారాయణ, చిత్తూరు నాగయ్య, స్థానం నరసింహారావు, కొచ్చెర్లకోట సత్యనారాయణ, కళ్యాణం రఘురామయ్య, సాలూరి రాజేశ్వరరావు, టంగుటూరి సూర్యకుమారి, పి.సూరిబాబు, తుంగల చలపతిరావు, రేబాల రమణ, యడవల్లి సూర్యనారాయణ, అద్దంకి శ్రీరామమూర్తి, కె.అబ్రహాం, ఋష్యేంద్రమణి, రెంటచింతల సత్యనారాయణ, సురభి కళాకారులు ఇలాగ ఎందరో నాటకరంగానికి కృషి చేసారు.


# డ్రామా రికార్డుల స్లీవ్స్







నటశేఖర
బి.యస్.సూరి & పార్టీ
వారి
SRI RAJYAM THEATRE
ALLURI
SEETHARAMARAJU
(TELUGU BASIC DRAMA)
MUSIC: S. DEVI PRASAD
అల్లూరి
సీతారామరాజు
నాటకం


శ్రీ రామాంజనేయ యుద్ధం
SRI RAMAN JANEYA
YUDDAM

ఆ రోజులలో నాటకాలను "డ్రామా సెట్స్"గా గ్రామఫోన్ రికార్డులు అమ్మేవారు. వేమూరి గగ్గయ్య నటించిన 'కృష్ణలీలలు' నాటకం 8 భాగాలు(4 రికార్డులు) గా విడుదల అయింది. బళ్లారి రాఘవ నటించి "భక్త ప్రహ్లాద " 10భాగాలుగా (5రికార్డులు) విడుదల అయింది. హచిన్స్, ట్విన్, సన్ రికార్డింగ్, బ్రాడ్‌కాస్ట్, రామగ్రాఫ్, కొలంబియా మొదలైన గ్రామఫోన్ కంపెనీలు ఈ కళాకారుల కంఠస్వరాలను గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేయటము వలన ఈ తరం వారికి కూడా అందుతున్నాయి.

ప్రముఖ నటుడు ఎం.ఆర్.రాధా, తమిళనాడులో నాటక ప్రదర్శనల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చాడు. రాధా నటించిన "రక్తకన్నీరు" నాటకం చూసి తెలుగు నటులు నాగభూషణం ఎం.ఆర్.రాధాను మక్కికి మక్కీ అనుకరిస్తూ తెలుగులో సొంతంగా ఈ నాటకం ప్రదర్శించే హక్కులుకొన్నాడు. ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు చేత నాటకం డైలాగులు రాయించుకున్నాడు. తన కుమారుడు 'రవి'పేరున "రవి ఆర్ట్ థియేటర్స్" స్థాపించి ఈ నాటకాన్ని ఊరూరా ప్రదర్శనలిచ్చాడు. సంభాషణలు చెప్పడంలో రాధాను అనుకరించాడు.

ఈ నాటకం దాదాపుగా 5400 సార్లకి పైబడి ప్రదర్శించబడింది. ఈ నాటకం ఘనవిజయం సాధించి నాగభూషణం 'రక్తకన్నీరు' నాగభూషణంగా ప్రసిద్ధిచెందాడు. ఈ నాటకంలో నటించిన వారిలో ప్రముఖ నటీమణులు ఊర్వశి శారద, వాణిశ్రీ ఉన్నారు. ఈ నాటకం సంభాషణలు గ్రామఫోన్ కంపెనీవారు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. రికార్డులు విపరీతంగా అమ్ముడుపోయాయి.

**జూక్ బాక్స్ :** జూక్‌బాక్స్ అంటె పెద్దసైజులో ఉండే రికార్డు ప్లేయరు. ఇందులో నాణెం (నోట్లు వేస్తే పనికిరాదు) వేసి మనకు ఇష్టమైన పాట వినవచ్చును. ఈ యంత్రాన్ని అమెరికాలో జాన్ గొబెల్ కనుగొన్నాడు. జూక్‌బాక్స్‌లో నాణాన్ని గుర్తించే మాగ్నెటిక్ డిటెక్టర్ ఉంటుంది. ఇందులో 24, 78 ఆర్‌పిఎం రికార్డులు ఉంటాయి. ఇందులో ముల్లు (నీడిల్)ను మార్చే సౌకర్యం ఉంటుంది. ఒక పిడి ('నాబ్') ఉంటుంది. దాని సహాయముతో మనకు కావలసిన రికార్డును ప్లే చేయవచ్చును, మన కిష్టమైన పాట వినవచ్చును. దీనిని 1906లో ఆటోమాటిక్ మెషిన్ అండ్ టూల్ కంపెని, అమెరికా వారు తయారుచేసారు.

ఎలక్ట్రికల్ రికార్డింగ్, ఎలక్ట్రికల్ యాంప్లిఫయర్స్ కనుగొన్నాక ఈ జూక్‌బాక్స్‌ల పాపులారిటి పెరిగింది. హోటల్స్, బార్‌లలో ఇవి ఉండేవి. దీని వలన గ్రామఫోన్ రికార్డులు బాగా అమ్ముడుపోయి గ్రామఫోన్ రికార్డులు తయారుచేసే కంపెనీలు వారి వ్యాపారాన్ని అభివృద్ధి పరచుకున్నారు.

గుంటూరు పట్టణములో బ్రాడీపేట మెయిన్‌రోడ్ 4వ లైనులో చాలా ప్రసిద్ధిగాంచిన హోటల్ - 'శంకర్‌విలాస్' (ఈ హోటల్ ఇప్పుడు మెయిన్ రోడ్ మీద కాకుండా 4వ లైనులో ఉంది). హోటల్ యజమాని పేరు శంకర్. ఆ హోటల్‌లో జూక్‌బాక్స్ ఉండేది. 1960 దశకంలో 25 పైసల నాణెమువేసి ఇష్టమైన పాటలను వినేవాళ్ళము. ఆ రోజుల్లో 'యహుది' హిందీ చిత్రములోని పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. అందులో లతా మంగేష్కర్ పాడిన 'దిల్ మే ప్యార్‌కా తూఫాన్' అనే పాట చాలా బాగుండేది. విపరీతముగా వినేవాళ్లం. చుట్టుప్రక్కల పల్లెటూర్లనుంచి కూడా ఎంతో మంది ఆ హోటల్‌లో కాఫీత్రాగుతూ జూక్‌బాక్స్‌లోని పాటలు వినేవారు.

అలాగే ఆరండల్‌పేట మెయిన్‌రోడ్డుమీద ఒకటి, రెండు లైనుల మధ్య నైజాం స్వీట్స్ షాప్స్ రెండు ఉండేవి. అందులో ఒక యజమానిపేరు బలరామ్, ఉత్తర హిందుస్థానీయులు. ఆ హోటల్లో కూడా గ్రామఫోన్ ఎప్పుడు మ్రోగుతూ ఉండేది. అర్ధరాత్రిపూట విద్యార్థులు ఆ హోటల్‌లో టీ త్రాగుతూ గ్రామఫోన్‌లో ఇష్టమైన పాటలు పెట్టించుకునేవారు. ఆరోజుల్లో అదో సరదా.

**రేడియోగ్రామ్ :** అందమైన చెక్కపెట్టెలో అమర్చబడిన వాల్వ్ (Valves)తో పనిచేసే రేడియో, 78 RPM రికార్డులు ప్లే చేయటానికి గ్రామఫోన్ కలిసి ఉన్నదానిని 'రేడియోగ్రామ్' అని పిలిచేవారు. క్రమేణా ఆటోమాటిక్ రికార్డు ఛేంజర్స్ వచ్చాయి.

రేడియోగ్రామ్స్ సంపన్నుల గృహాలలో ఉండేవి. క్రమేణా 78, 45, 33 1/3 RPM రికార్డులు ప్లే చేసే రికార్డ్ ప్లేయర్స్, స్టీరియో రికార్డులు, వాటిని ప్లే చేసే యంత్రాలు ప్రవేశపెట్టటము వలన ట్రాన్సిస్టర్‌తో తయారుచేసే రేడియోలు రావటము వలన 'స్టీరియో గ్రామ్స్' మార్కెట్‌లో ప్రవేశించాయి.

1970 దశకంలో 'హైఫిడిలిటీ' మ్యూజిక్ సిస్టమ్స్‌ను ప్రవేశపెట్టటము వలన రేడియోగ్రామ్స్‌కు ఆదరణ క్రమంగా తగ్గిపోయింది.

**78 ఆర్‌పిఎం గ్రామఫోన్ రికార్డుల తయారీ :** తొలి రోజులలో గ్రామఫోన్ రికార్డులను తయారు చేయటానికి శబ్దాన్ని డైరెక్ట్‌గా మాస్టర్ డిస్క్ మీద రికార్డు చేసేవారు. ఈ మాస్టర్ డిస్క్ ఒక ప్లేటు లాటిది. ఇనుము, రాగి లేదా తుత్తునాగం (జింక్)తో తయారుచేయబడి పైన మైనపు పూత (వాక్స్ కోటింగ్) కలిగి ఉంటుంది. శబ్దాన్ని రికార్డింగ్ చేస్తున్నప్పుడు ఉద్భవించిన ప్రకంపనాలు (వైబ్రేషన్స్) వజ్రపు ముల్లు (డైమండ్ స్టయిలస్) సహాయంతో మైనంపై గీతలు (గ్రూవ్) పెడుతుంది.



షెల్లాక్‌తో చేసిన గ్రామఫోన్ రికార్డు

ఆ విధంగా గీతలు పడిన మైనపు ప్లేట్‌పై కొన్ని రసాయనిక పదార్థాలు చల్లి ఎలక్ట్రో ప్లేటింగ్ చేస్తారు. మొదట నికెల్ తరువాత కాపర్ ప్లేటింగ్ చేస్తారు. మైనపు మాస్టర్ నుంచి ఈ డిస్క్‌ను వేరు చేస్తారు. దీనిని నెగటివ్ మాస్టర్ అంటారు. ఈ నెగటివ్ మాస్టర్‌ను ఉపయోగించి ప్రెస్‌లో షెల్లాక్ రికార్డులు తయారు చేసేవారు. గ్రామఫోన్ రికార్డుకు రెండువైపులా పాటలను తయారు చేయాలంటే ప్రెస్‌లో రెండు నెగటివ్ మాస్టర్స్‌ను వాడేవారు. ఈ రెండు మాస్టర్స్ మధ్య షెల్లాక్ ఉంచి సరైన ఉష్ణోగ్రత, పీడనము మెయింటైన్ చేస్తూ ప్రెస్ చేసి రికార్డులు తయారు చేసేవారు. ప్రెస్ నుండి గ్రామఫోన్ రికార్డును తీసి చల్లార్చి అంచులు నునుపు (ట్రిమ్) చేస్తారు. రికార్డింగ్ ప్రెస్ చేసే సమయంలోనే లేబుల్స్ అంటించేవారు. ఈ పద్ధతిలో తక్కువ మొత్తములో

రికార్డులు తయారు చేయటానికి వాడేవారు. ప్రారంభంలో రికార్డుల అమ్మకాలు తక్కువ కనుక యిది సరిపోయేది.

**ఎకూస్టిక్ రికార్డింగ్ (Acoustic Recording):** దాదాపు మొదటి 25 సంవత్సరాలు గ్రామఫోన్ రికార్డుల తయారీలో శబ్దాన్ని ఎకూస్టిక్ రికార్డింగు పద్ధతిలో రికార్డు చేసేవారు. ఈ పద్ధతిలో కళాకారులు వెడల్పుగా ఉన్న గొట్టముకు దగ్గరగా ముఖాన్ని పెట్టి గట్టిగా అరుస్తూ పాడేవారు. ఈ గొట్టము రెండోవైపు సన్నగా ఉంటుంది. దీనికి పొర (డయాఫ్రమ్) అమర్చేవారు. ఆ డయాఫ్రమ్‌కు వజ్రపుముల్లు అమర్చేవారు. పాడుతున్నప్పుడు శబ్దతరంగాల ప్రకంపనాలకు ముల్లు కదులుతూ మాస్టర్ డిస్క్‌మీద ఉన్న మైనంపై గీతలు గీస్తుంది. ఈ పద్ధతిని ఎకూస్టిక్ రికార్డింగ్ అంటారు. అంటే ఈ పద్ధతిలో యాంప్లిఫైయర్స్, మైక్రోఫోన్స్, స్పీకర్స్ మొదలైనవి ఉండవు. ఈ పద్ధతిలో తయారయిన గ్రామఫోన్ రికార్డులను ప్లే చేస్తే శబ్దము తక్కువగా వచ్చేది. రికార్డింగ్ నాణ్యత చాలా తక్కువగా ఉండేది.

**ఎలక్ట్రికల్ రికార్డింగ్ :** 1920 ప్రాంతంలో బ్రిటన్‌లోని వెస్టర్న్ ఎలక్ట్రిక్ కంపెనీ వారు శబ్దాన్ని రికార్డింగ్ చేయడంలో క్రొత్త పద్ధతిని కనుగొన్నారు. ఈ పద్ధతిలో మైక్రోఫోన్లు, శబ్దాన్ని పెంచే వాక్యూమ్ ట్యూబ్స్ వాడారు. పెరిగిన ధ్వనిలో వచ్చే సంకేతాలు (సిగ్నల్స్)ను ఎలక్ట్రోమాగ్నెటిక్ హెడ్‌ను వాడి రికార్డింగ్ చేసేవారు. దీనివలన రికార్డింగ్‌లో ఫ్రీక్వెన్సీ రేంజ్ పెరిగేది. రికార్డును ప్లే చేసినప్పుడు అధికంగా ధ్వని వచ్చేది. రికార్డింగ్ నాణ్యత కూడా పెరిగింది.

## వివిధ కంపెనీలు - గ్రామఫోన్ రికార్డులు

గ్రామఫోన్ కంపెని (హెచ్‌ఎంవి) వారికి 78 ఆర్‌పిఎం రికార్డులు తయారు చేసే అనేక కంపెనీలు పోటీగా ఉండేవి. అవి :

(1) ఒడియన్ (2) కొలంబియా (3) నికోల్ (4) బేకా (5) జోనోఫోన్ (6) పాతె (7) సింగర్ (8) జెమ్స్ ఒపేరా (9) సన్ డిస్క్ (10) రామా గ్రాఫ్ (11) బ్రాడ్‌కాస్ట్ (12) హిందుస్థాన్ (13) ట్విన్ (14) యంగ్ ఇండియా (15) మెగాఫోన్ మొదలగునవి.

**ఓడియన్ రికార్డులు :** జర్మనీలోని బెర్లిన్ నగరంలోని ఇంటర్నేషనల్ టాకింగ్ మెషీన్ కంపెనీ వారు 1903లో ఓడియన్ రికార్డులు తయారు చేయటము ప్రారంభించారు. పారిస్‌లోని ఒక థియేటర్ భవనము మీద ఉన్న బోర్లించిన గిన్నె ('డోమ్') ఆకారాన్ని ఓడియన్ రికార్డ్స్ లేబుల్‌మీద లోగోగా వాడారు. పాటలను రికార్డింగ్ చేసి, గ్రామఫోన్ రికార్డులు తయారు చేసి భారతదేశానికి, ఇతర దేశాలకు పంపి విక్రయించేవారు.

ఓడియన్ కంపెనీవారు 1906లో భారతదేశంలో ప్రవేశించారు. 1914 వరకు ఇండియాలో రికార్డింగ్స్ చేసి, జర్మనీలో గ్రామఫోన్ రికార్డ్స్ తయారుచేసి మనదేశానికి తెచ్చి అమ్మేవారు. తర్వాత వారు మనదేశంలో వ్యాపారాన్ని మానివేశారు.1930లో ఓడియన్ కంపెనీవారు వారి వ్యాపారాన్ని మన దేశంలో తిరిగి ప్రారంభించారు.

బొంబాయిలోని 'రూబీ రికార్డ్స్ కంపెని', మదరాసులోని 'సరస్వతీ స్టోర్స్' ఓడియన్ రికార్డ్స్‌కు ఏజెంట్లుగా వ్యవహరించారు. 1932లో ఓడియన్ కంపెనివారు మదరాసులో రికార్డింగ్ స్టూడియో నిర్మించారు. ఓడియన్ కంపెనివారు దక్షిణ భారతదేశంలోని అన్ని రకాల సంగీతాన్ని - వాద్యసంగీతం, హాస్యపు పాటలు, సినిమా పాటలు, రంగస్థల సంగీతం, శాస్త్రీయ సంగీతం, మొదలగునవి రికార్డులుగా విడుదల చేసి అన్ని వర్గాల వారిని సంతోషపరిచారు. 1945 నుంచి 1980 వరకు ఓడియన్ కంపెని ఇఎంఐ (యుకె) కంపెనీకి సబ్సిడియరీగా ఉండేది. హెచ్ఎంవి (ఇండియా) వారు హిందీ, తెలుగు, ఇతర భాషలలో ఓడియన్ లేబుల్ మీద ఎల్‌పి రికార్డులు చాలా విడుదల చేసారు.

**కొలంబియా రికార్డులు :** 1888లో స్థాపించ బడిన ఈ కంపెనీ హెడ్ క్వార్టర్స్ అమెరికాలోని కొలంబియాలో ఉండటం వలన కంపెనీకి కొలంబియా అని పేరు పెట్టారు. కొలంబియా కంపెనీ సిలిండర్ రికార్డులు, ఫోనోగ్రాఫ్‌లతో బాటుగా డిస్క్ రికార్డులు, గ్రామఫోన్స్‌కూడా అమ్మేవారు. పెద్ద సంస్థగా ఎదిగి మిగిలిన కంపెనీలకు పోటీనిచ్చింది. 1912 నుంచి సిలిండర్ రికార్డులు తయారీ ఆపు చేసి డిస్క్ రికార్డులు మాత్రమే తయారు చేసేవారు.

1917లో లండన్‌లో బ్రాంచి తెరిచారు. ఈ బ్రాంచి నుండి యూరప్‌లో వ్యాపారము కొనసాగించారు. కొన్ని సంవత్సరాల తరువాత లండన్‌లోని కొలంబియా వారు అమెరికాలో ఉన్న కొలంబియా కంపెనీని కొనుగోలు చేసారు. వెస్టన్ ఎలక్ట్రిక్ నుంచి లైసెన్సు తీసుకొని 1925 నుంచి ఎలక్ట్రికల్ రికార్డింగ్ ప్రారంభించి, ఎకూస్టిక్ రికార్డింగ్ మానేశారు. 1931లో బ్రిటిష్ కొలంబియా కంపెనీ, ఇంగ్లండులోనే వున్న గ్రామఫోన్ కంపెనీ (హెచ్‌ఎంవి) తో కలిసి ఇఎంఐ (ELECTRICAL AND MUSICAL INDUSTIRES LTD) గా రూపొందింది.

**ఇండియాలో కొలంబియా కంపెనీ :** 1930లో కలకత్తాలో కొలంబియా వారు తమ కార్యాలయాన్ని ప్రారంభించారు. కలకత్తాలో రికార్డింగ్ ఇంజనీర్లను నియమించి ఆసియా, ఇండియాలలో రికార్డింగ్స్ చేసి ఇంగ్లండ్‌లో రికార్డులు తయారు చేసేవారు. జర్మన్‌లు ఇంగ్లీషువారికి విరోధులు కాబట్టి రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఓడియన్ కంపెనీని మనదేశంలో మూసివేశారు. అందుకని ఓడియన్ కంపెనీ లేబుల్ మీద వచ్చిన ఎన్నో పాటలు కొలంబియా, రీగల్ లేబుల్స్ మీద విడుదల అయ్యాయి.

1931-1945 మధ్య కొలంబియా కంపెని మనదేశంలో అనేక భాషలలో హెచ్చు సంఖ్యలో రికార్డులు విడుదల చేసారు. 1938 ప్రాంతంలో రీగల్ లేబుల్ మీద రికార్డులు తయారు చేసి తక్కువ ధరలో అమ్మేవారు. మదరాసు లోని సరస్వతీ స్టోర్స్‌వారు కొలంబియా కంపెని వారి ఏజెంట్లుగా ఉండేవారు. కొలంబియా కంపెనీవారు ప్రారంభములో మాస్టర్స్‌ను ఇంగ్లండుకు పంపి రికార్డులుగా తయారు చేయించి మనదేశములో అమ్మేవారు. తరువాత కలకత్తాలోని గ్రామఫోన్ కంపెని (హెచ్‌ఎంవి) చేత రికార్డులు తయారు చేయించుకునేవారు.

1948లో కొలంబియావారు $33^{1/3}$ ఆర్‌పిఎమ్ మైక్రోగ్రూవ్ రికార్డులు, 1951లో 45 ఆర్‌పిఎం మైక్రో గ్రూవ్ వినైల్ రికార్డులు విడుదల చేసారు.

కొలంబియా కంపెనీవారు కొన్నివేల పాటలను 78 ఆర్‌పిఎం, ఇపి, ఎల్‌పి ఫార్మాట్‌లలో 1980 వరకు రికార్డులుగా విడుదల చేసారు.

**కొలంబియా కంపెనీలో యాజమాన్యపు మార్పులు :** కొన్ని కారణాల వలన అమెరికన్ కొలంబియా కంపెనిని ఇఎంఐ వారు యితరులకు అమ్మివేశారు. కొత్త

కంపెనీ యాజమాన్యమువారు దాన్ని అమెరికా రికార్డు కార్పొరేషన్ (ఎఆర్‌సి) కు అమ్మారు. వాళ్లు మళ్లీ కొలంబియా బ్రాడ్‌కాస్టింగ్ సిస్టమ్ (సిబిఎస్)కి అమ్మారు. వారి రికార్డులను కొంతకాలం ఫిలిప్స్ కంపెనీవారి చేత డిస్ట్రిబ్యూషన్ చేయించి తరువాత స్వయంగా సిబియస్ రికార్డ్స్ అనే సంస్థను స్థాపించారు. 1988లో సిబిఎస్ రికార్డ్స్ సంస్థను, కొలంబియా రికార్డ్స్ సంస్థను రెండింటినీ సోనీ కంపెనీవారు కొనుగోలు చేసినట్లుగా తెలుస్తున్నది.

**హెచ్.బోస్ - పాతె రికార్డులు :** భారతదేశంలో రికార్డులు తయారు చేయాలనే ఆలోచన వచ్చిన మొట్టమొదటి వ్యక్తి బెంగాల్ రాష్ట్రానికి చెందిన హెచ్. బోస్. రవీంద్రనాధ్ ఠాగూర్ ఆప్తమిత్రుడు. ఆయన కంపెనీకి రకరకాల వ్యాపారాలు ఉండేవి. బోస్ ఎడిసన్ కంపెని నుంచి ఫోనోగ్రాఫ్స్ తెప్పించుకుని దాని ద్వారా రికార్డింగ్స్ చేసి "హెచ్.బోస్ రికార్డ్స్" అనే లేబుల్ మీద సిలిండర్ రికార్డ్స్ తయారు చేసి అమ్మేవారు. రవీంద్రనాథ్ ఠాగూర్ చేత ఎన్నో పాటలు పాడించారు. అవి రికార్డులుగా రాలేదు. ఠాగూర్ స్వరపరచి పాడిన వందేమాతరం, కొన్ని శ్లోకాలు సిలిండర్స్ మీద రికార్డు చేసి ఫ్రాన్స్‌లోని పాతె కంపెనీకి పంపి డిస్క్ రికార్డుగా చేయించారు. కొద్ది సంవత్సరాల తరువాత ఈ కంపెనీ మూతపడింది.

**రామగ్రాఫ్ డిస్క్ రికార్డులు :** బొంబాయిలో టి.ఆర్.రామచందర్ బ్రదర్స్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను డ్రామా కంపెనీలకు సరఫరా చేసేవారు. వారు జర్మన్ కంపెని అయిన లైరోఫోన్ రికార్టులు తయారు చేసే కంపెనీతో కలిసి గ్రామఫోన్ రికార్డులు తయారుచేయ నారంభించారు. జర్మన్ నిపుణులచేత ఇండియాలో రికార్డింగ్ చేసినా గ్రామఫోన్ రికార్డులు మాత్రము జర్మనీలో తయారు అయ్యేవి.

ప్రారంభంలో రికార్డుల మీద RAM-O-GRAPH అని ఉండేది. తరువాత RAMAGRAPH గా మార్చారు. ఈ కంపెనీవారు ప్రముఖులు పాడిన సంగీతాన్ని గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. తెలుగు భాషలో కూడా రంగస్థల సంగీతాన్ని రికార్డులుగా విడుదల చేసారు. స్థానం నరసింహరావు పాడిన 'మీరజాల గలడా' పాటను ఈ కంపెనీయే విడుదల చేసింది. రెండవ ప్రపంచ యుద్ధమువలన జర్మన్ కంపెనీనుంచి వచ్చినవారు స్వదేశం వెళ్లిపోవడంతో రామాగ్రాఫ్ కంపెనీ మూతపడింది.

**హిందూస్థాన్ రికార్డులు :** కలకత్తాలో 1932లో చరణ్ సాహ్ గ్రామఫోన్ రికార్డుల కంపెని స్థాపించి హిందుస్థాన్ రికార్డ్స్ లేబుల్‌మీద గ్రామఫోన్ రికార్డులు విడుదల చేసారు. ఈ స్టూడియోలో రికార్డింగ్స్ చేసి మాస్టర్స్‌ను గ్రామఫోన్ కంపెని (హెచ్‌ఎంవి)కి పంపి రికార్డులుగా తయారు చేయించి అమ్మేవారు. ప్రముఖ హిందీ గాయకుడు కుందన్ లాల్ సైగల్ ఈ కంపెనీకి ప్రముఖ గాయకుడు.

ఇదే సమయంలో న్యూ థియేటర్స్ అనే సినిమా సంస్థ ప్రారంభించబడింది.

ఈ సంస్థ నిర్మించిన చిత్రాలలో పాటలు తొలుత హిందుస్థాన్ రికార్డ్స్‌గా వచ్చాయి. తర్వాత న్యూ థియేటర్స్ హిందుస్థాన్ రికార్డ్‌గాను, న్యూ థియేటర్స్ రికార్డ్‌గాను విడుదల అయ్యాయి. సుమారు 1970 వరకు ఈ సంస్థ 78 ఆర్‌పిఎం రికార్డులు తయారు చేసారు. ఆ తర్వాత ఈ పాటలను ఇపి, ఎల్‌పి రికార్డులుగా విడుదల చేసారు.

**సన్ రికార్డులు :** దక్షిణభారత భాషలలో చాలా పాటలు సన్ రికార్డింగ్ కంపెనీ లేబుల్‌మీద రికార్డులుగా విడుదల అయ్యాయి. “కనకతార” మొదలైన తెలుగు నాటకాలను ‘డ్రామా సెట్స్’గా విడుదల చేసారు.

**నికోల్, సింగర్, జేమ్స్ ఒపేరా రికార్డులు :** నికోల్, సింగర్, జెమ్స్ ఒపేరా లేబుల్ మీద గ్రామఫోన్ రికార్డులు తయారు చేయబడ్డాయి. నాణ్యత లోపం వల్ల వ్యాపారము విజయవంతము కానందున కంపెనీలు మూతపడ్డాయి.

**బ్రాడ్‌కాస్ట్, లోటస్, జై భారత్ రికార్డులు :** ఈ కంపెనీవారు బ్రిటిష్‌వారి సాంకేతిక పరిజ్ఞానము అనుసరించి ఉత్తర, దక్షిణ భారత దేశంలోని ప్రముఖులచే పాడించి రికార్డులుగా విక్రయించారు. మద్రాసులో 1933లో ‘మ్యూజికల్ ప్రాడక్ట్ లిమిటెడ్’ను ప్రారంభించి ‘బ్రాడ్‌కాస్ట్’ లేబుల్ మీద కొన్ని వందల రికార్డులు విడుదల చేసారు. వాటిలో ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, జొన్నవిత్తుల శేషగిరి రావు, బందా కనకలింగేశ్వరరావు, కొచ్చర్ల కోట సత్యనారాయణ పాడినవి ఉన్నాయి. అమ్మకాలు లేనందున మదరాసులోని ఆఫీసు కొద్ది సంవత్సరాలలోనే మూసివేశారు.

ఇదే యాజమాన్యం బొంబాయిలో ‘లోటస్’ లేబుల్‌మీద రికార్డులు తయారుచేసారు. ఈ కంపెనీకూడా మూతపడింది.

ఈ యాజమాన్యమే తిరిగి 'జై భారత్ లేబుల్' మీద రికార్డులు తయారుచేసారు. హిందీ, తమిళచిత్రాలలో పాటలు కూడా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. అమ్మకాలు లేనందున కొద్ది సంవత్సరాలలోనే మూతపడింది.

**బేకా రికార్డులు :** జర్మనీ దేశానికి చెందిన యీ కంపెనీ వారు రంగస్థల సంగీతము, సంప్రదాయ గీతాలను రికార్డులుగా విడుదల చేసారు. అతికొద్ది సంవత్సరాలలోనే ఈ సంస్థ మూతబడింది.

**జోనోఫోన్ రికార్డులు :** మనదేశంలో రికార్డింగ్ చేసి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసారు. రికార్డులు చౌకగా అమ్మేవారు. నాణ్యతాలోపము కూడా ఉండేది. ఈ సంస్థ కూడా నడవలేదు.

**ట్విన్ రికార్డులు :** ట్విన్ రికార్డ్స్ కంపెని గ్రామఫోన్ కంపెని (హెచ్ఎంవి)కి అనుబంధ (సబ్సిడరీ) సంస్థగా ఉండేది. అయినా ఇది స్వతంత్రముగా వ్యవహరించేది. ఈ లేబుల్ రికార్డులను మొదట కలకత్తాలోని సియాల్దాలో తయారుచేసేవారు. ఆ తర్వాత డమ్డమ్లో చేసేవారు. గ్రామఫోన్ కంపెనీకి పోటీగా ఉన్న కంపెనీలు విడుదల చేసిన పాటలను అదే కళాకారులు చేత పాడించి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసేవారు. వివిధ భాషలలలో కొన్ని వేల పాటలను విడుదల చేసారు. తెలుగులో కూడా కొన్ని వందల పాటలు, డ్రామా సెట్స్ విడుదల చేసారు.

ట్విన్ గ్రామఫోన్ రికార్డులు చౌకగా లభించేవి. మొదట్లో రికార్డు లేబుల్మీద 'ది ట్విన్' అని ఉండేది. తర్వాత 'ట్విన్' అని లేబుల్స్ ముద్రించేవారు.

**యంగ్ ఇండియా రికార్డులు :** పాండ్యా అనే వ్యాపారవేత్త 1939 ఏప్రిల్ మాసంలో "ది నేషనల్ గ్రామఫోన్ రికార్డ్ మాన్యుఫాక్చరింగ్ కం. లి." అనే సంస్థను బొంబాయికి దగ్గరలో ఉన్న వాడాలో ప్రారంభించాడు. జపాన్ దేశ సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పబడిన ఈ ఫ్యాక్టరీని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రారంభోత్సవము చేసారు. రికార్డ్స్ ప్రెస్సింగ్కూడా అక్కడే చేసేవారు.

ప్రముఖ చలనచిత్ర నిర్మాత, దర్శకులు, నటులు వి.శాంతారామ్ కూడా ఈ కంపెనీలో భాగస్వామి. శాంతారామ్ నిర్మించిన కొన్ని చిత్రాలలో పాటలు "యంగ్ ఇండియా" లేబుల్మీదే విడుదల అయ్యాయి. ఈ కంపెనీ కొన్ని వేల పాటలను వివిధ భాషలలో రికార్డులుగా విడుదల చేసారు. వీటిలో శాస్త్రీయ సంగీతము, జానపద

సంగీతము, సినిమా పాటలు మొదలైనవి ఉన్నాయి. సుభాష్ చంద్ర బోస్, జవహర్ లాల్ నెహ్రూలాంటి ప్రముఖ వ్యక్తుల ప్రసంగాలు కూడా రికార్డులుగా విడుదల చేసారు. ఆనాటి సూపర్ హిట్ చిత్రం అక్కినేని నటించిన "బాలరాజు" సినిమా పాటలు యంగ్ ఇండియా లేబుల్ మీద విడుదల అయినాయి. ఈ రికార్డు లేబుల్‌మీద మన జాతీయ పతాకము, రాట్నమును ఒక వనిత వడుకుచున్నట్లు ఉంటుంది.

జపనీస్ సాంకేతిక పరిజ్ఞానము ఉత్తమ ప్రమాణాలలో లేనందున నాణ్యత లోపించి రికార్డులు త్వరగా అరిగిపోయేవి. అందువలన గ్రామఫోన్ కంపెనీకి (హెచ్ఎంవి) గట్టి పోటీ ఇచ్చినా ఆర్థిక ఇబ్బందుల వలన **1956** ప్రాంతంలో మూతపడింది.

**వర్షన్ రికార్డ్స్ (VERSION RECORDS):** కొన్ని పాపులర్ సాంగ్స్‌ను వేరే సింగర్స్‌చే తిరిగి పాడించి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేసేవారు. వీటిని 'వర్షన్ రికార్డ్స్' అంటారు.

**హెచ్ఎంవి రికార్డులు - వారి యితర వ్యాపారాలు :** ప్రారంభంలో గ్రామఫోన్ కంపెనివారు టైప్‌రైటర్స్ అమ్మేవారు. హెచ్ఎంవి లేబుల్‌తో గ్రామఫోన్ రికార్డులు వ్యాపారము బాగా అభివృద్ధి అవటము వలన టైప్‌రైటర్ అమ్మకాలు నిలిపి వేశారు. టాకింగ్ మెషిన్స్, గ్రామఫోన్‌లు, రికార్డులు, నీడిల్స్, నీడిల్ బాక్స్‌లు ఇవన్నీ భద్రపరచుకోవటానికి చెక్క కాబినెట్లు తయారుచేసి అమ్మేవారు.

ఇవి కాక రిఫ్రిజిరేటర్స్, రేడియోలు, ట్రానిస్టర్ రేడియోలు, ఐరన్ బాక్స్‌లు కూడా హెచ్ఎంవి లేబుల్ మీద అమ్మేవారు. రేడియోగ్రామ్స్, ఎలక్ట్రికల్ రికార్డ్ ప్లేయర్స్, యాంప్లిగ్రామ్ మొదలైనవి కూడా అమ్మేవారు. వీటన్నిటి మీద కుక్కబొమ్మ లోగో ఉండేది.

## గ్రామఫోన్ రికార్డులుగా వచ్చిన కళారూపాలు

**జానపద కళారూపాలు :** సంగీతము, నృత్యము, అభినయం కలబోసి వుండే ప్రదర్శనలన్నీ జానపద కళల కోవకు చెందినవి. యక్షగానాలు, బుర్రకథలు, వీధినాటకాలు, తోలు బొమ్మలాటలు, భజనలు, కోలాటం, బుడబుక్కల వేషం మొదలైనవి ఎన్నో తెలుగు జానపద రూపాలు ప్రజలను సంతోషపరచేవి.

ఈ జానపద కళారూపాలు కన్నడ, తమిళ,మలయాళ భాషలలో కూడా చాలా ప్రసిద్ధి చెందాయి. కన్నడ జానపదకళారూపాలలో దసరాట, బయలాట, సన్నాట, దొడ్డాట మొదలైనవి ప్రసిద్ధి చెందినవి. తమిళభాషలో "కురువంజి", "నట్టువనర్" మొదలైనవి ప్రాముఖ్యము వహించాయి. కురువంజి డాన్స్‌బాలేలను నాట్యకళాకారులు చేసేవారు. వీటిని ప్రదర్శించటంలో పండనల్లూర్, మీనాక్షి సుందరం మొదలైనవారు ఆరితేరినవారు. 'నట్టువనర్' ప్రదర్శించి గొప్పపేరు తెచ్చుకున్న వారు దండాయుధ పిళ్లై, రుక్మిణీదేవి ఆరండేల్, బాల సరస్వతి, మృణాళిని సారాభాయ్ మొదలైన వారు.

కేరళదేశంలో తెయ్యమ్, కృష్ణ అట్టము మొదలైనవి చాలాకాలంగా వస్తున్న జానపద కళారూపాలు.

**యక్షగానాలు :** విజయనగర రాజులు, మధుర, తంజావూరును పరిపాలించిన రాజులు యక్షగానాలను ప్రోత్సహించారు. భరతనాట్యం, కూచిపూడి నాట్యాలను తంజావూరు రాజుల ప్రోత్సాహముతో ఖ్యాతి చెందాయి. యక్షగానాలకు మూలము భారతము, రామాయణము, భాగవతము మొదలైన గ్రంథాలు. యక్షగానాలు 12వ శతాబ్దము నుంచి బహుళప్రజాదరణ పొందినట్లుగా తెలుస్తున్నది.

యక్షగానాలందు అభిరుచిగల నిర్మాతలు కొందరు సినిమాలలో చోటు కల్పించారు. శంకరరెడ్డి నిర్మించిన "రహస్యం" (1967)లో 'గిరిజకళ్యాణం' యక్షగానం బహుళ ప్రజాదరణ పొందింది. అలాగే "దీపావళి" (1960)లో 'సరసిజాక్షి' అనే యక్షగానం చిత్రీకరించబడినది. ఇవి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

**బుర్రకథలు :** చారిత్రకాంశాలతో బాటు సమాజంలో జరుగుతున్న సమకాలీన అక్రమాలు, అన్యాయాలు కళ్లకు కట్టినట్లుగా ప్రజలముందు ఉంచి చైతన్యం కలిగించే గొప్పశక్తి బుర్రకథకు ఉంది. ఈ ప్రక్రియలో కథను ప్రధాన కళాకారుడు వర్ణిస్తూ ఉంటే పక్కన ఇద్దరు వాయిద్యాలను వాయిస్తూ "తందాన" అంటూ రిథమ్ అందిస్తారు. మన ఆంధ్రప్రదేశ్‌లో బుర్రకథ వ్యాప్తికి విశేష కృషి చేసినవారు బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్. అనేక తెలుగు చిత్రాలలో నిర్మాతలు బుర్రకథలను జోడించారు. వాటిలో "కన్యాశుల్కము", "మనదేశం", "మంచి మనసుకు మంచిరోజులు", "పూలరంగడు", "విచిత్రబంధం" మొదలైనవి. బుర్రకథలు గ్రామఫోన్ రికార్డులుగా వెలువడ్డాయి.

వేంకటేశ్వరస్వామి మీద ఘంటసాల పాడిన బుఱ్ఱకథ రికార్డుగా విడుదల అయింది. 1962లో చైనావారు భారతదేశంమీద యుద్ధము చేసినప్పుడు జనంలో చైతన్యం కలిగించాలని పింగళిగారు "చైనా దురాక్రమణ" బుఱ్ఱకథను రచించగా ఘంటసాల, ఇతర గాయనీగాయకులు గానం చేయగా గ్రామఫోన్ రికార్డుగా విడుదల అయింది.

**వీధి నాటకాలు :** పల్లెటూర్లలో ప్రజలను విశేషంగా ఆకర్షితులను చేసినవి వీధినాటకాలు. పురాణాల నుండి కథలను ఎన్నుకుని వేదికల మీద ప్రదర్శిస్తారు. వీధి నాటకాలు కొన్ని చిత్రాలలో చిత్రీకరింపబడినాయి. "నవరాత్రి" **(1966)**, "ఉమ్మడికుటుంబం" **(1967)** చిత్రంలో 'సతీ సావిత్రి' వీధినాటకం, "మెరుపువీరుడు" **(1970)** చిత్రంలో "చెంచులక్ష్మి" మొదలైనవి. ఇవి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

**పగటివేషాలు :** పగటివేషాల్లో హరిదాసు వేషం, బుడబుక్కల వాని వేషం, సోదివేషం, జంగమదేవర వేషం మొదలైనవి ఉన్నాయి. బుడబుక్కల వారి వస్త్రధారణ విచిత్రంగా ఉంటుంది. వీరు వాక్చాతుర్యంతో ప్రజలను విశేషంగా ఆకర్షించేవారు. చిన్న 'ఢమరుక' వాయిద్యాన్ని వాయిస్తూ వింతైన పదజాలంతో మనోహరంగా పలికేవారు. ఢమరుక వాద్యం శబ్దం వినసొంపుగా ఉండి ఆకట్టుకునేది. మా చిన్నతనములో యివి గ్రామఫోన్ రికార్డులుగా వచ్చాయి. వీటిని ప్రజలు చాలా ఆసక్తితో విని ఆనందించేవారు.

అలాగే సోదివేషం వేసేవారు కూడా ప్రజలను విశేషంగా ఆకర్షించేవారు. సోది చెప్పే కళాకారులు జరిగినది, జరుగుతున్నది, జరగబోయేది చెప్తూ ప్రజలను ఆకర్షించేవారు. స్త్రీలు చాలా ఆకర్షితులు అయి సోదిచెప్పే స్త్రీలకు బియ్యం మొదలైనవి ఇచ్చి గంటల తరబడి చెప్పించుకునేవారు. ఇవి కూడా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయినాయి. నూజివీడుకు చెందిన ఎస్.వి.సుబ్బారావు పాడగా 'సోదివారి తమాషా' అనే గ్రామఫోన్ రికార్డును ట్విన్ కంపెనీవారు విడుదల చేసారు.

**జానపద గేయాలు - గ్రామఫోన్ రికార్డులు :** జానపదగేయాలు ఆదివాసుల నుండి వచ్చినట్లు చరిత్ర తెలియచేస్తున్నది. కాయకష్టం చేస్తున్నప్పుడు, బాధలు, ఆనందం మొదలగు సమయాలలో ప్రజలు జానపదాలు పాడటం సహజము. జానపదాలలో

అనేక రకాలు అయిన పాటలు ఉన్నాయి. హాస్యపు పాటలు, దంపుడు పాటలు, వలపు పాటలు. శ్రామిక పాటలు, వినోదాన్ని కలిగించే పాటలు ఎన్నో రకరకాలుగా ఉన్నాయి. జానపదాలు పాడేవారు వారుచేసే పనులకు సంబంధించిన పదాలతో లయబద్ధంగా పాడుతారు.

చరిత్రను పరిశీలిస్తే జానపద సంగీతానికి 20వ శతాబ్దము పూర్వార్ధములో ఎనలేని సేవ చేసిన వాగ్గేయకారుడు, కాకినాడ వాస్తవ్యులు అయిన వల్లూరి జగన్నాథరావుగారు. వీరు శాస్త్రీయ సంగీతాన్ని, జానపద సంగీతాన్ని మేళవించి కొత్తరీతులలో ఎన్నో గీతాలు రచించి పాడారు. 1930 ప్రాంతంలో వీరు పాడిన అనేక రకములైన పాటలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి బహుళ ప్రజాదరణ పొందాయి.

పాటలు కొన్ని - "బొబ్బిలి పాట", "దంపుళ్ల పాట", "వప్పగింతల పాటలు", "వక్కాంక్రితాలు", "అన్నాడే! వస్తానన్నాడే", "అడవిలో నా యిల్లు", "గోలుకొండోయ్", "పప్పు బ్రాహ్మణుడు", "మన వైద్యుడుగారు" మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ఈ పాటలు గ్రామఫోన్ కంపెని వారు హెచ్ఎంవి బ్లాక్‌లేబుల్ మీద విడుదల చేసారు.

ప్రముఖ జానపద గాయని వింజమూరి అనసూయదేవి వల్లూరి జగన్నాథరావు వద్ద జానపద సంగీతము, దానికి సంబంధించిన రచనలు నేర్చుకున్నారు. అనసూయదేవి తన చెల్లెలు సీతాదేవితో కలిసి వల్లూరివారి పాటలు పాడుతుండేవారు. వీరిద్దరు పాడిన పాటలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి. అనసూయదేవిగారు తన 8వ ఏటనే పాడిన జానపదగేయం 'అయ్యో కొయ్యోడా' గ్రామఫోన్ రికార్డుగా 1928లో విడుదల అయింది. వీరు వాడవాడలలో తమ ప్రతిభని ప్రదర్శించటమే కాకుండా విదేశాలలోకూడా తమ గానాన్ని వినిపించి శ్రోతలను మైమరపించిన ప్రతిభాశాలురు.

ఎందరో కవులు గొప్ప గొప్ప జానపద గీతాలను రచించారు. నండూరి సుబ్బారావుగారి "ఎంకి పాటలు", విశ్వనాథ సత్యనారాయణగారి "కిన్నెరసాని పాటలు". కొనకళ్ల వెంకటరత్నంగారి 'రావోయి బంగారిమామ', ఆరుద్ర, బసవరాజు అప్పారావు,

సముద్రాల సీనియర్ మొదలైనవారు రచించిన జానపద గీతాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదలయి బహుళ ప్రజాదరణ పొందాయి.

బసవరాజు అప్పారావు రచించిన జానపద రచన 'గుత్తొంకాయ కూరోయ్ బావ'ను బందా కనక లింగేశ్వరరావు గారు పాడగా గ్రామఫోన్ రికార్డుగా విడుదలయి సంచలనం సృష్టించింది.

**లలితసంగీతం - గ్రామఫోన్ రికార్డులు :** 20వ శతాబ్దపు పూర్వార్థంలో మరొక అపూర్వ సంగీత ప్రక్రియ రూపుదిద్దుకున్నది. అదే లలిత సంగీత ప్రక్రియ ! ~~ఈ~~ సంగీతప్రక్రియ శాస్త్రీయ సంగీతంతో సమాంతరముగా రేడియో మాధ్యమం ద్వారా బహుళ ప్రజాదరణ పొందింది.

ఎన్నో లలిత గీతాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి బహుళ ప్రజాదరణ పొందాయి. సాలూరి రాజేశ్వరరావు, రావు బాలసరస్వతి, ఎం.ఎస్.రామారావు, ఘంటసాల, టంగుటూరి సూర్యకుమారి, ఎ.పి.కోమల, ఎస్.వరలక్ష్మి కె.రాణి, జమునారాణి మొదలగువారు పాడిన లలితగీతాలు శ్రోతలను రంజింప చేసాయి. ప్రఖ్యాత నర్తకి, నటీమణి వైజయంతిమాల, సంగీత దర్శకులు మాస్టర్ వేణు పాడినవికూడా లలితగీతాలు రికార్డులుగా విడుదల అయ్యాయి.

## రికార్డులపై ప్రకటనలు - పాటల పుస్తకాలు

ఆ రోజులలో 78 ఆర్‌పిఎం గ్రామఫోన్ రికార్డులు తయారు చేసే కంపెనీలు రికార్డ్ కవర్స్ మీద అనేక భాషలలో రకరకాల ప్రకటనలు చేసేవారు. గ్రామఫోన్ కంపెనీ (హెచ్‌ఎంవి) వారు కవర్స్‌మీద గ్రామఫోన్‌లో రికార్డు ప్లే చేస్తున్నట్లుగా, వారు తయారు చేసే రకరకాల గ్రామఫోన్ ఫోటోలు ముద్రించేవారు. కొన్ని కవర్స్‌మీద "His Masters Voice " "Instantaneous Speed Tester" అని రాసి దానికి సంబంధించిన పరికరము బొమ్మ వేసేవారు. అలాగే "His Masters Voice" "Recording Cleaning Pad" అని ప్రకటించి దాని బొమ్మవేసేవారు.

ట్విన్ కంపెని_వారు కవలపిల్లల ఫోటో వేసేవారు. డ్రామా రికార్డులైతే కవర్ మీద నాటకానికి సంబంధించిన దృశ్యాలు ఇలా రకరకాల ప్రకటనలు ఉండేవి.

ఒడియన్ కంపెని వారు వారి రికార్డుల కవర్లపై సరస్వతీదేవి ఫోటో, కళాకారుల ఫోటోలు, ఒడియన్ లోగో (రెండు ఏనుగులు వాటి మధ్య డోమ్) మొదలైనవి ఉండేవి. ఇంతేకాక కొన్ని డ్రామా సెట్స్ వివరాలు కూడా ప్రకటించేవారు.

హచిన్స్ కవర్ల మీద కళాకారుల ఫోటోలు, Play this Record with "His Masters Voice" Needles అని పిన్నులు ఉండే చిన్న డబ్బాను చూపించేవారు. డబ్బా మూతమీద కుక్కబొమ్మ లోగో ఉంగేది.

వివిధ కంపెనీలు ఇలాగ రకరకాల ప్రకటనలు చేస్తూ ఉండేవారు.

గ్రామఫోన్ కంపెనీలు వారు ఏ యే గ్రామఫోన్ రికార్డులు విడుదల చేసిందీ కాటలాగ్స్ రూపంలో ముద్రించేవారు. క్రమంగా గ్రామఫోన్ కంపెనీలు దినపత్రికలలో పాటల గురించి ప్రకటనలు చేసేవారు. గ్రామఫోన్ రికార్డులు అమ్మేవారు బ్లాక్‌బోర్డ్ మీద ఏ పాటలు రికార్డులుగా విడుదల అయినవో రాసి వారి షాపు ముందు అందరికి కనబడేలాగున ఉంచేవారు. కొంతమంది షాప్ యజమానులు వాళ్ల దగ్గరకు వచ్చే రెగ్యులర్ కస్టమర్స్‌కు ఫలానా తాజా రికార్డులు వచ్చాయని పోస్ట్‌కార్డు రాసి పంపేవారు.

కంపెనీవారు కాటలాగ్స్‌లో పాటల రచనలు (లిరిక్స్) కూడా కొన్ని సార్లు ముద్రించేవారు. వాటితో పాటు భక్తి సంగీతము, డ్రామా పాటలు, పద్యాలు, జానపద సంగీతం, సంప్రదాయ గీతాలు, పండుగలు, దైవకార్యాలలో పాడే పాటలు, రికార్డులుగా విడుదల చేసినపుడు పాటలను చిన్న చిన్న పుస్తకరూపంలో విడుదల చేసేవారు. గ్రామఫోన్ రికార్డ్స్ అమ్మే షాపులవారు కొంతమంది రికార్డులలోని పాటల రచనలను చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రించి అతి తక్కువ ధరలో గ్రామఫోన్ రికార్డ్స్ కొనేవారికి అమ్మేవారు. 1930 దశకానికి ఈ పాటల పుస్తకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఔత్సాహిక గాయనీగాయకులు ఈ పుస్తకాలు కొనుక్కొని పాటలు నేర్చుకునేవారు. గ్రామఫోన్ కంపెనీలువారు తయారు చేసే రికార్డుల అమ్మకాలను వృద్ధి చేసుకోవటానికి ఈ ప్రింట్ వెర్షన్ సహాయపడింది.

టాకీ చిత్రాలు ప్రారంభించాక సినిమా పాటలు పుస్తకరూపంలో విడుదల అయ్యేవి. ఇవి సినిమా థియేటర్స్‌లో ఇంటర్‌వెల్ సమయంలో అమ్మేవారు. రోడ్డు ప్రక్కన పెట్టుకొని కొంతమంది అమ్ముతూ ఉండేవారు. పాటల పుస్తకాలు ముద్రించి

అమ్మే సంస్థలు మదరాసులో చాలా ఉండేవి. (వి.సభాపతి మొదలియార్, కె.వి.కణ్ణప్ప మొదలియార్, వి.శివరామ్ మొదలియార్ మొదలుగువారు). విజయవాడలో కాంతి ప్రింటింగ్ ప్రెస్, శ్రీ పద్మనాభ ప్రింటింగ్ వర్క్స్, శ్రీరామకృష్ణా ముద్రాక్షరశాల, స్వతంత్ర ప్రింటర్స్, శ్రీ సత్యనారాయణ ప్రింటింగ్ వర్క్స్ మొదలైనవారు ముద్రించేవారు.

సినిమాహాళ్లలో అమ్మే యీ సినిమా పాటల పుస్తకాలలో 'కథా సంగ్రహము' అనే టైటిల్ కింద లోపలి పేజీలలో కథలోని కొంత భాగాన్ని మాత్రం చెప్పి సినిమా చూడాలనే ఉత్సుకత పెంచేవారు. చివరలో ఆస్తికకరమైన ప్రశ్నలు ఉండేవి. (ఉదా॥ ఫలానా వారికి పట్టాభిషేకం అవుతుందా? ప్రచండుని చేతిలో చిక్కుకున్న ప్రతాపుడు ఏమైనాడు? తన కుమారుని విజయానికై వేయికళ్లతో ఎదురు చూస్తున్న రాణి గతి ఏమిటి?) చివర్లో 'రక్తం ఉడుకు లెత్తించే రసవత్తర కథాంతం వెండితెరమీద చూడండి!' అని రాసేవారు లేదా 'తతిమ్మా కథ వెండితెరపై..' అని వేసేవారు.

ఇంతేకాక ఆ చిత్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు పుస్తకంలో ఉండేవి. సినిమా చూచిన తరువాత ఆ చిత్రానికి సంబంధించిన విషయాలు తెలుసుకోవాలంటే ఆ పుస్తకాలే గతి. ప్రస్తుతం సినిమాచరిత్రను అధ్యయనం చేసేవారికి ఆ పుస్తకాలే ఆధారంగా వున్నాయి.

ఉదాహరణకి "రాజమకుటం" చిత్రంలో కథా సంగ్రహం, పాటలతో బాటుగా ఇచ్చిన విషయాలు పరిశీలిద్దాము.

**నిర్వాహకులు**

| | |
|---|---|
| కథ - సంభాషణలు | : డి.వి.నరసరాజు - బి.ఎ. |
| సినిమా రూపకం | : బి.ఎన్.రెడ్డి, పద్మరాజు, బి.ఎస్.రామయ్య |
| పాటలు | : దేవులపల్లి కృష్ణశాస్త్రి, కొసరాజు, నాగరాజు |
| సంగీత దర్శకులు | : ఎం.వేణు |
| కళాదర్శకులు | : ఎ.కె.శేఖర్, వాలి |
| మేకప్ | : హరి పాద చంద్ర, పీతాంబరం, భక్తవత్సలం, మూర్తి |

సెట్టింగ్స్ : సి. కుప్పుస్వామి, కె. శ్రీనివాసన్, నీలకంఠన్

పెయింటింగ్స్ : కె.ఎస్.ఎన్.మూర్తి, ఆర్. జయరామరెడ్డి

నృత్యదర్శకులు : పసుమర్తి కృష్ణమూర్తి, వి.జె. శర్మ

స్టంట్ డైరక్టర్స్ : స్టంట్ సోము, సారంగన్

డైర్టకర్ ఆఫ్ ఫొటోగ్రఫీ : బి.ఎన్.కొండారెడ్డి

డైరక్టర్ ఆఫ్ ఆడియోగ్రఫీ : ఎ.కృష్ణన్ బి.ఎ.

రికార్డింగ్, రీ రికార్డింగ్ : కె.విశ్వనాధ్ బి.ఎస్‌సి.

సహాయ దర్శకులు : ఎ.కె.ప్రసాద్, కె.కృష్ణమూర్తి

ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ : వేణునాథ్

ఆఫీసు మేనేజర్ : ఆర్. కృష్ణమూర్తి

ప్రాసెసింగ్ : ఎస్.రంగనాధన్ (విజయ లాబొరేటరి)

చీఫ్ ఎలక్ట్రీషియన్ : ఎం.శంకరనారాయణన్

స్టూడియో ప్రోగ్రామ్స్ : సి.ఎస్.ప్రకాశ్, జి. సుందరం

కెమెరా అసిస్టెంట్స్ : డి.వి. రాజారాం, ఈ.వి. రాజన్

సౌండు : జి.ఆర్. దేవరాజన్,

యు.వి.నరసింహన్, ఎల్.సి.ఎస్.ఈ

## సహాయకులు

దుస్తులు : నారాయణమూర్తి

మోల్డింగ్ : ఎం.గోపాల పిళ్ళై

ఎడిటింగ్ : వాసు, మణి

ఆర్టు : బి.ఎన్.కృష్ణ

ప్రొడక్షన్ : పి.ఎస్.సి. నాగయ్య

మేకప్ : వెంకటరత్నం, ముత్తు

దుస్తులు : పూర్ణ, సత్యం, కమల

నిర్మాణము : విజయ వాహిని స్టూడియో

Recorded on Westrex Sound System

## నటీనటులు

| | | |
|---|---|---|
| యన్.టి.రామారావు, | రాజసులోచన, | కన్నాంబ, |
| గుమ్మడి | రాజనాల | |
| పద్మనాభం | వంగర | శివరావు |
| డా॥ శివరామకృష్ణయ్య | మోహనదాస్ | సత్యనారాయణ |
| కోటేశ్వరరావు | మాధవపెద్ది | లక్ష్మీనారాయణ |
| కృష్ణారావు | బొడ్డపాటి | సత్యం |
| విశ్వనాధం | చౌదరి | విశ్వనాధరావు |
| రామచంద్రరావు | కోలప్పన్ | కొల్లా సత్యం |
| కృష్ణమూర్తి | స్టంట్ సోము | సారంగన్ |
| రాజారావు | జోసఫ్ | చాందిని |
| లీలాబాయ్ | సురభి కమల | శాంత |

మీర్ల రాజేశ్వరి, నాగు, మాధురి, ఎతో బాయి, లక్ష్మిశాంతి, లీల, ఇంద్ర, కనకప్రభ,

నర్తకి : లక్ష్మీరాజ్యం

## నేపథ్యగాయకులు

| | | | |
|---|---|---|---|
| ఘంటసాల | పి.లీల | కృష్ణవేణి (జిక్కి) | సుశీల |
| మాధవపెద్ది | మల్లిక్ | | |

ఇంతమంది తెరవెనక సహకరిస్తేనేగాని సినిమా నిర్మాణము కాదు. ఆనాటి సినిమా పాటల పుస్తకాలలో ఎన్ని విషయాలు ఉండేవో తెలుస్తున్నది.

కాని ప్రజలు మాత్రం హీరో హీరోయిన్లకే పగ్గాలు పడతారు.

సినిమాల పాటల పుస్తకాలు వేసేవారు ఎందరో ఉన్నారు. హైదరాబాద్‌లో ఆబిడ్స్‌లోని మహ్మమద్ అబ్దుల్ గఫూర్ వారు వివిధ భాషలలో సినిమా పాటలు

## గ్రామఫోన్ రికార్డ్స్ స్లీవ్స్‌పై ప్రకటనలు









WEBER'S
"INVITATION TO THE WALTZ"
a Record that appeals to Everybody
HIS MASTER'S VOICE
PLAYED BY
THE PHILADELPHIA SYMPHONY ORCHESTRA
RECORD
D-1285
ASK YOUR DEALER TO PLAY THIS RECORD OVER FOR YOU
His Master's Voice
"His Master's Voice"
RECORDS


NEW
HMV
Super Sensitive
PORTABLE TRANSISTOR RADIO
HIS MASTER'S VOICE
8-TRANSISTOR
2-DIODE
3-WAVEBAND
MODEL 5765-A
LADY BIRD


His Master's Voice
"HIS MASTER'S VOICE"
THE GRAMOPHONE COMPANY
Telugu
N. 2024
Theatrical Song
HA PARATHPARA (Puri Kalyani)
G.C.-21-12396
మిస్ త. చ. రంగమ్మాళ్
మిస్ త.చ.రంగమ్మాళ్ పాడియుండు పాటలు
"హిస్ మాస్టర్స్ వాయ్స్"
రికార్డులు మూల్యముగా వినవచ్చును.
TELEGU


Columbia
Columbia
THE FINEST NAME ON RECORD


The TWIN
टइन
रेकार्डों की
नई
फ़ेहरिस्त
किसो
डोलर से
तलब कोजिए
The TWIN
FT. 12307


Have
you purchased
"KOVALAN"
DRAMA SET?
If not, ask your Dealer
to demonstrate
ODEON
ODEON
SARASWATHI STORES
MOUNT ROAD, MADRAS.

పుస్తకాలు ముద్రించి అమ్మేవారు. రెండు సినిమాల పాటలను ఒకే పుస్తకంలో ముద్రించేవారు. రెండు, మూడు హిందీసినిమా పాటలను తెలుగులిపిలో వేసి అమ్మేవారు.సినిమా పాటలను ఎక్కువ సంఖ్యలో ముద్రించి పుస్తకరూపంలో కొన్ని దశాబ్దాల నుంచి ప్రచురిస్తున్న గొల్లపూడి వీరాస్వామి సన్స్, దాచేపల్లి పబ్లికేషన్స్ వంటివారు చాలామంది ఉన్నారు. ఇప్పటికీ ఎంతో మంది పబ్లిషర్స్ సినిమాపాటలను పుస్తకాలుగా ముద్రిస్తున్నారు.

## చలనచిత్రాలు

1883లో థామస్ అల్వా ఎడిసన్ "కైనటో స్కోప్" తయారు చేసాడు. ఇది ప్రారంభదశలో ఉన్న "సినిమా ప్రొజక్టర్". దీనికి తాను తయారు చేసిన ఫోనోగ్రాఫ్‌ను జతచేసి మాట్లాడే బొమ్మను తయారు చేయటం సాధ్యమని నిరూపించాడు.

ఎడిసన్ తాను కనుగొన్న 'ఫోనోగ్రాఫ్', 'కైనటో స్కోప్'ల ప్రాముఖ్యత గ్రహింపక వీటి పరిశోధనలు అంతటితో ఆపి ఇతర పరిశోధనలపై దృష్టి మరల్చాడు. కాని తాను కనిపెట్టిన వాటి ద్వారా జరిగిపోయిన సంగతులను రికార్డు చేసుకుని తిరిగి అనుభవించే అవకాశం ఉంటుందని మాత్రం గ్రహించాడు.

**లూమియర్ సోదరులు :** లూమియర్ సోదరులు నికొలస్ లూమియర్ (1862-1954), జీన్ లూమియర్ (1864-1948) ఫ్రాన్స్ దేశంలోని బెసాన్‌కాన్‌లో జన్మించారు. వీరి తండ్రి ఫోటోగ్రఫీకి సంబంధించిన వ్యాపారము చేసేవారు. సోదరులిద్దరూ "కదిలే బొమ్మలు" (మోషన్ పిక్చర్స్) మీద పరిశోధనలు చేసి పేటెంట్ హక్కుపొందారు.



లూమియర్ సోదరులు

ఫిల్మ్‌కు రంధ్రాలు చేసి ముందుకు తిరిగేటట్లు చేయవచ్చును అని కనుగొన్నవారు థామస్ అల్వా ఎడిసన్, ఎమిల్ రేనాడ్. ఈ సదుపాయాన్ని ఉపయోగించి ప్రొజక్టర్ సహాయంతో "కదిలే బొమ్మలు" తీయవచ్చని, దీన్ని మాస్ మీడియాగా రూపొందించవచ్చనీ గుర్తించిన ప్రప్రథమ వ్యక్తులుగా లూమియర్ సోదరులు నిలిచారు.

కదిలే బొమ్మలు తీసే పద్ధతి (సినిమాటోగ్రఫీ)పై 1895లో ఈ సోదరులు పేటెంట్ హక్కును పొందారు.

సాయంత్రం ఫ్యాక్టరీ నుండి ఇంటికి తిరిగి వెళ్లే కార్మికుల హావభావాలను వీరు చిత్రీకరించారు. ఇది ప్రప్రథమ ఫిల్మ్ చిత్రీకరణ. ఆ తర్వాత కొన్ని మూకీలు తీశారు. తాము నిర్మించిన మూకీ చిత్రాలను 1895లో పారిస్‌లో ప్రదర్శించి త్వరలోనే ప్రపంచమంతా ప్రదర్శించటము ప్రారంభించారు. భారతదేశము వచ్చి బొంబాయి నగరంలో కూడా ప్రదర్శించారు.

అంతటితో ఆగకుండా యీ సోదరులిద్దరూ ఎన్నో పరిశోధనలు చేసి కలర్ ఫోటోగ్రఫీని కనుగొన్నారు. దీనికి పేటెంట్ హక్కుని పొందారు.

**పాతె కంపెనీ చిత్రాలు :** ఫ్రాన్సుకు చెందిన పాతె కంపెనివారు 1902లో సినిమా చిత్రీకరణకు కావలసిన స్టూడియో కెమెరాలను  సాంకేతిక పరంగా అభివృద్ధిపరచి వారే సినిమాలను చిత్రీకరించాలని ఆలోచించి లూమియర్ సోదరులనుంచి పేటెంట్ హక్కులను పొందారు. ఫిల్మ్ ప్రాసెసింగ్ లేబరేటరీని కూడా పారిస్‌లో ప్రారంభించారు. ఈ పరికరాలను అందరికి అందచేయటానికి పంపిణీదారులను నియమించి ప్రపంచ మార్కెట్‌లో అతి పెద్ద కంపెనీగా పేరు పొందారు. వీరు ఎన్నో దేశాలలో చిత్రీకరణకు తగిన ఏర్పాట్లు చేసారు. ప్రదర్శించటానికి సినిమా హాల్స్ ఏర్పాటు చేసారు. వీరు ప్రదర్శించిన చిత్రాలన్నీ మూకీ చిత్రాలే.

వీరు 1929లో టాకీలను నిర్మించారు. వీరి పరిశోధనల ఫలితంగా "ఎనమార్ఫిక్ లెన్స్" తయారైంది. దీనివలన "సినిమాస్కోప్", యితర  "వైడ్ స్క్రీన్" చిత్రాలు నిర్మాణం సాధ్యపడింది. "న్యూస్ రీల్"ను చిత్రీకరించిన ప్రథములు పాతె కంపెనియే. ఈ "న్యూస్‌రీల్స్"ను సినిమా ప్రదర్శనకు ముందు ప్రదర్శించేవారు. ఈ పద్ధతి అన్నీ దేశాలలోను ఉంది.

సంపన్నులు వారి ఇంటిలోనే చిత్రాలను చూచుకునేందుకు వీలుగా పాతె కంపెనివారు "పాతె బేబీ హోమ్ ఫిల్మ్ సిస్టమ్"ను ప్రవేశపెట్టారు. ఇవి చిన్నసైజు ప్రొజక్టర్స్.

**చిత్రాల ప్రదర్శన :** ఆ రోజుల్లో చిత్రాలు ప్రదర్శించటానికి ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. ఒకరు సినిమా ప్రొజక్టర్‌కు అమర్చిన హ్యాండిల్‌ను తిప్పుతూ ఉంటే, ఇంకొకరు

గ్రామఫోన్ రికార్డు పెట్టి శబ్దాన్ని వినిపించేవారు. చిత్రానికి, శబ్దానికి పొంతన లేకపోయినా మూకీ చిత్రాలను ప్రజలు చూచేవారు. కొన్ని చిత్రాలలో సంభాషణలు ఫిల్మ్ మీద ముద్రించి ప్రదర్శించేవారు.

చిత్రాలను గుడారాలలోకాని, నాటకాలు ప్రదర్శించే థియేటర్లలో కాని ప్రదర్శించేవారు. కొన్ని డ్రామా థియేటర్లలో స్టేజి ముందు ఒక గుంట ఉండేది. ఆ గుంటలో తబల, హార్మోని, వయోలిన్ మొదలైన వాయిద్యాలను పెట్టుకుని వాయిద్యకళాకారులు సందర్భానికి తగినట్లుగా సంగీతం వినిపించేవారు. కొన్ని సందర్భాలలో తెర వెనుక నుంచి వినిపించేవారు.


ఇంతే కాకుండా స్క్రీన్‌కు దగ్గరగా ఒక వ్యక్తి నిలబడి ఆ మూకీ చిత్రానికి సంబంధించిన, కథ సన్నివేశాలకు తగిన సంభాషణలు మొదలగునవి ప్రేక్షకులకు చెప్తుతూ ఉండేవారు. ప్రముఖ హాస్యనటులు కీ॥శే॥ కస్తూరి శివరావు మూకీ చిత్రాలకు తనదైన శైలిలో సంభాషణలు చెప్పి పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆ అనుభవంతో తరువాత చిత్రాలలో నటించారు.

**భారతీయ చిత్ర పరిశ్రమ :** మనదేశంలో మూకీ చిత్రాలు వివిధ భాషలలో చిత్రీకరించబడ్డాయి. క్రమముగా టాకీలకు చోటు ఇస్తూ మూకీ చిత్రాలు ప్రక్కకు తప్పుకొంటున్న రోజుల్లోనే దక్షిణ భారతంలో చిత్రపరిశ్రమ ప్రారంభము కావటము జరిగింది. భారతదేశంలో మొట్టమొదటి టాకీ చిత్రం హిందీలో నిర్మించబడినది. ఆదే సమయంలో దక్షిణ భారతభాషలు తెలుగు, తమిళములో కూడా టాకీలు నిర్మించబడ్డాయి.

ఈ సందర్భముగా కొంతమంది మహనీయులను అంటే చిత్రపరిశ్రమకు పునాదివేసిన వారిని జ్ఞాపకం చేసుకోవటం మన ధర్మం. అలాంటి వారిలో ఆర్దేషిర్ మార్వన్ ఇరాని, దాదా సాహెబ్ ఫాల్కె, రఘుపతి వెంకయ్యానాయుడుగారు, హెచ్ఎం రెడ్డిగారు.

**దాదా సాహెబ్ ఫాల్కె :** ఢుండిరాజ్ గోవింద్ ఫాల్కె 30-4-1870న నాసిక్ (మహారాష్ట్ర)కు దగ్గర ఉన్న త్ర్యంబకేశ్వర్ లో జన్మించారు. బొంబాయిలోని సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదివి బరాడోలోని కళాభవన్‌లో శిల్పకళ, ఇంజనీరింగ్, చిత్రలేఖనము, ఫోటోగ్రఫి, పెయింటింగ్‌లో శిక్షణ పొందారు. ప్రారంభంలో

ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. తరువాత లితోగ్రఫీ నైపుణ్యం సంపాయించారు. జర్మనీ వెళ్లి ప్రింటింగ్ టెక్నాలజి, యంత్రముల గురించి తెలుసుకొని, నేర్చుకొని బొంబాయిలో ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు.



గోవింద్ ఫాల్కె

ఆ రోజులలో విడుదల అయిన మూకీ చిత్రం "ద లైఫ్ ఆఫ్ క్రైస్ట్" చూసి సినిమాల మీద దృష్టి మరల్చారు. **1912**లో "రాజా హరిశ్చంద" మూకీ చిత్రాన్ని నిర్మించారు. ఇది **3-5-1913**న బొంబాయిలోని కార్పొరేషన్ సినిమాహాలులో ప్రదర్శింపబడినది. దీనితో భారతదేశ చలనచిత్ర పరిశ్రమకు నాంది పలికింది. మూకీలు, చిన్న చిన్న చిత్రాలు, డాక్యుమెంటరీలు, హాస్యానికి, విద్యకు సంబంధించిన చిత్రాలు నిర్మించాడు.

కొంతమంది భాగస్వాములతో కలిసి "హిందూస్థాన్ ఫిల్మ్ కంపెని" స్థాపించి "మోడల్ స్టూడియో" ప్రారంభించి నటీనటులకు, టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇచ్చారు. వీరు నిర్మించిన చివరి మూకీ చిత్రం "సేతుబంధన్" **1932**లో విడుదల అయింది. ఫాల్కె నిర్మించిన ఆఖరి చిత్రం "గంగావతార్" (టాకీ) **1937**లో విడుదల అయింది. టాకీ యుగంలో ఇమడలేక స్వస్థలానికి తిరిగి వెళ్లి **16-2-1944**న స్వర్గస్థులైనారు.

భారతదేశ ప్రభుత్వము వీరి జ్ఞాపకార్థము భారత చలన చిత్రరంగంలో విశేషకృషి చేసిన ప్రముఖులకు జాతీయస్థాయిలో దాదాసాహెబ్ ఫాల్కె అవార్డును ఇచ్చి **1970**నుంచి సత్కరిస్తున్నారు. **1970**లో ప్రథమంగా ఈ అవార్డును పుచ్చుకున్నవారు నటి దేవికారాణి.

**ఆర్దేషిర్ మార్వన్ ఇరాని :** ఇరాని **5-12-1886**న పూనాలో నివసించే జొరాష్ట్రియన్ కుటుంబంలో జన్మించారు. సినిమా థియేటర్స్ నిర్వహించేవారు. అమెరికాలో ఉన్న ప్రసిద్ధమైన "యూనివర్సల్ స్టూడియో"కు ఇండియన్ రిప్రజెంటివ్‌గా ఉన్నాడు. సినిమాలంటే ఆసక్తి.

**1917**లో చిత్రరంగం ప్రవేశించి "నలదమయంతి" అనే మూకీ చిత్రాన్ని నిర్మించాడు. **1922**లో నిర్మించిన మూకీ "వీర్ అభిమన్యు" విడుదల అయింది. న్యూయార్క్ స్కూల్ ఆఫ్ ఫొటోగ్రఫీలో డిగ్రీ సంపాదించిన భోగిలాల్ దేవ్‌తో కలిసి "స్టార్ ఫిలిమ్స్" ప్రారంభించి ఇరాని అనేక మూకీ చిత్రాలు నిర్మించారు.

1924లో ఇరానీ 'ఇంపీరియల్ ఫిలిమ్స్' స్థాపించి అనేక చిత్రాలు నిర్మించారు. ఆయన నిర్మించిన హిందీ చిత్రం "ఆలం ఆరా" భారతదేశంలో మొట్టమొదటగా నిర్మించబడిన టాకీ చిత్రం. సంభాషణలు, నాట్యగీతంతో సహా ఏడు పాటలు ఉన్నాయి. 1931 మార్చి 14 న బొంబాయిలోని మెజస్టిక్ హాలులో ప్రదర్శింపబడింది.



ఆర్దేషిర్ మార్వన్ ఇరాని

ఈయనే మొట్టమొదటి రంగుల చిత్రం "కిసాన్ కన్య" 1937లో నిర్మించారు.

వీరు నిర్మించిన ఆఖరి చిత్రం "పూజారి" 1945లో విడుదల అయింది. 14-10-1969న స్వర్గస్థులైనారు.

**రఘుపతి వెంకయ్య నాయుడు :** నాయుడుగారు 15-10-1887న జన్మించారు. స్వస్థలం మచిలీపట్నం. ఫొటోగ్రఫీ నేర్చుకుని మదరాసులో ఫొటో స్టూడియో ప్రారంభించారు. 1909లో బ్రిటిష్ చక్రవర్తి అయిన అయిదవ జార్జిగారు మదరాసు సందర్శించిన సందర్భంగా ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబడింది. ఆ ప్రదర్శనలో బ్రిటిష్ కంపెనీవారు ప్రదర్శించిన 'క్రౌన్ మెగాఫోన్' సందర్శకులను విపరీతంగా ఆకర్షించింది.



వెంకయ్య నాయుడు

ఈ మెగాఫోన్‌లో సినిమా ప్రొజెక్టరు, గ్రామఫోను అమర్చబడ్డాయి. దీనిని చూసిన నాయుడుగారు వెంటనే జాన్ డి కెన్సన్ కంపెని నుంచి కొనుగోలు చేసారు. చిన్న చిన్న మూకీచిత్రాలు తీసి మదరాసులోని విక్టోరియా పబ్లిక్‌హాల్‌లో ప్రదర్శించారు. బెంగుళూరు, విజయవాడ, రంగూన్, సిలోన్ (శ్రీలంక) మొదలైన ఊళ్లు తిరిగి తాను తీసిన షార్ట్ ఫిలిమ్స్‌ను ప్రదర్శించారు.


1912లో మదరాసులోని మౌంట్‌రోడ్‌లో 'గెయిటీ టాకీస్' నిర్మించారు. మదరాసులో సినిమా థియేటర్‌కు యజమాని అయిన మొదటి భారతీయుడు నాయుడుగారు. క్రమేణా మౌంట్‌స్ట్రీట్‌లో 'క్రౌన్' సినిమాహాల్, పరశువాకంలో 'గ్లోబ్'

థియేటర్లను కూడా నియమించారు. అమెరికన్, బ్రిటిష్ వారు నిర్మించిన చిత్రాలను ఆ థియేటర్స్‌లో ప్రదర్శించేవారు.

వారి కుమారుడు సూర్యప్రకాశ్‌ను లండన్ పంపించి 'సినిమాటోగ్రఫీ' గురించిన చదువు చెప్పించారు. తండ్రీకొడుకులు కలిసి "స్టార్ ఆఫ్ ఈస్ట్ ఫిల్మ్" అనే సంస్థను 1919లో ప్రారంభించి "మీనాక్షి కళ్యాణం", "గజేంద్రమోక్షము", "మత్స్యావతారము", "నందనార్", "భీష్మప్రతిజ్ఞ" మొదలగునవి నిర్మించారు. వ్యాపారంలో వచ్చిన నష్టాలను పూడ్చుకోవటము కొరకు 1929 ప్రాంతములో ఆస్తులను అమ్ముకోవలసివచ్చింది.

వీరు 15-3-1941న స్వర్గస్థులైనారు. వీరి గౌరవార్థం తెలుగు చలన చిత్రపరిశ్రమకు విశిష్టసేవలందించిన వారికి 1981నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 'రఘుపతి వెంకయ్యానాయుడు' అవార్డు నిచ్చి సత్కరిస్తున్నారు. తొలి అవార్డు ప్రముఖనిర్మాత ఎల్.వి.ప్రసాద్‌గారికి ఇచ్చారు.

**హెచ్.ఎమ్. రెడ్డి :** హనుమంత మునియప్ప రెడ్డి 12-6-1892న బెంగుళూరులో జన్మించి, అక్కడే చదివి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి ఉద్యోగానికి రాజీనామా చేసి సినిమారంగానికి వచ్చి హెచ్.ఎమ్. రెడ్డి అనే పేరుతో ఖ్యాతి వడసిన వ్యక్తి. సినిమా కళయందు ఉత్సాహముతో బొంబాయి వెళ్లి ఇరానీవద్ద సహాయకుడిగా చేరి సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని శాఖలను క్షుణ్ణంగా పరిశీలించిన ఘనుడు.


హెచ్.ఎమ్. రెడ్డి

ఇరాని ఇంపీరియల్ సంస్థను స్థాపించి అనేక భాషలలో సినిమాలు నిర్మించాలనే ఉద్దేశముతో ఉండుటవలన రెడ్డిగారిని అసిస్టెంట్‌గా తీసుకున్నాడు. ఇరాని "ఆలం ఆరా" సెట్లనే ఉపయోగించుకుంటూ తమిళంలో "కాళిదాసు" నిర్మించాడు. దీనికి దర్శకులు రెడ్డి గారు. తెలుగులో తొలి టాకీ "భక్తప్రహ్లాద" చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ రెండు చిత్రాలుకూడా 1931లో విడుదల అయినాయి.

రెడ్డిగారిని తెలుగు సినిమా రంగానికేకాక దక్షిణ భారత సినిమా రంగానికే పితామహుడుగా పేర్కొంటారు. సురభి కంపెనివారు ప్రదర్శించగా ప్రజాదరణ పొందిన

"భక్తప్రహ్లాద" నాటకాన్ని చిత్రంగా తీసారు. నాటకంలోని సంభాషణలు, పాటలు, పద్యాలు యథాతథంగా సినిమాలో చిత్రీకరించారుట. కళావతిగా సురభి కమలాభాయి నటించింది. ఇందులో ప్రముఖ దర్శకనిర్మాత ఎల్.వి.ప్రసాదు ఒక చిన్న పాత్రలో నటించారు.

తమిళ "కాళిదాసు" చిత్రంలో తెలుగు, తమిళ రంగస్థల నటులచే నటింప చేసారు. ఇందులో తెలుగు నటులు తెలుగులో, తమిళనటులు తమిళంలో సంభాషణలు చెప్పటం, పాటలన్నీ తెలుగులో ఉండటము కొన్ని విశేషాలు. ఆ తర్వాత రెడ్డిగారు "నిర్దోషి", (1951), "ప్రతిజ్ఞ" (1953), "వద్దంటే డబ్బు" (1957) మొదలైన చిత్రాలను తెలుగులో నిర్మించి, దర్శకత్వం వహించారు. 14-1-1960న స్వర్గస్థులైనారు.

**ఎలక్ట్రికల్ సినిమా ప్రొజక్టర్స్ :** సినిమా ప్రొజక్టర్స్‌ను చేతితో ఒకే వేగముతో తిప్పటం చాలా కష్టం. క్రమేణా ఊళ్లలో కరెంట్ రావటము ప్రారంభమయింది. అందుకని ఎలక్ట్రిసిటితో నడిచే ప్రొజక్టర్లను తయారుచేయటము ప్రారంభమయింది. చిత్రానికి, శబ్దానికి పొంతన కూర్చాలనే పరిశోధనల ఫలితంగా శబ్దము రికార్డింగ్ పద్ధతులలో మార్పులు రాసాగాయి.

## శబ్దాన్ని రికార్డింగ్ చేసే పద్ధతులు

శబ్దాన్ని రికార్డింగ్ చేయటానికి రెండుపద్ధతులు కనుగొన్నారు : ఒకటి డిస్క్ రికార్డింగ్, రెండవది ఫిల్మ్‌మీదనే రికార్డింగ్.

**డిస్క్ రికార్డింగ్ :** ఈ పద్ధతిలో శబ్దాన్ని రికార్డింగ్ చేసి గ్రామఫోన్ రికార్డులు తయారు చేసేవారు.

**సినిమా ప్రదర్శన - శబ్దము :** సినిమాను ప్రదర్శించేటప్పుడు శబ్దాన్ని వినిపించటానికి డిస్క్ రికార్డులను గ్రామఫోన్‌మీద ప్లే చేస్తారు. సినిమా ప్రదర్శించేటప్పుడు ప్రొజక్టర్‌లోని ఫిల్మ్, గ్రామఫోన్ రెండు సింక్రోనస్ మోటర్ల సహాయముతో ఒకేసారి తిరగటము ప్రారంభమవుతుంది. అందుకని చిత్రానికి, శబ్దానికి పొంతన ఉంటుంది. గ్రామఫోన్ రికార్డ్స్ నుంచి వచ్చే శబ్దము ఆంప్లిఫయర్స్ ద్వారా హెచ్చుగా అయి స్పీకర్స్‌లో నుంచి శ్రోతలకు వినబడతాయి.

ఈ పద్ధతిని వెస్టర్న్ ఎలక్ట్రిక్ కంపెనీ మైక్రోఫోన్, యాంప్లిఫయర్ పరికరాలను ఉపయోగించి 'వైటాఫోన్' కనుగొన్నారు. అమెరికాలోని వార్నర్ బ్రదర్స్ సంస్థ వెస్టర్న్ నుంచి హక్కులు కొనుక్కొని ఈ పద్ధతి ద్వారా కొన్ని సినిమాలు చిత్రికరించారు. వీరు నిర్మించిన "డాన్ జువాన్" అనే ఫీచర్‌ఫిల్మ్‌కు వైటాఫోన్ పద్ధతిలో శబ్దాన్ని రికార్డుచేసారు. ఇది మూకీ చిత్రం. గ్రామఫోన్ రికార్డునుంచి శబ్దాలు వినబడతాయి. సంభాషణలు ఉండవు. దీన్ని **6-8-1926**న అమెరికాలోని వార్నర్ థియేటర్‌లో ప్రదర్శిస్తే ప్రేక్షకులు ఆశ్చర్యపోయారట.

వార్నర్ బ్రదర్స్ నిర్మించిన రెండవచిత్రం "జాజ్ సింగర్". ఇందులో సంభాషణలు చాలా తక్కువ. కాని పాటలు అక్కడక్కడ వినిపిస్తాయి. ఈ చిత్రాన్ని న్యూయార్క్‌లోని వార్నర్ థియేటర్‌లో **16-10-1927**న ప్రీమియర్ షోగా ప్రదర్శించారు. ఇది ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేసింది. దీనితో టాకీ యుగము ప్రారంభమయిందని చెప్పవచ్చును.

**1928**లో వార్నర్ బ్రదర్స్ నిర్మించి విడుదల చేసిన చిత్రం "లైట్స్ ఆఫ్ మ్యూజిక్". ఇది శబ్దంతో కూడుకున్న పూర్తి నిడివి చిత్రం.

**1929**లో మొట్టమొదట రంగుల చిత్రం "ఆన్ విత్ ద షో" విడుదల చేసారు.

పై చిత్రాలన్నీ వైటాఫోన్ ఉపయోగించి శబ్దము రికార్డ్ అయిన చిత్రాలు. ఈ పద్ధతి వలన కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ప్రతి రీల్‌కు గ్రామఫోన్ రికార్డు మార్చాలి. రికార్డుమీద తిరిగే స్టైయలస్ జంప్ అయితే సౌండ్ పొంతన ఉండదు. ఫిల్మ్ తెగిపోయినప్పుడు అతికిస్తే చిత్రానికి, శబ్దానికి పొంతనలో గ్యాప్ వస్తుంది. ఇంకొక ఇబ్బంది ఫిల్మ్‌లతో బాటుగా గ్రామఫోన్ రికార్డులను ఊరూరా పంపాలి. అవి పగిలిపోయే అవకాశముంది. అయినా యిది **1928** వరకు వాడకంలో వుండేది. ఆర్‌సిఏ వారు **1928**లో 'ఫోటోఫోన్' పద్ధతి ద్వారా ఫిలిమ్‌మీద శబ్దము రికార్డింగ్ చేయటము కనుగొన్నారు. దీనితో వైటోఫోన్ శకము ముగిసింది.

**ఫిల్మ్ మీద శబ్దం రికార్డింగ్ :** డిస్క్ రికార్డుల వలన ఉన్న ఇబ్బందులను తొలిగించాలంటే ఫిల్మ్ మీదే శబ్దము రికార్డు చేయాలి అని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు 'ఆప్టికల్ ప్రాపర్టీ' సిద్ధాంతాన్ని ఉపయోగించి పరిశోధనలు ప్రారంభించారు. ఫాక్స్

మూవీటోన్ సంస్థ, వెస్టర్న్ ఎలక్ట్రిక్ కంపెనీ వారు వేరియబుల్ డెన్సిటి రికార్డింగ్ పద్ధతిన ఫిల్మ్‌మీద శబ్దాన్ని రికార్డు చేయటము కనుగొంటే రికార్డింగ్ కార్పోరేషన్ ఆఫ్ అమెరికా (ఆర్‌సిఏ) వారు వేరియబుల్ ఏరియా రికార్డింగ్ పద్ధతితో రికార్డింగ్ కనుగొన్నారు.

**1935** వరకు శబ్దాన్ని డైరెక్టుగా ఫిల్మ్ మీద రికార్డింగ్ చేసేవారు. దీనివలన చాలా ఇబ్బందులు వచ్చాయి.

పాటలు పాడుతూ నటించేవారు తప్పులేకుండా పాడాలి. పాటకు తగిన నటన కనపరచాలి. ఆర్టిస్టులు నటించే సమయంలో వాద్య కళాకారులు కూడా ఉండాలి. నటుల కదలికలకు అనుగుణంగా వాద్య కళాకారులు వారిని అనుసరించాలి. లేకపోతే మైక్‌లు శబ్దాన్ని అందుకోలేకపోయేవి. శబ్దములో నాణ్యత లోపించేది.

రికార్డింగ్ యంత్రాలు కూడా చాలా పెద్దవిగా బరువుగా ఉండేవి. కళాకారులు వత్తిడికి లోనయ్యేవారు.

పాటలను గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేయాలంటే కళాకారులందరూ రికార్డింగ్ కంపెనీకి వెళ్లి మరలా పాడవలసి వచ్చేది. సౌండ్ ప్రూఫ్ స్టూడియోలు లేనందున రాత్రిళ్లు షూటింగ్ ఎక్కువగా జరిగేవి.

**1935** తరువాత దృశ్యాలు, శబ్దములను విడివిడిగా రికార్డింగ్ చేసే పద్ధతి వచ్చింది. దానివలన కళాకారులకు, టెక్నీషియన్స్‌కు మానసిక వత్తిడి తగ్గింది. స్టూడియోలలోనే సౌండ్ డిపార్ట్‌మెంట్స్ ప్రారంభించబడ్డాయి.

**శబ్దాన్ని ఫిల్మ్ మీద రికార్డ్ చేసే నూతన పద్ధతి :** సౌండ్ ట్రాక్ (Sount Track) అంటే ఆడియో రికార్డింగ్ చేసిన ట్రాక్. దీన్ని చిత్రం నిర్మించేటప్పుడు కాని, నిర్మించిన తరువాత (Post Production) కాని ఉపయోగిస్తారు.

సంభాషణలు, నేపథ్య వాద్య సంగీతము, సంగీతము (పాటలు) విడివిడిగా ఫిల్మ్ మీద రికార్డు చేస్తారు. వీటిని డైలాగ్స్ ట్రాక్, సౌండ్ ఎఫెక్ట్స్ ట్రాక్, మ్యూజిక్ ట్రాక్ అంటారు. ఈ మూటిని చిత్రీకరణ చేసిన ఫిల్మ్‌తో 'మిక్స్' (Mix) చేస్తారు. అంటె ఫిల్మ్ మీద ఉన్న శబ్దము చిత్రీకరణ చేసిన ఫిల్మ్ మీదకు బదిలీ అవుతుంది. ఫిల్మ్ మీద ఉన్న రంధ్రాల ప్రక్కన గీతలా సౌండ్ ట్రాక్ ఏర్పడుతుంది.

చిత్రాన్ని ఒక భాష నుంచి వేరే భాషలోకి డబ్బింగ్ చేయవచ్చు. డబ్బింగ్ కొరకు చిత్రీకరణ చేసిన ఫిల్మ్‌ను వాడుతారు. ఇందులో డైలాగ్స్ ట్రాక్, మ్యూజిక్ ట్రాక్ ఉండదు. వీటిని ఆ భాషలలో ఫిల్మ్ మీద చిత్రీకరించి చిత్రీకరణ చేసిన ఫిల్మ్‌తో మిక్స్ చేస్తారు.

క్రమంగా ఫిల్మ్ మీద శబ్దము రికార్డింగ్ పద్ధతులలో ఎన్నో మార్పులు వచ్చాయి. సినిమాను ప్రదర్శించేటప్పుడు శక్తివంతమైన ఆర్క్ లైట్ వాడుతారు. ఆ వెలుతురులో ఫిల్మ్ ముందుకు ప్రయాణం చేస్తున్నప్పుడు సౌండ్ ట్రాక్ ప్రొజక్టర్‌లో అమర్చబడిన సౌండ్ హెడ్ మీదుగా ప్రయాణం చేస్తుంది. శక్తివంతమైన కాంతి సౌండ్ ట్రాక్ మీదుగా ఆవల వైపున ఉన్న సౌండ్ హెడ్ మీదపడి ఎలక్ట్రికల్ ఎనర్జీగా మారి ఆంప్లిఫయర్స్‌నుంచి స్పీకర్స్ ద్వారా శబ్దముగా వినబడుతుంది. ఈ విధంగా బొమ్మకు, శబ్దానికి పొంతన జరుగుతుంది.

**సినిమా టైటిల్స్‌లో సూచన :** సినిమా టైటిల్స్ వచ్చేటప్పుడు ఆ చిత్రములో శబ్దము ఏ పద్ధతిలో రికార్డు చేసినదీ చూపిస్తారు. అంటే ఏ కంపెనీవారు తయారు చేసిన యంత్రాలు వాడారో తెలుస్తుంది. విజయావారి చిత్రాలలో "సౌండ్ రికార్డెడ్ ఆన్ వెస్ట్రక్స్ సిస్టమ్" అని ఉంటుంది. "జయభేరి", "ఇద్దరు మిత్రులు", "రహస్యం" మొ॥ చిత్రాలలో కూడా వెస్ట్రెక్స్ పద్ధతి వాడారు.

"కీలుగుఱ్ఱం", "టైగర్ రాముడు", "సతీ సక్కుబాయి" మొదలైన చిత్రాలలో "సౌండ్ రికార్డెడ్ ఆన్ ఆర్‌సిఏ సిస్టమ్" అని ఉంటుంది.

**వినైల్ ప్లాస్టిక్ రికార్డులు :** భారతీయ భాషలలో కొన్ని లక్షలలో గ్రామఫోన్ రికార్డులు 'షెల్లాక్'తో చేసినవి విడుదల అవుతూ ఉండేవి. అవి సులభంగా పగిలిపోతూ ఉండేవి. ఒకచోటు నుండి ఇంకోచోటుకు పంపాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తూండేది. రికార్డుమీద ఒక్కొక్క వైపు పాట 3 నుంచి 3 1/2 నిమిషాలకన్నా మించి ఉండేదికాదు.

శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు 30 నుంచి 40 ని॥ల వరకు ఉండేవి. ఈ కార్యక్రమాలను గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేయాలంటే 'రికార్డ్‌సెట్స్'గా తయారు చేయాలసి వచ్చేది. ప్రతి 3 నుంచి 3 1/2 నిముషాలకు రికార్డు మార్చాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని రికార్డింగ్ సంస్థలు 1932 నుంచి

పరిశోధనలు ప్రారంభించారు. ఈ పరిశోధనల ఫలితమే ప్లాస్టిక్ రికార్డుల తయారీకి మార్గము చూపింది. దీనికి వినైల్ ప్లాస్టిక్ సరియైన పదార్థమని రూఢి చేసుకున్నాయి రికార్డింగ్ సంస్థలు.

15 సం॥లు పరిశోధన చేసి అమెరికాలోని కొలంబియా సంస్థవారు 10 అంగుళాల వ్యాసము కల మైక్రో గ్రూవ్స్‌తో తయారు చేసిన వినైల్ ప్లాస్టిక్ రికార్డును 1948లో తయారు చేసి ప్రదర్శించారు. ఈ రికార్డు 33 1/3 ఆర్పిఎంలో ప్లే చేయాలి. ఒక్కొక్క సైడ్ 15 ని॥లకు మించి ప్లే అయ్యేది. ఈ పరిశోధన విజయవంతం కావటంతో కొలంబియా రికార్డింగ్ కంపెనీవారు పెద్ద మొత్తములో వినైల్ ప్లాస్టిక్ లాంగ్ ప్లే రికార్డులను తయారు చేసి మార్కెట్‌లో ప్రవేశపెట్టారు.

అమెరికాలోని ఆర్సిఏ-విక్టర్ కంపెని మొదటిసారిగా 45 ఆర్పిఎం 7 అంగుళాల వ్యాసముతో మైక్రో గ్రూవ్ వినైల్ ప్లాస్టిక్ లాంగ్ ప్లే రికార్డులను తయారు చేసారు. ఒక్కొక్కవైపు 8 నిమిషాలు ప్లే అయేది. 1951 నుంచి 45 ఆర్పిఎం లాంగ్‌ప్లే రికార్డులు మార్కెట్‌లో ప్రవేశపెట్టారు. ఈ రికార్డులు ఒక్కొక్క వైపు 10 నుంచి 15 ని॥ల వరకు ప్లే చేయవచ్చును.

ఈ మైక్రో గ్రూవ్ ప్లాస్టిక్ రికార్డులు ప్లే చేయటానికి అవసరమైన గ్రామఫోన్‌లు కూడా తయారు చేసి అమ్మేవారు.1948లో 'బెల్ టెలిఫోన్ లాబ్స్' వారు "ట్రాన్సిస్టర్"ను కనుగొన్నారు. వీటిని వ్యాక్యూమ్ ట్యూబ్స్‌కు బదులుగా వాడి చిన్నసైజులో రేడియోలు, రికార్డు ప్లేయర్స్, టేప్ రికార్డులు తయారీ ప్రారంభమయింది.

1950 నుంచి "ఫోర్ స్పీడ్" (16, 33 1/3, 45, 78 ఆర్పిఎం) రికార్డ్ ప్లేయర్స్ మార్కెట్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. ఇఎంఐ (హెచ్ ఎం వి) లండన్ కంపెని 1952 నుంచి మైక్రో గ్రూవ్ వినైల్ ప్లాస్టిక్ 331/3 ఆర్పిఎం లాంగ్ ప్లే మరియు 45 ఆర్పిఎం (7 అంగుళాల వ్యాసం) రికార్డులు మార్కెట్ ప్రవేశపెట్టారు.

45 ఆర్పిఎం లాంగ్ ప్లే రికార్డులు, 33 1/3 ఆర్పిఎం ఎక్స్‌టెండెడ్ ప్లే (ఇ.పి.) రికార్డులు కూడా క్రమేణా ప్రవేశపెట్టారు.

గ్రామఫోన్ కంపెని ఆఫ్ ఇండియా హెచ్ఎంవి వారు 1958 నుంచి భారతదేశములో ఎల్పి/ఇపి రికార్డుల తయారీ ప్రారంభించారు.

**వినైల్ గ్రామఫోన్ రికార్డుల తయారీ :** వినైల్ అంటే పాలి వినైల్ క్లోరైడ్ (పివిసి) ప్లాస్టిక్. దీన్ని థెర్మో ప్లాస్టిక్ అంటారు. వేడిచేస్తే సాగే గుణము ఉన్నది. వర్జిన్ వినైల్‌తో చేసిన రికార్డుల శబ్దము నాణ్యత బాగుంటుంది. మన్నిక ఎక్కువ. ఎల్‌పి రికార్డు బరువు సుమారు 200 గ్రాములు ఉంటుంది.

గ్రామఫోన్ రికార్డుల ధర తగ్గించాలని వర్జిన్ వినైల్‌కు బదులుగా "రీసైకిల్డ్ వినైల్", "వర్జిన్ వినైల్"ల మిశ్రమాన్ని ఉపయోగించి రికార్డుల తయారీ ప్రారంభించారు. వీటిలో చేసిన రికార్డుల బరువు షుమారు 120 గ్రాములు ఉంటుంది.

**వినైల్ మైక్రో గ్రూవ్ రికార్డుల తయారీ :** ఫిలిమ్‌లోని సౌండ్ ట్రాక్ నుంచి గ్రూవ్స్ కట్ చేసి మాస్టర్ డిస్క్‌లు తయారు చేస్తారు. ఈ మాస్టర్ డిస్క్‌ల నుంచి స్టాంపర్స్‌ను తయారు చేస్తారు. ఈ స్టాంపర్స్ ఎన్నైనా చేయవచ్చును. ఒక్కొక్క స్టాంపర్‌ను ఉపయోగించి దాదాపు రెండువేల రికార్డుల దాకా తయారు చేయవచ్చును. ఆడియో ఫిల్మ్ నుంచి పాటలే కాక సంభాషణలు కూడా రికార్డు చేయవచ్చు. ఈ పద్ధతిలో మాస్టర్ డిస్క్ చెడిపోయే అవకాశము ఏ మాత్రము ఉండదు. అందుకనే రికార్డ్ స్లీవ్ మీద "From the Original Sound Track" అని ఉంటుంది.

**ప్రెస్సింగ్ :** వినైల్ ప్లాస్టిక్ చిన్న చిన్న గ్రాన్యూల్స్‌గా కాని, కొద్దిగా పెద్దసైజులో ఉండే పెలెట్స్‌గా గాని దొరుకుతుంది. తగినంత వినైల్ తీసుకుని రెండు స్టాంపర్స్ మధ్యన ఉంచి ప్రెస్ లో నొక్కుతారు. నొక్కేటప్పుడు తగినంత ఉష్ణోగ్రత, పీడనము (ప్రెషర్) ఉంచుతారు. గంటలో కొన్ని వందల రికార్డులు తయారవుతాయి. రికార్డుల మొదలులో, పాటకి-పాటకి మధ్యన, లేబుల్ చుట్టూ - కొంత భాగం డమ్మీ ఉంటుంది.

ప్రెస్ చేసే సమయములోనే రికార్డ్ లేబుల్స్ సైడ్ ఎ, సైడ్ బి పాటల వివరాలతో ఉన్నవి కూడా ప్రెస్ చేస్తారు.

**ప్యాకింగ్ :** మైక్రో గ్రూవ్స్ దెబ్బ తినకుండా ఉండటానికి రికార్డులను ప్లాస్టిక్ కవర్లలో ఉంచుతారు. దీనిని అట్టతో కాని, కార్డ్‌బోర్డ్‌తో గాని చేసిన కవర్లలో ఉంచుతారు. ఈ స్లీవ్స్ మీద పాటలకు సంబంధించిన వివరాలు అందమైన ఫోటోలు సంబంధిత విషయాలు మొదలైనవి ముద్రించుతారు.

**వినైల్ రికార్డుల్లో యిబ్బందులు :** వినైల్ రికార్డులు 'షెల్లాక్' రికార్డుల కన్నా గట్టిగా ఉన్నా జాగ్రత్తగా వాడకపోతే విరిగిపోయే ప్రమాదమున్నది. స్టాటిక్ ఎలక్ట్రిసిటీ వలన దుమ్ముధూళిని ఆకర్షిస్తుంది. కొన్ని సందర్భాలలో స్టయిలస్ మైక్రోగ్రూవ్‌ను స్కిప్ చేస్తుంది. కొన్ని సందర్భాలలో స్టయిలస్ ఒకే గ్రూవ్‌లో తిరుగుతూ ఉంటుంది.

**ప్రయోజనాలు :** లాంగ్ ప్లే రికార్డులు ఒక్కొక్క వైపు 30 నిమిషాలదాకా ప్లే చేయవచ్చును. సినిమాలలో పాటలన్నీ చాలావరకు ఒకే ఎల్‌పి మీద రికార్డు చేయవచ్చును. రికార్డ్ ప్లేయర్ యొక్క 'టోన్ ఆర్మ్' తేలికగా ఉండటం వలన రికార్డు అరుగుదల తక్కువగా ఉంటుంది. స్టయిలస్‌కూడా కొన్ని వందల పాటలు విన్న తర్వాత మాత్రమే మార్చుకోవలసిన అవసరం పడుతుంది.

**వినైల్ రికార్డులు - వివిధ కంపెనీలు :** 1970 చివరలోను, 1980 ప్రారంభంలోను గ్రామఫోన్ కంపెనీ (హెచ్‌ఎంవి) వారికి పోటీగా వినైల్ రికార్డులు తయారు చేసే కంపెనీలు అనేకము ప్రారంభించబడ్డాయి. అవి :

01. ఎకో రికార్డింగ్ కం. మద్రాసు
02. సూపర్ కాసెట్స్ ఇండస్ట్రీస్ ప్రై.లి., న్యూఢిల్లీ, మద్రాసు
03. లియో ఆడియో-వీడియో (ప్రై) లి, విజయవాడ, మద్రాసు
04. ఎవిఎం మ్యూజిక్ సర్వీసెస్, మద్రాసు
05. పోలిడార్ ఆఫ్ ఇండియా లి., బొంబాయి
06. ఏస్ మ్యూజిక్ కంపెనీ, మద్రాసు
07. ఆడియో విజన్స్, బెంగుళూరు
08. సప్తస్వర రికార్డింగ్ కం., మద్రాసు
09. మ్యూజిక్ ఇండియా
10. ఎస్‌ఇఏ రికార్డ్స్, మద్రాసు
11. కావేరీ, విజయవాడ
12. ఎఎంసి, విజయవాడ

13. ఓరియంటల్ గ్రామఫోన్ రికార్డ్స్ కం.

14. లహరి (ఆడియో విజన్), బెంగుళూరు

15. సిబిఎస్ గ్రామఫోన్ రికార్డ్స్ అండ్ టేప్స్ (ఇం) లి., బొంబాయి

16. టి-సీరీస్, న్యూఢిల్లీ

17. వీనస్ రికార్డ్స్ అండ్ టేప్స్ మాన్యుఫేక్చరింగ్ కం., బొంబాయి

ఇలాగ ఎన్నో కంపెనీలు ప్రారంభమయి కొంతకాలానికి కనుమరుగైనాయి. కాని గ్రామఫోన్ కంపెని ఆఫ్ ఇండియా (హెచ్ఎంవి) 110 సంవత్సరాలుగా మన దేశములో కొనసాగుతూనే ఉన్న ఏకైక సంస్థ.

## గిరి అండ్ కంపెని

ఆ రోజులలో గ్రామఫోన్ రికార్డులు అమ్మే డీలర్స్ ఎందరో ఉండేవారు. గుంటూరులో విజయ & కో, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో కాళిదాస పురోహిత్, కర్ణాటక మ్యూజిక్ హౌస్, మ్యూజికల్ మార్ట్, సుధా ఎంపోరియం, విశాఖపట్టణంలో రేడియోహౌస్, ది ఆఫ్రికన్ స్టోర్స్ ఇలాగ అన్ని ఊర్లలో ఎన్నో షాపులు ఉండేవి.

కాకినాడలో 'గిరి అండ్ కంపెని' గ్రామఫోన్ రికార్డుల షాపును 1924లో ఓలేటి శేషగిరిరావు గారు స్థాపించారు. హెచ్.యం.వి. కంపెనీ డీలర్స్‌గా వ్యవహరించి రికార్డుల



శేషగిరిరావు



కామరాజు

అమ్మకాలలో ప్రథమ స్థానంలో వుండి సిల్వర్ మరియు గోల్డ్ షీల్డులను ఎన్నోసార్లు అందుకున్న సంస్థ. శేషగిరిరావు గారి తదనంతరం వారి కుమారులలో ఒకరైన ఓలేటి కామరాజుగారు రికార్డ్స్ వ్యాపారము చూసుకునేవారు.

కామరాజు గారిని వారి అల్లుడు రమేష్ (మాధవి భర్త) నాకు పరిచయం చేసారు. కామరాజు గారు గ్రామఫోన్ రికార్డుల గురించి, అమ్మకాల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు నాతో చెప్పేవారు. ఘంటసాల గారి పాటల రికార్డులు ఎన్నో అమ్మి వ్యాపారంలో ధనము సంపాదించారని చెప్పేవారు. అంతేకాకుండా ఘంటసాల గారు గానం చేసిన 'నమో వెంకటేశ, ఏడు కొండలసామి' గ్రామఫోన్ రికార్డులు వేల సంఖ్యలో అమ్మి ఎంతో లాభం గడించారని చెప్పారు.

హెచ్.యం.వి. సంస్థలో "HMV Artists Repertoire Manager and Adviser Southern India" గా పదవీ విరమణ చేసిన పుట్టా మంగపతి గారు 'స్వరసేవ' పుస్తకాన్ని రచించారు.

**16-11-13**న హైదరాబాద్‌లో మంగపతి గారికి సత్కార సభ జరిగింది. అందులో చాలామంది సంగీతప్రియులు, ఉన్నతోద్యోగులు పాల్గొన్నారు. వారిలో ఓలేటి కామరాజుగారి కూతురు మాధవి, అల్లుడు రమేష్ కూడా పాల్గొన్నారు. నేను ఆ దంపతులను మంగపతి గారికి పరిచయం చేసాను. దానికి మంగపతి గారు సంతోషించి "ఘంటసాల గారు గానంచేసిన "ఏడుకొండలసామి" రికార్డు విడుదల అవటానికి మీ నాన్నగారు కూడా కారకులు. ఎప్పుడు కాకినాడ వెళ్ళినా కమ్మని భోజనం పెట్టేవారు. కోటయ్య కాజాలు పాకెట్ ఇచ్చి మదరాసులోని మీ కుటుంబ సభ్యులకు ఇవ్వండి" అనేవారు.

"ఆనాడు నేను ఒక్క కళాకారులతోనే కాకుండా HMV డీలర్స్‌తో కూడా ఎంతో ఆత్మీయత, ప్రేమానురాగాలు పంచుకొన్నాను" అని మధురస్మృతులను తలుచు కొన్నారు.

అంతేకాక "ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసురాలు పర్వీన్ సుల్తానా మదరాసు వచ్చినప్పుడు వారిని కలిసి రికార్డింగ్ చేద్దామని అడిగితే వెంటనే ఒప్పుకొని రికార్డింగ్‌కు వచ్చారు. రికార్డింగ్ చేసిన 'మాస్టర్'ను బొంబాయిలోని HMV సంస్థకు

పంపితే చాలా ఆశ్చర్యపోయారు. పర్విన్ సుల్తానా గారు చాలా బిజి ఆర్టిస్ట్. రికార్డింగ్ చేద్దామంటే ఎప్పుడు దొరికేవారు కాదు. అలాంటిది మీరు సాధించారని అన్నారు".

ఇలాగ మంగపతిగారు వారి జ్ఞాపకాలను ఆ సత్కార సభలో శ్రోతలతో పంచుకున్నారు.

**హై ఫిడిలిటీ (హైఫై)** : శబ్దము నాణ్యతను పెంచాలని, అనవసరపు శబ్దాలను రికార్డింగ్‌లో తగ్గించాలని పరిశోధనలు ప్రారంభమయ్యాయి. వీటి ఫలితంగానే స్టీరియో రికార్డింగ్‌కు నాంది పలికింది. స్టీరియో గ్రామఫోన్ రికార్డులు 1958నుంచి మార్కెట్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. దీని వలన సౌండ్ నాణ్యత పెరిగింది.

**స్టీరియోఫోనిక్ సౌండ్ :** సహజమైన శబ్దము వివిధ దిక్కుల నుంచి వినబడుతున్నట్లు భ్రమింపచేసే కళ - స్టీరియో ఫోనిక్ సౌండ్. ఇది ఎలా సాధ్యమౌతుందంటే రెండు లేక అంతకన్నా ఎక్కువ స్వతంత్రమైన (ఇండిపెండెంట్) ఆడియో ఛానెల్స్‌ను రెండు లేక అంతకన్నా ఎక్కువ స్పీకర్స్ (విడివిడిగా) నుంచి వినిపిస్తారు. అప్పుడు మనకు సహజంగా శబ్దము విన్నట్లు అనిపిస్తుంది. ఈ పదం క్వాడ్రాఫోనిక్, సరౌండ్ సౌండ్‌లకు కూడా వర్తిస్తుంది. కాని సాధారణముగా రెండు ఆడియో ఛానెల్స్ నుంచి, రెండు స్పీకర్స్ ద్వారా శబ్దము వస్తే "స్టీరియో ఫోనిక్ సౌండ్" అంటారు.

**స్టీరియో సౌండ్ రికార్డింగ్ :** స్టీరియో సౌండ్ రాకముందు గ్రామఫోన్ రికార్డులలో శబ్దాన్ని ఒకే ఛానెల్‌లో రికార్డు చేసేవారు (మోనో రికార్డింగ్) స్టీరియో గ్రామఫోన్ రికార్డులలో శబ్దం రెండు ఛానెల్స్‌లో రికార్డు చేయబడుతుంది. స్టీరియో రికార్డింగ్‌లో వివిధ పద్ధతులు ఉన్నా వెస్ట్రెక్స్ కంపెనీవారు 1957లో ప్రవేశపెట్టిన రికార్డింగ్ పద్ధతి చాలా పాప్యులర్ అయింది. వెస్ట్రెక్స్ పద్ధతిలో గ్రూవ్స్ కటింగ్ చేసే కటింగ్ హెడ్ ఒక్కొక్క ఛానెల్‌ను $45^0$ (డిగ్రీలు)ల చొప్పున రెండు ఛానెల్స్‌ను కటింగ్ చేస్తుంది. స్టీరియో రికార్డును ప్లే చేసినప్పుడు రెండు ఛానెల్స్ నుంచి శబ్దము రెండు స్పీకర్స్‌ద్వారా వినిపిస్తుంది.

**దీనివలన ప్రయోజనాలు** - 1) సౌండ్ నాణ్యత పెరుగుతుంది. 2) మోనో రికార్డును స్టీరియో ప్లేయర్ మీద ప్లే చేసినా శబ్దము రెండు స్పీకర్స్ నుంచి వస్తుంది. 3) బాలన్స్‌డ్




గ్రామఫోన్ ఇపి రికార్డ్, టర్న్ టేబుల్




గ్రామఫోన్ ఎల్‌పి రికార్డ్, టర్న్ టేబుల్

# గ్రామఫోన్ రికార్డ్ లేబుల్స్



























CBS
Sunny
AN ORIGINAL SOUNDTRACK RECORDING
SIDE A
33 1/3 RPM
IND 1073 A
1. Aur Kya Ahede Wafa * Asha Bhosle
2. Meri Yaad Aayegi
Lata Mangeshkar & * Suresh Wadkar
3. Jaane Kya Baat Hai Lata Mangeshkar
MUSIC: R. D. BURMAN
LYRICS: ANAND BAKSHI


RSO
2 LP Set No. 2658 123
2479 199
STEREO
1
SATURDAY NIGHT FEVER
Original Movie Soundtrack


Karussell
MAX GREGER
GEMA
2
Dance Appeal


LEO
INSPECTOR PRATAP
MUSIC: CHAKRAVARTHI
LONGPLAY


ANGEL RECORDS
LONG PLAY
3AEX 9004


mfp
MUSIC FOR PLEASURE
LONG PLAY
MFPE. 6535
2
EMI


Columbia
33ESX.11505
EMI


REGAL
ELRZ. 20
GHANTASALA VENKATESWARA RAO
EMI


"HIS MASTER'S VOICE"
TELUGU
P. 3946
SONG
Sung by Vallur Jagannatha Rao,
Coconada
G.C.-13-12740
Record manufactured by THE GRAMOPHONE CO. LTD., Calcutta


SUN RECORD COMPANY, COCANADA
TELUGU DRAMA
N.V. 48
KANAKA TARA—Part 9
Andhra Amateurs
OMC. 5007


HUTCHINS' RECORDS
HUTCHINS
TELUGU
Drama
SN 315
Lava - Kusa, (Part 5)
Hutchins Dramatic Party
OMG - 90
MANUFACTURED BY THE GRAMOPHONE Co. LTD., DUM DUM (INDIA)


Columbia
Hindustani
Film-Anmol Ghadi
GE. 3737
NOORJEHAN
Mehboob Productions
Music : Naushad Ali
Comp : Tanvir Naqvi
CEI. 26635
COLUMBIA GRAPHOPHONE CO. LTD. (Incorporated in England with Limited Liability) Made in India


LONG PLAYING
TRADE MARK
33⅓ R.P.M.
ODEON
Regd. Trade Mark of The Gramophone Co., Ltd.
2XJE.1239
Telugu Films
SIDE ONE
3AEX.9012
Recording First Published 1969
"HITS FROM TELUGU FILMS—VOL. 4"
MADE IN INDIA


NEW THEATRES RECORD
H. 850


This patented copyright record must not be publicly performed without license
HINDUSTHAN RECORD
Hindustani
Film: PARWANA
H. 1244
K. L. SAIGAL
Jeet Productions
Music: Khurshid Anwar
Comp: D. N. Madhok
HSB 3578
Recorded by H.M.P. & V. Syndicate Ltd., Made in India


The TWIN
TWIN
TELUGU COMIC
F.T. 595
S. V. SUBBA RAO
(Nuzvid)
OC. 517
MANUFACTURED FOR THE TWIN RECORD CO., LTD., DUM DUM.

సౌండ్ వస్తుంది. రెండు ఛానెల్స్ నుండి వచ్చే శబ్దము నాణ్యత ఒకే లాగ ఉంటుంది.
**4)** మోనో రికార్డు ప్లేయర్స్ మీద స్టీరియో రికార్డు ప్లే చేసినా కూడా రెండు ఛానల్స్‌లోని శబ్దము కలిసి ఒకే స్పీకరు నుంచి వినబడుతుంది.

**1931**లో స్టీరియో రికార్డింగ్ పద్ధతిని మొదటిసారిగా కనుగొన్నది, ఇయంఐ (EMI) లండన్ సంస్థయే కానీ **1958** దాకా ఈ సంస్థ స్టీరియో రికార్డులు విడుదల చేయలేదు. ఫిలిప్స్, బుష్, హెఎంవి సంస్థలు మొదలైన ఎన్నో పెద్దసంస్థలు స్టీరియో రికార్డ్ ప్లేయర్స్‌ను తయారు చేసాయి. ఇండియాలో ఫిలిప్స్ కంపెనీ వారి సిస్టమ్స్ చాలా ప్రసిద్ధి చెందాయి.

శబ్దము యొక్క నాణ్యతను అభివృద్ధి చేయాలని స్పీకర్స్ డిజైన్‌లో మార్పులు జరిగాయి. ఊఫర్స్, ట్వీటర్స్ ప్రవేశపెట్టారు. ఊఫర్స్ స్పీకర్స్ నుండి లో ఫ్రీక్వెన్సీ నోట్స్ చాలా కరెక్ట్‌గా రిప్రొడ్యూస్ అవుతాయి. చిన్న స్పీకర్ అయిన ట్వీటర్స్ నుంచి హై ఫ్రీక్వెన్సీ నోట్స్ రిప్రొడ్యూస్ అవుతాయి. ఈ మార్పువలన హెచ్చు నాణ్యత గల శబ్దం వినిపిస్తుంది. అంటే హై ఫిడిలిటీ సౌండ్ అన్నమాట. 'బాస్' అంటే 'లో ఫ్రీక్వెన్సీ నోట్స్', ట్రెబుల్ అంటే 'హై ఫ్రీక్వెన్సీ నోట్స్'. హై-ఫై స్టీరియో సిస్టమ్స్ **1980** నుంచి చాలా పాపులర్ అయ్యాయి.

**గ్రామఫోన్ ఎలా పనిచేస్తుంది :** రికార్డ్స్ ప్లే చేసే యంత్రాలను ఫోనోగ్రాఫ్, గ్రామఫోన్, రికార్డ్ ప్లేయర్, టర్న్ టేబుల్ అని రకరకాలుగా పిలువబడ్డాయి.

**మెకానికల్ గ్రామఫోన్ :** మెకానికల్ గ్రామఫోన్‌లో పాటలు వినటానికి విద్యుశ్చక్తి, బాటరీ మొదలైనవి అవసరము లేవు. యాంప్లిఫయర్స్, స్పీకర్స్, మైక్రోఫోన్స్ ఏమి ఉండవు. అప్పటికి ఇవి ఇంకా రాలేదు. ఇవేమి లేకుండ కనుగొనబడిన అద్భుత పరికరము గ్రామఫోన్.

గ్రామఫోన్‌లో భాగాలు :



1. సౌండ్‌బాక్స్
2. సౌండ్‌బాక్స్‌లో డయాఫ్రమ్
3. మెటల్ స్ట్రిప్ (ఫ్లాట్‌గా ఉండేది) స్ప్రింగ్
4. స్పీడ్ గవర్నర్స్
5. టోన్ ఆర్మ్
6. రికార్డ్‌ను ఫ్లాట్‌గా పెట్టటానికి ఆధారమైన గుండ్రటి మెటల్ డిస్క్ (ఇది తిరుగుతూ ఉంటుంది). టర్న్ టేబుల్ అంటారు
7. సౌండ్ బాక్స్‌కు కలిపిన హాలో (Hallow) గొట్టము.
8. ఈ గొట్టము చివరివైపు వెడల్పుగా ఉండే మరొక గొట్టానికి కలపబడి ఉంటుంది.
9. ఈ భాగాలన్నీ చెక్క పెట్టెలో అమర్చబడి ఉంటాయి.

గ్రామఫోన్‌కు కుడివైపున ఒక హాండిల్ (Handle) ఉంటుంది. దీనిని తిప్పుతూ ఉంటే స్ప్రింగ్ దగ్గరగా చుట్టుకుపోతుంది.

గ్రామఫోన్ రికార్డును టర్న్ టేబుల్ మధ్యన ఉన్న చిన్న ఇరుసుమీద ఉంచుతారు. రికార్డుకు మధ్యలో రంధ్రము ఉంటుంది. ఈ రంధ్రము వలన రికార్డు ఇరుసులో కూర్చుంటుంది.

సౌండ్‌బాక్స్‌కు నీడిల్ (Stylus) పెట్టే సౌకర్యము వుంటుంది. తిరుగుతున్న గ్రామఫోన్ రికార్డు మీద సౌండ్ బాక్స్‌లో ఉన్న నీడిల్‌ను కూర్చోబెట్టాలి.

శబ్దము రికార్డింగ్ చేయబడిన గ్రూవ్స్ (Grooves - గాడి) లో నీడిల్ ప్రయాణము చేస్తూ వైబ్రేషన్స్ (Vibrations) పుట్టిస్తుంది. సౌండ్‌బాక్స్‌లో ఉన్న డయాఫ్రమ్ ఈ వైబ్రేషన్స్‌ను శబ్ద రూపంలో టోన్ ఆర్మ్ నుంచి కలుపబడిన మరొక గొట్టము (సామాన్యముగా చెక్కతో చేయబడినది) ద్వారా పాటగా వినిపింపచేస్తుంది (బాక్స్ మోడల్ గ్రామఫోన్).

రికార్డు తిరిగే 78 RPM వేగాన్ని ఇత్తడితో చేయబడిన స్పీడ్ గవర్నర్స్ తిరుగుతూ అదుపులో ఉంచుతాయి (స్పీడ్ గవర్నర్స్ ఇత్తడితో చేయబడిన గుండ్రటి బాల్స్. ఇవి రెండు, మూడు వుంటాయి).

చెక్కతో చేయబడిన గొట్టానికి ఎదురుగా చిన్న చెక్క తలుపులు ఉంటాయి. ఇవి తెరుస్తే ఎక్కువ శబ్దము, మూసివేస్తే తక్కువ శబ్దము వస్తుంది. అంటే శబ్దాన్ని కంట్రోలు చేసే పద్ధతి. కొన్నిటిలో ఈ సౌకర్యము ఉండదు. ఒకే ధ్వనిలో శబ్దము వస్తుంది.

గ్రామఫోన్ రికార్డు ఉంచే డిస్క్ క్లాక్ మోటారు సహాయంతో తిరుగుతుంది. గ్రామఫోన్ రికార్డు తిరుగుతున్నప్పుడు మెటల్ స్ప్రింగ్ స్ట్రిప్ వదులుగా అవుతూ వుండి ఒక సమయానికి ఆగిపోతుంది. రికార్డు తిరగటము కూడా ఆగిపోతుంది. అంటె మళ్ళీ హాండిల్ సహాయంతో స్ప్రింగ్‌ను వైండ్ (Wind) చేయాలి.

ఏమి సౌకర్యాలు లేని రోజులలో ఈ యంత్రాన్ని కనుగొన్న మేథావులందరూ అభినందనీయులే.

**ఎలక్ట్రికల్ రికార్డు ప్లేయర్స్ :** ఇవి విద్యుశ్చక్తితో నడుస్తాయి. వీటిలో మైక్రోఫోన్స్, యాంప్లిఫయర్స్, స్పీకర్స్ ఉంటాయి.

స్టీలు నీడిల్‌కి బదులుగా సిరామిక్, డైమండ్‌తో చేసిన స్టైలస్ వాడుతారు. స్టైలస్ గ్రామఫోన్ రికార్డు గాడిలో (Grooves) తిరుగుతున్నప్పుడు మాగ్నటిక్ ఫీల్డ్ (Magnetic Field) లో మార్పులు కలుగుతూ వుండి స్వల్పమైన ఎలక్ట్రికల్ కరెంట్ ఉద్భవిస్తుంది. ఈ కరెంట్ రికార్డులోని సౌండ్ వేవ్స్‌ను (Sound Waves) అనుసరిస్తూ వైర్స్ ద్వారా యాంప్లిఫయర్‌కు చేరి శబ్దాన్ని పుట్టిస్తుంది. అంటే మాట, పాట వినిపిస్తుంది.

## సినీ సంగీతము - గ్రామఫోన్ రికార్డులు

**తెలుగు సినీ సంగీత వైభవం :** సంగీతము మానవుని జీవితంలో ఒక భాగము. అందులో సినీ సంగీతముతో విడదీయలేని బంధం ఏర్పడింది. సినిమాలకు కూర్చిన సంగీతాన్ని సినిమా సంగీతం అంటారు. సినిమాలు రాకముందు రంగస్థల సంగీతం చాలా ప్రజాదరణపొందింది. నాటకాలలోని పాటలు, పద్యాలు రికార్డులుగా విడుదల అయ్యాయి. ప్రజలు ఆదరించారు. సినిమాలు వచ్చాక సినిమా పాటలు కూడా రికార్డులుగా రాసాగాయి.

సినిమా పాటలు గ్రామఫోన్ ద్వారా ఇంటిలో వినడమే కాకుండా వీధులలో కూడా వినబడేవి. సినిమా ప్రారంభము ముందు, ఇంటర్వల్‌లో గ్రామఫోన్ రికార్డులు పెట్టి సినిమాహాల్స్‌లో పాటలు వినిపించేవారు. హోటల్స్, షాప్స్‌లో కూడా గ్రామఫోన్ రికార్డులు పెట్టి ప్రజలను ఆకర్షించి తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేవారు. సినిమా సంగీతం రేడియో, టెలివిజన్, ఐపాడ్స్, సెల్‌ఫోన్స్, కంప్యూటర్ ఇలాగ ఎన్నో విధాలుగా ప్రతి నిమిషం వినిపిస్తూనే ఉంటుంది.

నిశ్శబ్ద చిత్రాలు (Silent Movies) ప్రదర్శించబడినప్పుడు ప్రేక్షకులు చూసి విస్తుపోయారు. వ్యాఖ్యాత తనదైన బాణీలో చిత్రానికి అనుగుణంగా ప్రసంగిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునేవాడు. వాద్య బృందం, తబల, హార్మోనియం మొదలైన వాయిద్యాలను ఆ సందర్భానికి తగ్గట్లుగా వాయించేవారు. ఈ చిత్రాలను 'మూకి' చిత్రాలు అనేవారు.

క్రమంగా శబ్దముతో కూడిన చిత్రాలు వచ్చాయి. వీటినే 'టాకీ' (Talkies) అంటారు. ఈ చిత్రాలను చూసి ప్రేక్షకులు మరింతగా ఆశ్చర్యపోయారు.

అప్పటికే భారతదేశంలో అన్ని భాషలలో నాటకాలు చాలా ప్రసిద్ధి చెందాయి.

హిందీ సినిమాలతో బాటుగా మన దక్షిణ భారతదేశంలో సినిమా పుట్టింది.

హిందీ, తెలుగు సినిమా రంగాలలో నాటకాలే సినిమాలుగా నిర్మించబడ్డాయి. మహారాష్ట్ర నాటకాల ప్రభావం మన తెలుగు నాటకాల మీద ఎక్కువగా ఉండటము వలన పాటలు హిందూస్థానీ రాగాలలో, పద్యాలు కర్ణాటక సంగీతబాణీలో ఉండేవి.

నాటకాలను తెలుగు సినిమాలుగా తీయటం వలన నాటకాలలో నటించే వారే నటించి పాటలు, పద్యాలు పాడేవారు.

కలకత్తా, బొంబాయి, పూనా వంటి నగరాలలో చిత్రనిర్మాణ సంస్థలు ప్రారంభించబడ్డాయి. సంగీతంలో మార్పులు రాసాగాయి. సంగీతానికి ప్రాముఖ్యం ఇవ్వబడింది. సంగీత దర్శకుల అవసరం ఏర్పడింది. ప్రజలు తేలికగా పాడుకునే విధంగా పాటలకు బాణీలు కట్టాలనే ఆలోచనలు మొలకెత్తాయి. ఈ కారణాల వల్ల సంస్థలలో సంగీత విభాగాలు కూడా ప్రారంభించబడ్డాయి.

అందమైన నటీనటులు వచ్చారు. గొప్ప గొప్ప సంగీత దర్శకులు, గాయనీ గాయకులు ఉద్భవించారు. స్వయముగా పాడుకోలేని నటీనటులకు నేపథ్యగానం అనే కొత్త ప్రక్రియ అమలులోకి వచ్చింది. దీనితో సినిమా రంగంలో అనూహ్యమైన మార్పులు వచ్చి సినిమా సంగీతానికి ఒకస్థాయి, ప్రమాణము ఏర్పడింది.

## నేపథ్యగానం

చిత్రాలలో నేపథ్యగానం ప్రవేశపెట్టాలనే ఆలోచన వచ్చిన ప్రప్రథమ వ్యక్తి కలకత్తాలోని న్యూ థియేటర్స్‌లో స్క్రీన్‌ప్లే రైటర్, దర్శకులు అయిన నితిన్‌బోస్.

న్యూ థియేటర్స్ వారు కలకత్తాలో 1935లో 'ధూప్ ఛావోన్' (Dhoop Chaaon) అనే హిందీ చిత్రంలో ఒక నృత్యానికి హరిమతి, పరుల్‌ఘోష్, సుప్రభ సర్కారులచే ఒక బృందగానాన్ని పాడించారు సంగీత దర్శకులు ఆర్.సి. బొరాల్ మరియు పంకజ్ మల్లిక్, దర్శకులు నితిన్‌బోస్.

దక్షిణ భారతదేశ భాషలలో ప్రప్రథమంగా నేపథ్యగానం చిత్రాలలో ప్రవేశపెట్టిన ఘనత ఏ.వి.యం. సంస్థ అధినేత మెయ్యప్పన్ చెట్టియార్ గారిది.

చెట్టియార్ గారు 1938లో నిర్మించిన తమిళ చిత్రం 'నందనార్'లో దేవకి వేషధారికి బొంబాయి నుంచి లలిత తేవల్కర్ అనే గాయనిని పిలిపించి, ఆమె వెనక నుంచి పాడుతూ ఉంటే దేవకి పెదవులు కదపటాన్ని షూట్ చేయడంతో ప్లేబ్లాక్ సిస్టమ్ మొదలైంది.

తెలుగు చిత్రసీమలో ప్రథమ నేపథ్య గాయకుడు 'సాబు (వందేమాతరం - 1939)', నేపథ్యగాయని బెజవాడ రాజరత్నం (భక్తపోతన - 1942) అని సినీ విశ్లేషకులు అంటారు.

## చిత్ర నిర్మాణ సంస్థలు

నిర్మాతలు లేకపోతే రచయితలు లేరు, నటీనటులు లేరు, సంగీత దర్శకులు లేరు, గాయనీ గాయకులు లేరు అసలు సినిమానే లేదు. ఆ రోజుల్లో నిర్మాతను తండ్రి, గురువు దైవంగా భావించేవారు.

**నిర్మాణ సంస్థలలో కొన్ని :** ఈస్ట్ ఇండియా ఫిలిం కంపెని, వేల్ పిక్చర్స్, దుర్గా సినీటోన్, సరస్వతీ టాకీస్, వాహిని పిక్చర్స్, ప్రతిభా పిక్చర్స్, ఆంధ్రా సినీటోన్, రోహిణి

పిక్చర్స్, శ్రీ రాజ రాజేశ్వరి ఫిలిం కంపెనీ, జెమిని పిక్చర్స్, శోభనాచల పిక్చర్స్, భరణి పిక్చర్స్, విజయా పిక్చర్స్, భాస్కర్ ప్రొడక్షన్స్, మోడరన్ థియేటర్స్, ఎన్.ఏ.టి. ఫిలిమ్స్, జగపతి పిక్చర్స్, సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణా పిక్చర్స్, అంజలి పిక్చర్స్, లలితా శివజ్యోతి ఫిలిమ్స్, పద్మశ్రీ పిక్చర్స్, రాజ్యం పిక్చర్స్ ఇలాగ ఎన్నో ...

ప్రారంభదశలో మాణిక్యలాల్ సేట్, అంబాలాల్ యం. పటేల్, కాళ్ళకూరి సదాశివరావు, అక్తర్ నవాబ్, కావలి గుప్తా, కె. సుబ్బారావు, బి.వి. రామానందం మొదలైన వారెందరో చిత్రాలు నిర్మించారు.

## రచయితలు

సినిమాలలో సందర్భానుసారంగా నిర్మాత, దర్శకుల ఆదేశానుసారం రచయితలు గీతాలు రచిస్తారు.

భక్తిగీతాలు, దేశభక్తి గీతాలు, హాస్య గీతాలు, శృంగార గీతాలు, విరహ గీతాలు, ప్రబోధ గీతాలు, నేపథ్య గీతాలు, నిషా గీతాలు, శోక, కరుణరస గీతాలు, పద్యాలు, దండకాలు, శ్లోకాలు ఇలాగ ఎన్నో వైవిధ్య గీతాలు ఎందరో గొప్ప గొప్ప రచయితలు చిత్రాలలో రచనలు చేసారు. కొందరు కవులు కథ, మాటలు, పాటలు, పద్యాలు, దండకాలు, శ్లోకాలు మొదలైనవన్ని చిత్రాలకు రచించేవారు.

1931లో విడుదల అయిన తొలి తెలుగు టాకి భక్తప్రహ్లాద చిత్రంలో రెండు గీతాలు రచించిన చందాల కేశవదాసు (1876 - 1956) తొలి సినీ రచయితగా చరిత్ర కెక్కారు. వీరి జన్మస్థలం ఖమ్మం జిల్లాలోని జక్కేపల్లి గ్రామం.

ఏవిధమైన గీతాన్నైనా, సంభాషణలనైనా సులువైన పదాలతో సునాయాసంగా రచించగల ప్రతిభావంతులు సముద్రాల సీనియర్ (రాఘవాచార్యులు) రామాయణాన్ని పాటలో రాయగల అద్వితీయ ప్రతిభాశాలి.వీరు రచనలు చేసిన దేవదాస్, విప్రనారాయణ, వినాయక చవితి మొదలైన ఎన్నో చిత్రాలు విజయ ఢంకా మ్రోగించాయి.

19-7-1902న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించిన సముద్రాల సీనియర్ 17-3-1968న చెన్నైలో స్వర్గస్తులైనారు.

పాటలు చిన్న చిన్న పదాలతో పామరులకు సహితం అర్థమయ్యేరీతిలో రచించిన కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి (1897-1980). జన్మస్థలం పిఠాపురం తాలూకా లోని చంద్రపాలెం.

మల్లీశ్వరి, భాగ్యరేఖ, బంగారు పంజరం, రాజమకుటం లాంటి ఎన్నో చిత్రాలలో అజరామరమైన గీతాలు రచించిన కవి దేవులపల్లి.

అసామాన్య ప్రతిభావంతుడని చిత్రసీమలో ప్రశంశలందుకున్న మల్లాది రామకృష్ణశాస్త్రి (1905 - 1965) గారు జయభేరి, రేచుక్క, చిరంజీవులు, కన్యాశుల్కం, రాజనందిని మొదలగుగా గల చిత్రాలలో రచించిన గీతాలు బహుళ ప్రజాదరణ పొందాయి. రహస్యం చిత్రంలోని 'గిరిజా కళ్యాణం' యక్షగానం మల్లాది వారికి ఎనలేని కీర్తిని సంపాదించింది. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం తాలూకాలోని చిట్టి గూడూరులో జన్మించారు.

సులువైన పదాలతో పాటలను, వింత వింత పదాలతో సంభాషణలు సృష్టించి ప్రేక్షకులను సమ్మోహనపరచిన కవి పింగళి నాగేంద్రరావు (1901 - 1971).

వీరు రచించిన పాతాళభైరవి, పెళ్ళి చేసి చూడు, గుండమ్మకథ, మాయాబజార్, మిస్సమ్మ, జగదేక వీరుని కథ, శ్రీ కృష్ణార్జున యుద్ధం మొదలైన చిత్రాలలోని పాటలన్నీ సూపర్‌హిట్. వీరు బొబ్బిలి తాలూకాలోని రాజాంలో జన్మించారు.

కథ, మాటలు, పాటలు, పద్యాలు మొదలైనవి రచించటంలో దిట్ట వెంపటి సదాశివబ్రహ్మం (1905 - 1968). తూర్పు గోదావరి జిల్లా తునిలో జన్మించారు. భలేరాముడు, సంసారం, చరణదాసి, లవకుశ, రహస్యం మొదలైన ఎన్నో చిత్రాలకు రచన చేసారు.

విప్లవ సాహిత్యం, ప్రభోదాత్మక గీతాలు రచించటములో అందె వేసిన చేయి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసులు :1910-1983) విశాఖ పట్టణంలో జన్మించారు. వెలుగు నీడలు, పదండి ముందుకు, రాముడు, భీముడు, రణభేరి, భూమికోసం ... ఇలాగ ఎన్నో చిత్రాలలో సుమధుర గీతాలను రచించారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలోని "తెలుగువీర లేవరా" గీతానికి జాతీయ బహుమతి లభించింది.

చెంచులక్ష్మి, ఇల్లరికం, ఆరాధన, బందిపోటు, దేశద్రోహులు, ప్రేమలేఖలు ... ఇలా ఎన్నో చిత్రాలకు బహుళ ప్రజాదరణ పొందిన పాటలు రచించిన కవివర్యులు ఆరుద్ర (భాగవతుల శంకరశాస్త్రి 1925 - 1998) విశాఖపట్టణంలో జన్మించారు. 1985లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ ప్రదానం చేసారు. కొన్ని చిత్రాలకు సంభాషణలు కూడా రాసారు.

మనసుకవిగా పేరుగాంచిన ఆచార్య ఆత్రేయ (కిడాంబి నరసింహాచార్యులు : 1921-1989) అదృష్టవంతులు, ఆత్మబలం, మూగమనసులు, ప్రేమ్‌నగర్, దసరా బుల్లోడు మొదలైన అనేక చిత్రాలలో 1200 పైగా పాటలు రచించారు. నెల్లూరు జిల్లా, సుళ్ళూరు పేట తాలూకా మంగళంపాడు గ్రామంలో జన్మించారు. సంభాషణలు రాయటంలో దిట్ట.

'జానపద కవి సార్వభౌమ' కొసరాజు రాఘవయ్య చౌదరి (1905-1987) బాపట్ల తాలూకాలోని చింతాయపాలెంలో జన్మించారు. పెద్దమనుషులు, రాజు పేద, రోజులు మారాయి, కులదైవం ... మొదలైన చిత్రాలలో రచించిన పాటలన్నీ అజరామరాలే. లవకుశ చిత్రంలోని "ఏ నిమిషానికి ఏమి జరుగునో" పాట ఆచంద్ర తారకము.

**సినిమాలలో జానపద గేయాలు :** స్వర్ణయుగంలో విడుదల అయిన చిత్రాలలో అద్భుతమైన జానపదగీతాలను కూడా జోడించారు నిర్మాతలు. "మనదేశం" చిత్రంలోని 'అత్తలేని కోడలు ఉత్తమురాలు', 'పంచదార వంటి పోలీసు వెంకటస్వామి', జానపదగీతాలు బహుళ ప్రజాదరణపొందాయి.

తెలుగు చిత్రాలలో జానపదగీతాలను అధిక సంఖ్యలో రాసిన కవి కీ॥శే॥ కొసరాజు రాఘవయ్య చౌదరి. ఆయన రాసిన 'ఏరువాక సాగారో', 'చెట్టులెక్కగలవా', 'సరిగంచు చీరకట్టి', 'టౌను పక్క కెళ్ళొద్దురా' మొదలైన ఎన్నో జానపదగీతాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదలయినాయి. గ్రామఫోన్ కంపెనీవారు 1977లో "ఫోల్క్ సాంగ్స్ ఫ్రమ్ తెలుగు ఫిల్మ్స్" అనే లాంగ్ ప్లే (ఎల్‌పి) రికార్డు విడుదల చేసారు.

'రావే ప్రేమలతా' (పెళ్ళిసందడి), 'రావే నా చెలియా' (మంచి మనస్సుకు మంచిరోజులు), 'జయకృష్ణా ముకుందా మురారి' (పాండురంగ మహాత్మ్యం) మొదలైన చిరస్మరణీయమైన పాటలు రచించిన సముద్రాల జూనియర్ (రామానుజాచార్యులు 1923-1985) ఖమ్మం జిల్లాలోని రేమిడిచర్ల గ్రామంలో జన్మించారు. రేచుక్క పగటి చుక్క, శభాష్ రాజా, సతీ అనసూయ, శ్రీ సత్యన్నారాయణ మహాత్మ్యం మొదలైన

అనేక చిత్రాలకు పాటలే గాక సంభాషణలు కూడా రచించారు. సముద్రాల సీనియర్ సుపుత్రులు సముద్రాల జూనియర్.

స్వాతంత్ర్య సమరయోధుడు, మానవతా వాది, వాగ్దానం (1961) చిత్రం ద్వారా చిత్రరంగ ప్రవేశం చేసిన దాశరథి కృష్ణమాచార్య (1925-1987) వరంగల్ జిల్లా, మెహబూబాబాద్ తాలూకా చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. ఇద్దరు మిత్రులు, చదువుకున్న అమ్మాయిలు, అమరశిల్పి జక్కన్న, మనసు-మాంగల్యం, బంగారు గాజులు మొ. అనేక చిత్రాలలో పాటలు రచించారు.

అభ్యుదయకవి, స్వాతంత్ర్య సమరయోధుడు అనేక డబ్బింగ్ చిత్రాలకు రచన చేసిన అనిశెట్టి సుబ్బారావు (1922-1981) గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకా పురుషోత్తమ పట్నంలో జన్మించారు. సంతానం, భలేబావ, భట్టి విక్రమార్క, గుడిగంటలు మొ. చిత్రాలలోని పాటలు ఈనాటికీ ప్రజాదరణ పొందుతున్నాయి.

'దేవత' చిత్రంలో వీటూరి వెంకట సత్యన్నారాయణ మూర్తి రచించిన గీతాల వలన చిత్రం విజయ విహారం చేసింది అనటంలో అతిశయోక్తి లేదు. బంగారు తిమ్మరాజు, మల్లమ్మ కథ, వీరపూజ, మర్యాద రామన్న, భక్త తుకారాం మొ. చిత్రాలకు అద్భుత రచనలు చేసిన వీటూరి (1933-1984) విజయనగరం సమీపంలోని రెల్లివలస గ్రామంలో జన్మించారు.

యుగళ గీతాల రచనలో అద్వితీయ ప్రతిభ, 'పద్మభూషణ్' పురస్కారం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారు కరీంనగర్ జిల్లాలోని హనుమాన్ పేటలో 29-7-1931న జన్మించారు.

'గులేబకావళి' (1962) చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన సి.నా.రె. గారు కులగోత్రాలు, శకుంతల, పుణ్యవతి, వరకట్నం, పిడుగురాముడు, రాముడు భీముడు, రహస్యం, జరిగిన కథ మొదలైన వందల చిత్రాలలో సుమారు 3500 అజరామరమైన గీతాలను రచించారు.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, తాపి ధర్మారావు, పాలగుమ్మి పద్మరాజు, తోలేటి వెంకటరెడ్డి, జి. కృష్ణమూర్తి, సుంకర - వాసిరెడ్డి, కె. గోపాలరాయ శర్మ, సి. రామ్‌చంద్, నార్ల చిరంజీవి, జంపన, మల్లెమాల, పరశురాం, జాషువా, చెరువు ఆంజనేయశాస్త్రి,

అప్పలాచార్య, కోట సత్యరంగయ్యశాస్త్రి, బైరాగి, వడ్డాది, బసవరాజు అప్పారావు, వారణాసి సీతారామశాస్త్రి, ముద్దుకృష్ణ, రాజశ్రీ మొదలగు ఎందరో రచయితలు సినీ సంగీతానికి తమవంతు సేవలను అందించారు.

## సంగీత దర్శకులు

రచయితలు రచించిన గీతాలను సంగీత దర్శకులు వారి వారి సృజనాశక్తిని ఉపయోగించి స్వరపరుస్తారు. అలాగ మధురాతి మధురమైన బాణీలను సృష్టించిన ఎందరో సంగీత దర్శకులున్నారు.

**తొలితరం సంగీత దర్శకులు** : హెచ్.ఆర్. పద్మనాభశాస్త్రి (భక్త ప్రహ్లాద - 1931), మారుతీ రామయ్య (చింతామణి - 1933), ప్రభల సత్యనారాయణ (లవకుశ - 1934), గాలిపెంచల నరసింహారావు (సీతా కల్యాణం - 1934), చారి (భక్త కుచేల - 1935), పి. మునుస్వామి (రాణి ప్రమీల - 1936), మాధవ టెంబె (ద్రౌపదీ వస్త్రాపహరణం - 1936), భీమవరపు నరసింహారావు (బి.ఎన్.ఆర్. సతీతులసి - 1936), ఆకుల నరసింహారావు (సారంగధర - 1937), విద్వాన్ దేవరకొండ సుబ్బారావు (ఉషా పరిణయం - 1939), ఏ.టి. రామానుజాచార్యులు (మోహినీ భస్మాసుర - 1939), తుంగల చలపతిరావు (పాండురంగ విఠల్ - 1939), ఓగిరాల రామచంద్రరావు (మళ్ళీ పెళ్ళి - 1939), యస్. రాజేశ్వరరావు (జయప్రద - 1939), సాలూరు హనుమంతరావు (రాధిక - 1941), చిత్తూరు నాగయ్య (భక్తపోతన - 1943).

1948 నుంచి సినీ సంగీతము ఒక క్రొత్త మలుపు తిరిగిందని చెప్పవచ్చు. 1970 వరకు వచ్చిన సంగీత దర్శకులలో కొందరు ముఖ్యుల గురించి తెలుసు కుందాము.

1931లో విడుదల అయిన 'భక్తప్రహ్లాద' చిత్రానికి సంగీతం అందించిన హెచ్. ఆర్. పద్మనాభ శాస్త్రి (1914-1970) తెలుగు టాకీ చరిత్రలో తొలి సంగీత దర్శకునిగా చరిత్రకెక్కారు. వీరి స్వస్థలం కర్ణాటకలోని హోస్పేట్. స్వతంత్రంగా కాని ఇతరులతో సంయుక్తంగా కాని సుమారు 20 చిత్రాలకు సంగీతం అందించారు.

సంగీత దర్శకులు బి.యన్.ఆర్. (భీమవరపు నరసింహారావు : 1905-1976) గుంటూరు జిల్లా తెనాలి తాలూకా కొలకలూరులో జన్మించారు. కొద్ది చిత్రాలకు

దర్శకత్వం వహించారు.  వీరు సంగీతం వహించిన 'అర్థాంగి' (1955) చిత్రంలో పాటలు ఆణిముత్యాలు.

బాలమేధావి అని పిలవబడిన ప్రతిభావంతులైన సి.ఆర్. సుబ్బురామన్ (చింతామణి రామస్వామి అయ్యర్ సుబ్బురామన్ (1921 - 1952) తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలోని చింతామణి అగ్రహారంలో జన్మించారు.  ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాతీరము నుండి వలస వెళ్ళిన తెలుగువారు వారి పూర్వీకులు.  రత్నమాల, లైలామజ్ను, ప్రేమ, స్త్రీ సాహసము, దేవదాసు మొదలైన సుమారు 35 చిత్రాలకు అజరామరమైన సంగీతం అందించారు.

సంసారం, ఇలవేలుపు, సంతానం, అన్నపూర్ణ, భలే బావ, నర్తనశాల మొదలైన చిత్రాలకు సంగీతం వహించిన సుసర్ల దక్షిణామూర్తి (1921 - 2012) కృష్ణాజిల్లా దివి తాలూకాలోని పెద్దకళ్ళేపల్లిలో జన్మించారు.  'భారతరత్న' లతా గారిచేత తొలుత తెలుగులో (సంతానం చిత్రం) పాడించిన ఘనత వీరిదే.

నటులు, గాయకులు, సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు (1921 - 1999) మల్లీశ్వరి, విప్రనారాయణ, మిస్సమ్మ, చెంచులక్ష్మి, చరణదాసి, భార్యాభర్తలు, భక్తజయదేవ, భలేరాముడు మొదలైన శతాధిక తెలుగు చిత్రాలకు సంగీతం వహించి ప్రేక్షకులుని రంజింప చేసారు.  వీరు గానం చేసిన లలిత గీతాలు ఈనాటికీ ప్రజాదరణను పొందుతున్నాయి.  ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి 'కళాప్రపూర్ణ', తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కల్తై మామిణి', ఆంధ్ర ప్రభుత్వం నుంచి 1992లో రఘుపతి వెంకయ్యనాయుడు పురస్కారం అందుకున్నారు.

'సంగీత సామ్రాట్', 'సంగీత సుధాకర' మొదలగు బిరుదులు అందుకున్న ప్రముఖ సంగీత దర్శకులు పెండ్యాల నాగేశ్వరరావు (1917-1984) కృష్ణాజిల్లాలోని ఒణుకూరులో జన్మించారు.

ద్రోహి (1948) చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసి దొంగరాముడు, వాగ్దానం, జగదేకవీరుని కథ, జయభేరి, శ్రీకృష్ణార్జున యుద్ధం మొదలైన చిత్రాలకు సంగీతం వహించి భారతీయ చలనచిత్ర సంగీత ప్రపంచంలో చరిత్రను సృష్టించారు పెండ్యాల.

శతాధిక చిత్రాలకు సంగీతం, వందలాది ప్రైవేట్ గీతాలను స్వరపరచి గానం చేసిన, కొన్నివేల సినిమా పాటలు పాడిన ఏకైక కళాకారుడు ఘంటసాల. కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకాలోని చౌటపల్లి గ్రామంలో **4-12-1922**న జన్మించారు. పామరులకు కూడా 'భగవద్గీత' అంటే ఏమిటో తన గానం ద్వారా తెలియపరచి **11-2-1974** స్వర్గస్థులైనారు ఘంటసాల. **1970**లో భారత ప్రభుత్వము 'పద్మశ్రీ' బిరుదునిచ్చి గౌరవించింది.

'దొంగలున్నారు జాగ్రత్త' **(1958)** చిత్రం ద్వారా తెలుగు సినీరంగ ప్రవేశం చేసిన కె.వి. మహదేవన్ **(**కృష్ణ కోయిల్ వెంకటాచలం మహదేవన్ **: 1918 - 2001)** మంచి మనసులు, మూగమనసులు, తేనెమనసులు, దాగుడు మూతలు, అదృష్ట వంతులు, ప్రేమనగర్, దసరా బుల్లోడు మొ. రెండు వందల పై తెలుగు చిత్రాలకు సంగీతం వహించారు. కేరళలోని కృష్ణకోయిల్ గ్రామంలో జన్మించారు.

నంది అవార్డులు, జాతీయ అవార్డులు, కలైమామణి, మెల్లిసై చక్రవర్తి మొదలైన బిరుదులు పొందారు మహదేవన్.

రోజులు మారాయి, మాంగల్య బలం, మురళీకృష్ణ, పెళ్ళికాని పిల్లలు, వింత కాపురం, ప్రేమించి చూడు మొదలైన సుమారు **40** చిత్రాలకు సంగీతం వహించారు మాస్టర్ వేణు (మద్దూరి వేణుగోపాల్ **: 1916 - 1981).**

ఇల్లరికం, మా బాబు, పునర్జన్మ, లక్షాధికారి, గూఢచారి **116** మొదలైన **60** పై చిలకు చిత్రాలకు అజరామరమైన పాటలు స్వరపరచిన తాతినేని చలపతిరావు **(1920-1994)** కృష్ణాజిల్లా ఉయ్యూరు దగ్గరలో ఉన్న నందమూరు గ్రామంలో జన్మించారు.

**1961**లో 'కన్నకొడుకు' చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన యస్.పి. కోదండపాణి **(1932 - 1974)** దేవత, పదండి ముందుకు, బంగారు తిమ్మరాజు, శ్రీరామ కథ, లక్ష్మీ కటాక్షం మొదలైన చిత్రాలకు సంగీతం అందించారు. గుంటూరు జన్మస్థలం. గంధర్వ గాయకుడు యస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు "శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న" చిత్రంలో తొలిసారిగా పాడే అవకాశం ఇచ్చారు.

పెళ్ళి తాంబూలం, ఆడ బ్రతుకు, మనసే మందిరం, లేత మనసులు, సిపాయి చిన్నయ్య, ప్రేమలు పెళ్ళిళ్ళు మొ. సుమారు 40 తెలుగు చిత్రాలకు స్వతంత్రముగా గాని లేదా టి. రామ్మూర్తితో జంటగా గాని సంగీతం వహించారు యమ్.యస్. విశ్వనాథం. వీరు కలైమామిణి, గౌరవ డాక్టరేట్స్ అందుకున్నారు.

జయసింహ, రాజనందిని, మంగమ్మ శపథం, పిడుగు రాముడు, భామా విజయం, దేవకన్య, శ్రీ కృష్ణావతారం, చిక్కడు దొరకడు, గండికోట రహస్యం మొ. సుమారు 60 తెలుగు చిత్రాలకు సంగీతం వహించి అజరామరమైన స్వరాలను అందించారు టి.వి. రాజు (తోటకూర వెంకట రాజు :1918-1973). వీరు 'పాండురంగ మహాత్మ్యం' చిత్రంలో స్వరపరచిన పాటలు సంగీత చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందాయి.

పక్కింటి అమ్మాయి, ఉమాసుందరి, రేచుక్క, దేవాంతకుడు, అన్నాతమ్ముడు, కలిమిలేములు, మానవుడు దానవుడు మొదలైన సుమారు 30 చిత్రాలకు సంగీతం వహించిన అశ్వత్థామ (1927 - 1975) స్వస్థలం నరసాపురం. 'అన్నాతమ్ముడు' చిత్రంలో జిక్కి చేత పాడించిన 'మ్రోగింపవే మధురవీణ' పాట స్వర్ణయుగంలో వచ్చిన పాటలలో ఒక గొప్పపాట. వీరి కుమార్తె వైణిక విద్వాంసురాలు గాయత్రి.

1963లో విడుదల అయిన 'సవతి కొడుకు' చిత్రం ద్వారా తెలుగు సినీరంగంలో ప్రవేశించిన సత్యం (చెళ్ళపిళ్ళ సత్యనారాయణ శాస్త్రి : 1933 - 1989) పాలమనసులు, సర్కార్ ఎక్స్‌ప్రెస్, బుల్లెమ్మ బుల్లోడు, కన్నెవయసు, వాడే వీడు మొ. 200 పై తెలుగు చిత్రాలకు సంగీతం వహించారు. మెలోడీకి మారుపేరైన సత్యం విజయనగరం జిల్లాలోని పార్వతీపురం దగ్గరున్న గుణానుపురంలో జన్మించారు.

'స్వర్గసీమ' (1945) చిత్రంలో ఘంటసాలను గాయకునిగా పరిచయము చేసిన చిత్తూరు నాగయ్య (1904 - 1973) గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. వందేమాతరం, సుమంగళి, దేవత, భక్తపోతన, త్యాగయ్య, యోగి వేమన మొదలైన చిత్రాలకు సంగీతం వహించారు. నటులు, గాయకులు, నిర్మాత అయిన నాగయ్య తెలుగు సినీ సంగీతానికి తమ వంతు సేవలు అందించారు.

**సంగీతానికి సేవచేసినవారిలో మరి కొందరు** : ప్రసాదరావు (పెండ్లి పిలుపు), యం.ఎస్. రాజు (దొంగల్లో దొర), నిత్యానంద్ (శ్రీమతి), సి. మోహన్‌దాస్

(తోబుట్టువులు), పామర్తి (బభ్రువాహన), పూర్ణచంద్రరావు (బంగారు సంకెళ్ళు), యం.బి. శ్రీనివాసన్ (వివాహబంధం), యం. సుబ్బయ్యనాయుడు (విమల), యం.ఎస్. ప్రకాశ్ (ఇంటిగుట్టు), శ్రీరామ్ (పెళ్ళిరోజు), ఎ.ఎ. రాజ్ (కథానాయకురాలు), సి.ఎన్. పాండురంగం (కోడరికం), జోసెఫ్, కృష్ణమూర్తి (గులేబకావళి కథ), జి. రామనాథన్ (వరుడు కావాలి), ఎస్.వి. వెంకట రామన్ (నవజీవనం), దండాయుధ పిళ్ళై, ఎం.ఎస్.జి. మణి (ప్రపంచం), కుమార్ (సంబరాల రాంబాబు), సుదర్శన్ - గోవర్థన్ (భూకైలాస్), రాజన్ - నాగేంద్ర (అగ్గిపిడుగు), జి.కె. వెంకటేశ్ (శ్రీదేవి), జె.వి. రాఘవులు (జీవనతరంగాలు), బి. గోపాలం (నల దమయంతి), గాలిపెంచల (సీతారామ కళ్యాణం), సాలూరు హనుమంతరావు (ఉషా పరిణయం), బాలాంత్రపు రజనీ కాంతరావు (మానవతి) ఏ.యం. రాజా (పెళ్ళి కానుక), భానుమతి (చక్రపాణి), రమేష్‌నాయుడు (దేవుడు చేసిన మనుషులు), టి.జి. లింగప్ప (గాలిమేడలు) మొ. వారు ఎందరెందరో ఉన్నారు.

## సింగింగ్ స్టార్స్

నటీనటులుగా వుంటూ వారికి వారే పాడుకున్న వారిని సింగింగ్ స్టార్స్ అంటారు.

టాకీ సినిమాలు వచ్చిన ప్రారంభంలో పాడగలిగి నటించగలిగే వారినే సినిమాలకు ఎన్నుకునేవారు. అందువలన రంగస్థల నటీనటులు ఎక్కువగా నటించేవారు.

కన్నాంబ, ఋష్యేంద్రమణి, టంగుటూరి సూర్యకుమారి, సి. కృష్ణవేణి, జి. వరలక్ష్మి, యస్. వరలక్ష్మి, మాలతి, శాంతకుమారి, జయమ్మ, బెజవాడ రాజరత్నం, రావు బాలసరస్వతీ దేవి, సురభి కమలాబాయి, రామతిలకం, శ్రీరంజని (సీనియర్), సుందరమ్మ, లక్ష్మీబాయి, కనకం, కాంచనమాల, బళ్ళారి లలిత, పుష్పవల్లి, దాసరి కోటిరత్నం, కుమారి, యం.వి. రాజమ్మ మొ.వారు సింగింగ్ స్టార్స్.

చిత్తూరు నాగయ్య, కళ్యాణం రఘురామయ్య, పి. సూరిబాబు, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, బందా కనక లింగేశ్వరరావు, పి. మునుస్వామి, సాలూరు రాజేశ్వరరావు, రెంటచింతల సత్యనారాయణ, పులిపాటి వెంకటేశ్వర్లు, ఆరణి సత్యనారాయణ, మాధవ పెద్ది వెంకట్రామయ్య, ఆకుల నరసింహారావు, తుంగల చలపతిరావు, కపిలవాయి రామనాథ శాస్త్రి, అక్కినేని, రేలంగి వెంకట్రామయ్య, కస్తూరి శివరావు మొదలగు వారందరు సింగింగ్ స్టార్స్.

గ్రామఫోన్ కంపెనీ వారు (HMV) 1977లో కొలంబియా లేబుల్ మీద "Singing Stars of Forties" అనే శీర్షికన ఒక 'లాంగ్‌ప్లే' గ్రామఫోన్ రికార్డు (33 SEX 11517) ను విడుదల చేసారు. అందులో జి. వరలక్ష్మి, లక్ష్మీబాయి, మాలతి, భానుమతి, బెజవాడ రాజరత్నం, పి. సూరిబాబు, ఋష్యేంద్రమణి, టంగుటూరి సూర్యకుమారి, శాంతకుమారి, కస్తూరి శివరావు, నాగయ్య, కృష్ణవేణి, రఘురామయ్య, బి. జయమ్మ, అక్కినేని, యస్. వరలక్ష్మి, రావు బాలసరస్వతి పాడిన 16 పాటలున్నాయి.

## గాయక సంగీత దర్శకులు

సంగీత దర్శకులలో కొందరు గానం చేయగా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయినవారు :

టి.వి. రాజు (పల్లెటూరి పిల్ల), సాలూరు రాజేశ్వరరావు (కాలం మారింది), సి.ఆర్. సుబ్బురామన్ (పెళ్ళికూతురు), జి.కె. వెంకటేశ్ (శ్రీదేవి), సుసర్ల దక్షిణామూర్తి (సంసారం), యస్.పి. కోదండపాణి (సంతానం), కె. ప్రసాదరావు (ధర్మదేవత), బి. గోపాలం (బికారి రాముడు), జె.వి. రాఘవులు (పెళ్ళి సందడి), మాస్టర్ వేణు (ఓహో సుందరి, ఆనంద రూపిణి, ప్రైవేట్ రికార్డు), అశ్వత్థామ (దేవత - 1941), బి.ఎన్.ఆర్. (ధర్మదేవత), పామర్తి (పెళ్ళి చేసి చూడు), యల్. మల్లేశ్వరరావు (భక్త అంబరీష), నాగయ్య (భక్త పోతన - 1942), నాగేంద్ర (రాజన్ - నాగేంద్ర, జింబో).

## గాయనీమణులు

నటి, గాయని, రచయిత్రి, దర్శకురాలు, సంగీత దర్శకురాలు, స్టూడియోలకు అధిపతి అయిన భానుమతి (1925-2005) భరణీ సంస్థ పేరున రత్నమాల, లైలామజ్ను, ప్రేమ, చండీరాణి, బాటసారి, గృహలక్ష్మి, చింతామణి మొ. 30 చిత్రాల దాకా నిర్మించి నటించి గానం చేసారు. చక్రపాణి, అంతా మన మంచికే మొ. చిత్రాలకు సంగీతం వహించారు. తాను నటించిన చిత్రాలలోనే గానం చేయటము వలన వివిధ భాషలలో సుమారు 200 పాటలు గానం చేసారు. భారత ప్రభుత్వము 2001లో 'పద్మభూషణ్' పురస్కారం ప్రదానం చేసారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలుకు దగ్గరలో ఉన్న దొడ్డవరం గ్రామం జన్మస్థలము.

నటి, విలక్షణ గాత్రం, నిర్మాత యస్. వరలక్ష్మి (1925-2009) బాలరాజు,

జీవితం, సతీ తులసి, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, టింగ్‌రంగా, మహామంత్రి తిమ్మరుసు మొ. చిత్రాలలో నటించి గానం చేసారు. తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గంపేటలో జన్మించారు.

జన్మతః మలయాళి అయి ఉండి తెలుగుభాషను అద్భుతంగా ఉచ్చరించి భావయుక్తంగా గానం చేయటంలో అసాధారణ ప్రతిభాశాలి పి. లీల **(1933 - 2005)**. పెళ్ళిచేసి చూడు, పాతాళభైరవి, మిస్సమ్మ, లవకుశ, మాయాబజార్, భలేరాముడు, అప్పుచేసి పప్పుకూడు మొదలైన ఎన్నో చిత్రాలలో అజరామరమైన గీతాలను గానం చేసారు. కేరళలోని పాల్ఘాట్‌కు సమీపంలో ఉన్న చిత్తూరులో జన్మించారు. తమిళనాడు ప్రభుత్వంచే "కలైమామిణి" పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వంచే మరణానంతరం 'పద్మభూషణ్' **(2001)** వరించింది.

**1951**లో విడుదల అయిన 'కన్నతల్లి' చిత్రంలో గాయకుడు ఏ.యం. రాజాతో యుగళగీతం గానం చేసి తెలుగు సినీ రంగ ప్రవేశం చేసిన పి. సుశీల కొన్నివేల చిత్రాలలో అనేక భాషలలో కొన్నివేల గీతాలు గానం చేసి తనదైన యుగాన్ని స్థాపించి చరిత్ర సృష్టించిన గాయని. 13-11-1935న విజయనగరంలో జన్మించిన సుశీల గురించి ఒక గ్రంథమే రచించవచ్చు. కలైమామిణి, పద్మభూషణ్ మరెన్నో జాతీయ అవార్డులు పొందారు.

యం.ఎల్.ఏ. చిత్రం ద్వారా ఘంటసాల గారితో 'నీయాస అడియాస' అనే యుగళగీతం గానంచేసి తెలుగు సినీ రంగ ప్రవేశం చేసిన యస్. జానకి **23-4-1938**న రేపల్లె తాలూకాలోని పాలపట్ల గ్రామంలో జన్మించారు. అనేక భాషలలో వేల చిత్రాలలో వేలాది పాటలు గానం చేసారు.

దొంగల్లో దొర, వినాయకచవితి, పరివర్తన, లవకుశ, అన్నాతమ్ముడు, చిరంజీవులు మొదలగు చిత్రాలలో గానం చేసిన కె. రాణి **1943**లో కర్ణాటకలోని తుమ్‌కూర్‌లో జననం. 'దేవదాసు' చిత్రంలో పాడిన 'అంతా భ్రాంతియేనా', 'చెలియ లేదు చెలిమి లేదు' (ఘంటసాలతో) 'జయసింహ' లోని 'కొండ మీద కొక్కిరాయి' మొదలైన పాటలు రాణి గారికి శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టాయి.

1946లో విడుదల అయిన 'త్యాగయ్య' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన ఏ.పి. కోమల 28-8-1935న చెన్నైలో జన్మించారు. బాలసన్యాసమ్మ కథ, బంగారు పంజరం, జయసింహ, పిచ్చిపుల్లయ్య మొ. చిత్రాలలో గానం చేసిన కోమలకు 'సరియా నాతో' (దీపావళి), 'ఓహో ఇదికదా' (ప్రేమ), 'యవ్వన మొకటే' (అల్లాఉద్దీన్ అద్భుత దీపం) మరపురాని మధుర గీతాలుగా నిలిచిపోయాయి.

'తాసీల్దారు' (1944) చిత్రంలో 6వ ఏటనే సినీరంగ ప్రవేశం చేసిన జమునారాణి 17-5-1938న చెన్నైలో జన్మించారు. రత్నమాల, త్యాగయ్య, ద్రోహి, రాముడు - భీముడు, మర్మయోగి, భాగ్యదేవత, ఉషాపరిణయం మొదలైన ఎన్నో చిత్రాలలో గానం చేసిన జమునారాణికి 'మావ మావా' (మంచి మనసులు), "నాగమల్లి కోనలోన" (బంగారు తిమ్మరాజు) పాటలు శాశ్వత కీర్తిని తెచ్చాయి.

బాలనటిగా పంతులమ్మ, వాల్మీకి, త్యాగయ్య మొ. చిత్రాలలో నటించి ఘంటసాల సంగీతంలో 'మనదేశం' చిత్రంలో గానం చేసి సినీ రంగ ప్రవేశం చేసి గాయనిగా స్థిరపడిన జిక్కి (పిళ్ళా గజపతి నాయుడు కృష్ణవేణి : 1935 - 2004) చెన్నైలో జన్మించారు. లైలామజ్ను, దొంగరాముడు, శ్రీకృష్ణమాయ, పెళ్ళికానుక, పెళ్ళి సందడి, శాంతి నివాసం మొదలైన ఎన్నో చిత్రాలలో గానం చేసారు. 'రాజశేఖరా' (అనార్కలి), 'హాయి హాయిగా ఆమని సాగె' (సువర్ణ సుందరి), 'ఛాంగురే బంగారు రాజా' (శ్రీకృష్ణ పాండవీయము) పాటలు సినీ సంగీత చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందాయి.

ప్రముఖ గాయని ఆశాభోస్లే తన కంఠంలో ఎన్ని రకాల విన్యాసాలు పలికించ గలరో అన్ని రకాల విన్యాసాలను పలికించగల గాయని యల్.ఆర్. ఈశ్వరి.

అనుబంధాలు (1963) చిత్రంలో యల్.ఆర్. ఈశ్వరి గానం చేసిన గీతం 'నాపేరు సెలయేరు నన్నాపలేరు' మధురాతి మధురం.

రైతుకుటుంబం, ప్రేమనగర్, అమ్మమాట, కలిసొచ్చిన అదృష్టం, భలేరంగడు, భార్యాబిడ్డలు, సిపాయి చిన్నయ్య, కథానాయిక మొల్ల, కంచుకోట, ఉమ్మడి కుటుంబం, నడమంత్రపు సిరి మొదలైన ఎన్నో చిత్రాలలో లెక్కలేనన్ని గీతాలు గానం చేసారు.

అన్ని వయస్సుల వారిని తన గానంతో హుషారు ఎత్తించగల గాయని యల్.ఆర్. ఈశ్వరి.

స్వర్ణలత, బి. వసంత, ఉడుతా సరోజిని, రావు బాలసరస్వతీ దేవి, వక్కలంక సరళ, బెంగుళూరు లత, రేణుక, శ్రీదేవి, గిడుగు భారతి, సూలమంగళం రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, శ్రీరంగం గోపాలరత్నం, శారద, వైదేహి, షరావతి, పద్మాసిని, గాన సరస్వతి, రమోల మొ. ఎందరో గాయనిలు తమ వంతు సేవలందించారు.

## గాయకులు

మనదేశం, లక్ష్మమ్మ, మొదటిరాత్రి, ద్రోహి, జయసింహ, పల్లెటూరు, పిచ్చి పుల్లయ్య, వినాయక చవితి, సారంగధర, దీక్ష, మానవతి, సీతారామ కల్యాణం మొ. చిత్రాలలో గానం చేసిన యమ్. యస్. రామారావు (మోపర్తి సీతారామారావు 1921 - 1992) గుంటూరు జిల్లా తెనాలి తాలూకా లోని మోపర్రు గ్రామంలో జన్మించారు. 'పల్లెపడుచు' చిత్రానికి సంగీతం వహించారు. 'తాసీల్దార్' (1944) వారు ప్రప్రథమంగా గానం చేసిన చిత్రం.

నూరుకు పైగా చిత్రాలకు సంగీతం వహించి వేలాది సినీ గీతాలను గానం చేసిన ఏకైక కళాకారుడు ఘంటసాల (1922 - 1974). కృష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకా లోని 'చౌటపల్లి' గ్రామం జన్మస్థలం. విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో 6 సంవత్సరాలు శాస్త్రీయ సంగీతం నేర్చుకుని 'స్వర్గసీమ' (1945) చిత్రంలో గాయకునిగా సినీరంగ ప్రవేశం చేసారు. 1970లో 'పద్మశ్రీ' బిరుదు నందుకున్నారు.

51 సంవత్సరాల లోపు వయస్సులో జీవితం ముగించి శ్రోతల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహాగాయకులు ఘంటసాల (51), కుందన్ లాల్ సైగల్ (43), పాప్ సింగర్స్ ఎల్విస్ ప్రీస్లీ (46), మైకేల్ జాక్సన్ (50).

ప్రేమలేఖలు, అమర సందేశం, మిస్సమ్మ, పక్కింటి అమ్మాయి, విప్రనారాయణ, చక్రపాణి, బంగారు పాప, చింతామణి మొ. ఎన్నో చిత్రాలలో అజరామరమైన గీతాలను గానం చేసిన ఏ.యం. రాజా (అమల మన్మథ రాజా : 1929 - 1989) జన్మస్థలం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం. పెళ్ళికానుక, శోభ చిత్రాలకు సంగీతం వహించారు. గాయని జిక్కిని వివాహమాడారు.

జయభేరి, భలేరాముడు, వివాహబంధం, ప్రేమించి చూడు, రక్తసంబంధం, గుడి గంటలు, మనసే మందిరం, ఈడు - జోడు, జల్సారాయుడు ఇలాంటి ఎన్నో చిత్రాలలో గానం చేసిన పి.బి. శ్రీనివాస్ (ప్రతివాది భయంకర శ్రీనివాస్ : 1930-2013) అష్టభాషా కోవిదులు, విలక్షణమైన కంఠం కలవారు. ప్రముఖ హీరోలందరికి గానం చేసారు. కాకినాడ జన్మస్థలం. కన్నడ హీరో రాజకుమార్‌కు చరిత్రలో స్థిర స్థాయిగా నిలిచిన గీతాలను గానం చేసారు శ్రీనివాస్. తమిళనాడు ప్రభుత్వం 'కలైమామిణి', కర్ణాటక ప్రభుత్వము 'కన్నడ రాజోత్సవ' అవార్డులతో సత్కరించారు.

చిన్నతనం నుంచే నాటకాలలో నటిస్తూ 'మంగళసూత్రం' (1946) చిత్రంలో ప్రప్రథమంగా గానం చేసి గాయకునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన పిఠాపురం (పాతర్లగడ్డ నాగేశ్వరరావు : 1930 - 1996) జన్మస్థలం పిఠాపురం. షావుకారు, పెళ్ళిచేసి చూడు, చంద్రహారం, మాయాబజార్, జయం మనదే, లవకుశ, ప్రేమ, కులగోత్రాలు మొ. ఎన్నో చిత్రాలలో జనరంజకమైన గీతాలు గానం చేసారు పిఠాపురం.

నటుడు ఎస్.వి. రంగారావు భారీ విగ్రహానికి, కంఠ స్వరానికి సరితూగగల గాంభీర్యమైన కంఠం గల్గిన గాయకుడు మాధవపెద్ది సత్యం (1922 - 2000). లైలా మజ్ను (1949) చిత్రంలో ఘంటసాల, సుసర్ల గారితో 'మనుచు గాతా ఖుదా తోడై' అనే పాట ద్వారా పరిచయమయ్యారు. షావుకారులో ప్రప్రథమంగా ఏకగళ గీతాలు గానం చేసారు. రాముడు-భీముడు, లవకుశ, రహస్యం, ముందడుగు, భార్యాభర్తలు, చెంచులక్ష్మి, నర్తనశాల, కులగోత్రాలు, ఇద్దరు మిత్రులు మొదలైన చిత్రాలలో సుమధుర గీతాలను గానం చేసిన మాధవపెద్ది జన్మస్థలం బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరు. 'వివాహ భోజనంబు' (మాయాబజార్) పాట తెలుగు శబ్దము ఉన్నంత కాలము ఉండే పాట.

కొన్ని వేల చిత్రాలలో వేలాదిగా పాటలు గానం చేసి చరిత్రను సృష్టించిన గాయకుడు యస్.పి. బాలసుబ్రహ్మణ్యం నాటి ఆంధ్రలోని కోనేటం పేటలో జన్మించారు. (ప్రస్తుతం తమిళాడులో ఉన్నది) 4-6-1946న జన్మించారు. 'శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న' (1967) చిత్రంలో సుశీల, రఘురామయ్య, పి.బి. శ్రీనివాస్‌లతో 'ఏమిటి ఈ వింత మోహము' పాటతో తెలుగు సినీ రంగ ప్రవేశం చేసారు. 'శంకరా భరణం' చిత్రంలోని పాటలు బాలుగారికి శాశ్వత కీర్తిని అందించాయి.

టి.ఆర్. జయదేవ్, కె.బి.కె. మోహనరాజు, చిత్తరంజన్, జేసుదాసు, వి. రామకృష్ణ మొదలగువారు కూడా తెలుగు సినీ సంగీతానికి తమవంతు సేవల నందించారు.

## వాద్య కళాకారులు

పాట రక్తి కట్టటానికి గాయనీ గాయకులతో బాటుగా పాటలను జనరంజకము చేయటానికి తమవంతు సేవలను అందించినవారు వాద్య కళాకారులు. వాద్య కళాకారులు వారి వారి వాయిద్యాలను అద్భుతరీతిలో వాయించి పాటకు ప్రాణం పోశారంటే అతిశయోక్తి కాదనుకుంటాను. అట్టివారిలో కొందరు :

నంజప్ప, గుణశేఖర్, రాజేందర్, జడ్సన్, లక్ష్మణరావు, సంగీతరావు, కణ్ణ, రామచంద్రరావు, యం.యస్. రాజు, వై.యన్. శర్మ, హరి అచ్యుత రామశాస్త్రి, ప్రసాద్, సుభానీ, సుబ్రహ్మణ్యం, హనుమంతాచారి, వెంకటేశ్, సత్యం, జావేద్, చార్లి, బాబీ, ఫ్రాన్సిస్, గేబ్రియల్, శరత్‌శ్చంద్ర కుమార్ మొ. వారు.

## సౌండ్ ఇంజనీర్స్

ఎటువంటి సౌకర్యాలు రికార్డింగ్‌లో లేని రోజులలో ఎందరో సౌండ్ ఇంజనీర్స్ చిత్రాలలోని మాటలను, పాటలను, నేపథ్య వాద్య సంగీతాన్ని అద్భుతంగా రికార్డింగ్ చేసారు. ఆనాటి స్వర్ణయుగంలోని సినిమాలలోని పాటలు విన్నా, నేపథ్య వాద్య సంగీతము విన్నా ఒళ్ళు పులకరిస్తుంది. ఒక్క చిత్రాలలోనే కాదు గ్రామఫోన్ కంపెనీల స్టూడియోలలో కూడా సంగీతాన్ని రికార్డింగ్ చేయటంలో ఎంతో ప్రతిభను కనపరచిన వారెందరో ఉన్నారు. అట్టి వారిలో కొందరు :

ఏ.ఆర్. స్వామినాథన్, ఏ.కె. కృష్ణన్, పి.వి. కోటేశ్వరరావు, ఏజెల్ జీవరత్నం, పి.వి. కృష్ణారెడ్డి, పి. రంగారావు, శేఖర్, శ్యామ్‌సుందర్, ఏ. సూర్యనారాయణ, రంగస్వామి, పి. కృష్ణంరాజు, డి. కోటేశ్వరరావు, కె. విశ్వనాథ్, వి.బి.సి. మీనన్, యస్.పి. రామనాధన్, జీవా, పళని బాబు, దొరస్వామి, టి.ఎ. జగన్నాథ్, డబ్ల్యు. ఇ. నరసింహ మూర్తి, రామచంద్రరావు, టి.యన్. రంగస్వామి, నాగేశ్వరన్, వి. రంగాచారి మొ. వారు తమ వంతు సేవలను అందించారు.

# తమిళ సినిమా సంగీతము

ఆనాడు మదరాసు (చెన్నై) దక్షిణ భారతదేశ భాషల చిత్ర నిర్మాణానికి కేంద్రము. ఎన్నో గొప్ప చిత్రాలు ఎక్కువ భాగం మదరాసులోనే నిర్మించబడ్డాయి.

**నిర్మాణ సంస్థలు** : సాగర్ ఫిలిమ్స్, ఈస్ట్ ఇండియా ఫిలిం కంపెని, న్యూ థియేటర్స్, ఇంపీరియల్ ఫిలిం కంపెని, రాయల్ టాకీస్, వేల్ పిక్చర్స్, కోయంబత్తూర్ టాకీస్, పక్షిరాజా ఫిలిమ్స్, ఏ.వి.యం. ప్రొడక్షన్స్, జెమిని స్టూడియోస్, సెంట్రల్ స్టూడియోస్, జుపిటర్ పిక్చర్స్, భరణి పిక్చర్స్, విజయ పిక్చర్స్, అన్నపూర్ణ పిక్చర్స్, వీనస్ ఫిలిమ్స్, కెంప్ రాజ్ ప్రొడక్షన్స్, నరసు స్టూడియోస్, రోహిణి పిక్చర్స్, దేవర్ ఫిలిమ్స్, మినర్వ పిక్చర్స్, శరవణ ఫిలిమ్స్ మొ. ఎన్నో సంస్థలు చిత్రాలు నిర్మించి చిత్ర సంగీతాభివృద్ధికి తోడ్పడ్డారు.

**రచయితలు** : గొప్ప గొప్ప రచయితలు తమిళ చిత్రాలలో గీతాలు రచించారు. వారిలో కొందరు : టి.ఎన్. రామయ్యదాస్, యు. నారాయణ కవి, మరుద కాశి, పాపనాశం శివమ్, కంబదాసన్, విధాన్, పంచు అరుణాచలమ్, జయకాంతన్, అవినాష్‌మణి, వాలి, కణ్ణదాసన్, అలంగూడి సాయి మొ.వారు. వాలి, కణ్ణదాసన్ పోటీపడి రాసేవారట. వాలిపేరు టి.ఎస్. రంగరాజన్. వీరు రచించినన్ని చిత్రగీతాలు దక్షిణ భారతదేశంలో ఎవరూ రచించలేదని అంటారు.

**సంగీత దర్శకులు** : జి. రామనాధన్, రాజా చంద్రశేఖర్, జనార్దన్, పాపనాశం శివమ్, ఎ.ఎన్. కళ్యాణ సుందరం, సి.యన్. జయరామన్, జి. గోవింద రాజులు నాయుడు, టిమిర్‌బరన్, ఎస్.వి. వెంకట్రామన్, ఎస్.యం. సుబ్బయ్య నాయుడు, యం.ఎస్. జ్ఞానమణి, ఎస్. బాలచందర్, సి.ఆర్. సుబ్బురామన్, సి.ఎన్. పాండురంగన్, టి.ఆర్. పాప, ఘంటసాల, యం.ఎస్. విశ్వనాధం, రామ్మూర్తి, కె.వి. మహదేవన్, సుసర్ల, ఆర్. సుదర్శన్, ఆర్. గోవర్ధన్, ఆర్. దేవరాజన్, వేదా, యమ్.బి. శ్రీనివాసన్, జి. దేవరాజన్, ఆదినారాయణ రావు, పెండ్యాల, టి.జి. లింగప్ప మొ.వారు అద్భుత గీతాలను స్వరపరచారు.

**గాయనీ గాయకులు** : త్యాగరాజ భాగవతార్, శీర్కాజి గోవింద రాజన్, టి.యం. సౌందర్య రాజన్, ఘంటసాల, తిరుచ్చి లోకనాథన్, ఏ.యం. రాజా, పి.బి. శ్రీనివాస్,

యస్.సి. కృష్ణన్, జి. కస్తూరి, జిక్కి, లీల, సుశీల, జానకి, వసంత, రేణుక, ఎస్. జానకి, రాజేశ్వరి, ఎల్.ఆర్. ఈశ్వరి, ఏ.పి. కోమల మొ.వారు తమిళ సినీ సంగీత ప్రపంచానికి సేవలందించారు.

## కన్నడ చిత్ర సంగీతము

గుబ్బి కర్ణాటక ఫిలిమ్స్, శకుంతల ఫిలిమ్స్, ఆర్.ఎన్.ఆర్. పిక్చర్స్, పద్మిని పిక్చర్స్, విఠల్ ప్రొడక్షన్స్, విక్రమ్ ప్రొడక్షన్స్, రాఘవేంద్ర పిక్చర్స్, బి. ఆర్. పంతులు ప్రొడక్షన్స్, రోహిణి ఫిలిమ్స్, కెంప్‌రాజ్ ప్రొడక్షన్స్, విజయ ప్రొడక్షన్స్, ఏ.వియం. ప్రొడక్షన్స్, సురభి పిక్చర్స్, మోడరన్ థియేటర్స్ మొదలైన ఎన్నో సంస్థలు మంచి చిత్రాలు నిర్మించాయి.

కె.ఆర్. సీతారామ శాస్త్రి, హున్సూరు కృష్ణమూర్తి, కనగాల్ ప్రభాకర శాస్త్రి, గీతప్రియ, విజయ నరసింహ, యస్. అశ్వత్, ఉదయకుమార్ మొదలైన అనేక రచయితలు అద్భుతమైన గీతాలు రచించారు.

ఆర్. నాగేంద్రరావు, వెంకట రామయ్య (పాపన్న), హార్మోనియం శేషగిరిరావు, మాధవరావు, హెచ్. ఆర్. పద్మనాభ శాస్త్రి, టి. చౌడయ్య, ఆర్. గోవర్ధన్, ఆర్ సుదర్శన్, నాగయ్య, పి. శాయణ్ణ, కళింగరావు, యం. రంగారావు, హొన్నప్ప భాగవతార్, యం. వెంకటరాజు, విజయ భాస్కర్, రాజన్ - నాగేంద్ర, టి.జి. లింగప్ప, జి.కె. వెంకటేశ్, ఘంటసాల, సత్యం, పురుషోత్తం, బి. గోపాలం, శ్రీనివాస అయ్యంగార్ లాంటి అనేక ప్రతిభాశాలురు అయిన సంగీత దర్శకులు కన్నడ చిత్ర రంగానికి మరువలేని సేవలు చేసారు.

ఏ.యం. రాజా, పి.బి. శ్రీనివాస్, షిమోగా సుబ్బణ్ణ, సి. అశ్వత్, రాజా అనంత స్వామి, జిక్కి, లీల, సుశీల, జానకి, ఎల్.ఆర్. ఈశ్వరి, ఘంటసాల, యస్.పి. బాల సుబ్రహ్మణ్యం మొదలైన గాయనీ గాయకులు కన్నడ చిత్రరంగానికి సంగీత సేవలు అందించారు.

## మలయాళ చిత్ర సంగీతం

యం.ఎస్. ప్రొడక్షన్స్, సుప్రియ ప్రొడక్షన్స్, ప్రతాప్ చిత్రాన్, శ్రీ రాజేష్ ఫిల్మ్స్ మరియు టి.ఎ. చంద్రన్, మధు, యాంటోని తెక్కర్, దిలీప్, రాజీవ్ అంచల్, రాజీవ్

నాయర్, సుకుమారన్, టి.ఆర్. సుందరమ్, సిద్ధిఖి మొదలైనవారు ఎందరో మంచి చిత్రాలను నిర్మించారు.

పి. భాస్కరన్, రఫీక్ అహమ్మద్, నంబూద్రి, తిరునలూర్ కరుణాకరన్, యం.డి. రాజేంద్రన్, వాయలార్ రామవర్మ, శ్రీకుమారన్ తంపి, సుకుమారన్, ఓ.యన్. వి. కురుప్ మొదలైన రచయితలు మధురమైన గీతాలను రచించారు.

వి. దక్షిణామూర్తి, జి. దేవరాజన్, ఏ.యం. రాజా, యం.బి. శ్రీనివాసన్, ఆర్.కె. శేఖర్, రవీంద్రన్, బాబూరావు, విజయభాస్కర్, యం.ఎస్. విశ్వనాథం, సలీల్ చౌదరి, యం.జి. సుకుమార్, జయచంద్రన్ మొదలగు సంగీత దర్శకులు మలయాళ సంగీత ప్రపంచానికి తమవంతు సేవల నందించారు.

యేసుదాసు, పి. లీల, బి. వసంత, పి.బి. శ్రీనివాస్, పి. సుశీల, మన్నాడే, ఏ.పి. కోమల, జయచంద్రన్, అరుంధతి, మధు బాలకృష్ణన్, మెహబూబ్, సురేష్ పీటర్, ఆనంద నారయణ్, చిత్ర, రాహుల్ నంబియార్, సచిన్ వారియర్, కాజికుడ్ అబ్దుల్ కర్దార్, ఏ.యం. రాజా, సంతోష్ పండిత్, కె.పి. ఉదయభాను, శాంతా పి. నాయర్, రేణుక మొదలైన గాయనీ గాయకులు మలయాళ సంగీత ప్రపంచానికి తమ వంతు సహకారం అందించారు.

## హిందీ సినీ సంగీత వైభవం - గ్రామఫోన్ రికార్డులు

మన జాతీయ భాష హింది. మాతృభాషతో బాటుగ శ్రోతలు ఎక్కువగా ఇష్టపడేది హిందీ సినీగీతాలు.

**నిర్మాతలు** : స్వర్ణయుగంలో ఎందరో నిర్మాతలు సంస్థలు స్థాపించి అద్భుతమైన చిత్రాలతో బాటుగా మధురమైన సంగీతానికి ప్రాముఖ్యత నిచ్చారు. అట్టి సంస్థలలో కొన్ని :

కర్దార్ ఫిలిమ్స్, మొహబూబ్ ప్రొడక్షన్స్, శాంతారామ్ ప్రొడక్షన్స్, బిమల్‌రాయ్ ప్రొడక్షన్స్, ఏ.వియం. ప్రొడక్షన్స్, జెమిని పిక్చర్స్, ముఖర్జి ఫిలిమ్స్, ఫిల్మ్ ఆర్ట్స్, మార్స్ అండ్ మూవీస్, శ్రీ పిక్చర్స్, కల్పన పిక్చర్స్, గీతాంజలి పిక్చర్స్, ఫిల్మిస్థాన్ ప్రైవేట్ లిమిటెడ్, మహల్ పిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్, నవకేతన్ ఫిలిమ్స్, ఆర్.కె. ఫిలిమ్స్, బి.ఆర్.

చోప్రా ఫిలిమ్స్, ప్రసాద్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, వీనస్ పిక్చర్స్, రాజ్‌కోస్లా ఫిలిమ్స్, రూపమ్ చిత్ర, రాహుల్ థియేటర్స్, సుబోధ్ ముఖర్జి ఫిలిమ్స్, కాశ్యప్ ప్రొడక్షన్స్, సన్ని ఆర్ట్ ప్రొడక్షన్స్ లిమిటెడ్ మొదలగునవి.

**రచయితలు** : హిందీ చిత్రాలలో ఎందరో రచయితలు అద్భుతమయిన గీతాలు రచించారు. వారిలో కొందరు :

గుజరాత్ జిల్లాలోని జలాల్‌పూర్ జట్టాన్‌లో జన్మించిన రాజేందర్ కిషన్ (1919-1988) ఆనాటి రచయితలలో అత్యంత ధనవంతుడు. దీనికి ముఖ్యకారణం గుఱ్ఱపు పందాల 'జాక్‌పాట్'లో 48 లక్షలు గెలుపొందటము.

నాగిన్, అనార్కలి, ప్యార్‌కియాజా, ఛాయా, మన్‌మౌజి, నజ్రానా, దేఖ్‌కభీరా రోయా, షరాభి, బరోసా, అల్‌బేలా మొదలైన ఎన్నో చిత్రాలలో శాశ్వతంగా నిలిచిపోయే గీతాలు రచించారు. మహాత్మాగాంధీ మరణించినపుడు రాజేందర్ కిషన్ రచించిన గీతం "సునో సునో దునియా వాలా బాపూజీకి అమర్ కహాని'' హుస్నలాల్ - భగత్ రామ్ సంగీతం వహించగా మహమ్మద్ రఫీ గానం చేసిన ప్రైవేట్ గీతం సూపర్‌హిట్ అయింది.

రచయితలలో ప్రప్రథమంగా దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు (1993)ను అందుకున్న రచయిత మజ్రూ సుల్తాన్‌పురి (1919-2000). తుమ్‌సా నహిదేఖా, దిల్ దెకె దేఖో, యాదోంకి బారాత్, అందాజ్ (1949), కారవాన్, బహారోంకె సప్నే, తీస్రిమంజిల్ మొదలగు అనేక చిత్రాలకు పాటలు రచించారు. గజల్స్ వ్రాయటంలో ప్రసిద్ధులు. ఉత్తరప్రదేశ్‌లోని అజాంఘర్ జిల్లాలోని నిజామాబాద్‌లో జన్మించారు.

నౌజవాన్, బాజి, దూల్‌కా ఫూల్, గుమ్రా, బర్సాత్ కీ రాత్, కాజల్, హమ్‌దోనొ, తాజ్‌మహల్ లాంటి అనేక చిత్రాలలో సుమధుర గీతాలను రచించారు సాహిర్ లుథియాన్‌వి (1921 - 1980). ప్రేమ ఫలించక బ్రహ్మచారిగానే తనువు చాలించిన సాహిర్ పంజాబ్‌లోని లూథియానాలో జన్మించారు.

బైజు బావరా, మదర్ ఇండియా, ఘరానా, దులారి, సాహెబ్ బీబీ ఔర్ గులామ్, మొగల్ ఎ అజామ్, గంగా జమునా, మెరె మెహబూబ్ లాంటి అనేక సంగీత ప్రధాన చిత్రాలకు బహుళ ప్రజాదరణను పొందిన గీతాలను రచించిన షకీల్ బడయూని

(1916-1970) ఉత్తరప్రదేశ్‌లోని బడయాన్‌లో జన్మించారు. సంగీత దర్శకులు నౌషద్ - షకీల్ బడయూనిలది గొప్ప కాంబినేషన్.

షోలె, జీనేకి రాహ్, జబ్ జబ్ ఫూల్‌కిలె, దిల్‌వాలె దుల్హానియ లేజాయెంగె, నగీనా, బాబి, ధరమ్‌వీర్, సీతా ఔర్ గీతా మొ. విజయవంతమైన చిత్రాలకు గీతాలు రచించిన ఆనంద బక్షి (1930 - 2002) కాశ్మీర పండిత కుటుంబానికి చెందినవారు. ఆనాడు రావల్పిండి (ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది)లో జన్మించారు.

శైలేంద్రగా పిలువబడే శంకరదాస్ కేసరిలాల్ (1923 - 1966) రావల్పిండిలో జన్మించారు. 'బర్సాత్' చిత్రము ద్వారా చిత్ర ప్రవేశము చేసి ఆవారా, ఆహ్, శ్రీ 420, చోరిచోరి, సంగమ్, మధుమతి, యాహుది, బ్రహ్మచారి మొ. చిత్రాలకు రచనలు చేసారు. 'తీస్రికసమ్' చిత్రం నిర్మించి ఆర్థికంగా నష్టపోయి 43 సంవత్సరాల వయస్సులోనే మరణించడం దురదృష్టం.

రచయితే కాక, నిర్మాత దర్శకులు 1936లో విడుదల అయిన 'దేవదాస్' చిత్రానికి పాటలు మాటలు రచించిన కేదారినాథ్ శర్మ (1910-1999) నీల్‌కమల్, కాజల్, ఫరియాద్, చిత్రలేఖ మొదలైన అనేక చిత్రాలకు రచనలు చేశారు. అనేక చిత్రాలకు దర్శకత్వం వహించారు.

'బర్సాత్' చిత్రం ద్వారానే సినీరంగ ప్రవేశం చేసిన హస్రత్ జైపురి (ఇక్బల్ హుస్సేన్ : 1922 - 1999) ససురాల్, జంగ్లి, సంగం, లవ్ ఇన్ టోక్యో, ఆవారా, శ్రీ 420, సూరజ్, అందాజ్ (1971), గీత్‌గయా పతరోంనె, ప్రిన్స్ మొదలైన చిత్రాలకు అద్భుత గీతాలు రచన చేసారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జన్మించారు.

మల్హార్, ఉపకార్, పూరబ్ ఔర్ పశ్చిమ్, సరస్వతిచంద్ర, జాని మెరానామ్, సఫర్, డాన్ మొదలైన కొన్ని వందల చిత్రాలలో అనేక గీతాలు రచించి పేరు గాంచిన రచయిత శ్యామలా బాహురాయ్. కలంపేరు ఇందీవర్ (1924 - 1997) ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాకు చెందిన 'ధామ్నా' గ్రామంలో జన్మించారు.

పాటలను రచించటములో ఒక క్రొత్త వరవడిని సృష్టించిన కవి కైఫి ఆజ్మి (1919 - 2002). ఉత్తరప్రదేశ్‌లోని అజామ్ ఘర్ జన్మస్థలము. ఫకీజా, రజియా

సుల్తానా, హకీకత్, కొహ్రా, అనుపమ, పర్వానా, బవార్చి, కాగజ్ కె ఫూల్ మొ. చిత్రాలకు అద్భుత రచనలు చేసారు. ప్రముఖనటి, సంఘ సేవకురాలు షబానా అజ్మికి తండ్రిగారు.

ఫాగున్, షబ్నమ్, హౌరా బ్రిడ్జి, రాగిణి, ఉపకార్, మేరా నామ్ జోకర్, వారిస్, కల్పన, బసంత్, ప్యాసె పంచి, మిట్టి మెసోనా, దో ఉస్తాద్ మొదలగు అనేక చిత్రాలకు రచన చేసినది కమర్ జలాలాబాద్ (1919 - 2003). అసలు పేరు ఓంప్రకాశ్ భండారి. అమృత్‌సర్ సమీపంలోని 'జలాలాబాది' జన్మస్థలం.

1943లో విడుదల అయి సంచలనాన్ని సృష్టించిన చిత్రం 'కిస్మత్'కు పాటలు రచించినది కవి ప్రదీప్‌గా పిలువబడిన రామచంద్ర నారాయణ్‌జీ ద్వివేది. ఈయన గాయకుడు కూడా. 'నాస్తిక్' చిత్రంలో వీరు రచించి గానం చేసిన పాట 'దేఖ్ తేరే సంసారికి హాలత్' సూపర్‌హిట్ అయింది. మషాల్, పైగామ్, జై సంతోషిమా, సంబంధ్, జిందగి ఔర్ క్వాబ్ మొ. అనేక చిత్రాలకు గీతాలు రచించారు.

ప్రదీప్ రచించగా యావత్ భారతదేశాన్ని కదలించిన పాట 'ఆయే మేరా వతన్ కె లోగే', సి. రామచంద్ర దర్శకత్వంలో లతా మంగేష్కర్ గానం చేయగా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయింది. భారత ప్రభుత్వం 'దాదా సాహెబ్ ఫాల్కె' (1997) అవార్డుతో గౌరవించింది. 1998లో స్వర్గస్థులైనారు.

కవి, సంగీత దర్శకులు అయిన ప్రేమ్‌ధవాన్ బూట్ పాలిష్, హమ్ హిందుస్థాని, జీత్, చిరాగ్ కహా రోషన్ కహా, బరాదారి, జబక్, వారెంట్, గెస్టుహౌస్, అమన్, దస్‌లాక్, ఏక్ ఫూల్ దోమాలి మొ. అనేక చిత్రాలకు గీతాలు రచించారు.

ఎస్.హెచ్. బిహారి, పి.ఎల్. సంతోషి, డి.ఎన్. మధోక్, మధుకర్ రాజస్థాని, తన్వర్‌నఖ్వి, రాజమెహాది ఆలీఖాన్, వర్మామాలిక్, యం.జి. హస్మత్, భరత్‌వ్యాస్, హసన్ కమల్, అజీజ్ కాశ్మీరి, కేదార్ శర్మ మొదలైన రచయితలు ఎందరో హిందీ సినీ సంగీతానికి తమ వంతు సేవలు అందించారు.

## సంగీత దర్శకులు

భారతీయ చలన చిత్ర సీమలో ప్రప్రథమంగా నేపథ్య గానాన్ని ప్రవేశ పెట్టిన సంగీత దర్శకులు రామ్‌చంద్ బొరాల్ (ఆర్.సి. బొరాల్ : 1903 - 1981) జన్మస్థలం కలకత్తా.

హిందీ, బెంగాలి చిత్రాలకు సంగీతం వహించిన బొరాల్‌ను 1978లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో భారత ప్రభుత్వము సత్కరించింది.

సంగీత దర్శకుడు, నటుడు, గాయకుడు పంకజ్ మల్లిక్ (పంకజ్ కుమార్ మల్లిక్ : 1905-1978) తొలితరం కళాకారుడు. డా. విద్య, కపాలకుండలి, నర్తకి మొ. హిందీ చిత్రాలకు, కొన్ని బెంగాలీ చిత్రాలకు సంగీతం అందించారు. 1972లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. కలకత్తా జన్మస్థలము. 1962లో గ్రామఫోన్ కంపెనీ వారు "The Hits of Punkaj Mullick" అనే టైటిల్‌తో ఓడియన్ లేబుల్ మీద ఒక లాంగ్‌ప్లే రికార్డు విడుదల చేసారు. అందులో కొన్ని ప్రైవేట్ గీతాలు కూడా ఉండటం విశేషం.

1949లో విడుదల అయి సంచలనాన్ని సృష్టించిన 'మహల్' చిత్రానికి సంగీతం వహించినది ఖేమ్‌చంద్ ప్రకాశ్ (1907 - 1950). లతా గానం చేసిన 'ఆయెగా ఆనేవాలా' పాట సూపర్ హిట్. లతాజీకి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన పాట. మేరి ఆంఖెన్, జడ్జి, గౌరి, చిరాగ్, ఫరియాద్ మొదలైన చిత్రాలకు సంగీతం వహించిన ప్రకాశ్ చిన్న వయస్సులో (43) మరణించారు.

1943లో విడుదల అయి చరిత్ర సృష్టించిన 'కిస్మత్' చిత్రానికి సంగీతం వహించిన అనీల్ బిస్వాస్ (1914 - 2003) మిలన్ (1947), ఆర్జూ (1949), వతన్, ఔరత్, పెహలి నజర్ మొదలైన 40 చిత్రాలకు సంగీతం వహించారు.

పూర్తి స్వేచ్ఛ నిచ్చిన నిర్మాతలకే సంగీతం వహించి, 'దేశి' సంగీతాన్ని ప్రప్రథమంగా సినిమాలలో ప్రవేశపెట్టి, సంగీత దర్శకులకు మార్గదర్శి అయిన నౌషద్ ఆలి (1919 - 2006) లక్నోలో జన్మించారు. అనుమోల్ ఘడి, షాజహాన్, మేలా, అందాజ్ (1949), బైజు బావరా, మదర్ ఇండియా, దులారి, ఉరన్ కఠోలా, లీడర్, దిల్లగి, కోహినూర్ వంటి ఎన్నో చిత్రాలలో జనరంజకమైన సంగీతాన్ని అందించిన నౌషాద్‌ను భారత ప్రభుత్వం 'దాదా సాహెబ్ ఫాల్కే' (1981) 'పద్మభూషణ్' (1992) పురస్కారాలతో సత్కరించింది.

అనార్కలి, నవరంగ్, అజాద్, అమరదీప్, పతంగ, అల్‌బేలా, షెహనాయ్, సరగమ్, నిరాల, యాస్మిన్ మొదలగు నూరు చిత్రాలకు పైగా సంగీతం వహించారు గాయక సంగీత దర్శకులు సి. రామచంద్ర (నరహర్ చితల్ కర్ రామచంద్ర : 1918

- 1982). కొన్ని తమిళ చిత్రాలకు కూడా సంగీతం వహించిన రామచంద్ర అహ్మద్‌నగర్ జిల్లా (మహారాష్ట్ర) లోని 'పుంతాంబ' గ్రామంలో జన్మించారు. అక్బర్, సలీం అనార్కలి తెలుగు చిత్రానికి సంగీతం వహించారు.

మంచి ప్రతిభ ఉండి కూడా అవకాశాలు రాక మనస్తాపానికి గురియై 51 సం.ల వయస్సులోనే మరణించిన సంగీత దర్శకుడు మదన్‌మోహన్ (మదన్‌మోహన్ కొహ్లి : 1924 - 1975). సంజోగ్, మథోష్, షరాబి, దాస్తక్, అదాలత్, అన్‌పడ్, వొ కౌన్ థీ మొదలైన సుమారు 50-60 చిత్రాలకు సంగీతం వహించారు.

1967లో గ్రామఫోన్ కంపెని (HMV) వారు ఓడియన్ లేబుల్ మీద 'Movie Melodies of Madan Mohan' అనే లాంగ్‌ప్లే రికార్డును విడుదల చేసారు. ఇందులోని 12 పాటలు మదన్ మోహన్ ఎన్నిక చేసినవే. 'స్లీవ్‌నోట్'లో ఆతని సంగీత భావనలతో బాటుగా ఆతని దస్తూరిని కూడా పొందుపరచటము విశేషము. 'అదాలత్' చిత్రంలో మదన్‌మోహన్ స్వరపరచిన యుగళగీతం 'జమీన్ సె హమెన్ మెన్ అస్మాన్ పర్' మధురాతిమధురమైన గీతం. ఆశా భోస్లే, మహమ్మద్ రఫీ గానం చేసారు.

విలక్షణమైన గాయకుడు, సంగీత దర్శకుడు, నిర్మాత, హేమంత్ కుమార్ (హేమంత్ కుమార్ ముఖర్జి : 1920 - 1989) జన్మస్థలం బెనారస్. అనుపమ, బందిష్, చంపాకలి, ఏక్ హి రాస్తా, బిన్ బాదల్ బర్సాత్, షర్త్, ఏక్ ఝలక్, సాహిబ్ బీబీ ఔర్ గులాం మొదలైన సుమారు 50 హిందీ చిత్రాలకు, 100 పైగా బెంగాలి చిత్రాలకు సంగీతం వహించారు. 'నాగిన్' చిత్ర సంగీతం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

నూతన విన్యాసాలతో పాటలకు ఒక క్రొత్త వరవడిని సృష్టించిన సంగీత దర్శకుడు ఓ.పి. నయ్యర్ (ఓంకార్ ప్రసాద్ నయ్యర్ : 1926 - 2007). తుమ్ సా నహి దేఖా, నయాదౌర్, ఫాగున్, ఫిర్ వహి దిల్ లాయా హుం, మేరే సనమ్, కాశ్మీర్కి కలి, ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా, ఏక్ బార్ ముస్కురాదొ, సి.ఐ.డి., ఆర్‌పార్ మొదలైన ఎన్నో చిత్రాలకు అజరామరమైన బాణీలను సమకూర్చారు నయ్యర్.

ఓ.పి. నయ్యర్ గారి 81వ జన్మదినోత్సవ వేడుకను నిర్మాత ఆర్.వి. రమణమూర్తి గారు హైదరాబాద్ లోని 'గ్రీన్‌పార్క్' హోటల్ 16-1-2007న అతి వైభవంగా జరిపారు.

ఆయనను కలిసి గ్రామఫోన్ కంపెనీవారు 1967లో ఓడియన్ లేబుల్ మీద విడుదల చేసిన The Inimitable O.P Nayyar' అనే లాంగ్‌ప్లే రికార్డు చూపించి ఆటోగ్రాఫ్ అడిగితే రికార్డును చూసి "40 సంవత్సరాల క్రిందట విడుదల అయిన గ్రామఫోన్ రికార్డు ఇది. నా దగ్గర కూడా లేదు. ఎంత జాగ్రత్తగా దాచావు" అని చాలా సంతోషించి రికార్డు కవరు పైన "With Love and Affection to Sri K.V. Raoji" అని వ్రాసి సంతకం పెట్టి తారీకు కూడా వ్రాశారు. ఇది మరచిపోలేని మధురస్మృతి. నయ్యర్ లాహోర్‌లో జన్మించారు. ఓ.పి. నయ్యర్ గారినే కాక సంగీత దర్శకులు రవి, కళ్యాణ్ జీ ఆనంద్‌జీ, గాయని షంషాద్ బేగం లను చూచి పలకరించే అవకాశం కల్పించిన కీ.శే. ఆర్.వి. రమణమూర్తి గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

రాజేష్‌ఖన్నాను 'మెగాస్టార్' చేసిన చిత్రం "ఆరాధన"కు సంగీతం వహించిన సచిన్ దేవ్ బర్మన్ (ఎస్.డి. బర్మన్ :1906 - 1975) తల్లితండ్రులు మణిపుర, త్రిపుర దేశ రాజ వంశీయులు. సోల్వసాల్, టాక్సీడ్రైవర్, జ్యూవెల్ తీఫ్, ప్యాసా, గైడ్, మునీంజి, నౌదోగ్యారా, సజా, సుజాత, జాల్, బందిని మొదలైన నూరు చిత్రాలకు పైగా సంగీతం వహించిన బర్మన్ 1969లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

బాభి, మైన్ చుప్ రహేంగి, కాలా టోపి లాల్ రుమాల్, గంగాకి లహరె, జబక్, గెస్ట్‌హౌస్, మిస్టర్ 'X', నయా సంసార్, ఊంచేలోగ్ మొదలైన సుమారు 80 చిత్రాలకు సంగీతం వహించారు చిత్రగుప్త (చిత్రగుప్త శ్రీవాత్సవ్ :1917 - 1991). వీరి కుమారులే జంట సంగీత దర్శకులు ఆనంద్ - మిలింద్.

సుమారుగా నూరు హిందీ చిత్రాలకు, పద్నాలుగు మళయాళ చిత్రాలకు సంగీతం వహించిన రవి (రవిశంకర్ శర్మ : 1926 - 2012) 'నాగిన్' చిత్రంలోని 'బిన్' సంగీతాన్ని సమకూర్చారు. చైనాటౌన్, ఆజ్ ఔర్ కల్, చౌద్వీకా చాంద్, గుమ్రా, వక్త్, కాజల్, నీల్‌కమల్, గ్రహస్థి, ఘరానా, ఢిల్లీకా ఠగ్, దో కళ్యాణ్, నజ్రానా, ప్యార్‌కా సాగర్, ఎరాస్తె హై ప్యార్‌కి మొదలైన చిత్రాలలోని పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఢిల్లీ జన్మస్థలం.

హింది, బెంగాలి, తమిళము, మలయాళము, కన్నడ భాషలలో దాదాపుగా 150 చిత్రాలకు సంగీతం వహించిన సలీల్ చౌదరి (1922 - 1995) పశ్చిమ బెంగాల్‌లోని

24 పరగణాల జిల్లాలోని 'బింగ్రిపోత' గ్రామంలో జన్మించారు. మధుమతి, జాగ్ తెరహో, ముసాఫిర్, కానూన్, ఛాయ, ఉస్నె కహోతా, మాయ, రజని గంధ, లాల్‌పత్తర్ మొ. చిత్రాలలో మంచి సంగీతాన్ని అందించారు. తెలుగులో 'ఛైర్మన్ చలమయ్య' చిత్రానికి సంగీతం వహించారు.

తొలి తరానికి చెందిన వసంత దేశాయ్ (1912 - 1975) శాంతారాం చిత్రాలలో నటించడం, గానం చేయటం, సంగీతం వహించటము చేసారు. ఎక్కువగా మరాఠీ చిత్రాలకు సంగీతం ఇచ్చారు. ఝునక్ ఝునక్ పాయల్ బాజే, దో ఆంఖే బారాహాత్, తుఫాన్ ఔర్ దియా, అచానక్, గూంజ్ ఉట్‌కి షహనాయి, గుడ్డి మొదలైన తక్కువ హిందీ చిత్రాలలో అజరామరమైన బాణీలు స్వరపరచారు.

హిందీ చిత్ర రంగంలో ప్రప్రథమ జంట సంగీత దర్శకులు హుస్నలాల్ - భగత్‌రామ్ దాదాపుగా 40 చిత్రాలకు సంగీతం వహించారు. అఫ్సానా, ఆన్‌సూ, బడి బెహెన్, మీనాబజార్, చాంద్, బాలన్ మొ. చిత్రాలకు పాటలు స్వరపరిచారు.

తాజ్‌మహల్, బర్సాత్ కి రాత్, మల్హార్, చిత్రలేఖ, మమత, ఆరతి, అనో ఖిరాత్, దిల్ హి తోహై, బావరె నైన్ మొ. చిత్రాలకు సంగీతం అందించిన రోషన్ (రోషన్ లాల్ నగ్రాత్ : 1917-1967) పంజాబ్‌లోని గుజ్రంవాలాలో జన్మించారు. కుమారులు రాకేష్‌రోషన్ నటులు, రాజేష్ రోషన్ సంగీత దర్శకులు. మనవడు హృతిక్ రోషన్ బాలివుడ్ ప్రముఖ హీరో.

హిందీ చలన చిత్ర రంగంలో పామరులతో సహా పాడుకోవటానికి అతి సులువైన బాణీలతో పాటలను స్వరపరచి విజయ ఢంకా మ్రోగించిన జంట సంగీత దర్శకులు శంకర్ - జైకిషన్.

శంకర్ (శంకర్ సింగ్ రఘువంశి : 1922 - 1987) మధ్యప్రదేశ్‌లోని నరసింగ్ పూర్ జిల్లాలోని 'గడర్‌వార'లో జన్మించారు. తల్లిదండ్రులు శంకర్ చిన్నతనంలో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అందుకని తెలుగువచ్చు. తబలా వాయించటంలో ప్రవీణులు.

జైకిషన్ (జైకిషన్ దయా భాయ్ పంచాల్ : 1929 - 1971) గుజరాత్ లోని 'బన్‌సాడా'లో జన్మించారు. హార్మోనియం వాయించటంలో దిట్ట.

వారిద్దరు పృధ్వీ థియేటర్‌లో తబలా, హార్మోనియం కళాకారులు. వీరి ప్రతిభను గమనించిన రాజ్‌కపూర్ తాను నిర్మించిన 'బర్సాత్' చిత్రంలో జంట సంగీత దర్శకులుగా అవకాశమిచ్చాడు. 190 చిత్రాల దాకా సంగీతం వహించి వందల కొలది హిట్ సాంగ్స్ స్వరపరచారు. తెలుగు, తమిళములో ప్రేమలేఖలు చిత్రానికి శంకర్ జైకిషన్, 'శారద' తెలుగు చిత్రానికి శంకర్ సంగీతం వహించారు.

కొన్ని వందల చిత్రాలకు జంట సంగీత దర్శకులుగా చరిత్ర సృష్టించిన వారు లక్ష్మీకాంత్ - ప్యారెలాల్. లక్ష్మీకాంత్ (లక్ష్మీకాంత్ శాంతారామ్ కుడాల్కర్ **3-11-1937**న ముంబైలో జన్మించగా ప్యారెలాల్ (ప్యారెలాల్ రామ్ ప్రసాద్ శర్మ) ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో **3-9-1940**న జన్మించాడు. దోస్తి, మిలన్, జీనేకి రాహ్, సత్యం శివం సుందరం, బాబి, ఏక్ దూజే కేలియే, దోరాస్తె, రోటి కపడా ఔర్ మకామ్ మొ. వందల చిత్రాలకు సంగీతం వహించారు.

దాదాపుగా **200** చిత్రాలకు సంగీతం వహించిన జంట సంగీత దర్శకులు, సోదరులు కళ్యాణ్ జీ (కళ్యాణ్ జీవీర్‌జీ షా : **1928 - 2000**), ఆనంద్‌జీ (కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ : **2-3-1933**) గుజరాత్ లోని కచ్ జిల్లాలోని 'కంద్రోడి'లో జన్మించారు. సామ్రాట్ చంద్రగుప్త, సట్టాబజార్, మదారి, సచ్చా ఝూటా, రఫూ చక్కర్, సుహాగ్‌రాత్, బనారసి బాబు, పూరబ్ ఔర్ పశ్చిమ్ మొ. చిత్రాలకు మంచి సంగీతం ఇచ్చారు. 'ముఖద్దర్ కా సికిందర్', 'ఖుర్బాని' చిత్రాలలోని పాటల గ్రామఫోన్ రికార్డులు అమ్మకాలలో రికార్డులు సృష్టించాయిట. **1992**లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాలతో ఇద్దరిని గౌరవించారు.

సంగీతంలో ఒక క్రొత్త వరవడిని సృష్టించిన రెండో తరానికి చెందిన సంగీత దర్శకుడు, ఆర్.డి. బర్మన్ (రాహుల్ దేవ్ బర్మన్ : **1939 - 1994**). **1961**లో 'ఛోటె నవాబ్' చిత్రం ద్వారా హిందీ సినీరంగ ప్రవేశం చేసిన ఆర్.డి. బర్మన్ భూత్ బంగళా, బహారోంకె సప్నె, ప్యార్ కా మౌసమ్, పడోసన్, యాదోంకి బారాత్, కటి పతంగ్, హరె రామ హరే కృష్ణ, కారవాన్, ఆప్ కి కసమ్, షోలె, షాలిమార్, షాన్, బేతాబ్, జవాని మొదలైన మూడువందల చిత్రాలకు సంగీతం వహించారు.

ఆర్.డి. బర్మన్ సంగీతం వహించగా **1965**లో విడుదల అయిన 'తీస్రి మంజిల్'

చిత్రంలో పాటలు శ్రోతలను విపరీతంగా ఆకర్షించాయి. కలకత్తాలో జన్మించిన ఆర్.డి. బర్మన్ చిన్న వయసులోనే 55 సంవత్సరాలకే స్వర్గస్థులైనారు. తండ్రి సచిన్‌దేవ్ బర్మన్.

పైవారే కాక గులాం హైదర్, వినోద్, ఫిరోజ్ నిజామి, సర్దార్ మాలిక్, గులాం మహమ్మద్, ఖయ్యాం, ఎన్. దత్తా, దత్తారామ్, ఉషాఖన్నా, బప్పిలహరి, ఖురేషి, జైదేవ్, అర్జున్, ఎస్.ఎన్. త్రిపాఠి మొదలైన ఎందరో సంగీత దర్శకులు హిందీ సంగీత ప్రపంచానికి సేవలు చేసారు.

## హిందీ సినిమా సంగీతానికి సేవ చేసిన గాయనీ గాయకులు

**గాయనీమణులు** : విలక్షణమైన కంఠం, కంచు కంఠం, మొదటి తరానికి చెందిన షంషాద్ బేగం (1919 - 2013) జన్మస్థలం లాహోరు. మేలా, షబ్నమ్, మషాల్, సి.ఐ.డి., బాబుల్, దులారి, అందాజ్ మొదలైన ఎన్నో చిత్రాలలోను ప్రముఖ సంగీత దర్శకులందరి దగ్గర పాడారు. 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించారు.

దేశవిభజనకు పూర్వము అనుమోల్‌ఘడి, జుగును మొదలైన 10 హిందీ సినిమాలలో నటించి గానం చేసిన సింగింగ్ స్టార్ నూర్జహాన్ (1926 - 2000). బాలనటిగా కూడా కొన్ని చిత్రాలలో నటించిన నూర్జహాన్ పంజాబ్‌లోని కసూర్‌లో జన్మించింది. ఇది ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది. నూర్జహాన్‌ది 'మెటాలిక్ వాయిస్' అంటారు. ఆ తర్వాత పాకిస్తాన్‌కి తరలి వెళ్ళి కొన్ని సినిమాలలో నటించి తర్వాత గాయనిగా స్థిరపడింది.

అఫ్సర్, బడి బెహన్, దిల్లగి, మీర్జా గాలిబ్, వారిస్, పర్వానా, అనుమోల్‌ఘడి, దర్ద్ మొదలయిన చిత్రాలలో నటించి గానం చేసిన, విలక్షణమైన కంఠం, అందగత్తె అయిన సురయ (1929 - 2004) పంజాబ్‌లోని 'గుజ్రాన్‌వాలా'లో జన్మించింది. ఇప్పుడావూరు పాకిస్థాన్‌లో ఉన్నది.

పద్మవిభూషణ్, భారతరత్న లతామంగేష్కర్ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 28-9-1929న జన్మించింది. కొన్ని వందల చిత్రాలలో కొన్ని వేల పాటలు పాడిన లత కొన్ని మరాఠీ చిత్రాలు నిర్మించారు. వారి తండ్రి దీనానాథ్ మంగేష్కర్ పేరున పూనా పట్టణంలో హాస్పిటల్‌ను స్థాపించి ప్రజలకు సేవలందిస్తున్నారు.

భారత క్రికెట్ జట్టు 1983లో ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్నప్పుడు ఢిల్లీలోని ఇంద్రప్రస్థ స్టేడియంలో అభినందన సభ 1983లో ఏర్పాటు చేయబడింది. ఆ సభలో లతా లైవ్ (Live) కార్యక్రమాన్ని మ్యూజిక్ ఇండియా కంపెనీ వారు ఒక లాంగ్‌ప్లే గ్రామఫోన్ రికార్డుగా విడుదల చేసారు. నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధి పాల్గొని ప్రసంగించారు. ఆ ప్రసంగం కూడా రికార్డులో ఉండటము విశేషం.

శ్రోతలను ఆకర్షించే విలక్షణమైన కంఠము దోభాయ్, ఆర్‌పార్, దేవదాస్, ప్యాసా, సుజాత, కాగజ్ కె ఫూల్, సాహెబ్ బీబీ ఔర్ గులామ్ లాంటి ఎన్నో చిత్రాలలో మధురమైన గీతాలను ఆలపించిన గీతాదత్ (గీతారాయ్ : 1930 - 1972) ఆనాడు బెంగాల్ రాష్ట్రము ఈనాడు బంగ్లాదేశ్‌లో ఉన్న ఫరీదాపూర్‌లో జన్మించింది.

నిర్మాత, నటుడు గురుదత్‌ను వివాహము చేసుకుని ఆతని ప్రేమను పొందలేక, ఆతని మరణము సహించలేక మనస్తాపానికి గురియై జీవితముపై విరక్తి చెంది అతి చిన్న వయస్సు (41)లోనే రాలిపోయిన అద్భుత గాయని గీతాదత్. ఆమె హౌరా బ్రిడ్జ్ చిత్రంలో గానం చేసిన 'మేరా నామ్ చుమ్ చుమ్ చుమ్' పాట సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఎంతటి క్లిష్టమైన పాటనైనా, ఏ స్థాయిలోనైనా, ఎలాంటి విన్యాసాలతోనైన పాడగలిగిన ఏకైక గాయని ఆశాభోస్లే 8-9-1933న మహారాష్ట్రలోని సాంగ్లిలో జన్మించింది.

పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కె (2000) అవార్డులతో పాటుగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో 2011లో 'Most Recorded Artist'గా పేరు నమోదైన గాయని. ఆశా తెలుగులో అన్నమయ్య కీర్తనలు గానం చేయటం విశేషం.

ప్రతిభ గల గాయని అయినా అవకాశాలు రాని గాయని సుమన్ కళ్యాణ్ పూర్. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉన్న ఢాకాలో 28-1-1937లో జన్మించింది.

మరాఠి, బెంగాలి, భోజ్‌పురి, హిందీ చిత్రాలలో గానం చేసిన గాయని. జబ్ జబ్ ఫూల్‌కిలె, జాన్‌వర్, దిల్ ఏక్ మందిర్, సూరజ్, ప్యాసె పంచి, ఏప్రిల్ ఫూల్, బాల్ ఏక్ రాత్‌కి మొదలైన ఎన్నో హిందీ చిత్రాలలో గానం చేసారు సుమన్ కళ్యాణ్ పూర్.

సుధామల్హోత్రా, ముబారక్ బేగమ్, కృష్ణకళ్ళే, ఉషా మంగేష్కర్ మొదలైన ఎందరో గాయనీ మణులు సంగీత ప్రపంచానికి తమ వంతు సేవలు అందించారు.

**గాయకులు** : తొలితరం గాయకులు, నటులు, సంగీత దర్శకులు, దేవదాసు, చండీదాసు, విద్యావతి మొదలైన చిత్రాలలో గానం చేసిన కృష్ణ చంద్రడే (కె.సి.డే :1893 - 1962) ప్రముఖ గాయకుడు మన్నాడేకు పినతండ్రి. కలకత్తా జన్మస్థలం.

చలనచిత్ర రంగానికి, సంగీతానికి ఒక ప్రత్యేక యుగాన్ని సృష్టించిన నట గాయకుడు కుందన్లాల్ సైగల్ జమ్మూ కాశ్మీర్లోని జమ్మూలో 4-11-1904న జన్మించారు.

సైగల్ 1935లో దేవదాసు చిత్రంలో నటించి గానం చేసిన పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి.

కలకత్తాలోని న్యూథియేటర్స్లో పనిచేసారు. సైగల్ స్ట్రీట్ సింగర్, సూరదాస్, తాన్సేన్, షాజహాన్, పర్వానా మొదలైన ఎన్నో చిత్రాలలో నటించి గానం చేసారు. త్రాగుడుకు బానిస అయి 43 సం.ల వయస్సులో 1947లో మరణించారు సైగల్.

ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, సైగల్తో పోటాపోటీగా పాడిన ప్రతిభాశాలి పంకజ్ కుమార్ మల్లిక్ (పంకజ్ మల్లిక్ : 1905-1978) డాక్టర్, నర్తకి, కాపాలకుండలి, జిందగి, యాత్రిక్ మొదలైన చిత్రాలలో గానంచేసిన, అనేక ప్రైవేట్ గీతాలు గానం చేసిన మల్లిక్ రెండున్నర దశాబ్దాలు కలకత్తాలోని న్యూ థియేటర్స్లో పనిచేసారు.

భారత ప్రభుత్వం 1972లో పద్మశ్రీ బిరుదును, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు నిచ్చి పంకజ్ మల్లిక్ను గౌరవించారు.

నేను 1980 దశకంలో కలకత్తాలోని పంకజ్ మల్లిక్ ఇంట్లో కొన్ని గంటలు గడిపిన అదృష్టము కలిగింది.

హిందీ చలనచిత్ర సంగీతాన్ని మకుటం లేని మహారాజుగా నాలుగు దశాబ్దాలు పరిపాలించిన మధుర గాయకుడు మహమ్మద్ రఫి 24-12-1924న అమృత్సర్ జిల్లాలోని కోట్లా సుల్తాన్సింగ్ అనే చిన్న ఊరిలో జన్మించారు. శాస్త్రీయ సంగీతం నేర్చుకుని సినీరంగ ప్రవేశము చేసారు. అసూయా ద్వేషాలు లేని వ్యక్తి. భక్తి, వినయం,

మృదు స్వభావం కల వ్యక్తి.  షాజహాన్, జుగ్ను మొదలైన చిత్రాలలో నటించారు. 'బైజు బావరా' చిత్రం ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది రఫీకి.  హిందీ, కన్నడ, తెలుగు, ఒరియా, సింధి, ఉర్దూ, మరాఠీ, పంజాబి భాషలలో 5000 పాటలు గానం చేసిన రఫీ 31-7-1980న స్వర్గస్తులైనారు.  భారత ప్రభుత్వము 1967 పద్మశ్రీ బిరుదునిచ్చి గౌరవించారు.

హిందీ, బెంగాలి, మలయాళము చిత్రాలలో దాదాపుగా 3,500 పాటలు గానం చేసిన మన్నాడే 1-5-1919న కలకత్తాలో జన్మించారు.  ప్రఖ్యాత సంగీత విద్వాంసుల వద్ద శాస్త్రీయ సంగీతము నేర్చుకున్నారు.

క్లాసికల్ పాటలు పాడటంలో మన్నాడేని మించిన వారు హిందీ చిత్రసీమలో లేరు అంటారు.

ఆవారా, శ్రీ 420, సీమ, దో ఆంఖే బరహాత్, నవరంగ్, మేరా నామ్ జోకర్ వంటి అనేక చిత్రాలలో మరపురాని మధుర గీతాలను గానం చేసారు.

1971లో పద్మశ్రీ, 2005లో పద్మభూషణ్, 2007లో దాదా సాహెబ్ ఫాల్కె అవార్డులతో బాటుగా మధ్యప్రదేశ్ ప్రభుత్వముచే 'లతా మంగేష్కర్' అవార్డుతో గౌరవించబడ్డారు మన్నాడే (ప్రభోద్ చంద్రడే) 24-10-2013న బెంగుళూరులో మరణించారు.

విలక్షణమైన కంఠము గల ప్రఖ్యాత గాయకుడు ముఖేష్ చంద్ మాధుర్ (ముఖేష్ : 1923 - 1976) లూథియానాలో జన్మించారు.  క్లాసికల్ సంగీతము నేర్చుకున్నారు. ఆవారా, ఆహ్, శ్రీ 420, సంగమ్, మేరా నామ్ జోకర్, అనాడి ... ఇలాగ ఎన్నో చిత్రాలలో దాదాపుగా వెయ్యి పాటలు గానం చేసిన ముఖేష్ అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో లతా మంగేష్కర్‌తో సంగీత కార్యక్రమాలలో పాల్గొనటానికి వెళ్ళి గుండెపోటుతో అక్కడే 22-7-1976న స్వర్గస్థులైనారు.  భారత ప్రభుత్వము ముఖేష్ గౌరవార్థము తపాళా బిళ్ళ విడుదల చేసింది.

సంగీతభరిత చిత్రం 'నవరంగ్'లో ఆరంగ్రేటం చేసి ధూల్ కా ఫూల్, గుమ్రా, వక్త్, హమ్‌రాజ్, ధూండ్ మరియు ఉపకార్, యాద్‌ఘర్, ఫకీరా మొదలైన చిత్రాలలో గానం చేసిన మహేంద్ర కపూర్ 9-1-34న అమృతసర్‌లో జన్మించారు.  1972 పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.  2008లో మరణించారు.

విలక్షణమైన గాయకుడు, నటుడు, నిర్మాత, సంగీత దర్శకుడు, యోడలింగ్‌లో అనన్య ప్రతిభను కనపరచిన అభాస్‌కుమార్ గంగూలి (కిశోర్‌కుమార్) ప్రముఖ నటులు అశోక్‌కుమార్‌కు తమ్ముడు. న్యూఢిల్లీ, ఆశా, చల్‌తీకా నామ్ గాడి, షరారత్, గైడ్, షర్మిలి, ఆరాధన, అమరప్రేమ్, కటి పతంగ్ మొదలైన ఎన్నో చిత్రాలలో సూపర్‌హిట్ సాంగ్స్ గానం చేసిన కిశోర్‌కుమార్ 1987లో స్వర్గస్థులైనారు.

'కింగ్ ఆఫ్ గజల్స్'గా పేరు గాంచిన గాయకుడు, నటుడు, అందగాడు తలత్ మహ్మద్ (1924 - 1998) ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జన్మించాడు.

రాజ్యలక్ష్మి, తుమ్ ఔర్ మైన్, దిల్ ఎనాదాన్, డాక్‌బాబు, సోనేకి చిడియా మొదలైన 13 చిత్రాలలో నటించారు. లాల్‌రుక్, సోనేకి చిడియా, ఏక్‌గావ్‌కీ కహానీ, టాక్సీడ్రైవర్, పతిత, నయాఘర్, దాగ్, అనోహి, బాబుల్, మీర్జాగాలిబ్ మొదలైన ఎన్నో చిత్రాలలో మధురంగా గానం చేసారు. తెలుగులో మనోరమ, మలయాళంలో 'ద్వీప్' చిత్రంలో గానం చేసారు.

అఖండ విజయాన్ని సాధించిన విజయావారి పాతాళభైరవి 1952లో హిందీలో డబ్ చేసినప్పుడు ఘంటసాల గారి సంగీతంలో తలత్ మూడు పాటలు గానం చేసారు.

1979లో లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత 'రాయల్ ఆల్‌బర్ట్ హాల్'లో గానం చేయటం విశేషం. 1992లో 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకున్నారు.

మధుర గాయకుడు, సైగల్‌ను పోలిన కంఠము 1923లో ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్న హైదరాబాద్ సింధ్‌లో జన్మించిన సి.హెచ్. ఆత్మ పేరు వినగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చే పాట 1945లో గానం చేసిన 'ప్రీతమ్ ఆన్‌మెలో' ప్రైవేటు గీతం. ఈ గీతానికి సంగీతం సమకూర్చింది ఒ.పి. నయ్యర్ అయితే రచించినది ఒ.పి. నయ్యర్ సతీమణి సరోజ్ మోహిని నయ్యర్.

అతి తక్కువ చిత్రాలలో గానం చేసారు. శంకర్ - జైకిషన్ సంగీతంలో 'నగీనా' చిత్రంలో గానం చేసారు.

ఎక్కువగా సంగీత కచేరీలలో గానం చేసేవారు. వీరు గానం చేసిన రొమాంటిక్ గజల్స్ బహు ప్రజాదరణ పొందాయి.

1962లో గ్రామఫోన్ కంపెనీ (HMV) ఆత్మగానం చేసిన లలిత గీతాలు, గజల్స్, భజనలు, 'నగీనా' చిత్రంలోని ఒక పాట మొత్తం 12 గీతాలుగా ఎల్.పి. రికార్డు విడుదల చేసారు.

# గజల్స్

'గజల్స్' 10వ శతాబ్దములో పర్షియాలో అభివృద్ధి చెందినట్లుగా తెలుస్తున్నది. మహమ్మదీయులు హిందూ దేశానికి వచ్చి రాజ్యాలను పరిపాలించేటప్పుడు ఈ 'గజల్స్' సంస్కృతి కూడా 12వ శతాబ్దంలో ప్రవేశపెట్టబడినట్లు తెలుస్తున్నది.

ఉర్దూభాషలో 'గజల్స్' చాలా ప్రసిద్ధి చెందాయి. గజల్స్ ఉర్దూలో ఒక గేయ ప్రక్రియ. ప్రముఖంగా శృంగారభావ భరితమైనది. ఉర్దూ గజల్స్ పాకిస్తాన్‌లో చాలా పాపులర్. మన భారతదేశంలో ఉర్దూ భాషతో పాటు హిందీలో కూడా గజల్స్ రచింపబడ్డాయి. క్రమేణా ప్రాంతీయ భాషలలో కూడా రచించి గానం చేయబడుతున్నాయి.

ఉర్దూ గజల్స్ గానం చేయటంలో అద్వితీయమైన ప్రతిభ కలవారు బేగమ్ అక్తర్, నుస్రాత్ ఫతే ఆలి, రహత్ ఫతే ఆలీఖాన్, మెహంది హాసన్ మొదలగువారు. మెహంది హాసన్ రాకతో గజల్స్ స్వరూపమే మారిపోయిందంటారు. గజల్స్‌లోని సాహిత్య భావాన్ని సంగీతమయం చేసి శ్రోతలకు అందించటంలో విశేష కృషి సల్పినట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదుకు చెందిన తలత్ అజీబ్, జగ్‌జిత్‌సింగ్, పంకజ్ ఉథాస్, అనూప్ జలోట గజల్స్ గానం చేయటంలో నిష్ణాతులు.

గజల్స్ కింగ్‌గా పిలవబడిన జగన్‌మోహన్ సింగ్ (జగ్‌జిత్‌సింగ్ :1941 - 2011) రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలోని శ్రీరాంనగర్‌లో జన్మించారు.

గ్రామఫోన్ కంపెనీవారు (HMV) విడుదల చేసిన జగ్‌జిత్‌సింగ్ ఆల్బమ్స్ విపరీతంగా అమ్ముడుపోయి రికార్డు నెలకొల్పాయట. దాదాపు నూరు ఆల్బమ్స్ విడుదలయినట్లు తెలుస్తున్నది.

పద్మభూషణ్, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి గారు తెలుగు భాషలో రచించి, వారే వివిధ రాగాలలో స్వరపరచుకుని గానంచేసిన గజల్స్ లాంగ్ ప్లే గ్రామఫోన్ రికార్డుగా విడుదల అయింది. వాద్య సంగీతాన్ని అందించినవారు సాలూరు రాజేశ్వరరావు. ఈ గజల్స్ అభ్యుదయ భావాలతో, సామాజిక స్పృహతో రచించి గానం చేయబడినవి. ఈ రికార్డును సమర్పించినవారు యం.కె. రాము (రసమయి సంస్థ, హైదరాబాద్).

తెలుగుభాషలో గజల్స్ సంస్కృతిని బాగా ప్రచారం చేస్తున్న వ్యక్తి 'గజల్ శ్రీనివాస్'. అనేక భాషలలో గజల్స్ గానం చేస్తూ దేశ విదేశాలలో శాంతియాత్రలు చేస్తున్న ఘనుడు. ఆఫ్ఘనిస్థాన్‌లో కూడా గానం చేయటం విశేషం.

## ఖవ్వాలి

భారతదేశమున ప్రచలితమవుతున్న సూఫీమతము ఇరానీ దేశ పరంపరను అనుసరణ చేస్తూ 9వ శతాబ్దము నుండి 10వ శతాబ్దము వరకు విస్తరిస్తూ పోయినట్లు తెలుస్తున్నది.

సూఫీలు ఐశ్వర్య, భోగవిలాసానికి అతిదూరంగా అత్యంత సాధారణ జీవితాన్ని గడిపెడివారు. కేవలం ఆధ్యాత్మిక సాధనలతో మునిగి తేలుతుంటారు. అందరూ కలసి మెలసి సహజీవనము చేయవలెనని చెప్పేవారు.

ఖవ్వాలి సంగీతము సూఫీ మతస్థులు పాడే భక్తి సంగీతము. ఈ సంగీతము పర్షియా (ఇరాన్)లో 8వ శతాబ్దములో ఉద్భవించినట్లు తెలుస్తున్నది.

పర్షియన్, భారతదేశ సంగీతాల కలయిక వలన ఈనాటి ఖవ్వాలి 13వ శతాబ్దములో ఉద్భవించినట్లు తెలుస్తున్నది. భారతదేశీయులు ఈ సంగీతము ప్రసిద్ధి చెందటానికి కారకులు 14వ శతాబ్దంలో రాజా అల్లాఉద్దీన్ ఖిల్జి పాలనలో మంత్రివర్యులుగా ఉన్న సంగీత కళాకారుడు అమీర్ ఖుస్రో అని చరిత్ర తెలియ చేస్తున్నది.

ఖవ్వాలీలు దక్షిణ ఆసియా దేశంలో చాలా పాపులర్. ముఖ్యంగా పాకిస్థాన్‌లోని పంజాబ్ మరియు సింధు ప్రాంతంలో, భారతదేశంలో హైదరాబాద్, ఢిల్లీలలో పాపులర్.

ఖవ్వాలి గీతాలు ఉర్దూ, పంజాబి భాషలలో ఎక్కువగా ఉంటాయి. భారతీయ భాషలలో కూడా ఖవ్వాలీలు ఉన్నట్లు తెలుస్తున్నది.

ఖవ్వాలి గీతాల ముఖ్య ఉద్దేశము ప్రేమ, ఆధ్యాత్మికము, భక్తిని మానవ జాతిలో పెంపొందించటానికి.

ఖవ్వాలి గానంలో నిష్ణాతులు ఎందరో ఉన్నారు. అందులో కొందరు : సాబ్రి బ్రదర్స్, నియాజి బ్రదర్స్, రోషనార బేగమ్, నుస్రత్ ఫతేఆలి మొ.వారు.

కొన్ని హిందీ చిత్రాలలో ఖవ్వాలీలు ఉన్నాయి.

# పుట్టా మంగపతి గారి స్వరసేవ

పుట్టా మంగపతిగారు మదరాసు (చెన్నై) బ్రాంచి అయిన గ్రామఫోన్ కంపెని ఆఫ్ ఇండియా (HMV) లో 1957 నుంచి ముప్పయి సంవత్సరాలు ఆర్టిస్ట్స్ అండ్ రిపర్టొయిర్ మేనేజర్ అండ్ ఎడ్వైజర్, సదరన్ ఇండియా పదవిని సక్రమంగా, బాధ్యతగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించి పదవీ విరమణ చేసారు.

సినీ స్వర్ణయుగంలో తమ వంతు సేవలను అందించిన మంగపతిగారు ఎంతో మంది కళాకారులకు చేయూతనిచ్చారు.

ఆ రోజులలో పాటను రేడియో ద్వారా గాని, గ్రామఫోన్ రికార్డు రూపంలో గాని వినగలిగే అవకాశము ఉండేది. ఈనాటి మీడియా సౌకర్యాలు ఆ రోజులలో లేవు. ఔత్సాహిక గాయనీ గాయకుల ప్రతిభలను గుర్తించే అవకాశాలు చాలా అరుదుగా ఉండేవి. అలాంటి రోజులలో మంగపతి గారు ఊరూరు తిరిగి ఆర్టిస్టులను వెదికి పట్టి వారి ప్రతిభలను గ్రామఫోన్ రికార్డుల ద్వారా నలుగురికి తెలియపరచిన నిస్వార్థపరుడు.

ప్రముఖ గాయకుడు యేసుదాసు, ప్రముఖ సంగీత దర్శకులు చక్రవర్తి మొదలైన ప్రతిభ గల ఎందరినో గుర్తించి వారి పాటలను రికార్డు చేసి గ్రామఫోను రికార్డులుగా విడుదల చేయించి వారు ఉన్నతస్థితిని చేరుకునే అవకాశాలను కల్పించారు మంగపతి.

ఔత్సాహిక గాయనీ గాయకులైన జి. ఆనంద్, జి.వి. ప్రభాకర్, మండపాక శారద, కర్నూలు నరసునాయుడు, విజయనగరం కుమ్మరి మాస్టారు, అనకాపల్లి సంజీవరావు, నందిగం పెద్దన్న, వేదవతి ప్రభాకర్, జానపద గాయకుడు చలపతిరావు ... ఇలాగ ఎందరి చేతనో పాటలు పాడించి గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేయించారు. వీరందరూ జీవితాలలో స్థిరపడ్డారు.

జి.వి. ప్రభాకర్ సంగీత కళాశాలలను నిర్వహిస్తూ కొన్ని వందల మంది గాయనీ గాయకులను వాద్య కళాకారులను తయారుచేసారు.

మండపాక శారద మొ.వారు విశ్వవిద్యాలయాలలో సంగీత విభాగంలో ప్రొఫెసర్లుగా పనిచేస్తూ సంగీత సరస్వతికి తమవంతు సేవలను అందిస్తున్నారు.

మంగపతిగారు రచించిన 'స్వరసేవ' పుస్తకంలో ఎన్నో ఆసక్తికరమైన విశేషాలున్నాయి. ఇది అందరూ చదువదగిన పుస్తకము.



మంగపతిగారిని సత్కరిస్తున్న శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్
(డిప్యూటీ డైరక్టర్ జనరల్, ఆకాశవాణి, హైదరాబాద్)



మంగపతిగారిని సత్కరిస్తున్న ఎన్.వి.ఎస్. చలపతి

# భక్తి సంగీతము - గ్రామఫోన్ రికార్డులు

భారతీయులలో అన్ని మతాల వారికి దైవమందు ఎనలేని భక్తి ఉంది. అన్ని భారతీయభాషలలో భక్తి సంగీతాన్ని తొలుత గ్రామఫోన్ రికార్డ్స్‌గా, తరువాత కాసెట్స్‌గా, సి.డీ.లుగా తయారు చేసి ఎన్నో మ్యూజిక్ సంస్థలు మార్కెట్‌లో ప్రవేశపెడుతున్నాయి. సినిమాలలో కొన్ని వందల భక్తిగీతాలు వచ్చాయి. వీటిలో చాలామటుకు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి. ఇవి 78 ఆర్‌పిఎం, 45 ఆర్‌పిఎం, 33 1/3 ఆర్‌పిఎం రికార్డులుగా విడుదల అయ్యాయి.

హిందీ భాషలో, సంస్కృత భాషలో ప్రైవేట్ భక్తిగీతాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయినాయి. లతా మంగేష్కర్, అనూరాధా పొడ్వాల్ మొదలైన ఎందరో కళాకారులు గానం చేసారు. (లతామంగేష్కర్ పాడిన మీరా భజన్స్, భగవద్గీత మొ॥నవి)



చిరంజీవి మండపాక శారదను ఆశీర్వదిస్తున్న ఘంటసాల

గ్రామఫోన్ కంపెనీలు తెలుగు భాషలో లెక్కలేనన్ని భక్తిగీతాల రికార్డులను విడుదల చేసాయి. భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గానం చేసిన శ్రీవేంకటేశ్వర సుప్రభాతమ్, కాశీరామేశ్వర సుప్రభాతం, శ్రీకామాక్షి సుప్రభాతం, భజగోవిందం, శ్రీవేంకటేశ్వర పంచరత్నములు మొదలైనవి ఎన్నో ఎల్పి రికార్డులుగా విడుదల అయ్యాయి.

ఘంటసాల "భగవద్గీత", ఎం.ఎస్.రామారావు రచించి గానం చేసిన "బాలకాండము", "సుందరకాండము", సుశీల గానం చేసిన "కృష్ణం వందే జగద్గురుమ్", "శ్రీరామ గానలహరి", భగవాన్ సత్యసాయిబాబా భక్తిగీతాలు, భజనలు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడిన ఎన్నో భక్తిగీతాలు ఎల్పి రికార్డులుగా విడుదల చేయబడ్డాయి.

ప్రముఖ శాస్త్రీయ సంగీత కళాకారులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం చేసిన శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలు, శ్రీనివాస గీతమాల, అష్టపదులు మొదలైనవే కాక శ్రీనివాస కళ్యాణం, శ్రీవేంకటేశ్వర విలాసం, శ్రీరామధ్యాన సాగరము, శివార్చన, భక్తికిరణాలు, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతకథ - ఇలాగ ఎన్నో టైటిల్స్ మీద ఎందరో కళాకారులు గానం చేసిన భక్తిగీతాలు ఎల్పి రికార్డులుగా విడుదల అయినాయి.

ఘంటసాల గానం చేసిన జయదేవుని అష్టపదులు, శ్రీరాఘవేంద్ర సుప్రభాతము, జిల్లెళ్లమూడి అమ్మ మీద గానం చేసినవి, అంబికా సుప్రభాతము, వేంకటేశ్వరస్వామి మీద గానం చేసినవి, శ్రీరామదండకం, వినాయక చతుర్థి కథా విధానము మొదలగునవి. ఇలాగ ఎందరో గానం చేసిన భక్తి గీతాలు 78 ఆర్పిఎం, 45 ఆర్పిఎం, $33^{1/3}$ ఆర్పిఎం రికార్డులుగా విడుదల అయినాయి.

1936లో విడుదల అయిన 'సతీ అనసూయ' చిత్రంలో నటి, గాయని, నిర్మాత శ్రీమతి సి. కృష్ణవేణి గారు అన్నమయ్య కీర్తన 'జో అచ్యుతానంద ...' గానం చేసారు. ప్రప్రథమంగా చిత్రాలలో వినిపించిన అన్నమాచార్య కీర్తన ఇది. భాగ్యరేఖ చిత్రంలో మల్లిక్ గారు గానం చేసారు. రేడియోలో అన్నమయ్య కీర్తనలు ప్రథమంగా గానం చేసినది మల్లిక్, బాలాంత్రపు రజనీకాంతరావు గార్లు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు 1971లో సాలూరి రాజేశ్వరరావుగారి సంగీతంలో హెచ్ఎంవి వారి

ద్వారా ఒక ఎస్‌పి వినైల్ రికార్డు విడుదల చేసారు. అందులో ఒక వైపు ఘంటసాల పాడిన 'బ్రహ్మ కడిగిన పాదము', రెండోవైపు సుశీలపాడిన 'జో అచ్యుతానంద' పాట ఉన్నది.

1971లో ఘంటసాలగారి అమెరికా పర్యటనలో ఘంటసాలగారి గౌరవార్థం ఒక ఎల్‌పి రికార్డు విడుదల అయింది. అందులో అన్నమయ్య కీర్తన, త్యాగరాజస్వామి రచించిన 'చలమేలరా సాకేతరామ', భద్రాది రామదాసు కీర్తన పాడారు. ఈ ముగ్గురు భక్తుల రచనలు విదేశాలలో పాడగా మొట్టమొదటిసారిగా గ్రామఫోన్ రికార్డుగా విడుదల అవటం ఒక విశేషం.

బాలమురళిగారు గానం చేసిన అన్నమాచార్య కీర్తనలను 1975లో గ్రామఫోన్ LP రికార్డు విడుదల అయింది.

ఆ తరువాత యం.ఎస్. సుబ్బులక్ష్మి, శ్రీరంగం గోపాలరత్నం, శోభారాజు మొదలగు వారు పాడిన అన్నమయ్య కీర్తనలు గ్రామఫోన్ LP రికార్డులుగా గ్రామఫోన్ కంపెనీ వారు విడుదల చేసారు.

అయ్యప్పస్వామి భక్తిగీతాలను శ్రీ అయ్యప్ప చరిత్రగానము, శ్రీ అయ్యప్ప భక్తిమాల, మొదలైనవెన్నో ఎల్‌పి లుగా విడుదల అయ్యాయి. ఇలాగ కొన్ని వందల భక్తిగీతాలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యము వినిపించే వేంకటేశ్వర సుప్రభాతమును పి.వి.అనంతశయనం అయ్యంగార్, వారి బృందము గానం చేసారు. ఆకాశవాణి వారు ప్రతి శనివారము ఉదయం భక్తిరంజని కార్యక్రమంలో ఇది వినిపిస్తారు. ఆనాడు ఈ సుప్రభాతం వినటానికి శ్రోతలు ఎంతో ఆతురతో ఎదురు చూచేవారు. ఈ సుప్రభాతాన్ని హెచ్‌ఎంవి కంపెనీవారు 78 ఆర్‌పిఎం రికార్డ్సుగా విడుదల చేసారు.

క్రైస్తవగీతాలు, బైబిల్ మొదలయినవి మొదట ఎల్‌పి రికార్డులుగా, తరువాత కాసెట్స్‌గా, సిడీలుగా విడుదల అయ్యాయి.

ఇవి కాక ఎంతో మంది కళాకారులు పాడిన భక్తిగీతాలు అనేక మ్యూజిక్ సంస్థలు సి.డీలుగా విడుదల చేస్తున్నాయి.

# కర్ణాటక సంగీత వైభవం - గ్రామఫోన్ రికార్డులు

భగవంతుడు ఓంకార స్వరూపుడు. నాదాశ్రయుడు. నాదోపాసన ద్వారానే తొందరగా భగవంతుని సాన్నిధ్యం చేరుకోవచ్చును అని గాయకుల విశ్వాసం. ఆ విశ్వాసంతోనే సంగీత సాహిత్యాలతో సమానమైన పాండిత్యము కలిగినటువంటి వాగ్గేయకారులు అద్భుతమైన సంగీతకళను సృష్టించారు.

సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి కర్ణాటక సంగీతాన్ని మహోన్నత స్థితికి తీసుకువెళ్లారు.

వీరేకాకుండా ఎందరో గొప్ప గొప్ప విద్వాంసులు జన్మించారు. సంగీతానికి ఎనలేని సేవలు చేసారు. వారిలో కొందరు : నారాయణ తీర్థ, భద్రాచలం రామదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య, తూము నరసింహదాసు, పురందరదాసు, కనకదాసు, నమ్మాళ్వార్, స్వాతి తిరునాళ్, తుకారామ్, కుంభార, నామ్‌దేవ్ మొ.వారు.

20వ శతాబ్దంలో ఎందరో సంగీత కళాకారులు జన్మించి కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవ చేసారు. అట్టివారు : యం.ఎస్. సుబ్బులక్ష్మి, డి.కె. పట్టమ్మాళ్, యం.ఎల్. వసంతకుమారి, రాధా జయలక్ష్మి, బెంగుళూరు నాగరత్తమ్మ, శ్రీరంగం గోపాలరత్నం, బాలమురళీకృష్ణ, నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, జి.యన్. బాలసుబ్రహ్మణ్యం, జాన్ హిగిన్స్, వోలేటి వెంకటేశ్వర్లు, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులు, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, శ్రీపాద పినాకపాణి, మైసూరు వాసుదేవాచార్యులు, బిడారం కృష్ణప్ప, ముత్తయ్య భాగవతార్, టైగర్ వరదాచార్యులు, ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, సంధ్యావందనం శ్రీనివాసరావు, యం.డి. రామనాధన్, కె.జె. ఏసుదాసు మొ.వారు.

**వాద్య కళాకారులు :** కర్ణాటక సంగీతానికి సేవచేసిన వాద్య కళాకారులు ఎందరో ఉన్నారు.

**వీణ విద్వాంసులు :** వీణ సుబ్బణ్ణ, వీణ శేషణ్ణ, పి. దొరస్వామి అయ్యంగార్, ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు, యస్. బాలచందర్, వాసా కృష్ణమూర్తి, అయ్యగారి సోమేశ్వరరావు, గాయత్రి, మేడూరి నరసింహారావు, ఆర్.ఎస్. కేశవమూర్తి, అయ్యగారి శ్యామ్‌సుందర్ మొ.

కర్ణాటకలోని మైసూరుకు చెందిన వీణ విద్వాంసులు ఆర్.కె. సూర్యనారాయణ గాయత్రి వీణను వాడేవారు. ఈ వీణలో 24 తీగలు (Strings) ఉండడం విశేషం.

**వయోలిన్ కళాకారులు :** ద్వారం వెంకటస్వామి నాయుడు, ద్వారం నరసింగరావు నాయుడు, హరినాగభూషణం, పేరి సుబ్బారావు, ద్వారం భావనారాయణరావు, కె.వి. రెడ్డి, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, నేతి శ్రీరామశర్మ, లాల్‌గుడి జయరామన్, యం.ఎస్. గోపాలకృష్ణన్, కున్నకూడి వైద్యనాథన్, హరి అచ్యుతరామశాస్త్రి, కన్యాకుమారి, ద్వారం మంగతాయారు, కె.ఎస్. అలగిరి స్వామి, టి. కేశవులు, కొమండూరి కృష్ణమాచార్యులు, అన్నవరపు రామస్వామి, పూర్ణచంద్, జి.జె. ఆర్. కృష్ణన్ మొ.వారు.

మైసూరు రాష్ట్రం (కర్ణాటక)లో జన్మించిన టి. చౌడయ్య గొప్ప వయోలిన్ విద్వాంసులు. బెంగుళూరులో చౌడయ్య భవన్ అని నిర్మించారు. అది పై నుంచి చూస్తే వయోలిన్ ఆకృతిలో ఉంటుంది.

**నాదస్వర విద్వాంసులు :** ఎందరో నాదస్వర విద్వాంసులు సంగీత తల్లికి అనేక సేవలు చేసారు. షేక్ చిన్న మౌలానా, రాజారత్నం పిళ్లై, మధురై సేతురామన్, మధురై పొన్నుస్వామి మొ.వారు.

**మృదంగ విద్వాంసులు :** కమలాకర్‌రావు, కరైకూడి ఆర్ మణి, గురువాయూర్ దొరై, ముష్ఇమ్ రాజారావు, టి.కె. మూర్తి, టాంజోర్ ఉపేంద్రన్, టి.యస్. నాగప్పన్, వెల్లూర్ రామభద్రన్, పాల్‌ఘాట్ మణిఅయ్యర్, ముళ్లపూడి శ్రీరామమూర్తి మొ.వారు ఎందరో కర్ణాటక సంగీతానికి సేవలందించారు.

**ఘటం వాద్య కళాకారులు :** టి.హెచ్. వినాయకరామ్, పాల్‌ఘాట్ వి.ఎ. సుందరం, నాగరాజారావు, కె.ఎస్. మంజునాధ, గురుమూర్తి, షణ్ముఖ సుందరం, ఇ.యం. సుబ్రమణియమ్, ఆర్.యస్. కృష్ణమూర్తి రావు మొ.వారు.

కె.వి.టి. స్వామినాధన్, యస్. సుబ్రమణియ్య, ఉప్పలపాటి అంకెయ్య మొదలగువారు డోలు వాద్యములో ప్రవీణులు.

హరిశంకర్, వి. నాగరాజన్, టి.ఎస్. దక్షిణామూర్తి కంజీర వాద్య నిపుణులు.

మాండోలిన్ వాద్యములో అశేష ప్రతిభావంతుడు యు. శ్రీనివాస్.

పుదుక్కోట్టై మహాదేవన్ వంటి ఎందరో మోర్సింగ్ వాద్య నిపుణులు కర్ణాటక సంగీతానికి సేవలందించారు.

**వేణు వాదన విద్వాంసులు :** టాంజూర్ విశ్వనాధన్, త్యాగరాజన్ రమణి, విజయ రాఘవరావు, టి.ఆర్. మహాలింగం, ఎన్. రమణి, ప్రపంచం సేతారాం, ఎన్.ఎస్. శ్రీనివాసన్, టి.ఎన్. శివకుమార్, పి. సంజీవరావు, శశాంత్ సుబ్రహ్మణ్యం మొదలగువారు.

కర్ణాటక సంగీతం కొన్ని వందల గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

**హిందూస్థానీ సంగీత వైభవం :** ఎందరెందరో గొప్ప గొప్ప మహా విద్వాంసులు హిందూస్థానీ సంగీతానికి ఎనలేని సేవలు చేశారు.

**గాత్ర విద్వాంసులు :** పండిట్ విష్ణు నారాయణ ఖాట్మండే, పండిట్ ఓంకారనాధ్ ఠాగూర్, ఉస్తాద్ బడే గులామ్ ఆలీఖాన్, పండిత విష్ణు దిగంబర్ పలూస్కర్, గంగూబాయి మానగల్, పండిత భీమ్‌సేన్ జోషి, పండిట్ జస్‌రాజ్, పర్వీన్ సుల్తానా, ఉస్తాద్ మహమూద్ దిల్‌షాద్‌ఖాన్, రషీద్‌ఖాన్, కుమారీ గంధర్వ, కిశోరి అయోన్‌కార్ మొదలగువారు.

**షెహనాయ్ విద్వాంసులు :** ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షెహనాయ్ వాదనలో లోక ప్రసిద్ధులు. 2001లో భారత ప్రభుత్వంచే 'భారతరత్న'తో గౌరవింపబడ్డారు.

**తబల విద్వాంసులు :** సురేష్ తల్వార్, అల్లారఖ, దిల్‌దారీ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, అష్‌తోష్ భట్టాచార్య, నేపాల్ అచ్యుతరామ్, అనూరాధాపాల్, ఆదిత్య కళ్యాణ్ పూరీ, కేదార్ పండిట్, ఫిలిప్ వి. ఫ్రాన్సిస్ మొదలగువారు.

**సితార్ విద్వాంసులు :** అల్లాఉద్దీన్‌ఖాన్, ఇనాయత్ ఖాన్, విలాయత్‌ఖాన్, పండిట్ రవిశంకర్, పండిత్, కుశాలీదాస్, జనార్ధన్ మిట్ట, అనేష్క శంకర్, రాగిణి త్రివేది, శివనాధ్, అన్నపూర్ణాదేవి, పండిట్ నికిన్ బెనర్జి.

**వేణువు వాద్యకారులు :** పన్నాలాల్‌ఘోష్, యస్. ఆకాశ్, మోహిత్ చౌహాన్, చేతన్ జోషి, హరిప్రసాద్ చౌరాసియా, రోనుమజుందార్, గురుభజన్ సింగ్ సహదేవ్, రఘునాథ్ సేట్ మొ.

**సంతూర్ వాద్య కళాకారులు :** పండిట్ శివకుమార్ శర్మ, రాహుల్ శర్మ, వర్ష అగర్వాల్, సందీప్ ఛటర్జి, కునాల్‌సహ, సతీష్ వ్యాస్, పండిట్ తరుణ్ భట్టాచార్య, పండిట్ భజన్ సపోరి మొ.వారు.

**జల్ తరంగ్ వాద్యకారులు :** సీతా దొరైస్వామి, రాజబ్ ఆలిఖాన్, రాగిణి త్రివేది, రంబున్ ప్రధాన్, అనయాపుట్టి యస్. గణేశన్ మొదలగు విద్వాంసులు సంగీతానికి సేవలందిస్తున్నారు.

గొప్ప గొప్ప కళాకారుల హిందూస్థానీ సంగీతం లెక్కలేనన్ని గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యాయి.

## తాన్‌సేన్

15, 16 శతాబ్దాలలో భారతదేశంలో సంగీతానికి పునరుజ్జీవం జరిగింది. దీనికి ముఖ్యకారకులు గ్వాలియర్ మహారాజు మాన్‌సింగ్ తోమార్. ధ్రువపద పద్ధతి గానాన్ని వ్యవస్థీకరించాడంటారు. మాన్‌సింగ్ సంగీత కళాకారుల సహాయంతో ధ్రువపద గానంలో మార్పులు తెచ్చాడంటారు. ఈ గానపద్ధతిని విష్ణుభక్తులు బ్రతికించుకుంటూ వచ్చారు.

స్వామి హరిదాసు వైష్ణవ సంప్రదాయానికి చెందిన గొప్ప గాయకుడు. గొప్ప గాయకుడు అయినా రాజుల ఆస్థానాలలో ఎటువంటి సంబంధాలు పెట్టుకోలేదు. గొప్ప యోగి కూడా. అక్బరు పరిపాలనా కాలంలో, అంతకు ముందు స్వామి హరిదాసు గొప్ప సంగీత కళాకారుడుగా ప్రసిద్ధి చెందాడు. హరిదాసు తన సంగీత ప్రజ్ఞా పాఠవాలను తాన్‌సేన్‌కు నేర్పారట.

తాన్‌సేన్ సంగీత ప్రతిభను గురించి, సంగీత సాధన, జీవితాన్ని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయట. వాటిలో ఇది ఒకటి.

గ్వాలియర్‌లో ఒక బ్రాహ్మణ కుటుంబం నివసించేవారట. ఆ దంపతులకు పిల్లలు లేరు. ఆ కుటుంబ యజమాని హజరత్ పీర్ మహమ్మద్ ఘవుస్ అనే బాబాను కలిసి మొరపెట్టుకుంటే ఆయన పిల్లలు పుడుతారని ఆశీర్వదించాడుట. ఆ బాబా ఆశీర్వచనంతో ఆ దంపతులకు కుమారుడు పుట్టాడు. బాలుని జాతకము

చూసి చాలా గొప్పవాడయి చరిత్రను సృష్టిస్తాడని జోస్యము చెప్పాడుట. తల్లిదండ్రులు వారి కుమారునికి 'రాంతను' అని పేరు పెట్టారుట. ఏ శబ్దం విన్నా, ఏ ధ్వని విన్నా దానిని ఉన్నది ఉన్నట్లుగా పలుకగలిగే ప్రతిభ ఉండేదట రాంతనుకు.

ఒకసారి స్వామి హరిదాసు శిష్యులతో ఒక అడవిలో బస చేయవలసి వచ్చిందట. వారు బస చేసిన చోట ఒక చెట్టుచాటు నుండి పులి గాండ్రించినట్లుగా రాంతను ధ్వనులు చేసాడు. శిష్యులు భయపడ్డారు. ఆ అడవిలో పులులు ఉండవని తెలిసిన స్వామివారు వెతికి రాంతనును పట్టుకున్నారు. కుర్రవాడిలో అద్వితీయమైన ప్రతిభ ఉందని గ్రహించాడు. పిల్లవాడి మీద అనుగ్రహం కలిగింది.

హరిదాసు రాంతను తల్లిదండ్రులను కలిసి శిష్యునిగా గ్రహిస్తాను అని చెప్పి ఒప్పించి పిల్లవాడిని తీసుకెళ్లి సంగీత విద్యను నేర్పించాడు.

కొన్ని సంవత్సరాలు హరిదాసు వద్ద శిష్యరికం చేసిన తర్వాత రాంతను రాజామాన్‌సింగ్ భార్య అయిన రాణి మృగనయని కొలువులో చేరాడు.

రాంతను దివాణంలో ఒక ముస్లిమ్ వనితను ప్రేమించాడు. మహారాణి, బాబా గార్ల ఆశీర్వాద వచనాలతో ఆ వనితను వివాహమాడి ఇస్లాం మతం స్వీకరించి తన పేరు ఆటా మహమ్మద్ ఖాన్‌గా మార్చుకున్నాడు.

మహమ్మద్‌ఖాన్ (రాంతను) స్వామి హరిదాసు శిష్యరికం వదలకుండా దర్శించుకుంటూ ఉండేవాడు. యోగవిద్యలను స్వామి హరిదాసునుండి, సూఫీ తత్వం బాబా ఘవుస్ గారి నుంచి నేర్చుకుని గొప్ప సంగీత కళాకారుడుగా రూపొందాడు.

కొంతకాలము రేవా దివాణంలో ఉండి ఆ తర్వాత అక్బరు చక్రవర్తి దివాణంలో చేరాడు. అక్కడ ప్రధాన గాయకుడిగా నియమించ బడ్డాడు మహమ్మద్‌ఖాన్. సంగీత సాహిత్యాలను మెండుగా పోషించాడు అక్బరు. ధ్రువపద సంగీతం పరాకాష్ట అందుకుంది.

మహమ్మద్‌ఖాన్ సంగీత ప్రావిణ్యానికి అక్బరు అచ్చెరువొంది 'మియా తాన్‌సేన్' అనే బిరుదునిచ్చి సత్కరించాడు.

తాన్‌సేన్ అనేక ఇంద్రియ శక్తులను గడించాడు. సంగీతంలో అనేక మహాత్మ్యాలు సాధించాడు. 'దీపక్' రాగంలో పాడితే దీపాలు వెలిగాయని, 'మేఘలహరి' రాగంలో పాడగా వర్షం కురిసిందని చరిత్ర తెలియచేస్తున్నది.

తాన్‌సేన్ అనేక రాగాలను సృష్టించి ప్రచారంలోకి తీసుకువచ్చాడు. ఇప్పటికీ ఆ రాగాలు ఆయన పేరు మీదనే ప్రచారం జరుగుతున్నాయి. అటువంటి రాగాలలో కొన్ని మియాకీమలహర్, మియాకితోడి, మియాకీ సారంగ్, దర్బారీ కాన్నడ మొ. అలాగ తాన్‌సేన్ సంగీత ప్రపంచంలో చరిత్రను సృష్టించి చిరస్థాయిగా నిలిచిపోయాడు.

## పాశ్చాత్య సంగీతము - గ్రామఫోన్ రికార్డులు

విదేశాలలో సంగీతము దాదాపుగా 1500 సంవత్సరాల నుంచి వృద్ధి పొందుతున్నది. భారతదేశాన్ని ఇంగ్లీషువారు పరిపాలించేటప్పుడు, గ్రామఫోన్, గ్రామఫోన్ రికార్డుల శకము ప్రారంభంలో యూరోపియన్ సంగీతానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉండేది. యూరోపియన్ మ్యూజిక్ గ్రామఫోన్ రికార్డులుగా మన దేశానికి దిగుమతి అయ్యేది. రానురాను ప్రాంతీయ భాషలో గ్రామఫోన్ రికార్డుల తయారీ ప్రారంభమయింది.

విదేశాలలో మూకీ చిత్రాల నిర్మాణము ప్రారంభమయింది. ఆ చిత్రాలు మనదేశంలో ప్రదర్శింపబడేవి. క్రమేణా టాకీ చిత్రాలలోని ఇంగ్లీషు సంగీతాన్ని గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయ్యేవి. అవేకాక రకరకాల పాటలు, హాస్యగీతాలు ఇంగ్లీషు భాషలో రికార్డులుగా విడుదల అవుతూండేవి. వాద్య సంగీతపు రికార్డులు కూడా విడుదల అవుతూ ఉండేవి. ఈ సంగీతం 78 ఆర్‌పిఎం, 45 ఆర్‌పిఎం, $33^{1/3}$ ఆర్‌పిఎం రికార్డులుగా క్రమేణా విడుదల కాసాగాయి.

పాశ్చాత్య సంగీతములో బాగా పాపులర్ అయిన సంగీతము - పాప్ మ్యూజిక్, రాక్ అండ్ రోల్, బీటిల్స్, వెంచర్స్, అబ్బా- ఇలాగ ఎన్నో ఉన్నాయి. ఆనాటి ప్రముఖ కళాకారులు క్లిఫ్ రిచర్డ్, ఎల్విస్ ప్రిస్లీ, పాట్ బూన్, డీన్ మార్టిన్, ఫ్రాంక్ సినాట్రా, మైకేల్ జాక్సన్, మడొన్నా మొదలైన వారు పాడిన ఎన్నో పాటలను గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి బహుళ ప్రజాదరణపొందాయి.

**పాప్ మ్యూజిక్ :** దీన్ని నిర్వచించాలంటే - యువతను ప్రభావితం చేసే పద్ధతిలో, వాణిజ్యపరంగా చేసిన సంగీతం. రాక్, రాక్ అండ్ రోల్‌తో కూడుకున్నది. సంగీతం సామాన్యులకు అందాలనే ముఖ్య ఉద్దేశము గల నాన్-క్లాసికల్ సంగీతం. ఇది అమెరికాలో 1926లో మొదటసారిగా గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయినట్లు తెలుస్తున్నది. 1950 దశకం మధ్యకాలం నుంచి బాగా పాపులర్ అయింది.

సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రతిబింబిస్తూ డాన్స్ చేయటానికి వీలుగా బీట్, రిథమ్‌తో కూడుకున్న యీ సంగీతాన్ని బాగా ప్రచారం చేసిన కళాకారులు ఎల్విస్ ప్రిస్‌లీ, మైకేల్ జాక్సన్, మడోనా మొదలైనవారు. మనదేశంలో పాప్ మ్యూజిక్‌ను బాగా పాపులర్ చేసినది ప్రముఖగాయని ఉషా ఉతుప్. వీరి పాటలు గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి ప్రజాదరణ పొందాయి.

1965, 1966 సంవత్సరాలలో ఆంధ్రా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేటప్పుడు నా మిత్రుడు కీ॥శే॥ అందె గోపాలకృష్ణ పాప్ మ్యూజిక్ రికార్డ్స్ పెట్టి విద్యార్థులను పిలిచి వినిపించేవాడు. సామాన్యులకు కూడా పాప్ సంగీతాన్ని గురించి తెలియ చెప్పాలనే ప్రయత్నంలో "పాప్ మ్యూజిక్" అనే పుస్తకం రాశాడు.

**రాక్ అండ్ రోల్ :** ఇది ఒక ప్రత్యేకమైన శైలిలో సాగే సంగీతం. 1940 దశకంలో అమెరికాలో ఉద్భవించిన సంగీతం. ఇది అనేక రకాల సంగీతాల కలయిక, ఈ సంగీతానికి కారకులు ఆమెరికాలో నివసించే నల్లజాతివారు. రాక్ అండ్ రోల్ సంగీతములో ఎలక్ట్రికల్ గిటార్, బాస్ గిటార్, డ్రమ్స్ మొదలుగు వాయిద్యాలతో పాటుగా గాత్ర సంగీతము ఉంటుంది. ఇందులో బీట్ డ్రమ్స్ ద్వారా వినిపిస్తుంది.

1960 దశకానికి ఈ సంగీతము ప్రపంచమంతా బహుళ ప్రజాదరణ పొందినది. టి.వి.ఛానెల్స్, సినిమాలలో కూడా విజయ ఢంకా మ్రోగించింది. ప్రజల జీవిత విధానంలో, ఆలోచనలో మార్పు తెచ్చింది. నల్లజాతీయులు,శ్వేతజాతీయులు పరస్పరము గౌరవించుకోవటానికి అద్భుతంగా పనిచేసింది. ఫాషన్, నడవడికలలో మార్పు తెచ్చింది. దీని గ్రామఫోన్ రికార్డులు లక్షలాదిగా అమ్ముడుపోయి గ్రామఫోన్ కంపెనీలకు అధికలాభాలను చేకూర్చింది.

ఈ సంగీతాన్ని విపరీతంగా ప్రచారం చేసిన కళాకారుడు ఎల్విస్ ప్రీస్లీ డ్రగ్స్‌కు బానిసగా మారి చిన్నవయస్సులో (43 సం॥లు) మరణించాడు. ఈతనిని "కింగ్ ఆఫ్ రాక్ అండ్ రోల్" అని పిలిచేవారు. 1960 దశకం తర్వాత ఈ సంగీతానికి ఆదరణ తగ్గింది. దీనికి ముఖ్యకారణము - కొందరు కళాకారులు మరణించటం.

భారతీయ భాషా చిత్రాలలోకూడా కొంతమంది సంగీత దర్శకులు రాక్ అండ్ రోల్ సంగీతాన్ని అనుకరించి కొన్నిపాటలకు బాణీలు కట్టారు. (హిందీ చిత్రం "ఆశా", తెలుగులో "ఆరాధన", "అత్తా ఒకింటి కోడలే" మొ॥నవి).

**ది వెంచర్స్ :** ఇది అమెరికన్ రాక్ బాండ్ వాద్యసంగీత బృందం. 1958లో అమెరికాలోని వాషింగ్టన్ లోని టొకోమా అనే ఊరిలో ఈ సంస్థ ప్రారంభమయింది. దీని వ్యవస్థాపకులు డాన్ విల్సన్, బాబ్ బోగ్లె. విల్సన్ రిథమ్ గిటార్ వాయించటములో ప్రసిద్ధుడు. బాబ్ లీడ్ మరియు బాస్ గిటార్ వాద్యములలో నిపుణుడు.

ఈ బృందములో నోకి ఎడ్వర్డ్స్, లీడ్ గిటార్ ఆర్టిస్టుగా ప్రవేశించాడు. ఆ తర్వాత మెల్ టేలర్ (డ్రమ్స్), గెర్రి మెక్‌గి (లీడ్ గిటార్), లియాన్ టేలర్ (డమ్స్), బాబ్ స్పాడింగ్ (లీడ్ గిటార్, బాస్ గిటార్) చేరారు. వీరి సంగీతము ప్రత్యేక శైలిలో ఉండి సూపర్‌హిట్ అయింది. వీరి సంగీతం ప్రపంచం మొత్తాన్ని ఉర్రూత లూగించింది. వీరి సంగీతంలో విడుదల అయిన గ్రామఫోన్ రికార్డులు మిలియన్స్‌లో అమ్ముడుపోయాయి. ఈ బృందం ప్రపంచమంతటా పర్యటించి 2008లో 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అదే సంవత్సరంలో "రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్'' లో గౌరవించబడినది. వీరు సంగీతానికి చేసిన సేవలకు గుర్తింపుగా జపాన్ ప్రభుత్వము ఉచితరీతిలో సత్కరించింది. ఇది చాలా అరుదైన గౌరవము.

**బీటిల్స్ :** బీటిల్స్ అనేది ఇంగ్లీష్ రాక్ బ్యాండ్. ఇది ఇంగ్లండులోని లివర్‌పూల్‌లో 1960లో ప్రారంభించబడింది. వీరు పాప్ మ్యూజిక్‌ను, రాక్ సంగీతాన్ని పాడి వాణిజ్యపరంగా విజయవంతమై పేరు గాంచిన బృందం. 1962 నుండి ఈ సంస్థలో జాన్ లెనన్ (రిథమ్ గిటార్, వోకల్), పాల్ మెకార్టెని (బాస్ గిటార్, వోకల్), జార్జి హారిసన్ (లీడ్ గిటార్, వోకల్) రింగో స్టార్ (డ్రమ్స్) ముఖ్యసభ్యులు.

వీరు ప్రపంచమంతా పర్యటించి వారి సంగీతాన్ని శ్రోతలకు వినిపించి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు గడించారు. ఈ బృందాన్ని సామాజిక, సాంస్కృతిక జీవనంలో పరివర్తన తెచ్చినవారుగా భావించేవారు శ్రోతలు. వీరి సంగీతం గ్రామఫోన్ రికార్డులుగా విడుదల అయి లక్షల లక్షలు అమ్ముడుపోయాయి. 1986లో బీటిల్స్ బృందము అమెరికాలోని "రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్''లో గౌరవింపబడింది.

**కమ్ సెప్టెంబర్ :** ఇది రొమాంటిక్ కామెడి సినిమా. ఇందులో ఇటాలియన్ బ్యూటీ జినలొలా బ్రిగిడా, రాక్ హడ్సన్, బాబి డారిన్ నటించారు. సంగీతము హాన్స్ జె. సాల్టర్. ఈ చిత్రం ఇంగ్లీషు. ఇటాలియన్ భాషలలో నిర్మించబడింది. 9-8-1961న విడుదలై విజయవంతమయింది.

ఈ చిత్రంలో థీమ్ ట్యూన్ "కమ్ సెప్టెంబర్" వాద్యసంగీతము బహుళ ప్రజాదరణ పొందింది. బాబి డారిన్ ఈ సంగీతానికి నర్తించాడు. ఈ వాద్యసంగీతం, ఆ రోజులలో 78 ఆర్‌పిఎం రికార్డుగా మనదేశంలో విడుదల అయి సూపర్‌హిట్ అయింది. ప్రపంచమంతా ఈ సంగీతము శ్రోతలను ఆకర్షించింది. ఆ తర్వాత 1975లో ఈ సంగీతము 45 ఆర్‌పిఎం ఇ.పి. రికార్డుగా భారతదేశంలో విడుదల అయింది. ఆర్కెస్ట్రా సమకూర్చింది - 'బిల్లీ వాఘన్ అండ్ హిజ్ ఆర్కెస్ట్రా' !

ఆ రోజులలో ఈ సంగీతము వినబడని చోటు లేదు. ముఖ్యంగా ఇంగ్లీషు చిత్రాలు ప్రదర్శించే సినిమా హాళ్లలో ఈ మ్యూజిక్ తప్పక వినబడుతుండేది.

**అబ్బా :** "అబ్బా" స్వీడన్ దేశానికి చెందిన పాప్ మ్యూజిక్ బృందం. ఆంగ్లేతర సంగీత బృందాలలో చెప్పుకోతగ్గ గ్రూపు యిది. వీరిలో బిజార్న్ స్వీడన్ దేశంలో ప్రసిద్ధి చెందిన జానపద సంగీత ('ఫోక్ మ్యూజిక్') గాయకుడు. బెన్నీ యాండర్సన్ స్వీడన్‌లోని అతిపెద్ద పాప్ మ్యూజిక్ సంస్థలో కీబోర్డు వాద్యకళాకారుడు. 1969 నుంచి వీరిద్దరూ కలిసి కంపోజర్స్‌గా స్థిరపడ్డారు. అగ్నేథా ఫాల్ట్‌స్కాగ్, ఏనీ ఫ్రెడ్ లింగ్‌స్టాడ్ స్వీడన్‌లో ప్రఖ్యాత గాయనీమణులు. 1970లో ఈ నలుగురు కలిసి పాటలు పాడటము, వాద్యసహకారము అందించటము ప్రారంభించారు.

వీరి సంగీత కార్యక్రమాలు ప్రారంభంలో ప్రజాదరణ పొందకపోయినా క్రమేణా చాలా పాపులర్ అయ్యారు. వీరి నలుగురు పేర్లలో మొదటి అక్షరములు తీసుకుని వారి బృందానికి ABBA అని పేరు పెట్టుకున్నారు. 1974 కల్లా అబ్బా ప్రపంచమంతా ప్రసిద్ధిచెంది అంతర్జాతీయ అవార్డులనుకూడా అందుకున్నారు. లోకమంతా పర్యటించి వారి సంగీతాన్ని శ్రోతలకు అందించారు. 1978కల్లా మెగాస్టార్స్ అయ్యారు. వారి వస్త్రధారణ శ్రోతలను విశేషంగా ఆకర్షించేదట. ఈ బృందసభ్యుల్లో అగ్నేథా, బిజార్న్‌లు బెన్నీ, ఏనీఫ్రెడ్‌లు వివాహం చేసుకున్నారు.

వీరి కార్యక్రమాలు గ్రామఫోన్ రికార్డులుగా, వీడియో కాసెట్స్‌గా విడుదల అయి విపరీతంగా అమ్ముడుపోయాయి. 1982లో యీ బృందం విడిపోయింది. మన భారతదేశంలో కూడా వీరు పాడిన గ్రామఫోన్ రికార్డులు విడుదల అయ్యాయి. ఈ బృందం 2010లో 'రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్' గౌరవాన్ని అందుకున్నారు.

**సౌండ్ ఆఫ్ మ్యూజిక్ :** ఆ రోజులలో చరిత్ర సృష్టించిన ఇంగ్లీషు చిత్రం "సౌండ్ ఆఫ్ మ్యూజిక్" ! ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్ వారు జూలీ ఆండ్రూ హీరోయిన్‌గా, క్రిస్టఫర్ ప్లమర్ హీరోగా నిర్మించిన యీ చిత్రం సంగీతపరంగా బహుళ ప్రజాదరణ పొందింది. చిత్రగీతాలను ఆస్కార్ హేమ్‌స్టీన్ ॥ రాయగా సంగీతం రిచర్డ్ రోజర్స్ సమకూర్చారు. ఇందులోని పాటలన్నీ సూపర్‌హిట్. గ్రామఫోన్ రికార్డు లేబుల్ మీద ఆర్‌సిఏ, విక్టర్ అని ఉంటుంది. కాని ఈ ఎల్‌పి రికార్డును తయారు చేసింది - కలకత్తాలోని (హెచ్‌ఎంవి) గ్రామఫోన్ కంపెనీవారు.

**రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్ :** అమెరికాలోని ఓహియో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్‌లో 1986లో ఈ సంస్థ ప్రారంభించబడినది. ఈ సంస్థ ముఖ్యఉద్దేశ్యము - సంగీతంలో, ముఖ్యంగా రాక్ అండ్ రోల్ సంగీతములో - సంచలనము సృష్టించి బహుళ ప్రజాదరణ పొందిన కళాకారులను, బాండ్‌బృందాలను, నిర్మాతలను మొదలైనవారిని గుర్తించి గౌరవించటం. ఈ గౌరవాన్ని అందుకున్నవారిలో జెర్రీ లూయిస్, ఎల్విస్ ప్రిస్‌లీ, బీటిల్స్, వెంచర్స్, అబ్బా, మైకేల్ జాక్సన్, మడోనా మొదలైన ప్రముఖులెందరో ఉన్నారు.

**పాశ్చాత్య సంగీత రికార్డుల లేబుల్స్ :** భారతదేశంలో విడుదల అయిన పాశ్చాత్య సంగీత గ్రామఫోన్ రికార్డుల వివిధ లేబుల్స్

01. సౌండ్ అండ్ సుపర్బ్, పాథే-మార్కొని-ఇఎంఐ
02. వింగ్స్, ఎరేంజ్‌మెంట్ విత్ ఎటివి మ్యూజిక్ లి
03. అట్లాంటిక్ రికార్డింగ్ కం. న్యూయార్క్
04. పోలీడార్
05. కాపిటల్ రికార్డ్స్ INC యుఎస్ఏ
06. ప్రమోటోన్ బివి
07. లిబర్టీ రికార్డ్స్ INC
08. ఎపిక్ ట్రేడ్‌మార్క్ ఆఫ్ సిబిఎస్ INC
09, కరుస్సెల్, వెస్ట్ జర్మనీ, గెమా
10. యునైటెడ్ ఆర్టిస్ట్స్ రికార్డ్స్, కాలిఫోర్నియా

11. సిబిఎస్ INC

12. ఆర్‌సిఎ, విక్టర్ మొ॥నవి

ఈ కంపెనీలు గ్రామఫోన్ రికార్డులు ఇండియాలో తయారుచేసి విక్రయించేవారు.

**78 ఆర్‌పిఎం రికార్డుల శకం అంతం :** వినైల్‌తో చేసిన గ్రామఫోన్ రికార్డుల వలన చాలా ప్రయోజనాలు ఉండటము చేత పాపులర్ అయాయి. క్రమేనా 78 ఆర్‌పిఎం రికార్డుల తయారీ, అమ్మకాలు తగ్గిపోయాయి. ఇంగ్లండ్‌లోని ఇఎమ్ఐ (EMI) కంపెనివారు 1960 దశకంలో ఆఖరి షెల్లాక్ 78 ఆర్‌పిఎం రికార్డు విడుదల చేసినట్లు తెలుస్తున్నది. మనదేశములో 78 ఆర్‌పిఎం రికార్డుల ఉత్పత్తి ఏ సంవత్సరము నుంచి ఆగిపోయిందో చెప్పటము కష్టము. 1974లో భారతరత్న లతా మంగేష్కర్ "ఫిర్ కబ్ మిలోగే" హిందీ చిత్రములో పాడిన పాటలు రికార్డులుగా వచ్చాయని, ఇదే ఆఖరి 78 ఆర్‌పిఎం రికార్డు అని కొంతమంది ప్రముఖుల అభిప్రాయము.

**గ్రామఫోన్ రికార్డుల దుస్థితి :** సదుపాయాలు, సౌకర్యాలు లేని రోజులలో ఎందరో మహానుభావులు రికార్డింగ్ యంత్రాలు, గ్రామఫోనులు, గ్రామఫోన్ రికార్డులు మొదలైనవి కనుగొని ఎందరో కళాకారుల కంఠస్వరాన్ని, సంగీతాన్ని వినిపించి సంగీత ప్రియులను ఆనందింపచేసారు.

ప్రముఖ గాయక సంగీత దర్శకులు పద్మశ్రీ ఘంటసాల వారి స్వీయసంగీతంలో శ్రీశ్రీ రచించగా గానం చేసిన "మేనకోడలు" చిత్రంలోని పాట -

***'బ్రతుకే చీకటాయే, తనువే భారమాయే***

***ఎటు చూచినా, ఎటుపోయినా***

***ఏ దారి లేకపోయే...*** ' అన్నట్లుగా గ్రామఫోను రికార్డులకు నేడు దుర్గతి పట్టింది.

ఆనాడు తయారు అయిన 78 ఆర్‌పిఎం రికార్డు లెన్నో విరిగిపోయాయి. అలంకరణ వస్తువులుగా వాడబడుతున్నాయి. ప్లాస్టిక్ వినైల్ రికార్డులు రీసైక్లింగ్ చేసి ప్లాస్టిక్ వస్తువులుగా తయారు చేయటానికి వాడారు, వాడుతున్నారు. రికార్డులను

భద్రపరచే కవర్లు - పేపర్‌తో చేసినవి, కార్డ్‌బోర్డుతో చేసినవి - పేపర్ మిల్స్‌లో గుజ్జు (పల్ప్) తయారై పేపర్‌గా తయారు చేయ బడుతున్నాయి.

ఈ కవర్లమీద ఎంతో విలువగల సమాచారము అద్భుతమైన ఫోటోలు ముద్రింపబడ్డాయి. అవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి, పోతున్నాయి. ఈ సమాచారము స్థలాభావం వలన సిడీల కవర్ల మీద రావటం లేదు. కనీసం రచయిత పేరు, సంగీత దర్శకుల పేర్లు కూడా ముద్రించబడటము లేదు.

గ్రామఫోన్ రికార్డులు భద్రపరచే రికార్డ్ కలక్టర్స్ దగ్గర అతి తక్కువ సంఖ్యలో రికార్డులు ఉన్నాయి. కొన్ని సంస్థలు దాచి వుంచిన రికార్డుల సంఖ్య అంతకంటె స్వల్పం.

## సరెగమ ఇండియా లిమిటెడ్

మన భారతదేశములో హెచ్ఎంవి సంస్థ ప్రారంభించబడి 110 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 1980 దశకంలో యీ సంస్థను ఇఎమ్ఐ, లండన్ నుండి ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్‌పిజి ఎంటర్‌ప్రైజెస్ అధినేత శ్రీ రామ్‌ప్రసాద్ గోయంకా (ఆర్ పి గోయంకా) కొనుగోలు చేసారు. దీనిని ఇప్పుడు 'సరెగమ' అని పిలుస్తారు.

ఇండియాలో మొదటి పాట రికార్డు 1902లో అయింది. 1992 లో ఆర్కయివ్స్ తరచి చూసి తమ వద్దనున్న సంగీత ఖజానా నుంచి 90 సంవత్సరాలుగా భారతదేశంలో రికార్డింగ్ అవుతున్న సంగీతాన్ని మొదటపాట నుంచి ఒక క్రమపద్ధతిలో ఎన్నుకొని "50 అవర్స్ ఆఫ్ మ్యూజిక్ ఫ్రమ్ 90 ఇయర్స్" (90 సంవత్సరాల సంగీతం నుండి 50 గంటల సంగీతం) అనే కాన్సెప్ట్‌తో కాసెట్స్‌గా, సిడీలుగా రూపొందించాలి అనుకున్నారు. వాటిని 'ఛైర్మన్స్ ఛాయిస్' అనే టైటిల్‌తో విడుదల చేయాలని ప్రారంభించారు.

దీనిలోని మొదట ప్రయత్నముగా మొట్టమొదటి కాసెట్, మొదటి సిడిని ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ బి.కె. బిర్లాగారి సతీమణి శ్రీమతి డా॥ సరళా బిర్లా గారు 10-5-1994న విడుదల చేసారు. ఈ ఆవిష్కరణ మహోత్సవం కలకత్తాలో ప్రముఖుల సమక్షంలో జరిగింది. ఆనాటి సభలో గ్రామఫోన్ కంపెనీవారు కీ॥శే॥ గౌహర్ జాన్ పాడగా రికార్డు అయిన మొదటి పాటను కూడా వినిపించారు. ఆ సభలో, గౌహర్



ఆర్.పి.జి. యాజమాన్యము :

ఆర్.పి. గోయంకా, హెచ్.వి. గోయంకా, ఎస్. గోయంకా

# గ్రామఫోన్ రికార్డ్ స్లీవ్స్






## డా. సి. నారాయణరెడ్డి గారు గానం చేసిన గజల్స్ రికార్ట్









EMI
GOLDEN HITS OF OLDEN TIMES
MOTION PICTURE MUSIC
TELUGU



EMI
PLEASING SONGS FROM POPULAR FILMS (Telugu)
MOTION PICTURE MUSIC



FROM THE ORIGINAL SOUND TRACK
జగదేకవీరునికథ
Vijaya Productions (P) Ltd.
JAGADEKA VEERUNI KATHA
Music :
PENDYALA


HYPNOTIC MELODIES
(POPULAR HITS OF GHANTASALA)
(Telugu Film Tunes)
Instrumental
N. L. SUBHASH AND HIS ORCHESTRA



EMI
GHANTASALA VENKATESWARA RAO
KUNTI KUMARI


33ESX. 11512
FOLK SONGS
FROM TELUGU FILMS
SIDE ONE
YERUVAAKA
Jikki
Lyric: Kosaraju
Music: Venu
CHETTULEKKA GALAVA
P. Susheela & P. B. Srinivas
Lyric: Arudra
Music: S. Rajeswara Rao
Film: Chenchu Lakshmi
TOWN PAKKA
Ghantasala & P. Susheela
Lyric: Kosaraju
Music: Venu
POGARU BOTHU
Ghantasala
Lyric: Kosaraju
Music: S. Rajeswara Rao
SARIGANCHU CHEERA
Ghantasala & P. Susheela
Lyric: Kosaraju
Music: Pendyala
SIDE TWO
MAAMA MAAMA
Ghantasala & Jamuna Rani
Lyric: Kosaraju
Music: K. V. Mahadevan
Film: Manchi Manasulu
GOWRAMMA
Ghantasala, P. Susheela & Chorus
Lyric: Kosaraju
Music: K. V. Mahadevan
Film: Mooga Manasulu
PAANDAVULU
P. Susheela
Lyric: Athreya
Music: K. V. Mahadevan
Film: Akkachellelu
PATTALI ARAKA
S. P. Balasubrahmanyam & Chorus
Lyric: Dr. C. Narayana Reddy
Music: S. Rajeswara Rao
Film: Chitti Chellelu
LONG PLAY 33⅓ R.P.M. RECORD
EMI
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED


SUPERB HITS OF
S.P. BALASUBRAHMANYAM
TELUGU
EMI
MOTION PICTURE MUSIC


DIL EK MANDIR
Music: Shankar-Jaikishan


from the original soundtrack
EMI
TEESRI MANZIL


RUPAM CHITRA
ANAND
Music: Salil Chowdhury Lyrics: Gulzar & Yogesh
FROM THE ORIGINAL SOUNDTRACK
EMI



Binaca Geet Mala
A Silver Jubilee Presentation by Ameen Sayani
EMI



MOCE 4116
music direction • NAUSHAD • lyrics • MAJROOH
JHOOM JHOOM KE NACHO AAJ
TU KAHE AGAR
TOOTE NA DIL TOOTE NA
• mukesh
TOD DIYA DIL MERA
KOI MERE DIL MEN
• lata mangeshkar
UTHAYE JA UNKE SITAM
• lata mangeshkar
YUN TO APAS MEN BIGADTE HAIN
• lata mangeshkar & mohd. Rafi
HUM AAJ KAHIN DIL KHO BAITHE
• mukesh
MERI LADLI
• lata mangeshkar & chorus
DAR NA MOHABBAT KARLE
• lata mangeshkar & shamshad begum
mehboob productions
ANDAZ
LONG PLAY 33⅓ R.P.M. RECORD
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED



ECLP 5933
R. K. FILMS present
AAG
Music: RAM GANGULI
SIDE ONE:
Zinda Hoon Is Tarah
Mukesh
Lyric: Behzad Lucknavi
Dil Toot Gayaji
Shamshad Begum
Lyric: Behzad Lucknavi
Raat Ko Ji
Mukesh & Shamshad Begum
Lyric: Majrooh
Kahe Koyal Shor Machaye Re
Shamshad Begum
Lyric: Behzad Lucknavi
SIDE TWO:
Dekh Chand Ki Aur
Shailesh & Shamshad Begum
Lyric: Deepak
Solah Baras Ki
Shamshad Begum, Mohd. Rafi & Chorus
Lyric: Behzad Lucknavi
Na Ankhon Men Ansoo
Shamshad Begum
Lyric: Behzad Lucknavi
Music
EMI
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED
Reproduced From
OLD RECORDINGS



STEREO
MERE WATAN KE LOGO
EMI
REGAL



EMI
BABUL
ORIGINAL
SOUNDTRACK
RECORDING



ORIGINAL SOUNDTRACK RECORDING
EMI
NAGINA


AWĀRA
AN ORIGINAL SOUNDTRACK RECORDING
EMI


EMI
"JUGNU"
Music
FEROZ NIZAMI



Basant Bahar
EMI
FROM
THE
ORIGINAL
SOUNDTRACK


EMI
PRASAD PRODUCTIONS PRIVATE LTD.
SASURAL
music: SHANKAR JAIKISHAN
lyrics: SHAILENDRA · HASRAT JAIPURI
FROM THE ORIGINAL SOUNDTRACK


EMI
FROM THE ORIGINAL SOUNDTRACK
GUIDE


EMI
AN ORIGINAL MOTION PICTURE SOUNDTRACK ALBUM
MEHBOOB PRODUCTIONS
AMAR
Music: Naushad


SUNNY ART PRODUCTIONS LTD.
UranKhatola
Music Naushad
Lyrics: Shakeel Badayuni
Old Recordings
FROM THE ORIGINAL SOUNDTRACK


KARNATAK MUSIC HOUSE
LBY-1274
(BLP 2037)
A Dolton Recording
THE VENTURES
à go-go
The number one sound of the sixties is the go-go sound. It is the sound heard in France, Japan, the United States, and even behind the Iron Curtain! It is the sound that has brought about such dances as the Watusi, the Frug, the Monkey, the Swim or the you-name-it.
The number one instrumental group of the sixties, and also of the world, is The Ventures. No other group has consistently remained on top for such a long period of time. No other group has sold as many dance records and had so many people dancing to these records.
So, take the number one sound, plus the number one instrumental group, and what do you do? You give them the number one hits! Current hits like "(I Can't Get No) Satisfaction," "The 'In' Crowd," "Wooly Bully," and "Whittier Blvd." to guarantee the perfect combination for the go-goingest LP going!
SIDE ONE
1. (I Can't Get No) Satisfaction
2. Go-Go Slow
3. Louie Louie
4. Night Stick
5. La Bamba
6. The "In" Crowd
SIDE TWO
1. Wooly Bully
2. A Go-Go Guitar
3. A Go-Go Dancer
4. The Swingin' Creeper
5. Whittier Blvd.
6. I Like It Like That
THE VENTURES
LONG PLAY 33⅓ R.P.M. RECORD
Manufactured & Distributed by
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED
DUM DUM ● INDIA


STEREO 2344145
ABBA Greatest Hits Vol. 2
INCLUDING THE HIT-SINGLE: Gimme, Gimme, Gimme (A MAN AFTER MIDNIGHT)
polydor

జాన్ పాడుతుండగా ఆవిడ పాటలు విన్నవారు కూడా ఉండి, ఆనాటి మధురస్మృతులను నెమరు వేసుకొన్నారు.

'ఛైర్మన్స్ ఛాయిస్' సీరీస్‌లో విడుదల అయిన కాసెట్స్, సిడీల ద్వారా ఎందరో ప్రముఖుల సంగీతం యీ తరానికి అందుబాటులోకి వచ్చింది. పైరసీ విపరీతముగా నడుస్తున్న ఈ కాలంలో కూడా యీ సంస్థ అనేక ఆటుపోట్లకు తట్టుకుంటూ సంగీత సేవలను అందిస్తున్నారు. ఆనాటి పాటలను ఈనాడు కూడా సి.డి.ల రూపంలో విడుదల చేస్తూనే ఉన్నారు.

రికార్డింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చినా సంగీత ప్రియులకు గ్రామఫోన్ రికార్డ్స్ మీద నుండి మనస్సు మళ్లలేదు. ఈ సంస్థవారు గ్రామఫోన్ ఎల్‌పి రికార్డులను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రికార్డ్స్‌ను ప్లే చేసే గ్రామఫోన్స్ (రికార్డ్ ప్లేయర్స్)ను కూడా విక్రయిస్తున్నారు. సంగీత ప్రియులు వీటిని ఆదరిస్తున్నారు. అమ్మకాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పుడు విడుదల అవుతున్న ఎల్‌పి రికార్డుల రికార్డింగ్ నాణ్యత అత్యద్భుతం. కొద్దికాలంలో మరలా గ్రామఫోన్ రికార్డుల వైభవం చూడవచ్చని అనిపిస్తోంది.

**నూరు వసంతాల నిప్పర్ :** నిప్పర్ కుక్కపిల్లను 1884లో ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్‌లో నివసించే మార్క్ బరాడ్ తెచ్చి పెంచుకున్నాడు. అతను మరణించిన తర్వాత మార్క్ సోదరుడు ఫ్రాన్సిస్ సంరక్షకుడిగా ఉండి ఆ కుక్క గ్రామఫోన్ గొట్టములో నుంచి వచ్చే యజమాని కంఠస్వరాన్ని వింటున్నట్లుగా కూర్చున్న చిత్రాన్ని పెయింటింగ్ చేసి గ్రామఫోన్ కంపెనీవారికి అమ్మాడు. ఈ పెయింటింగ్‌ను గ్రామఫోన్ కంపెనీవారు హెచ్ఎంవి లోగోగా రికార్డులమీద వాడారు అని తెలుసుకున్నాము.

అసలు విషయము, విశేషము ఏమిటంటే 1984లో గ్రామఫోన్ కంపెనీవారు (హెచ్ఎంవి) నిప్పర్ శతజయంతిని ఘనంగా జరిపారు. ఇది గొప్ప విశేషము. ఈనాటికి ఫ్రాన్సిస్ వేసిన పెయింటింగ్ ఇంగ్లండులోని EMI ఆర్కైవ్స్‌లో ప్రవేశద్వారము దగ్గర భద్రంగా ఉంచారుట.

# రేడియో

విద్యుత్ తీగలు (ఎలక్ట్రిక్ వైర్లు) లేకుండా, ఎలక్ట్రో మాగ్నటిక్ తరంగాల ద్వారా సందేశాలను పంపటానికి, తిరిగి వాటిని వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. **1894**లో మార్కోని రేడియో తరంగాలను వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ కొరకు ఉపయోగించవచ్చును అనే ఆలోచన చేసాడు. **1895**లో రేడియో సిగ్నల్స్ కొంత దూరము పంపగలిగాడు (ట్రాన్స్‌మిషన్) కూడా. **1896**లో దీనికి బ్రిటిష్ పేటెంట్‌ను పొందాడు. **1898**లో రేడియోలు, వాటికి కావలసిన పరికరాలు తయారు చేసే ఫ్యాక్టరీని స్థాపించాడు. **1907**లో ఒక దేశము నుండి మరొక దేశానికి మొదటిసారిగా వ్యాపారపరంగా సమాచారాన్ని పంపే ఏర్పాటు చేసాడు.

**1922** నుంచి బ్రిటన్ దేశములో మార్కొని తన పరిశోధనాలయము నుంచి క్రమపద్ధతిలో వైర్‌లెస్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ప్రజలను రంజింపచేసాడు. మొట్టమొదటిసారిగా రేడియో వార్తలను అమెరికాలోని డెట్రాయిట్ పట్టణంలో **31-8-1920**న ప్రసారం చేసినట్లు తెలుస్తున్నది.

**రేడియో ఎలా పనిచేస్తుంది :** ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌ను అందుకుని దాన్ని తిరిగి వినిపించే ప్రక్రియ యాంటినా (Antenna) ద్వారా సాధ్యమవుతుంది.



మార్కోని




రేడియో

యాంటినా ఒక పొడుగాటి వైర్ (wire). రేడియో కేంద్రము నుంచి వచ్చే ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌ను అందుకుని డయోడ్ (Diode) ద్వారా స్పీకర్‌కు వెళుతాయి. అప్పుడు స్పీకర్ నుంచి ఈ ఏ.సి. సిగ్నల్స్ శబ్ద రూపములో మనకు వినబడతాయి.

**భారతదేశంలో రేడియో ప్రసారాలు :** 1927లో మొదటిసారిగా రేడియో కార్యక్రమాలను అతి తక్కువ ప్రాంతాలలో (బొంబాయి, మదరాసు) ప్రైవేట్ సంస్థలు నడిపేవి. మన దేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ గవర్నమెంట్ 1930 నుంచి "ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్" ప్రారంభించి రేడియో కార్యక్రమాలను నిర్వహించేవారు. 1936లో ఈ పేరును "అల్ ఇండియా రేడియో"గా మార్చారు. 1939 నుంచి విదేశాలలో కూడా మన భారతదేశ కార్యక్రమాలు వినగలిగినట్లు చేసారు. 1947లో మనదేశానికి స్వాతంత్ర్యము వచ్చేనాటికి మన దేశంలో ఢిల్లీ, బొంబాయి, మదరాసు, కలకత్తా, తిరుచ్చి, లక్నో లలో మాత్రమే ఆంగ్లప్రభుత్వ రేడియో స్టేషన్స్ ఉండేవి. అంటే ఆ రోజులలో తెలుగు కార్యక్రమాలు మదరాసు నుంచి మాత్రమే ప్రసారమయ్యేవి.

**ఆకాశవాణి ఢిల్లీ కేంద్రము :** ఢిల్లీ నగరములోని ఆకాశవాణి భవన్ భారతదేశములోని ఆకాశవాణి కేంద్రాలకు హెడ్‌క్వార్టర్స్. ఈ కేంద్రము జాతీయ కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది. భారతదేశంలోని వివిధ భాషలలో ఢిల్లీ కేంద్రము వార్తలు ప్రసారం చేస్తుంది. ఆకాశవాణి కేంద్రాలు రిలే చేస్తూ ఉంటాయి.

ఢిల్లీ కేంద్రములో వార్తలను వివిధ భాషలలో అతిరథ మహారథులు చదివేవారు. శ్రోతలు వార్తలు వింటానికి చాలా ఇష్టపడేవారు. ఆ రోజుల్లో వార్తలు చదివే వారిలో కొందరు ప్రముఖులను గుర్తుచేసుకుందాము.

ఇంగ్లీషు వార్తలు డిమెల్లో, నోతికారత్నం, రినీఖన్నా, శ్రీమతి అయ్యర్ మొదలగు వారు చదివేవారు. వారి కంఠాలు ఎంతో వినసొంపుగా ఉండేవి. కొందరు తర్వాత ఢిల్లీ దూరదర్శన్ కేంద్రంలో కూడా వార్తలు చదివేవారు.

ఆ రోజులలో పెద్దలు విద్యార్థులను, ఉద్యోగస్థులను ఇంగ్లీషు వార్తలు విని ఇంగ్లీషు పదాలు ఎలా ఉచ్చరించాలో నేర్చుకోమనేవారు.

తెలుగుభాషలో వార్తలు పన్యాల రంగనాథరావు, అద్దంకి మన్నార్, ప్రయాగ రామకృష్ణ, తిరుమలశెట్టి శ్రీరాములు, మంగమ్మ, కందుకూరి సూర్యనారాయణ, మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి, ఏడిద గోపాలరావు మొదలైన ప్రముఖులెందరో చదివేవారు.

వార్తలు ప్రారంభించేముందు "ఆకాశవాణి వార్తలు చదువుతున్నది ..." అని ఎవరి శైలిలో వారు చెప్పి వార్తలు చెప్పేవారు.

ప్రముఖ సినీనటులు కొంగర జగ్గయ్య చిత్రసీమలో ప్రవేశించకముందు ఖంగుమనే కంఠముతో ఢిల్లీ కేంద్రము నుండి తెలుగు వార్తలు చదివేవారు.

హిందీ భాషలో రమణ అనే ఆంధ్రుడు వార్తలు చదివేవాడు.

ఆకాశవాణి మదరాసు కేంద్రము వారు తెలుగులో ఎన్నో వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహించేవారు. అందులో సంగీత రూపకాలు, గీతావళి, శాస్త్రీయ సంగీతము, యక్షగానాలు, సాహిత్యసభలు, జానపదగీతాలు, లలిత సంగీతము, వెలుగు వెల్లువ, ప్రభాతసేవ, వీధినాటకాలు, నాటకము, మొదలైనవి ఎన్నో ప్రసారం చేయబడ్డాయి.

మొట్టమొదటి సంగీత నాటక "బిల్హణీయం" 1939లో ప్రసారమయింది. దీని రచన మల్లవరపు విశ్వేశ్వరరావు. సంగీతం సమకూర్చింది బి.వి.నరసింహారావు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రచించిన సంగీత నాటికలు "ఊర్వశి", "దక్షయజ్ఞం", "అతిథిశాల" మొదలైనవి, విశ్వనాథవారి "కిన్నెరసాని", "కోకిలమ్మ పెళ్లి" మొ॥నవి, రజనీగారి "మధురానగర గాథ", "మేఘసందేశం" మొ॥నవి.. ఇలా ఎందరో గొప్ప గొప్ప రచయితలు రచించిన సంగీతనాటకాలెన్నో మదరాసు కేంద్రము నుంచి ప్రసారితమయ్యాయి.

బసవరాజు అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, అడవి బాపిరాజు, ఆరుద్ర, శ్రీశ్రీ, కొనకళ్ల వెంకటరత్నం మొదలైన ప్రసిద్ధ కవుల గీతాలను, గాయనీ గాయకులు పాడగా ప్రసారంచేసారు.

ఆనాటి సంగీత కార్యక్రమాలలో పాల్గొన్న గాయనీగాయకులలో - భానుమతి, టి.జి.కమలాదేవి, టంగుటూరి సూర్యకుమారి, యస్.వరలక్ష్మి, బెజవాడ రాజరత్నం, రావు బాలసరస్వతిదేవి, ఎ.పి.కోమల, వైదేహి, సాలూరి రాజేశ్వరరావు, మల్లిక్, పి.బి.శ్రీనివాస్, ఘంటసాల మొదలైనవారు ఎందరో ఉన్నారు. వీరందరూ చిత్రసీమలో ప్రవేశించి ఎనలేని కీర్తి సంపాదించుకున్నారు.

మధురగాయకుడు ఘంటసాల కంఠస్వరాన్ని శ్రోతలకు మొట్టమొదటిసారిగా 30-9-1944న పరిచయం చేసింది - ఆకాశవాణి మదరాసు కేంద్రమే! దీనికి కారకులు ఆనాడు ఆకాశవాణి ఉద్యోగి - శ్రీబాలాంత్రపు రజనీకాంతరావు గారు.

**విజయవాడ కేంద్రం :** భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత 1-12-1948న విజయవాడలో ఆకాశవాణి కేంద్రాన్ని అప్పటి ఉమ్మడి మదరాసు రాష్ట్రమంత్రివర్గంలోని మంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు ప్రారంభోత్సవము చేసారు. ప్రారంభోత్సవ సమయంలో నిర్వహించబడిన కవిసమ్మేళనములో ప్రముఖ కవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, జాషువా, పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలైన పెద్దలు పాల్గొన్నారు. 1962లో వివిధ భారతి విభాగం (బి కేంద్రం) ను అప్పటి కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రారంభోత్సవం చేసారు.

విజయవాడ కేంద్రము ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలను ప్రసారం చేసి బహుళ ప్రజాదరణ పొందింది. ఆ కార్యక్రమాలలో రంగస్థల పద్యాలు, యక్షగానాలు, సంగీతపాఠాలు, లలితసంగీతం, నాటకాలు, కార్మికుల కార్యక్రమం మొదలైనవి ఎన్నో ఉన్నాయి. “గణపతి”, “సక్కుబాయి”, “కన్యాశుల్కం”, “వరవిక్రయం”, “బారిష్టర్ పార్వతీశం” మొదలైన నాటకాలు ప్రదర్శింపబడి శ్రోతలను రంజింపచేసాయి.

సినిమాలను ఒక గంటకు కుదించి సంక్షిప్త శబ్దచిత్రాలుగా ప్రసారము చేసేవారు. దీనిని నిర్వహించినది వాడ్రేవు పురుషోత్తం అని ప్రకటించేవారు. సినిమాలు ఎప్పుడు ప్రసారం చేస్తారా అని శ్రోతలు ఎదురు చూచేవారు. చిత్రం నిడివి ఒక గంటకు కుదించటము వలన కొన్ని సంభాషణలు, పాటలు తీసివేయబడేవి. వాటిని తీసివేసి ప్రసారం చేసినందుకు శ్రోతలు ఎంతో అసంతృప్తి పొందేవారు.

బందా కనక లింగేశ్వరరావు, వోలేటి వేంకటేశ్వర్లు, ప్రయాగ నరసింహశాస్త్రి, దేవులపల్లి, బాలమురళికృష్ణ, సత్యం శంకరమంచి, ఎన్.సి.హెచ్. కృష్ణమాచార్యులు, ఎన్.సి.వి.జగన్నాథాచార్యులు, బాలాంత్రపు రజనీకాంతరావు, శ్రీరంగం గోపాలరత్నం, వింజమూరి శివరామారావు వంటి ప్రయోక్తలు ఎన్నో మంచి కార్యక్రమాలను రూపొందించారు. నిలయ విద్వాంసులు అన్నవరపు రామస్వామి (వయోలిన్), దండమూడి రామమోహనరావు (మృదంగం) మొదలగు కళాకారులు ఎన్నో సేవలను అందించారు.

**హైదరాబాదు కేంద్రం :** హైదరాబాద్ స్వతంత్ర రాష్ట్రముగా ఉన్నప్పుడు (నిజామ్ ప్రభుత్వం) హైదరాబాద్‌లో 'దక్కన్ రేడియో' కేంద్రాన్ని ఒక ప్రైవేట్ సంస్థ ప్రారంభించింది. 3-2-1950న ప్రభుత్వము ఆధీనములో తీసుకుని జాతీయము చేసింది. ఉర్దూ కార్యక్రమాలు ప్రసారం చేయబడేవి. హైదరాబాద్ సంస్థానము భారతదేశములో విలీనమైన తరువాత 1-4-1950న దక్కన్ రేడియోను భారతప్రభుత్వము స్వాధీనము చేసుకుని ప్రసారాలు నిర్వహించ ప్రారంభించింది. ఉర్దూ, తెలుగు కార్యక్రమాలతో బాటుగా మరాఠీ, కన్నడ కార్యక్రమాలు ప్రసారం చేసేవారు.

1956లో హైదరాబాద్ రేడియో కేంద్రము ఆల్ ఇండియా రేడియోలో విలీనమైంది. అప్పటినుంచి ఆల్ ఇండియా రేడియో, హైదరాబాద్‌గా వ్యవహరించబడినది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటినుంచి తెలుగు కార్యక్రమాలు పుంజుకున్నాయి. దినదినాభివృద్ధి చెందుతూ ఎన్నో గొప్ప కార్యక్రమాలను తెలుగులో ప్రసారం చేయటం ప్రారంభించారు. హైదరాబాద్ రేడియో కేంద్రాన్ని అభివృద్ధి పరచటంలో ఎనలేని కృషి చేసినవారు ఉన్నారు. అందులో స్థానం నరసింహారావు, రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, రేడియో అక్కయ్య కామేశ్వరి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, బుచ్చిబాబు, పాలగుమ్మి విశ్వనాధం మొదలైన వారెందరో ఉన్నారు.

క్రమేణా ఆకాశవాణి కేంద్రాలు కడప, విశాఖపట్టణము మరియు ఇతర ప్రాంతాలలో ప్రారంభించబడినాయి.

## ఘంటసాల గాన సప్తాహము

అమర గాయకుడు ఘంటసాల షష్ఠిపూర్తి సందర్భంగా ఆం.ప్ర. లాటరీ సంస్థ 1982 డిసెంబరు నుంచి 63 వారాల పాటు సుదీర్ఘంగా 'ఘంటసాల గాన హేళను' ఆకాశవాణిలో ప్రసారం చేసారు. ఇది చారిత్రాత్మక విషయము. నిర్వాహకులు అభినందనీయులు.

ఘంటసాల గారి 91వ జయంతి సందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రము వారు 28-11-2013 నుంచి 4-12-2013 వరకు 'ఘంటసాల గాన సప్తాహం' నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఘంటసాల గారి విదేశీ కచ్చేరీలు, ఘంటసాల గారు గానం చేసిన అనువాద చిత్రాలలోని పాటలు ఒక్కొక్క కార్యక్రమం రెండు గంటల సేపు ప్రసారం చేయటం చారిత్రాత్మక విషయంగా పేర్కొనవచ్చు.

ఈ కార్యక్రమంలో ఘంటసాల గారి సతీమణి శ్రీమతి సావిత్రి గారి జ్ఞాపకాలు, ఘంటసాల గాన విశ్లేషణ, ఘంటసాల సంగీతంలో సమకూర్చిన పాటలు, వివిధ గాయనీ మణులతో గానం చేసిన పాటలు, సోలో పాటలు, సుశీలతో గానం చేసిన యుగళ గీతాలు, పద్యాలు, ప్రైవేటు గీతాలు ఇలాగ వైవిధ్యంగా కార్యక్రమాన్ని రూపుదిద్దుకోవడమే కాక ప్రతి కార్యక్రమము రెండుగంటల సేపు ప్రసారం చేయబడింది. ఈ సప్తాహం ఎంతో ప్రజాదరణ పొందటమే కాక పునఃప్రసారము కూడా చేయబడింది.

ఆకాశవాణి ప్రాంగణంలో ప్రవేశించగానే ఘంటసాల గారి ఛాయా చిత్రముతో బాటుగా

**'మన ఘంటసాల పాటలు**
**మనసున మల్లెల తోటలు'**

అని వ్రాసియున్న బానర్ (Banner) స్వాగతము పలుకుతుంది.

ఆకాశవాణి వారికి ఘంటసాల యెడల ఉన్న భక్తి శ్రద్ధలను తెలియచేస్తుంది. మరి ఘంటసాల గారి కంఠ మాధుర్యాన్ని ప్రప్రథమంగా శ్రోతలకు పరిచయము చేసింది ఆకాశవాణేకదా!

ఈ కార్యక్రమాన్ని ఎంతో అంకిత భావంతో నిర్వహించి సంగీత ప్రపంచానికి సేవచేసిన శ్రీ మంగళగిరి ఆదిత్య ప్రసాదు గారు, డెప్యూటీ డైరక్టర్ జనరల్, ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రము వారు ఎంతో అభినందనీయులు.

**ప్రయివేటు కేంద్రాలు : 2006** సంవత్సరానికి ముందు మన భారత ప్రభుత్వమే ఆకాశవాణి కేంద్రాలను నిర్వహించేది. ఆ తరువాత ప్రైవేట్ సంస్థలకు ఎఫ్ఎమ్ రేడియో కేంద్రాలు నడుపుకోవటానికి లైసెన్స్ ఇచ్చారు. అలాగ వచ్చిన కేంద్రాలలో ఒకటి - రేడియో మిర్చి స్టేషన్. **2006** జులై **1**న ఇంటర్నెట్ ద్వారా ప్రపంచమంతా తెలుగు కార్యక్రమాలను ప్రసారం చేయటానికి తెలుగువన్ రేడియో ప్రారంభించబడింది. దీనినే టోరి (TORI) రేడియో అంటారు.

**రేడియో సిలోన్ :** ఆసియా ఖండములో అతి పురాతనమైన రేడియో స్టేషన్ సిలోన్. **16-12-1925**లో మొట్టమొదటిసారిగా సిలోన్ స్టేషన్ ప్రసారాలను ప్రారంభించింది. Edward Harper సిలోన్ రేడియో స్టేషన్‌ను ప్రారంభించిన ప్రథమ వ్యక్తి. ఆ రోజులలో 'కొలంబో రేడియో'గా పిలవబడేది. గ్రామఫోన్ ఉపయోగించి రికార్డులు ప్లే చేసి వాటి సంగీతాన్ని శ్రోతలకు ప్రప్రథమంగా వినిపించారు. 'రేడియో సిలోన్'గా నామకరణం చేయబడింది.

ఈ కేంద్రము బౌద్ధ, హిందూ, ఇస్లామ్, క్రిస్టియన్ మత సంబంధ కార్యక్రమాలను నిర్వహించేవారు.

**30-9-1967**న సిలోన్ రేడియో కేంద్రము పేరును 'శ్రీలంక బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్'గా మార్చబడింది.

**రేడియో సిలోన్ - హిందీ కార్యక్రమాలు - బినాకా గీత్ మాలా :** 1950 దశకం ప్రారంభంలో సిలోన్ రేడియో హిందీ విభాగాన్ని ప్రారంభోత్సవం చేసారు. దీనివలన ప్రకటనల ద్వారా కోట్ల రూపాయల రాబడి వచ్చేది. హిందీ కార్యక్రమాలను నిర్వహించటానికి అమీన్ సయాని, గోపాల్ శర్మ, విజయ కిశోర్ దూబె, సునీల్ దత్ మొదలగు ఎందరో ప్రముఖులు ఉండేవారు. సునీల్ దత్ తర్వాత చిత్రసీమలో ప్రవేశించాడు. సినిమా సంబంధిత కార్యక్రమాలు బహుళ ప్రజాదరణ పొందాయి. లతా మంగేష్కర్, ఆశా భోన్‌స్లే, మహమ్మద్ రఫీ, ముకేష్, కిశోర్ కుమార్ మొదలైన గాయనీ గాయకుల పాటలు శ్రోతలను విశేషంగా అలరించాయి. వారూ ఎంతో ప్రజాదరణ పొందారు.

సీబా కంపెనీవారు 'బినాకా టూత్ పేస్ట్' ను విక్రయించేవారు. దీనికి సంబంధించిన కౌంట్ డౌన్ కార్యక్రమమే "బినాకా గీత్ మాలా". 'బినాకా గీత్‌మాలా' రేడియో సిలోన్‌లో **1952** లో ప్రారభించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆల్-ఆసియా హిందీ కమ్మర్షియల్ సర్వీస్ ఆఫ్ శ్రీలంక బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్ (రేడియో సిలోన్) వారు ప్రసారం చేసేవారు. ఈ కార్యక్రమము ప్రారంభంలో 30 నిమిషాల పాటు ఉండేది. చాలా ప్రజాదరణ పొందుటవలన 60 నిమిషాలకు పెంచారు. ఈ కార్యక్రమములో వచ్చే పది పాటలు గ్రామఫోన్ రికార్డ్సుగా ఎక్కువగా అమ్ముడు

పోయినవి, శ్రోతలు ఓటింగ్ చేసినవి పరిగణనలోకి తీసుకొని ప్రసారం చేసేవారు. ఆ రోజులలో ఒక ఆసియా ఖండములోని వారే కాకుండా ఆఫ్రికా దేశాలలో వారు కూడా వినేవారు. ఈ కార్యక్రమాన్ని సుమారుగా 2 కోట్లమంది శ్రోతలు విని చరిత్రను సృష్టించారు.

ఈ కార్యక్రమము ప్రతి బుధవారము రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు ప్రసారము చేయబడేది. ఈ కార్యక్రమ నిర్వహకులు అమీన్ సయాని! బుధవారాన్ని ఆ రోజులలో "బినాకా గీత్‌మాలా డే" అనేవారు. ఉద్యోగస్తులు బుధవారము నాడు తొందరగా ఇళ్లు చేరుకుని ఇంటిల్లిపాది కార్యక్రమాన్ని వినేవారు. కాఫీ హోటల్స్‌లో, కిళ్లీషాపులలో ఎక్కడ రేడియోలు వుంటే అక్కడకు జనాలు చేరుకుని పాటలు విని ఆనందించేవారు. ఈ కార్యక్రమము సూపర్‌హిట్ అయింది. అమీన్ సయాని కంఠమంటే ఆ రోజులలో చిన్నవారి నుంచి పెద్దల వరకు క్రేజ్ ఉండేది. అమీన్ సయాని భారత ప్రభుత్వంచే 'పద్మశ్రీ' అవార్డుతో గౌరవించబడ్డారు.

"బినాకా గీత్‌మాలా" ప్రసారసమయంలో గుంటూరు పట్టణములో అరండల్‌పేట, బ్రాడీపేటల మధ్యనున్న ఓవర్ బ్రిడ్జ్ రెయిలింగ్స్‌మీద విద్యార్థులు కూర్చుని అరండల్‌పేట ఒకటి, రెండు లైనుల మధ్య మెయిన్‌రోడ్ మీద ఉన్న నైజాం హోటల్స్ రేడియోను పెద్దగా వినబడేటట్లు పెట్టించుకుని వినేవారు. ఆ వారంలో అత్యధిక ప్రజాదరణ పొందిన పాట (సర్‌తాజ్ గీత్) చివరగా వస్తుంది కాబట్టి ఆ పాట ఏది అని చివరి వరకూ సస్పెన్స్. అది ఏ పాట అని విద్యార్థులు తెగ చర్చించుకునే వారు (అందులో నేనొకడిని). అంతగా అన్ని వర్గాల వారిని ప్రభావితం చేసిన ఈ కార్యక్రమము "టాప్ మీడియా ఈవెంట్"గా నిలిచిపోయింది. అమీన్ సయానిని 'గోల్డెన్ వాయిస్ ఆఫ్ ఇండియన్ రేడియో' అని ప్రశంసించారు.

రేడియో ద్వారా నిర్వహించబడి 25 సంవత్సరాలు నిండి సిల్వర్ జూబిలీ జరుపుకున్న ఏకైక కార్యక్రమము - "బినాకా గీత్‌మాలా'. రజతోత్సవ సందర్భముగా హెచ్ఎంవి సంస్థ రెండు లాంగ్ ప్లే గ్రామఫోన్ రికార్డులను విడుదల చేసారు. స్లీవ్ నోట్ లో అమీన్ సయాని ప్రసంగాన్ని, అతని సంతకాన్ని పొందుపరచటం విశేషం. ఈ రజతోత్సవాన్ని బొంబాయిలో 1977లో అతివైభవముగా జరుపబడింది. దాదాపుగా

15 సంవత్సరాల క్రిందట అమీన్ సయాని హైదరాబాద్ రవీంద్రభారతిలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఆయనని చూసి, వారి వ్యాఖ్యానాన్ని వినే అదృష్టము నాకు కలిగింది.

అలాగె 'లిప్టన్ కా సితారె' (Lipton Tea సంబంధిత కార్యక్రమం) కూడా బహుళ ప్రజాదరణ పొందింది.

రేడియో సిలోన్‌లో ప్రతీ ఉదయం 7.30 నుండి 8.00 వరకు ఉదయం "పురానీ ఫిల్మ్ గీత్" ప్రసారం చేసేవారు. ఆ కార్యక్రమంలో ఆఖరి పాట విధిగా ప్రముఖ గాయకుడు కె.ఎల్.సైగల్ దే అయ్యేది. పాట వినిపించిన తర్వాత బెల్ కొట్టి 'లోమా టైమ్' అని చెప్పి 'లోమా - ద హెయిర్ డార్క్‌నర్' అని చెప్పేవారు. సైగల్ పాట వినిపిస్తుంటే టైము ఉదయము 8 గంటలు అని అందరికీ తెలిసేది. ఆదివారము రాత్రి పదిగంటల నుంచి పదకొండు గంటల వరకు పాతపాటల కార్యక్రమము నిర్వహించి అందులో మరుగున పడిన అద్భుతమైన పాటలు వినిపించేవారు. ఈ కార్యక్రమంలో ప్రారంభములో, చివరలో మధురమైన వాద్య సంగీతము వినిపించేవారు.

**రేడియో సిలోన్ - తెలుగు కార్యక్రమాలు :** రేడియో సిలోన్ వారు హిందీపాటలే కాక దక్షిణ భారత చలనచిత్రాలలోని పాటలు కూడా వినిపించేవారు. ప్రతిరోజు సాయంత్రము 4.30 గంటల నుండి 5 గంటల వరకు తెలుగు పాటలు ప్రసారం అయ్యేవి. ఆదివారము 4 గంటల నుండి 4.30 గంటల వరకు వచ్చేవి. పాటలను కోరిన వారి పేర్లు కూడా చెప్పేవారు. సిలోన్ రేడియోలో తెలుగు పాటలు వచ్చే సమయంలో యిళ్లలో రేడియోలు లేనివారు, రేడియోలు ఉన్న వారింటికి వెళ్లి పాటలు వినేవారు. రేడియోలు కలవారు ఎంతమందినైనా సహృదయంతో ఆహ్వానించేవారు.

ఈ తెలుగు కార్యక్రమాలను శ్రీలంకకు చెందిన తెలుగు మహిళ శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై గారు నిర్వహించేవారు. ఆమెది అద్భుతమైన కంఠము. గాంభీర్యము, మాధుర్యముతో కూడుకొన్నది. 'ఫలానా పాట ప్రసారం చేయండి' అని అసంఖ్యాకంగా ఉత్తరాలు వచ్చేవని, అందరి పేర్లు చదవలేక పోతున్నాము అని కూడా చెప్పేవారు. మీనాక్షి పొన్నుదొరై గారి కంఠమంటే శ్రోతలకు విపరీతమైన క్రేజ్ ఉండేది. "దేవదాసు" చిత్రంలో పాటలను శ్రోతలు అధిక సంఖ్యలో ప్రసారం చేయమని కోరేవారుట. 1975లో

హైదరాబాద్‌లో జరిగిన ప్రప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై పాల్గొని ప్రసంగించారు. శ్రోతలు విశేషంగా ఆకర్షింపబడి కరతాళధ్వనులతో ఆమెను ప్రశంసించారు.

**ఆకాశవాణి - వివిధ భారతి :** కోట్లాది రూపాయల ఆదాయం భారత దేశంనుండి రేడియో సిలోన్‌కు ప్రకటనల ద్వారా తరలి పోవటాన్ని గమనించిన భారత ప్రభుత్వము 1957లో బొంబాయి నగరంలో వివిధ భారతి విభాగాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం హిందీ పాటలే కాక దక్షిణ భారతభాషలలో లలిత సంగీతాన్ని కూడా సాయంత్రం వేళ ప్రసారం చేసేవారు. ఎన్నో వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ వివిధ భారతి బహుళ ప్రజాదరణ పొందింది. సైనిక సోదరులకోసం ప్రముఖులు తమ జీవితవిశేషాలను తెలుపుతూ తమ యిష్టమైన పాటలను వినిపించే "జయమాల" కార్యక్రమం శ్రోతలను విశేషంగా ఆకర్షించింది.

**విదేశీ రేడియో కేంద్రాలు :** ప్రపంచ ప్రసిద్ధి చెందిన రేడియో కేంద్రాలు బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పోరేషన్ (BBC), వాయిస్ ఆఫ్ అమెరికా (Voice of America). ఈ కేంద్రాలు వార్తలకు ప్రసిద్ధి చెందాయి.

**రేడియో - క్రికెట్ కామెంట్రీ :** ఆ రోజులలో క్రికెట్ టెస్ట్ మాచ్‌లు మాత్రమే జరిగేవి. రేడియో కేంద్రాలు అయిదు రోజుల క్రికెట్ కామెంటరీని ప్రత్యక్ష ప్రసారం చేసేవారు. భారతదేశములో టెలివిజన్ రాకముందు రేడియో కామెంటరీ చాలా ప్రసిద్ధి చెందింది. ఇప్పటికీ రేడియో కేంద్రాలు మన దేశపు క్రికెట్ మాచ్‌లను ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

ఆనాడు క్రికెట్ కామెంట్రీలు చెప్పే అతిరథ మహారథులను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుందాము.

ఇంగ్లండ్ దేశానికి చెందిన ప్రముఖ ఆల్‌రౌండర్ ట్రావర్ బైలీ (Traver Bailey), జాన్ ఆర్లాట్ (John Arlot), రెక్స్ ఆల్‌స్టన్ (Rex Alston) మొదలగువారు ఎందరో ఉండేవారు. బైలీ కంఠము గాంభీర్యముతోపాటు మాధుర్యము కూడా ఉండి ఒళ్లు గగుర్పొడిచేది.

ఆస్ట్రేలియా దేశానికి చెందిన మైకేల్ చారల్‌టన్ (Maichael Charlton), రిచి

బెనడ్ (Richie Benaud), ఎలాన్ మిక్ గెలరి (Alan Micgalery), జాని మాయిస్ (Johny Mois), జాక్ ఫింగలీటన్ (Joch Fingleton) మొదలైనవారు చాలా ప్రసిద్ధులు.

వెస్ట్ ఇండీస్ దేశానికి చెందిన టోని కొజియర్ (Tony Cozier) కూడా ప్రసిద్ధి చెందిన క్రికెట్ కామెంట్రేటరీ.

భారతదేశంలో సర్ విజ్జి (విజయనగరం మహారాజు), దేవరాజ్ పూరి, సురేష్ సరయు, పార్థసారధి, రాజు భరతన్, బాలు అలగానన్, ఫతేసింగ్ రావ్ గయక్వాడ్, తల్యార్ఖాన్, విజయ మర్చంట్, చక్రపాణి ... ఇలాగ ఎందరో ప్రముఖులు అత్యద్భుతంగా కామెంటరీ చెప్పి మాచ్ మన కళ్లకు కనిపిస్తున్నదనే భ్రమను కలుగచేసేవారు.

ఇప్పటికి ఆనాడు కామెంటరీ చెప్పినవారి కంఠాలు చెవులలో రింగ్ మంటుంటాయి. ఆ కంఠాలు శ్రోతలను అంత ప్రభావితం చేసాయి.

టెలివిజన్ లేని రోజుల్లో ఈ ప్రముఖులు బాల్-టు-బాల్ కామెంటరీ చెప్పి క్రికెట్‌కు వారు చేసిన సేవలను తలచుకుంటే ఒళ్లు పులకరిస్తుంది.

## ఆకాశవాణి - బాలానందం

ఈనాటి పిల్లలకు బాల్యస్మృతులు లేవు. ఎవరినైనా మీ చిన్నతనం గురించి చెప్పమంటే చెప్పటానికి ఏమి లేదంటారు.

చిన్నతనం నుంచి ఎప్పుడూ చదువు, ట్యూషన్స్, హోంవర్క్, కోచింగ్ సెంటర్స్, కంప్యూటర్స్, సెల్‌ఫోన్స్ తప్ప తెలియవు. కాసేపు ఆడుకోవాలన్నా తల్లిదండ్రులు పంపరు. చదువుకొని ర్యాంక్ తెచ్చుకోమంటారు. ఇలాంటి భయంకర వాతావరణంలో మానసిక వత్తిడిలో పిల్లలు పెరుగుతున్నారని అందరికీ తెలిసిన విషయమే.

ఇలాంటి పరిస్థితులు వస్తాయని సుమారు 70 సంవత్సరాల క్రిందటే ఆలోచించిన వ్యక్తి రేడియో అన్నయ్య అని పిలువబడే న్యాయపతి రాఘవరావు గారు. పిల్లల గురించి తీవ్రంగా ఆలోచించి "బాల్యములోనే వారికి ప్రశాంత వాతావరణములో ఎట్టి మానసిక వత్తిడులకు లోను కానీయకుండా వారిలో ఉండే ప్రతిభను "సాంస్కృతిక కార్యక్రమముల ద్వారా వెలికితీసి బాధ్యతాయుత పౌరులుగా దిద్దవచ్చు" అని తలచి వారి ఆలోచనలను ఆచరణలో పెట్టిన వ్యక్తి రేడియో అన్నయ్య. ఆయనకు అన్ని విధాల సహకరించిన వ్యక్తి వారి సతీమణి శ్రీమతి న్యాయపతి కామేశ్వరి.

ఈ ఆలోచనతోనే వీరిరువురు మదరాసు (చెన్నై)లో 1940వ సం.లో 1956లో హైదరాబాద్‌లోను "బాలానంద సంఘము" స్థాపించారు.

1939 నుంచి 1956 వరకు ఆకాశవాణి మదరాసు కేంద్రములో ఆ తర్వాత ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రములో పిల్లలకోసం 'బాలానందం' శీర్షికన అనేక వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ఆకాశవాణి కేంద్రాలలో కూడా పిల్లల కార్యక్రమాలను నిర్వహించారు.

పిల్లలకు సులువుగా అర్థమయ్యే రీతిలో అనేక ఆసక్తికరమైన విషయాలను తెలియచేసి పిల్లల సృజనాశక్తిని, సంస్కారాన్ని పెంపొందించాలనే తపనతో 1945లో 'బాల' అనే పత్రికను స్థాపించారు.

వీరి కార్యక్రమాలు బహుళ ప్రజాదరణ పొందటమే కాకుండా 'బాలానందం' ద్వారా ఎంతోమంది నటీనటులు, గాయనీ గాయకులు, రచయితలు, సినిమా డైరక్టర్లు, ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లు అనేక రంగాలలో ఎదిగారు.

రేడియో అన్నయ్యగారు 'నాయిల్లు', 'స్వప్నసుందరి', 'మల్లీశ్వరి' మొదలగు చిత్రాలలో నటించారు. పిల్లల కార్యక్రమాల కోసం ఆయన నటనకు స్వస్తి చెప్పారు. పిల్లల కోసం సులభ రీతిలో నాటికలు, గేయాలు రచించారు.

రేడియో అన్నయ్య గారి ప్రోత్సాహంతో ప్రముఖ దర్శకులు, నిర్మాత కె.యస్. ప్రకాశరావు 'బూరెల మూకుడు', 'కొంటె కిష్టయ్య', 'రాజయోగం' అనే చిత్రాలను



రేడియో అన్నయ్య, అక్కయ్య

‘బాలానందం’ పేరున నిర్మించారు.  ఈ చిత్రంలో అందరూ పిల్లలే నటించారు. భారతదేశంలో ప్రప్రథమంగా నిర్మించబడిన పిల్లల చిత్రం.

అన్నయ్యగారు రచించిన పాటలను పిల్లలు పాడగా గ్రామఫోన్ రికార్డులుగా గ్రామఫోన్ కంపెనీవారు విడుదల చేసారు.

‘పెళ్లిచేసిచూడు’ చిత్రంలో పిల్లల మీద చిత్రీకరించిన పాటలు ‘ఎచ్చట నుండొచ్చినారూ - బల్ చక్కటి రాజులు మీరు’, ‘ఏ వూరిదానవే వన్నెలాడి’ పాటలు ‘బాలానంద సంఘం’, మదరాసుకు చెందిన పిల్లలు రామకృష్ణ, శకుంతల గానం చేసారు.

అలాగే బాలానందంకు చెందిన మరొక గాయని గిడుగు భారతి. సంగీత సాహితీ కుటుంబానికి చెందిన భారతికి కీ.శే. గిడుగు సీతాపతిగారు పెదతండ్రి. కర్ణాటక సంగీతం నేర్చుకుని సోదరితో కలసి కర్ణాటక గాత్ర కచేరీలు చేసారు.

రేడియో అక్కయ్య, అన్నయ్య నిర్వహించిన ఎన్నెన్నో కార్యక్రమాలలోను, ఆకాశవాణి ప్రసారం చేసిన లలిత సంగీతం, సంగీత రూపకాలు, జానపద గేయాలు మొదలైన కార్యక్రమాలలో ఎంతో హుషారుగా పాల్గొనేవారుట.  ఆరోజుల్లో పి. లీల, టి.జి. కమలాదేవి గార్లతో ‘పాతాళభైరవి’ మొదలగు చిత్రాలలో కలిసి పాడారు. ‘పెళ్ళిచేసి చూడు’ చిత్రంలో ఘంటసాల గారితో యుగళగీతం ‘ఎవడొత్తాడో సూత్తాగా’ గానం చేసారు.  ఆరోజుల్లో భారతి మంచి గాయనిగా పేరొందింది.  వివాహానంతరము గానానికి స్వస్తి చెప్పారు.  **20-1-1932**న మదరాసులో జన్మించిన భారతి చిన్న వయస్సులో **(36 సం.) 6-2-1968**న స్వర్గస్థులైనారు.



గిడుగు భారతి

గిడుగు భారతి గురించిన విషయాలను తెలియ చేసిన వారి సోదరి మరియు కళాప్రపూర్ణ నిడదవోలు వేంకటరావు గారి కోడలు నిడదవోలు పాప (గిడుగు పాప) గారికి కృతజ్ఞతలు.  పాపగారిని పరిచయము చేసిన శ్రీ పెయ్యేటి జయంతి కుమార్, శ్రీమతి ఇందిర గార్లకు కృతజ్ఞతలు.

జీవితమంతా పిల్లల సేవలో తరించిన మానవతా మూర్తులు రేడియో అన్నయ్య, రేడియో అక్కయ్య గార్లు.

రేడియో అన్నయ్య, అక్కయ్య చేసిన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా వారి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య కారకులు జె.వి. కామేశ్వరి, మలపాక పూర్ణచంద్రరావు.



జె.వి. కామేశ్వరి



మలపాక పూర్ణచంద్రరావు

ఇప్పటికీ హైదరాబాద్ 'బాలానంద సంఘం' ఉత్సాహంతో నిర్వహించ బడుతున్నది. పిల్లలకు అనేక రంగాలలో చిత్రలేఖనము, సాహిత్యము, సంగీతము, నాట్యము మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వటమే కాకుండా పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. చాలా గర్వించదగ్గ విషయము.

అన్నయ్య, అక్కయ్య లాంటి మహానుభావులు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి బాల్యాన్ని ఇస్తారని ఆశిద్దాము.

రేడియో అన్నయ్యగారు 13-4-1905న గంజాం జిల్లాలోని బరంపురంలో జన్మించారు (బరంపురం ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రంలో ఉన్నది). **24-2-1984**న హైదరాబాద్‌లో స్వర్గస్థులైనారు. వీరికి చేదోడుగా ఉండి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించిన వారి సతీమణి (రేడియో అక్కయ్య) గారు విజయనగరంలో **1908**లో జన్మించారు. అక్కయ్యగారు **23-10-1980**న మరణించారు.

**ట్రాన్సిస్టర్ రేడియోలు : 1948**లో అమెరికాలోని బెల్ టెలిఫోన్ లాబొరేటరీ వారు ట్రాన్సిస్టర్ రేడియో ప్రొటోటైప్‌ను మొదటిసారిగా ప్రదర్శించారు. "టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అండ్ రీజెన్సి' వారు మొదటిసారిగా వారు ఉత్పత్తి చేసిన ట్రాన్సిస్టర్ రేడియోను

1952లో అమ్మకాలకు ప్రదర్శించారు. ట్రాన్సిస్టర్ రేడియోలో 'వాక్యూమ్ ట్యూబ్స్'కు బదులుగా ట్రాన్సిస్టర్స్ వాడతారు.

1954 నుంచి ట్రాన్సిస్టర్ రేడియోలు మార్కెట్‌లో బహుళ ప్రజాదరణ పొందాయి. ప్రారంభంలో వీటిసైజు కొద్దిగా పెద్దవిగా ఉండేది. రాను



ట్రాన్సిస్టర్ రేడియో

రాను సైజు తగ్గించి తయారు చేయనారంభించారు. పాకెట్ రేడియోలు శ్రోతలను విశేషంగా ఆకర్షించాయి. వీటిని ఎక్కడికైనా తీసుకుని వెళ్లే (పోర్టబిలిటీ) సౌలభ్యం వుండడంతో, విద్యుత్ సరఫరా లేని సమయాలలోనైనా, విద్యుత్ సౌకర్యం లేని ఊళ్లల్లోనైనా కూడా వినే అవకాశం వుండడంతో దీనివలన రేడియో కార్యక్రమాలు వినడం మరింత పెరిగింది.


## టేప్ రికార్డులు

శబ్దాన్ని రికార్డుచేసి నిలవ ఉంచి తిరిగి వినటానికి ఉపయోగపడే సాధనము - ఆడియో టేప్ రికార్డర్! ఈ సాధనంలో టేప్, టేప్ హెడ్ మీదుగా ప్రయాణము చేస్తున్నప్పుడు మాగ్నటిజమ్ సిద్ధాంతాన్ని ఉపయోగించి ఆడియో సంకేతాలను టేప్ మీద రికార్డ్ చేస్తారు. రికార్డెడ్ టేప్‌ను ప్లే చేసినప్పుడు రికార్డు చేసిన శబ్దము వినబడేటట్లు చేస్తుంది.

మొదట్లో స్టీల్ వైర్‌ను టేపుగా ఉపయోగించి మాగ్నటిక్ టేప్‌రికార్డర్స్ తయారు చేశారు శాస్త్రజ్ఞులు. కొన్నాళ్లకు స్టీల్ వైర్‌కు బదులుగా సన్నని స్టీల్ టేప్‌ను వాడారు. స్టీల్ వైర్, స్టీల్ టేప్‌ల వలన చాలా ఇబ్బందులు వచ్చాయి. అందుకని పరిశోధనలు కొనసాగించారు.

ఆ పరిశోధనల ఫలితంగా 1935లో ఎఇజి జర్మనీ కంపెని మొదటి రీల్-టు-రీల్ టేప్ రికార్డరును మాగ్నటో ఫోన్ అనే పేరుతో మార్కెట్‌లో విడుదల చేసారు.

దీనికి కావలసిన టేప్‌ను ప్లాస్టిక్ పదార్ధమును జర్మనీలోని బిఎఎస్ఎఫ్ కంపెని తయారుచేసింది. ఈ టేప్ రికార్డులు చాలా ఖరీదు. వీటిని రేడియో స్టేషన్‌వారు, రికార్డింగ్ స్టూడియోలు ఉపయోగించేవారు. 1950 నుంచి ఈ టేప్ రికార్డరులను సంపన్నులు వారి గృహాలలో ఉపయోగించుకునేవారు. ఇందులో



రీల్ టు రీల్ టేప్ రికార్డర్

వాక్యూమ్ ట్యూబ్స్ ఉండటము వలన, చాలా పెద్దవిగా, బరువుగా ఉండేవి. ఈ యంత్రాలలోనే యాంప్లిఫయర్స్, స్పీకర్స్ కూడా అమర్చబడ్డాయి. 2 నుంచి 8 ట్రాక్‌లలో రికార్డింగ్ చేసి, ఏ ట్రాక్‌లో రికార్డు చేసిన శబ్దాన్ని అయినా విడివిడిగా వినగలిగే సౌకర్యము ఉండేది. స్టీరియో టేప్ రికార్డులు కూడా విడుదల అయాయి.

క్రమేపీ వాక్యూమ్ ట్యూబ్స్‌కు బదులుగా ట్రాన్సిస్టర్స్ వాడటము వలన సైజు తగ్గి బరువుకూడా తగ్గింది. అమ్మకాలు పెరిగాయి. కాని ఇవి కొనుగోలు చేసేవారి సంఖ్య గ్రామఫోన్ రికార్డులు కొనేవారి సంఖ్యకన్నా చాలా తక్కువ.

**ప్రీ-రికార్డెడ్ టేప్స్ :** రీల్ - టు - రీల్ టేప్స్ మీద స్టీరియో రికార్డింగ్ చేసిన సంగీతపు ప్రీ-రికార్డెడ్ టేప్స్‌ను మార్కెట్‌లో కొన్ని సంస్థలు ప్రవేశపెట్టాయి కాని అవి పాపులర్ కాలేదు.

**టేప్ రికార్డర్‌లోని భాగాలు :** రెండు ప్లాస్టిక్ స్పూల్స్ ఉంటాయి. ఒకటి టేప్‌తో ఉన్నది. రెండవది ఖాళీది. మోటర్ సహాయంతో టేప్ తిరుగుతుంది. టేప్ ప్లే చేసినప్పుడు టేప్ రికార్డింగ్, ప్లేయింగ్ హెడ్ మీదుగా ఖాళీ ప్లాస్టిక్ స్పూల్‌కు చుట్టుకుంటుంది. అంటే ఒక ఖాళీ స్పూల్ ఎప్పుడూ ఉండాలి. ఈ యంత్రములో రికార్డింగ్ హెడ్, ప్లేబాక్ హెడ్ విడివిడిగాకాని కలిసికాని ఉంటాయి. ఈ టేప్ కాప్‌స్టన్ ద్వారా ముందుకు నడుస్తుంది. ఈ కాప్‌స్టన్‌కు రబ్బర్ పించ్ రోలర్ ఉంటుంది. ఈ ఏర్పాటు వలన టేప్ ఒకే స్పీడ్‌లో ముందుకు నడుపబడుతుంది. టేప్ రికార్డర్‌లో యాంప్లిఫయర్,

స్పీకర్స్‌కూడా ఉంటాయి. ట్రాక్ మార్చుకోవటానికి ఒక నాబ్ ఉంటుంది. ఇది మనకు కావలసిన ట్రాక్‌లో నుంచి శబ్దము రావటానికి సహాయపడుతుంది.

టేప్ తయారీకి పాలియస్టర్ ఫిల్మ్ వాడతారు. ఈ ఫిల్మ్‌మీద ఐరన్ ఆక్సైడ్ కోటింగ్ ఇస్తారు. రికార్డింగూ, రికార్డయిన శబ్దము వినటమూ రెండూ మాగ్నటిక్ పద్ధతి ద్వారా జరుగుతాయి. ఈ టేప్ రికార్డరులలో టేప్‌మీద ఉన్న శబ్దాన్ని చెరిపివేసి మళ్లీ అదే టేప్ మీద రికార్డ్ చేయవచ్చును. ఈ టేప్ రికార్డర్లలో వివిధ స్పీడ్‌లో టేప్‌ను రికార్డింగ్ చేయడానికి, ప్లే చేయటానికి సౌకర్యం ఉంటుంది. రకరకాల సైజులలో (ఉదా: 5 అం॥, 6 అం॥, 7 అం॥) టేప్స్ దొరుకుతాయి. స్పూల్ వ్యాసం బట్టి టేప్ నిడివి మారుతుంది. స్పూల్ టేప్‌లో కొన్ని గంటలపాటు శబ్దాన్ని వినవచ్చును.


కాంపాక్ట్ కాసెట్, టేప్‌రికార్డర్

**కాంపాక్ట్ కాసెట్స్ :** గ్రామఫోన్, గ్రామఫోన్ రికార్డులు, రీల్-టు-రీల్ (స్పూల్) టేప్ రికార్డులలో ఉన్న అసౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని శబ్దము రికార్డింగ్ పద్ధతిలో శ్రోతలకు సౌకర్యాలను కలుగ చేయాలని జరిపిన పరిశోధనల ఫలితమే “కాంపాక్ట్ కాసెట్స్”ను కనుగొనటానికి దారి చూపించింది. 1962లో ఫిలిఫ్స్ కంపెని వారు “కాంపాక్ట్ ఆడియో కాసెట్”ను కనుగొన్నారు. రెండేళ్ళలో యూరప్, అమెరికా దేశాలలో ప్రవేశపెట్టారు. దీని ట్రేడ్‌మార్క్ “కాంపాక్ట్ కాసెట్”. ఈ కాసెట్స్‌తో బాటు వాటిని ప్లే చేసే టేప్ రికార్డర్స్‌ను కూడా మార్కెట్‌లో ప్రవేశపెట్టారు. ఇవి మోనో రికార్డింగ్ ప్లేయింగ్ టేప్ రికార్డర్. ఈ కాంపాక్ట్ కాసెట్స్ లైసెన్స్‌ను ఫిలిప్స్ కంపెనీ వారు జపాన్‌లోని సోనీ కంపెని వారి కిచ్చారు. 1968 కల్లా ప్రపంచమంతా కొన్ని వేల టేప్‌ను ప్లే చేసే యంత్రాలు విక్రయించబడ్డాయి.

**మ్యూజిక్ కాసెట్స్ :** 1964 నుంచి కాసెట్స్‌ను అధికసంఖ్యలో జర్మనీలోని హనొవర్‌లో తయారు చేయటం ప్రారంభించబడింది. ‘ప్రీ-రికార్డెడ్ మ్యూజిక్ కాసెట్స్‌ను” 1968 ప్రాంతంలో యూరప్‌లో ప్రవేశపెట్టారు. వీటికి “మ్యూజిక్ కాసెట్స్” లేదా ఎం.సి. అని నామకరణము చేసారు.

**కాసెట్స్ టేప్ :** ప్రారంభంలో మ్యూజిక్ కాసెట్స్‌లో నాణ్యత లోపంగా ఉండేవి. నాణ్యత పెంచాలని టేప్స్ తయారుచేసే సంస్థలు పరిశోధనలు ప్రారంభించాయి. కాంపాక్ట్ కాసెట్‌లో ఉండే టేప్ పాలియస్టర్ ఫిల్మ్‌తో తయారు చేయబడినది. దాని మీద రికార్డింగ్ చేయటానికి కొన్ని బైండర్స్‌తో ఐరన్ ఆక్సైడ్ కోటింగ్ ఇచ్చేవారు.

1970 దశకంలో 3ఎమ్ కంపెనీ వారు కనుగొన్న కోబాల్ట్ డోపింగ్ ప్రాసెస్‌ను అనుసరించి కోబాల్డ్ ఆక్సైడ్ కోటింగ్ ఇచ్చారు. ఈ టేప్స్ 'స్కాచ్' బ్రాండ్ పేరుతో విడుదలయ్యాయి. ఇదే సమయంలో డ్యూపాంట్ కంపెనీవారు క్రోమియమ్ డై ఆక్సైడ్ కోటింగ్ డెవలప్ చేసారు.బిఎఎస్ఎఫ్ కంపెనీ వారు 'మాగ్నటైట్' ($Fe_3O_4$) ను కోటింగ్ చేసారు.

టిడికె కంపెనీవారు కోబాల్ట్ ఐరన్ ఆక్సైడ్ మిశ్రమముతో పాలియస్టర్ ఫిల్మ్ మీద కోటింగ్ ఇచ్చారు. ఈ పద్ధతిలో తయారైన కాంపాక్ట్ కాసెట్ల శబ్దము నాణ్యత, లాంగ్‌ప్లే గ్రామఫోన్ రికార్డుల శబ్దనాణ్యతకు సమానమైంది.

మార్కెట్‌లో కాసెట్లు రెండురకాలుగా దొరుకుతాయి - నార్మల్, క్రోమ్. 'నార్మల్' కాసెట్స్‌లో ఐరన్ ఆక్సైడ్ కోటింగ్ ఉంటుంది. చౌకగా లభ్యమవుతాయి. 'క్రోమ్' కాసెట్స్‌లో ఐరన్ ఆక్సైడ్, కోబాల్ట్ మిశ్రమము ఉంటుంది. ఇవి నార్మల్ వాటికన్నా ఖరీదు. క్రోమియమ్ డయాక్సైడ్‌తో చేసిన కాసెట్స్ వాడకము చాలా తక్కువ. ఖరీదు కూడా ఎక్కువ. కాసెట్ నిడివి రెండువైపుల కలిపి 60 ని॥లు వస్తే దాన్ని C-60 కాసెట్ అంటారు. 90 నిమిషాలువస్తే C-90 అంటారు. నెంబర్ పెరిగిన కొద్ది నిడివి పెరుగుతుంది.

కాసెట్ సైజ్ 100 మి.మీ. x 62 మి.మీ. x 12 మి.మీ. ఉంటుంది. కాసెట్‌లో రెండు చిన్న ప్లాస్టిక్ స్పూల్స్ ఉంటాయి. టేప్ యొక్క ఒక చివరను ఒక స్పూల్‌కు, రెండవ చివరను రెండో స్పూల్‌కు గట్టిగా ఫిక్స్ చేస్తారు. టేప్ ఒక స్పూల్ నుంచి రెండో స్పూల్‌కు చుట్టబడుతుంది. ఈ టేప్‌ను రెండు భాగాలుగా ఉన్న ప్లాస్టిక్ కేసింగ్‌లో ఉంచి స్క్రూలతో బిగించి రక్షణ ఇచ్చారు. ఈ టేప్ గైడ్స్‌మీదుగా ప్రయాణము చేస్తుంది.

టేప్ రికార్డరులో 'ప్లే' బటన్ నొక్కినప్పుడు టేప్ మాగ్నటిక్‌హెడ్‌కు రాసుకుంటూ ఉంటుంది. మాగ్నటిక్ టేప్ రెండు చివరల బాగా బలమైన ప్లాస్టిక్ ఫిలిమ్‌కు కలుపుతారు. వీటిని లీడర్స్ అంటారు. టేప్‌ను ముందుకుగాని, వెనుకకు గాని తిప్పేటప్పుడు (వైండ్ చేసేటప్పుడు) స్పీడ్‌గా తిరుగుతూ చివరకు వచ్చినప్పుడు సడెన్‌గా ఆగిపోతుంది. అప్పుడు కలిగిన షాక్‌కు మాగ్నటిక్ టేప్ తెగిపోకుండా లీడర్ ఆపుతుంది. ఈ బలమైన ప్లాస్టిక్ లేకపోతే మాగ్నటిక్ టేప్ తెగిపోతుంది.

టేప్ రికార్డరులలో రికార్డు చేసుకొనే సౌకర్యము కూడా ఉంటుంది. అందుకని ప్రీ-రికార్డెడ్ కాసెట్స్‌ను వాడేటప్పుడు పొరపాటున కూడా టేప్‌లో ఉన్న శబ్దము చెరిగిపోకుండా ఉండేందుకు టేప్స్ తయారు చేసే కంపెనీ వారు రక్షణ కల్పిస్తారు. కాసెట్స్‌పైన చిన్న ప్లాస్టిక్ పట్టీలు రెండు ఉంటాయి. వాటిని విరగకొడితే చిన్న చిన్న గుంటలు ఏర్పడుతాయి. అప్పుడు ఆ టేప్‌పై వేరేది రికార్డు చేయడం సాధ్యం కాదు. టేప్స్‌పై మళ్లీ రికార్డు చేయాలంటే ఈ పట్టీలను అలాగే ఉంచాలి. విరగకొట్టకూడదు.

క్రమేణా స్టీరియో టేప్ రికార్డరులు, డాల్బి పద్ధతిలో తయారుచేసి మార్కెట్‌లో విడుదల చేసారు. వీటివలన శబ్దములో నాణ్యత మరింత పెరిగింది. 1977 నుంచి రికార్డింగ్ కంపెనీలు ప్రీ-రికార్డెడ్ మ్యూజిక్ కాసెట్స్‌తో బాటుగా గ్రామఫోన్ రికార్డులను కూడా తయారు చేసారు.



వాక్‌మన్

**వాక్‌మన్ :** 1979లో సోనికంపెనీవారు చిన్నసైజు టేప్‌రికార్డరు తయారు చేసారు. ఇందులో రికార్డింగ్ చేయవచ్చు. రికార్డింగ్ అయిన శబ్దాన్ని వినవచ్చును. దీనికి "వాక్‌మన్" అని నామకరణము చేసారు. ఇది చాలా చిన్నదిగా ఉండటము వలన ఎక్కడికైనా తీసుకుపోవచ్చును. బ్యాటరీలతో నడుస్తుంది. దీనిలో శబ్దము తక్కువగా వినిపిస్తుంది. అంటే ప్రక్కనున్న వారికి ఇబ్బంది ఉండదు. దీనిలో సంగీతాన్ని ఇయర్‌ఫోన్స్ ద్వారా వినవచ్చు.

ప్రముఖ కంపెనీలు సోనీ, నేషనల్ పెనాసానిక్, సాన్యో, అకాయ్, ఫిలిప్స్, షార్ప్ మొదలైన ఎన్నో కంపెనీలు రకరకాల సైజులలో టేప్ రికార్డరులను తయారుచేసి విక్రయించేవారు. డబల్ కాసెట్ టేప్ రికార్డరులు కూడా తయారు చేసేవారు. వీటిలో ఒక టేప్‌నుంచి మరొక టేప్ రికార్డు చేసుకోవచ్చు. అంటే కాసెట్స్ డబ్బింగ్ చేసుకొవచ్చును. వీటిల్లో రేడియో కూడా ఉంటుంది. దాని నుంచి పాటలు రికార్డు చేసుకోవచ్చును. అంతేకాక గ్రామఫోన్ నుంచి కూడా సంగీతాన్ని రికార్డు చేసుకునే సౌకర్యము ఉంటుంది.

**కాసెట్ డెక్స్ :** కొన్ని ప్రముఖ కంపెనీలు హై ఫిడిలిటీ స్టీరియో డెక్స్‌ను తయారు చేయనారంభించారు. ఈ యంత్రాలలో డాల్బీ సిస్టమ్స్‌ను ప్రవేశపెట్టారు. అందుకని రికార్డింగ్ నాణ్యతగా ఉంటుంది. కాసెట్ నుంచి మరొక కాసెట్‌ను ఎక్కువ స్పీడులో డబ్బింగ్ చేయవచ్చు. అయితే వీటిలో యాంప్లిఫయర్స్, స్పీకర్స్ ఉండవు. వీటిని యాంప్లిఫయర్స్‌కు, స్పీకర్స్‌కు కలుపుతే శబ్దము వినబడుతుంది. కాని రికార్డింగ్ నాణ్యత హెచ్చుగా ఉంటుంది. టాన్‌బర్గ్, నకామిచి, మెరింజ్, బి.ఇ.సి. రివోక్స్ మొదలైన డెక్స్ నాణ్యత చాలా ఎక్కువ. వీటిలో టేప్స్ రికార్డింగ్ చేస్తే ఫ్రీక్వెన్సి ఫుల్ రేంజిలో (20HZ to 20000 HZ) ఉంటుంది. అనవసరమైన చప్పుడు తక్కువ ఉంటుంది.

**భారతదేశంలో కాసెట్ ప్లేయర్స్ :** మనదేశంలో 1978లో కాసెట్స్, కాసెట్స్‌ను ప్లే చేసే టేప్ రికార్డర్స్ తయారు కాగా 1980 నుంచి మనదేశపు మ్యూజిక్ పరిశ్రమలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. అప్పటివరకు గుత్తాధిపత్యం చలాయించిన గ్రామఫోన్ కంపెని (హెచ్ఎంవి) వారి వ్యాపారానికి దెబ్బతగిలింది. అంతవరకు వినైల్ మైక్రోగ్రూవ్ రికార్డులకు ఉన్న డిమాండ్ తగ్గిపోయింది. గ్రామఫోన్ కంపెనీకి పోటీగా ఎన్నో రికార్డింగ్ కంపెనీలు వినైల్ రికార్డులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించటం ప్రారంభించాయి. కాసెట్స్ తయారు చేసే కంపెనీలు ఉద్భవించాయి. పోటీ పెరిగింది.

1980 ప్రాంతంలో పాకెట్ టేప్ రికార్డర్స్, హైఫి ప్లేయర్స్ మార్కెట్‌లోకి వచ్చాయి. 1990 సంవత్సరములో కాంపాక్ట్ డిస్క్ (సిడి) లు మార్కెట్‌లోకి వచ్చాయి. ప్రీ రికార్డెడ్ మ్యూజిక్ కాసెట్స్ అమ్మకాలు తగ్గిపోయాయి. గ్రామఫోన్ రికార్డుల తయారీ ఆగిపోయింది. 2000 సంవత్సరములో ఎంపి 3 ఫార్మాట్ వచ్చింది. కాసెట్స్, టేప్ రికార్డుల తయారీ బాగా తగ్గిపోయింది.


SURAIYA
3AEX-5121
SURAIYA
SIDE ONE
SIDE TWO
LONG PLAY 33⅓ R.P.M. RECORD
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED
Angel



3AEX-5117
THE INIMITABLE O.P.NAYYAR
SIDE ONE
SIDE TWO
LONG PLAY 33⅓ R. P. M. RECORD
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED
DUM DUM • INDIA
Angel


STEREO
BHAGAWADH GEETHA
ECSD. 3232
VOLUME 2
(PARTS 3 & 4)
RECITED BY GHANTASALA VENKATESWARA RAO
Telugu Commentary Spoken by: GHANTASALA
Telugu Commentary Written by: K.S. RANGIAH SASTRY
Sleeve Notes by: PROF. A. N. PARASURAM
Front Cover Design: VINU
Recorded by: K.S. RAGHUNATHAN
Produced by: P. MANGAPATHY
LONG PLAY 33⅓ R.P.M. RECORD
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED


Movie Melodies of Madan Mohan
3AEX-5149
SIDE ONE
SIDE TWO
LONG PLAY 33⅓ R. P. M. RECORD
Manufactured & Distributed by
THE GRAMOPHONE COMPANY OF INDIA LIMITED
DUM DUM • INDIA

## క్యాసెట్, ఇన్‌లే కార్డ్స్




RPG ENTERPRISES
HMV
సూపర్ డ్యూయెట్స్ ఆఫ్
ఘంటసాల
SPHO 33223
ECONOMY
SUPER DUETS OF GHANTASALA VOL.1
(Telugu Films)
7/91
PRE-RECORDED CASSETTE MAX. RETAIL PRICE Rs. 22.00
Side A:
Side B:
℗ 1991 Copyright owner and manufacturer The Gramophone Co. of India Ltd., 5 Old Court House St. Calcutta-700 001
© The Gramophone Co. of India Ltd. 1991. Original sound recording made by The Gramophone Co. of India Ltd.
All rights of the producer and of the owner of the recorded work reserved. Unauthorised copying, public performance and broadcasting of this recording prohibited.


RPG
Side-A
Side-B
B-89
℗2003, Owner, Manufacturer & Licensee. Saregama India Ltd. 33, Jessore Road, Calcutta - 700 028 ©2003 Made in India
STHV 855660
sa re ga ma
GOLDEN HOUR
Cine Hits of A.P. Komala
NOT TO BE EXPORTED OUTSIDE INDIA EXCEPT TO INTERNATIONAL LICENSEES: SAREGAMA PLC / RPG GLOBAL MUSIC LIMITED.
36
Rs. 55.00
HMV
GOLDEN HOUR
ఏ.పి. కోమల సినీ హిట్స్
All time Hits
DIGITALLY RE-MASTERED OVER 60 MINUTES
A.P. Komala
A Treasure of Unforgettable Film Melodies

# దూరదర్శన్ (TELEVISION)

టెలివిజన్ అంటే వైర్స్ (Wires) సహాయం లేకుండా కాంతి తరంగాలను విద్యుత్ అయస్కాంత తరంగాలుగా మార్చి దూర ప్రాంతాలకు పంపి మరలా కాంతి తరంగాలుగా మార్చేటటువంటి సాధనము. అంటే బొమ్మ కనిపిస్తుంది.

టెలివిజన్‌ను కనిపెట్టి అభివృద్ధి చేయటానికి ఎంతో మంది ఇంజనీర్లు పరిశోధనలు జరిపారు.

ఇంగ్లండ్‌లోని స్కాట్లెండ్ దేశానికి చెందిన జాన్ లోగి బెయిర్డ్ (John Logie Biard) 26-1-1926 ప్రపంచములో మొట్టమొదటిసారిగా టెలివిజన్ పనిచేసే విధానాన్ని ప్రదర్శించారు.

1928లో బెయిర్డ్ టెలివిజన్ సిగ్నల్‌ను లండన్ నుంచి న్యూయార్క్ దేశానికి పంపినట్లుగా చరిత్ర తెలియజేస్తున్నది.

మొదట్లో టెలివిజన్ ప్రసారాలకు Electro Mechanical పద్ధతులను వినియోగించారు. 1935 లోపల చాలా దేశాలు టెలివిజన్ ప్రసారాలను ప్రారంభించారు.

1937 నుండి వీడియో కెమెరా ట్యూబ్‌ను ఉపయోగించి మార్కొని - ఇ.యం.ఐ. పద్ధతిని వాడారు. దీనివలన ప్రసారంలో నాణ్యత పెరిగి బొమ్మ నాణ్యత పెరిగింది.

టెలివిజన్ స్టేషన్స్‌ను ఛానెల్స్ అంటారు. 1962 సాటిలైట్ ద్వారా టీ.వి. కార్యక్రమాలను అందించటము ప్రారంభమయింది.

కేబుల్, సాటిలైట్ వలన ఎక్కువ ఛానెల్స్ ప్రసారానికి అనుకూలం కలిగింది.

1980 దశకంలో ఎలక్ట్రానిక్ ట్యూనర్స్ రావటము వలన రిమోట్ కంట్రోల్ సాధనాలు ప్రవేశపెట్టబడ్డాయి. 1988లో LED టీ.వి.లు ప్రవేశించాయి.

1990 నుంచి టీ.వి.లకు వి.సి.ఆర్. (VCR) ను కనెక్ట్ చేసే అవకాశం కలిగింది. 1970 దశకంలో కలర్ టెలివిజన్ సెట్స్ మార్కెట్‌లో ప్రవేశపెట్టబడ్డాయి.

**భారతదేశంలో టెలివిజన్ :** టెలివిజన్ ప్రసారం భారతదేశంలో ప్రథమంగా 1959లో ఢిల్లీలో ప్రారంభమయింది. 1976లో దీనిని ఆకాశవాణి నుంచి విడదీసి 'దూరదర్శన్' గా వ్యవహరించబడింది.


క్రమంగా స్థానిక స్టేషన్స్ వచ్చాయి. ప్రైవేట్ ఛానెల్స్ కూడా కొన్ని వందలు ప్రారంభించబడినాయి.

టీ.వి. ఛానల్స్ ఎన్ని వైవిధ్యమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయో చెప్పనవసరం లేదు. 24 గంటలు ప్రసారాలు జరుగుతున్నాయి.

టీ.వి. కార్యక్రమాలలో స్పోర్ట్స్ ఛానల్స్ ప్రారంభించబడి బహుళ ప్రజాదరణ పొందుతున్నాయి.

## వీడియో టేప్స్

శబ్దాన్ని రికార్డు చేయటము ఆడియో అయితే దానితో బాటు కదులుతున్న చిత్రాలను కూడా రికార్డు చేసేది వీడియో. శబ్దాన్ని, దృశ్యాన్ని రికార్డు చేయటానికి మాగ్నటిక్ టేప్‌ను వాడుతారు. దీనిని వీడియో టేప్ అంటారు. వీడియో టేప్స్‌ను ప్లే చేసి చిత్రాన్ని శబ్దంతో సహా చూడవచ్చు, వినవచ్చు. ప్లే చేసే యంత్రాలను వీడియో కాసెట్ ప్లేయర్ (విసిపి) అంటారు. వీడియో కాసెట్ రికార్డర్ (విసిఆర్)లో ప్లే చేయడంతో బాటు రికార్డు కూడా చేయవచ్చును. 1970 దశకంలో వీడియో రికార్డింగ్ టెలివిజన్ పరిశ్రమకు ఎంతో సహాయపడింది. రికార్డింగ్ చేసిన విషయాలు బ్రాడ్‌కాస్ట్ చేయటానికి వీడియో టేప్ రికార్డర్స్ చాలా ఉపయోగపడ్డాయి.




వీడియో కాసెట్

1976లో కన్స్యూమర్ మార్కెట్‌లో వీడియో హోమ్ సిస్టమ్‌ను, విహెచ్‌ఎస్ టేప్స్‌ను ప్రవేశపెట్టినవారు - విక్టర్ కంపెనీ ఆఫ్ జపాన్ (జెవిసి). సోనీ కంపెనీ 'బీటామాక్స్' అనే టేప్‌ను రూపొందించారు.

1977లో ఆర్‌సిఏ వారు అమెరికన్ మార్కెట్‌లో వీడియో టేపులు విడుదల చేసారు. వీటితో పాటు టేప్ ప్లేయర్స్, రికార్డర్స్ కూడా విడుదల చేసారు. వీటిలో పెనాసోనిక్, ఫిలిప్స్, సాన్యో, షార్ప్ మొదలగు కంపెనీలు కూడా ఉన్నాయి.

**వీడియో టేప్ భాగాలు :**

వీడియో టేపులో 12.7 మి.మీ. వెడల్పు ఉన్న మాగ్నటిక్ టేప్ రెండు ప్లాస్టిక్ స్పూల్స్‌కు అమర్చబడి ఉంటుంది. టేప్ రెండు చివరల గట్టిగా ఉండే ప్లాస్టిక్ టేప్‌ను మాగ్నటిక్ టేప్‌కు కలుపుతారు. టేప్‌ను ముందుకు కాని, వెనుకకు కాని వైండింగ్ చేస్తే చాలా ఎక్కువ స్పీడ్‌లో తిరిగి ఆగిపోతుంది. సడన్‌గా ఆగిపోవటము వలన షాక్ ఉద్భవిస్తుంది. అందుకని మాగ్నటిక్ టేప్ తెగిపోకుండా ఉంటానికి ఈ బలమైన ప్లాస్టిక్‌తో జత చేస్తారు. వీటిని 'లీడర్స్' అంటారు.

టేప్‌ను పాలియస్టర్ ప్లాస్టిక్ ఫిల్మ్ తో తయారు చేస్తారు. దీనిమీద ఐరన్ ఆక్సైడ్ కోటింగ్ ఉంటుంది. ఈ టేప్‌లలో 3 నుంచి 8 గంటల వరకు రికార్డు చేయవచ్చు. ఈ టేప్స్‌లో PAL, NTSC అని రెండు రకాలు ఉంటాయి. NTSC లో ఫ్రేమ్‌రేట్ సెకండుకు 50 అయితే PAL పద్ధతిలో 30 ఉంటాయి.

**వీడియో కేసెట్స్ - చిత్రాలు :**

విహెచ్‌ఎస్ వలన పాత చిత్రాలతో పాటు కొత్త చిత్రాలు కూడా వీడియో కాసెట్స్ రూపంలో విడుదల అయ్యాయి. ఇంతకు ముందు ఏదయినా సినిమా చూడాలంటే ఆ సినిమా హాలులో ప్రదర్శించినప్పుడే ప్రేక్షకులు చూడగలిగేవారు. విహెచ్‌ఎస్ వచ్చాక మనకు కావలసిన సినిమాలను కొనుక్కొని గాని లేదా వీడియో లైబ్రరీల నుంచి అద్దెకు తెచ్చుకుని గాని చూచే అవకాశం లభించింది.

సినిమా రీళ్ల నుండి అలనాటి చిత్రాలను వీడియో కాసెట్స్‌గా తయారు అయి విడుదల కాకపోయివుంటే అలనాటి మంచి మంచి చిత్రాలు కాలగర్భంలో కలిసిపోయేవి.

ఇలాగ ఆ చిత్రాలను విహెచ్ఎస్ రూపంలో విడుదల చేసి చలనచిత్రపరిరక్షణకు దోహదపడిన మనీషా, అంజలి, ప్రియదర్శిని సంస్థలు ఎన్నో ఉన్నాయి.

ఖాళీ వీడియో బ్లాంక్ కాసెట్స్ కూడా మార్కెట్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. వీటిని ఉపయోగించి టెలివిజన్‌లో వచ్చే అరుదైన కార్యక్రమాలను రికార్డు చేసుకుని, తీరికవేళల్లో తిరిగి చూచే అవకాశం లభించింది.

పూర్వం శుభకార్యాలను చిత్రీకరించే సౌకర్యాలు లేవు. వీడియో కెమెరాలు వచ్చాక వివాహాది శుభకార్యాలను చిత్రీకరించి తిరిగి చూచి ఆనందించే అవకాశము, సౌకర్యము లభించాయి.

1997 నుంచి విహెచ్ఎస్ అమ్మకాలు తగ్గిపోయాయి. దీనికి ముఖ్యకారణము విసిడి, డివిడిలు మార్కెట్‌లో ప్రవేశించటం. 2006 నుంచి విహెచ్ఎస్ రూపంలో చిత్రాలు విడుదల చేయడం నిలిచిపోయినట్లుగా తెలుస్తున్నది.

## కాంపాక్ట్ డిస్క్ (సి.డి.)

శబ్దనాణ్యతను ఇంకా అభివృద్ధి చేయాలని, శబ్దాన్ని నిల్వ ఉంచే కాలపరిధిని పొడిగించాలని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు నిర్విరామంగా పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఆ పరిశోధనల ఫలితమే డిజిటల్ శకానికి దారి తీసింది. 1970లో లేజర్ బీమ్ సహాయముతో శబ్దాన్ని రికార్డుచేసి నిలువ ఉంచి తిరిగి ఆడియో రూపములో గాని, వీడియో రూపములో గాని ప్లే చేయవచ్చునని జేమ్స్ టి. రస్సెల్ వంటి శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంటే డిజిటల్ రికార్డింగ్ పద్దతిలో శబ్దాన్ని ఎలక్ట్రికల్ పల్స్ శ్రేణిగా మార్చి రికార్డు చేసి, నిల్వ ఉంచి తిరిగి వినటానికి దృశ్యరూపంలో చూడటానికి ఆప్టికల్ పద్ధతి అనుసరించవచ్చు.

ఆప్టికల్ పద్ధతి అంటే - కాంతిని మాధ్యమం (మీడియం) గా ఉపయోగించి లేజర్ బీమ్ ద్వారా రికార్డు చేయడం. లేజర్ బీమ్ అంటే మన అదుపులో వుండే శక్తివంతమైన కాంతిపుంజం. ఆప్టికల్ పద్ధతి మాగ్నటిక్ పద్ధతి కన్నా ఉత్తమమైనది. గ్రామఫోన్ రికార్డు నుంచి శబ్దము రావాలంటే స్టయిలస్ వాడాలి. టేప్‌రికార్డర్‌లో నుంచి శబ్దము రావాలంటే టేప్ ప్లేయింగ్ హెడ్‌కు టేపు తగలాలి. అందువల్ల వాడిన కొద్ది గ్రామఫోన్ రికార్డు, టేప్ అరిగిపోతూ ఉంటాయి. లేజర్ బీమ్ వాడటంలో యిటువంటి




కాంపాక్ట్ డిస్క్

తాకిడి వుండదు కాబట్టి సౌండ్ రికార్డు చేసిన వస్తువుకు అరుగుదల అనేది ఉండదు. ఈ పరిశోధన బైనరీ డిజిట్స్ రూపంలో కాంపాక్ట్ డిస్క్ (సిడి)ను తయారు చేయటానికి మార్గదర్శకమైనది.

**1979** లో ఫిలిప్స్, సోనీవారు చేతులు కలిపి డిజిటల్ ఆడియో సిడిని రూపొందించారు. మొట్టమొదటి సిడిని జర్మనీలోని హనోవర్ పట్టణం దగ్గరున్న లాంజన్ హెగన్ లోని పాలిడర్ ప్లాంట్‌లో ప్రెస్ చేసారు. ఈ సిడిలో సింఫని సంగీతాన్ని రికార్డు చేసారు. ఆ తరువాత హనొవర్ దగ్గరలో కొత్త ఫాక్టరీ స్థాపించి సిడిలు తయారుచేయ ప్రారంభించారు. ఈ కంపెనీలో **1981**లో ప్రెస్ చేసిన మొదట సిడిలో 'అబ్బా' బృందము పాడిన 'ది విజిటర్' పాట వుంది. క్రమేణా సి.డి.ప్లేయర్స్, సి.డిలు తయారు చేయనారంభించారు. ప్రపంచమంతా ఈ సి.డి.లను ఆదరించారు. కొన్ని మిలియన్ల సంఖ్య అమ్మకాలు జరిగాయి. గ్రామఫోన్ రికార్డుల వారసత్వమే ఆడియో సిడి అనుకోసాగారు సంగీతప్రియులు.

**1985**లో కంప్యూటర్‌లో రీడ్ చేయగలిగన సిడీలు తయారు చేసారు (CD-ROM)

సోనీ, ఫిలిప్స్ కంపెనీల వారు 1990లో రికార్డబుల్ సిడీలు (CD-R) తయారు చేయనారంభించారు.

**కాంపాక్ట్ డిస్క్‌లు :** సిడీలు గ్రామఫోన్ రికార్డులు లాగే ఫ్లాట్ డిస్క్‌లు. అయితే గ్రామఫోన్ రికార్డుల వ్యాసము వెరైటీ(78 ఆర్‌పిఎం, ఇపి, ఎల్‌పి) బట్టి 180-300 మి.మీ.లు కాగా సిడి వ్యాసం మాత్రం 120 మి.మీ. లే ! అందుకనే దానికి కాంపాక్ట్ డిస్క్ అని పేరు వచ్చింది.

**బ్లాంక్ సిడిలు :** బ్లాంక్ సిడిలను తయారు చేయడానికి పాలీ కార్బనేట్ ప్లాస్టిక్ గ్రాన్యూల్స్‌ను వేడి చేసి మెటల్ స్టాంపర్‌లో ప్రెస్ చేస్తారు. ప్లాస్టిక్ చల్బార్చి, తీసి మధ్యలో 15 మి.మీ. వ్యాసముతో రంధ్రము చేస్తారు. ఈ పద్ధతి వలన గుండ్రని ఆకారంలో క్లియర్‌గా ఉండే ప్లాస్టిక్ బ్లాంక్ తయారు అవుతుంది. ఈ ప్లాస్టిక్ లేయర్ మీద తళతళ మెరిసే అల్యూమినియమ్ పొరను (రిఫ్లెక్టింగ్ సర్ఫేస్) ప్లాస్టిక్‌కు అంటుకు పోయేట్లు ఏర్పాటు చేస్తారు.

ప్రీ-రికార్డెడ్ మ్యూజిక్ సిడీలను కూడా గ్రామఫోన్ రికార్డుల లాగానే తయారు చేస్తారు. అయితే పద్ధతిలో కొన్ని మార్పులు ఉంటాయి. ముందుగా మాస్టర్ సిడి చేస్తారు. దీనిని పాజిటివ్ ఇమేజ్ అంటారు. ఇందులో మైక్రోస్కోపిక్ పిట్స్, లాండ్స్ ఉంటాయి. దీని నుంచి 'మెటల్ డై' (లోహపు అచ్చు) చేస్తారు. దీనిని నెగటివ్ ఇమేజ్ అంటారు. ఇవి ఎన్నైనా చేయవచ్చును.

ఈ అచ్చుని ప్రెస్‌లో ఉంచి బ్లాంక్ సిడి మీద ఒత్తుతారు. ఇలా చేయటము వలన డై మీద ఉన్న ఫిజికల్ ఇమేజ్ బ్లాంక్ సిడి మీదకు బదిలీ అవుతుంది. తరువాత సిడిమీద లాకర్ కోటింగ్ ఇస్తారు. సిడి అంచుల మీద కూడా లాకర్ కోటింగ్ ఇస్తారు. తర్వాత లాకర్ కోటింగ్ మీద సిడి సంబంధించిన సమాచారాన్ని స్క్రీన్ ప్రింట్ లేదా ఆఫ్‌సెట్ ద్వారా ప్రింట్ చేస్తారు.

సిడిప్లేయర్‌లో ఉద్భవించే లేజర్ బీమ్ సిడి అడుగుభాగము నుంచి ప్రసరించి అల్యూమినియమ్ మెటల్ పొరమీద పడిన లైట్ రిఫ్లెక్ట్ అవుతుంది. ఈ రిఫ్లెక్ట్ అయిన లైట్ యొక్క గాఢత (ఇన్‌టెన్‌సిటీ) లో మార్పువస్తుంది. ఈ మార్పును ఫోటోడయోడ్

సాధనము ద్వారా సిడిలోని డేటాను మనకు అందిస్తుంది. అంటే శబ్దరూపంలో వినిపిస్తుంది. ఈ విధంగా బ్లాంక్ సిడి నుండి ప్రీ-రికార్డెడ్ మ్యూజిక్ సిడిని పైన చెప్పిన పద్ధతిలో కొన్ని సెకండ్లలో ఒక్కొక్క సిడి చొప్పున తయారు చేస్తారు.

**ఆడియో డివిడి :** డిజిటల్ ఫార్మాట్‌లో మంచి క్వాలిటి ఉన్న శబ్దాన్ని డివిడి ఆడియో సిడిలో రికార్డు చేయవచ్చును. తిరిగి వినవచ్చును. డివిడి ఆడియో ప్లేయర్స్ 2000వ సంవత్సరములో మార్కెట్‌లోకి వచ్చాయి. ఖరీదు ఎక్కువగా ఉండడము చేత విజయవంతము కాలేదు. డివిడి ఆడియో వలన చాలా ఉపయోగాలున్నాయి. దీనివలన ఆడియో ఛానెల్స్ పెరుగుతాయి. ఎక్కువ సంఖ్యలో పాటలు రికార్డ్ చేయవచ్చును. అంటే ప్లేయింగ్ టైము బాగా పెరుగుతుంది. శబ్దము నాణ్యత, సిడిలో వచ్చే శబ్దము నాణ్యత కన్నా హెచ్చుగా ఉంటుంది.

**గ్రామ్‌ఫోన్ రికార్డులా ? సిడిలా ? :** ఆడియో సిడీలు విడుదల అయినప్పుడు చాలామంది శ్రోతలు రికార్డ్స్ నుంచి వచ్చే శబ్దము సిడీల నుంచి వచ్చే శబ్దముకన్నా వినసొంపుగా ఉండేది అంటూ రికార్డులనే ఇష్టపడేవారు. దీనిని కొంతమంది ఇంజనీర్స్ వ్యతిరేకించేవారు. మరి కొందరు ఒప్పుకునేవారు.

కాంపాక్ట్ డిస్క్ ప్లేయర్స్‌ను ప్రారంభంలో తయారు చేసినప్పుడు డిజిటల్‌లో ఎనలాగ్ కన్వర్టర్స్ అనుకున్న స్థాయిలో ఉండకపోవడం చేత శబ్దము నాణ్యత రికార్డ్ నుంచి వచ్చే శబ్దము నాణ్యత కన్నా తక్కువ ఉండేదట. తరువాత డిజిటల్ ఆడియో టెక్నాలజీ అభివృద్ధి పరిచి దానితో తయారు చేసిన సిడి ప్లేయర్స్‌లో నాణ్యత పెంచారు.

సిడిలో ఫ్రీక్వెన్సి రేంజ్ 2HZ to 22500 HZ ఉంటుంది. కాని గ్రామఫోన్ రికార్డునుంచి వచ్చే శబ్దము అప్పర్ ఫ్రిక్వెన్సీ 30000 HZ దాకా ఉంటుంది. గ్రామఫోన్ తిరుగుతున్నప్పుడు వచ్చే లో ఫ్రీక్వెన్సీ 20HZ శబ్దము రేంజిని వినపడకుండా చేస్తుంది. మానవులు వినికిడి రేంజ్ 20HZ నుంచి 20000 HZ. కాని అతి తక్కువ, అతి ఎక్కువ అయిన శబ్దము యొక్క ఫ్రీక్వెన్సీలో వినబడే స్త్రోమత మనిషి మనిషికి మారుతుంది. అదీకాక గ్రామఫోన్ రికార్డుల నుంచి సంగీతాన్ని సిడీల రూపంలో చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొకపోయినా శబ్దము నాణ్యత సిడిలలో తగ్గుతుంది.

మనదేశంలో హెచ్ఎంవి కంపెనీ వారు ఎంతో మంచి సంగీతాన్ని ఆడియో సిడిలుగా తయారుచేసి విక్రయిస్తున్నారు. ప్రారంభములో వివిధ భాషలలోని సంగీతాన్ని లండన్‌లో ఇఎంఐ కంపెనీలో సిడీలుగా తయారు చేయించి మనదేశంలో అమ్మేవారు. అందులో 16 నుంచి 20 పాటలు ఉండేవి. సిడి ఖరీదు 360 రూపాయలు ఉండేది. తర్వాత మనదేశంలో తయారుచేయడం ప్రారంభించారు. ధర క్రమంగా తగ్గుతూ వచ్చి ఇప్పుడు 109 రూపాయలు అయింది.

**ఎంపి 3 ఫార్మాట్ (MP3 Format):** ఇది ఆడియో స్టోరేజిలో ఒక నూతన పద్ధతి. ఈ పద్ధతిలో డిజిటల్ ఆడియో కంప్రెస్ చేసి స్టోర్ చేసి తిరిగి వినటానికి అనుకూలంగా ఉండే పద్ధతి. ఈ MP3 ఆడియో ఫార్మాట్‌ను డిజైన్ చేసిన వారు Moving Picture Experts Group-MPEG.

ఈ పద్ధతి 2003 నుంచి అమలులోకి వచ్చింది. దీని వలన తక్కువ స్పేస్‌లో ఎక్కువ డేటాను స్టోర్ చేయవచ్చును. అంటే మామూలు (కంప్రెస్ చేయని) ఆడియో పద్ధతిలో చాలా తక్కువ పాటలు ఉంటాయి. ఎంపి 3 ఫార్మాట్‌లో ఎక్కువ డేటాను కంప్రెస్ చేసి పెట్టటము వలన వందల పాటలు వినవచ్చును. పాటల నాణ్యత కంప్రెస్ చేసే పద్ధతిని బట్టి ఉంటుంది. ఆడియో లేదా డివిడి ప్లేయర్స్‌లో ఎంపి 3 ఫార్మాట్‌లోని సంగీతము కూడా వినవచ్చును.

ఎంపి 3 ఫార్మాట్‌లో ఆడియో సిడీలు విరివిగా విడుదల అవుతున్నాయి. దీని వలన రికార్డింగ్ కంపెనీల వ్యాపారము క్రమేణా తగ్గిపోతున్నది. పాటల సిడీని చాలా సులభంగా కాపీ చేయవచ్చును.

## సోని డిఎడిసి (Sony Digital Audio Disc Corporation - DADC)

సోని డిఎడిసి కాంపాక్ట్ డిస్క్‌లు, డివిడిలు, బ్లూరే డిస్క్‌లు తయారుచేసే (Home entertainment Services) సంస్థ.

ఈ సంస్థ వారికి సంబంధించిన గ్రామఫోన్ రికార్డు లేబుల్స్ పాటలే కాక ఇతర సంస్థల లేబుల్స్ సంబంధిత పాటలను కూడా సీడీలుగా తయారుచేసి విక్రయిస్తారు.

ఈ సంస్థ ప్రపంచంలో అనేక దేశాలలో వినైల్ గ్రామఫోన్ రికార్డులు చేసే సంస్థలను కొనగోలు చేసారు. మనదేశంలోని సి.బి.యస్. రికార్డ్సు సంస్థ కూడా సోని యాజమాన్యానికి చెందింది. ప్రపంచంలో ఆడియో సీడీలు తయారుచేసి విక్రయించే అతి పెద్ద సంస్థ.

మనదేశంలోని సరెగమ (ఇంతకుముందు HMV) సంస్థ నుంచి లైసెన్స్ తీసుకుని ఆడియో సీడీలను విడుదల చేస్తున్నారు సోని డిఎడిసి. ఆ సీడీల మీద సరెగమ లేబుల్‌తో పాటుగా Manufactured Marketed and Distributed by Sony DADC అని ఉంటుంది. (ఉదాహరణకు ఘంటసాల గానం చేసిన 'భగవద్గీత' సిడి).

ఇలాగ సోని డిఎడిసి సంస్థ సంగీత ప్రపంచానికి తమ వంతు సేవలు అందిస్తున్నారు.

## డాల్బీ సిస్టమ్స్ (DOLBY SYSTEMS)

వినడానికి చెవికి ఇంపుగా ఉన్న శబ్దాలను సంగీత స్వరాలని (Musical Sounds), వినటానికి కఠోరంగా ఉన్న శబ్దాలను చప్పుళ్ళు (Noises) అని అంటారు.

శబ్దాన్ని రికార్డింగ్ చేసేటప్పుడు రకరకాల చప్పుళ్ళు కూడా రికార్డు అవుతాయి. ఈ సమస్య ఉందని తెలిసినా వాటిని తొలగించే లేదా తగ్గించే సాధనాలు లేకపోవటము వలన సంగీతాన్ని అలాగనే రికార్డు చేసేవారు.

రికార్డింగ్‌లో చొరబడే చప్పుళ్లను తగ్గించాలని (Noise Reduction) పరిశోధనలు చేసిన వ్యక్తి రేడాల్బి (Ray Dolby). ఇతను అమెరికా దేశస్థుడు.

**1965**లో రేడాల్బి బ్రిటన్ దేశములో డాల్బి లేబరేటరీస్ (Dolby Laboratories) స్థాపించాడు. **1976**లో వాటిని అమెరికా దేశానికి తరలించారు.

డాల్బి లేబరేటరీస్ అనేక పరిశోధనలు చేసి చప్పుళ్ళను తగ్గించే వివిధ పద్ధతులను కనుగొన్నారు. వీటిని డాల్బి సిస్టమ్స్ అంటారు.

**డాల్బి - ఎ (Dolby - A) :**

ప్రప్రథమంగా డాల్బి కంపెనివారు ఈ పద్ధతిని కనుగొన్నారు. ఈ సాధనము వలన రికార్డింగ్‌లో వచ్చే చప్పుళ్ళను కొంత భాగము తగ్గించవచ్చును (Noise

Reduction). 1966లో ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ సాధనము ప్రొఫెషనల్ రికార్డింగ్ స్టూడియోలకు సరఫరా చేసేవారు.

**డాల్బి - బి (Dolby - B) :**

1968లో డాల్బి - బి పద్ధతిని కనుగొని కన్స్యూమర్ మార్కెట్‌లో ప్రవేశపెట్టారు. ఈ సాధనాలను ప్రీ రికార్డెడ్ మ్యూజిక్ కాసెట్స్ కంపెనీలకు సప్లై చేసారు. ఈ పద్ధతిలో కొంత భాగము నాయిస్ తగ్గి కాసెట్స్ రికార్డింగ్ నాణ్యత పెరిగింది. ఈ నాయిస్ తగ్గించే సాధనాన్ని కాసెట్ టేప్ రికార్డర్స్, టేప్‌డెక్స్‌లో కూడా అమర్చబడింది.

**డాల్బి స్టీరియో (Dolby Stereo) :**

డాల్బి లేబరేటరీస్ డాల్బి స్టీరియో పద్ధతిని 1975లో ప్రవేశపెట్టారు. చిత్రసీమలో శబ్దాన్ని రికార్డు చేయటానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడింది.

ఈ పద్ధతిలో ఆడియో ఛానెల్స్ నాలుగు వరకు పెరిగాయి. అన్ని ఛానెల్స్‌లోను నాయిస్ రిడక్షన్ ఉంటుంది. 1977లో విడుదల అయిన ఇంగ్లీషు చిత్రం 'Star Wars' ఈ పద్ధతిలో రికార్డు చేయబడింది.

**సరౌండ్ సౌండ్ (Surround Sound) :**

సినిమా థియేటర్‌లో కూర్చున్న ప్రేక్షకులకు మల్టిపల్ ఆడియో ఛానెల్స్‌లో రికార్డు చేయబడిన శబ్దాన్ని చుట్టూరా అమర్చబడిన స్పీకర్స్ ద్వారా దేనికదే ప్రత్యేకంగా వినిపించే ప్రక్రియను సరౌండ్ సౌండ్ అంటారు.

**డాల్బి సరౌండ్ (Dolby Surround) :**

సినిమా హాలులో వినగలిగిన సరౌండ్ సౌండ్‌ను ఇంటిలోనే వినగలిగే సౌకర్యాన్ని 1982లో డాల్బి థియేటర్ వినియోగ దారులకు ప్రవేశపెట్టింది.

ఈ పద్ధతిలో టి.వి., వీడియో రికార్డ్ ప్లేయర్, డి.విడి రికార్డు ప్లేయర్ గదిలో చుట్టూరా అమర్చబడిన స్పీకర్స్ ఉంటాయి. దీనినే హోమ్ థియేటర్ (Home Theatre) అంటారు.

**డాల్బీ యస్.ఆర్. (Dolby SR - Spectral Recording) :**

ఇది చాలా శక్తివంతమైన నాయిస్‌ను తగ్గించే సాధనం. ఈ పద్ధతిని డాల్బీ సంస్థ 1986లో ప్రవేశపెట్టింది.

ఇది ప్రొఫెషనల్ రికార్డింగ్‌కు వాడే యంత్రాలలో వాడుతారు. సినిమాలలో శబ్దాన్ని రికార్డు చేయటానికి వాడుతారు. ఇందులో మొత్తము నాలుగు ఆడియో ఛానల్స్ ఉంటాయి. డిజిటల్ రికార్డింగ్ వచ్చాక దీనికి ప్రాముఖ్యత తగ్గింది.

**డాల్బీ డిజిటల్ (Dolby Digital) :**

డాల్బీ డిజిటల్ రికార్డింగ్ పద్ధతిలో శబ్దాన్ని ఆరు ఛానల్స్‌లో రికార్డు చేస్తారు. డాల్బీ సంస్థ ఈ పద్ధతిని 1994లో ప్రవేశపెట్టింది. సినిమా ఫిల్మ్ మీద డాల్బీ డిజిటల్ సౌండ్‌ను రికార్డు చేస్తారు. దీనివలన నాయిస్ బాగా తగ్గి శబ్ద నాణ్యత బాగా పెరుగుతుంది.

సినిమా హాలులో ఈ శబ్దము మొత్తము ఆరు స్పీకర్స్ నుంచి వినపడుతుంది. ఇందులో అయిదు స్పీకర్స్ నుంచి ఫుల్ రేంజిలో (20 HZ - 20,000 HZ) శబ్దము వినబడుతుంది. ఆరో ఛానల్ నుంచి వచ్చే శబ్దము సబ్ వూఫర్ స్పీకర్ లోంచి వినబడుతుంది. ఇవి లో ఫ్రీక్వెన్సీ శబ్దాలు (20 HZ - 120 HZ). స్పీకర్స్ సినిమా హాలులో మధ్యన, ప్రక్కన, వెనుక అమర్చబడతాయి. ఇప్పుడు 8 ఛానెల్స్‌లో శబ్దాన్ని రికార్డు చేసే పద్ధతులు వచ్చాయి.

ఈవిధంగా చప్పుళ్ళను తగ్గించి శబ్దములో నాణ్యత పెంచాలని డాల్బీ సంస్థ ఎంతో కృషి చేసింది.

**5.1 సరౌండ్ సౌండ్ అంటే ఏమిటి :**

హాలులో చుట్టూరా ఉన్న స్పీకర్ల సంఖ్యను తెలుపుతుంది. 5.1లో అయిదవ సంఖ్య అయిదు స్పీకర్లను తెలియచేస్తుంది. 0.1 అనేది ఆరో స్పీకర్. దీన్ని సబ్ వూఫర్ స్పీకర్ అంటారు. ఆరు ఆడియో ఛానల్స్‌లో రికార్డు అయిన శబ్దము ఆరు స్పీకర్ల ద్వారా వినబడుతుంది.

6.1 సరౌండ్ సౌండ్ అంటే మొత్తము ఏడు స్పీకర్స్ ఉంటాయి. ఏడు ఆడియో ఛానల్స్ ఉంటాయి.

7.1 సరౌండ్ సౌండ్ అంటే ఎనిమిది స్పీకర్లు, ఎనిమిది ఆడియో ఛానల్స్ ఉంటాయి.

**హోమ్ థియేటర్ :**

హోమ్ థియేటర్‌లో వాడే డివిడి ప్లేయర్‌లు 5.1 చానల్స్ అని రాసి ఉంటుంది. అంటే మొత్తము ఆరు ఆడియో ఛానల్స్ నుంచి వచ్చే శబ్దము ఆరు స్పీకర్ల నుంచి వస్తుంది.

## డిటియస్ - DTS (Digital Theatre System)

"డిజిటల్ సరౌండ్ సౌండు'' టెక్నాలజీలో పరిశోధనలు చేస్తున్న సంస్థ - డిజిటల్ సౌండ్ స్పేస్ కాంపిటీటర్ ! దీని యాజమాన్యము DTS (NASDAQ DTSL). దీనిని ఇంతకు పూర్వము డిజిటల్ థియేటర్ సిస్టమ్ సంస్థ అని పిలిచేవారు. వీరు సినిమాకు, మార్కెటింగ్‌కు కావలసిన సౌకర్యాలను అందించటములో కృషి చేయడంతో బాటు మల్టిఛానెల్ ఆడియో రికార్డింగ్‌లో పరిశోధనలు కూడా చేస్తున్నారు.

డాల్బీ లాబరేటరీస్ వారు డాల్బీ డిజిటల్ రికార్డింగ్ గురించి పరిశోధనలు చేస్తున్న సమయంలోనే డిటియస్ వారు కూడా 1991 నుంచి పరిశోధనలు ప్రారంభించారు. వీరు 5.1 ఛానెల్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. ఇది డాల్బీ డిజిటల్ పద్ధతి లాంటిదే. ఈ పద్ధతిలో అయిదు ప్రధాన ఆడియో ఛానెల్స్‌తో బాటుగా ఒక స్పెషల్ ఛానెల్ ఉంటుంది. ఈ స్పెషల్ ఛానెల్‌లో నుంచి లో ఫ్రీక్వెన్సీ ఎఫెక్ట్స్ సబ్-వూఫర్ నుంచి వినిపిస్తాయి.

డాల్బి డిజిటల్, డిటియస్ పద్ధతులు డివిడిల తయారీలో, హోమ్ థియేటర్లలో ఉపయోగిస్తున్నారు. అంతేకాక ఫిల్మ్‌మీద ఆడియో రికార్డింగ్‌కు కూడా వాడుతున్నారు. స్పీల్‌బెర్గ్ "జురాసిక్ పార్క్'' డిటియస్ పద్ధతిలో రికార్డు చేయబడింది. ఇటీవలే రంగుల్లో విడుదల అయిన "మాయబజార్'' చిత్రంలో డిటియస్ పద్ధతిలో శబ్దాన్ని రికార్డ్ చేసారు.

## యస్.డి.డి.యస్ (SONY DYNAMIC DIGITAL SOUND)

సినిమాలలో శబ్దాన్ని రికార్డు చేయటానికి జపాన్‌లోని సోని కంపెనీవారు ప్రవేశపెట్టిన పద్ధతి - యస్‌డిడియస్ (సోనీ డైనమిక్ డిజిటల్ సౌండ్). ఈ పద్ధతివలన ఫిల్మ్‌మీద స్వతంత్రముగా 8 ఛానెల్స్‌లో శబ్దాన్ని రికార్డు చేయవచ్చు.

## వీడియో సిడి (VIEW CD - VCD)

వీడియోను కాంపాక్ట్ డిస్క్‌మీద స్టోరేజి చేయటానికి వాడిన డిజిటల్ ఫార్మాట్ యిది. విసిడికి కావలసిన ప్రమాణాలను 1993లో సోనీ, ఫిలిప్స్, జె.వి.సి. మొదలైన కంపెనీలు ప్రవేశపెట్టాయి. మొట్టమొదటి సారిగా ఈ ఫార్మాట్‌ను సినిమాలను విడుదల చేయటానికి వాడారు.

1970లో ఫిలిప్స్ కంపెనివారు లేజర్ డిస్క్‌ను కనుకొన్నారు. ఇది సైజులో పెద్దది. 1980లో ఫిలిప్స్‌వారే చిన్న సైజులో ఎ (4.8 అం॥ వ్యాసం)తో లేజర్ డిస్క్‌ను కనుగొన్నారు. దీనికి కాంపాక్ట్ డిస్క్ అని నామకరణము చేసారు. ఇది మ్యూజిక్ ఇండస్ట్రీలో చాలా విజయవంతమైనది.




వీడియో సిడి

ఫిలిప్స్ కంపెనీవారు ఈ కాంపాక్ట్ సిడిమీద చిత్రాలను స్టోర్ చేసి సిడి వీడియో (CD-V) ప్రవేశపెట్టాలని పరిశోధనలు చేసి **1990** దశకంలో **83** నిముషాల నిడివిలో వీడియో మరియు ఆడియోను స్టోర్ చేయగలిగారు. ఇలాగ వారి పరిశోధనలు విజయవంతమయ్యాయి.

ఈ ఫార్మాట్‌ను వీడియో సిడి లేదా విసిడి (VCD) అని పేరు పెట్టారు.

విసిడిలోని సినిమాలు కాపీ చేయటము చాలా సులభమగుటవలన విదేశాలలో వీటి విడుదల ఆపుచేసారు. కాని ఆసియాలో చాలా పాపులర్ అయింది. భారతదేశములో ఇప్పటికి సినిమాలు విసిడి ఫార్మాట్‌లో వస్తూనే ఉన్నాయి. ఈనాటికి ప్రజలు ఆదరిస్తున్నారు.

## డిజిటల్ వర్సటైల్ డిస్క్ (DVD)

సినిమాల నాణ్యత చెడకుండా విడుదల చేయాలనే ఉద్దేశంతో డివిడిని **1995**లో ఫిలిప్స్, సోనీ, నేషనల్ పెనాసోనిక్, తోషిబా మొదలైన కంపెనీలు తయారు చేసారు. డివిడిలో స్టోరేజి కెపాసిటి ఎక్కువ. పిక్చర్ నాణ్యత విసిడి కన్నా చాలా రెట్లు బాగుంటుంది. అందుకని **1998**లో ఇవి మార్కెట్‌లో ప్రవేశపెట్టబడినాయి. డివిడిలను ప్లే చేయటానికి




డివిడి

ప్లేయర్లను కూడా విడుదల చేసారు. ఇవి బహుళ ప్రజాదరణ పొంది వీడియో కాసెట్స్ వ్యాపారమును దెబ్బతీసింది. వీడియో కాసెట్ల తయారి నిలిపివేయబడింది.

**ప్రీ-రికార్డెడ్ డివిడి :** ప్రీ-రికార్డెడ్ డివిడిలను అత్యధిక సంఖ్యలో తయారు చేయవచ్చును. మాస్టర్ నుంచి డేటాను బ్లాంక్ డివిడి మీదకు ట్రాన్సఫర్ చేసే పద్ధతులు వచ్చాయి. ఈ డివిడిలోని సమాచారాన్ని చూడవచ్చు. చెరిపి వేయటానికి మళ్ళీ రికార్డు చేయటానికి వీలుండదు.

బ్లాంక్ డివిడిలమీద డివిడి రికార్డర్ ద్వారా సమాచారాన్ని కాపీ చేయవచ్చును. వీటిని డివిడి రికార్డబుల్ (DVD-R) అనిపిలుస్తారు.

అలాగే డివిడి-రీ రైటబుల్ అనే సిడిలు వస్తున్నాయి. వీటిలో డేటాను చెరిపివేసి మళ్ళీ రికార్డు చేయవచ్చును. వీటిని DVD-RW అనిపిలుస్తారు.

**సిడి కాపీయింగ్ :** కంప్యూటర్‌లో సిడి నుంచి కాపీ చేసుకొని తిరిగి రైట్ చేసే పద్ధతిలో తేడా ఉంటుంది. రికార్డబుల్ సిడీల (సిడి-ఆర్) తయారీలో కొంచెం తేడా ఉంటుంది. సిడి-ఆర్ లను ఇంజెక్షన్ మౌల్డింగ్ పద్ధతిలో తయారు చేస్తారు. ఫోటో సెన్సిటివ్ డై ను సిడికి అప్లయి చేస్తారు. తరువాత అల్యూమినియమ్ మెటల్ పొరను ఏర్పాటు చేస్తారు. తరువాత లాకర్ (Lacqer) కోటింగ్ ఇస్తారు.

సిడి రికార్డర్‌లో సిడిని కాపి చేస్తున్నప్పుడు లేజర్ బీమ్ డై రంగులో మార్పు తెస్తుంది. దీనినే బర్నింగ్ అంటారు. దీని వలన సిడి మీద పిట్స్, లాండ్స్ ఏర్పడతాయి. దీనివలన రిఫ్లెక్ట్ అయిన లైట్ ఇంటెన్సిటి మారుతుంది. అంటే డేటా రికార్డు అవుతుంది.

## కంప్యూటర్ శకం

కంప్యూటర్ అనేది ఒక ఎలక్ట్రానిక్ సాధనము. ఏదైనా ఒక సమస్యకు సంబంధిత సమాచారాన్ని (డాటా) ఇచ్చినప్పుడు దాన్ని స్వీకరించి, ముందుగా ఇవ్వబడిన ప్రోగ్రాము ప్రకారం డేటాని విశ్లేషించి ఫలితాలను అందచేస్తుంది. దీని చరిత్రలోకి వెళితే -

క్రీస్తుపూర్వము 2000వ సం॥నికి ముందే చైనా దేశస్థులు అబాకస్ అనే చెక్క సాధనాన్ని కూడికలు, తీసివేతలు, గుణింతాలకు వాడేవారు.

జాన్ నేపియర్ 1617 సంవత్సరములో లాగరిథమిక్ టేబుల్స్‌ని కనిపెట్టాడు. ఈ టేబుల్స్‌ను ఉపయోగించి గుణకారాలు, భాగహారములు చాలా సులభంగా చేయ వీలయింది.

1620 ప్రాంతంలో లాగరిథమిక్ టేబుల్స్‌నుపయోగించి విలియమ్ ఆట్రెడ్ స్లయిడ్ రూల్ కనుగొన్నాడు. కాలిక్యులేటర్స్ రాకముందు ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ స్లయిడ్‌రూల్‌ను వాడేవారు, శాస్త్రవేత్తలు కూడా వాడేవారు.

1642లో బ్లయిజ్ పాస్కల్ పెద్ద పెద్ద లెక్కలను వేగవంతముగా చేయటానికి పాస్కల్ యంత్రం కనుగొన్నాడు.

1671లో లీబిగ్ అనే జర్మన్ శాస్త్రవేత్త తన పేరు మీదుగా లీబిగ్ కాలిక్యులేటర్ అనే సాధనాన్ని కనిపెట్టాడు.

1804లో జోసఫ్ జాక్వర్డ్ అనే శాస్త్రవేత్త 'పంచ్‌డ్ కార్డ్స్' ను తన వీవింగ్ ఫ్యాక్టరీలో ప్రవేశపెట్టి అల్లికలో రకరకాల నమూనాలు చేయటానికి ఉపయోగించాడు.

1833లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేసే గణిత శాస్త్రజ్ఞుడు చార్లెస్ బాబేజ్ ఎనలిటికల్ ఇంజన్ అనే యంత్రాన్ని కనుగొన్నాడు. దీనిలో డేటాను నిల్వ ఉంచే వీలు ఉంది. ఇది అర్థమిటికల్ కాలిక్యులేషన్స్ చేయగలగిన యంత్రము. ఈ పరిశోధన కంప్యూటర్లను తయారు చేయటానికి నాంది పలికింది.

1890 ప్రాంతంలో జనాభా లెక్కల డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే హెర్మన్ హోల్‌రీత్ (Hermann Hollerith) పంచ్‌డ్ కార్డ్సు ఆధారముగా చేసుకుని అంకెలను గుర్తించే యంత్రం 'సెన్సస్ మిషన్'ను తయారు చేసాడు. ఈ మెకానికల్ యంత్రము వలన జనాభా లెక్కలను వేగముగా విశ్లేషించటానికి ఉపయోగపడింది. ఈ హోల్‌రీత్ స్థాపించిన సంస్థ - ఐబిఎం ! ఈ సంస్థ

1936లో మొదటిసారిగా ఎనలాగ్ కంప్యూటర్స్‌ను ప్రవేశపెట్టింది. ఇది విద్యుచ్ఛక్తితో పనిచేస్తుంది.

1940లో జాన్ న్యూమెన్ బైనరీ నంబర్స్ (0,1) ప్రవేశపెట్టి కంప్యూటర్ డిజైన్‌లో ఒక విప్లవాన్ని సృష్టించాడు.

1948లో హార్వార్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన హోవార్డ్ ఇకెన్స్ సహాయంతో కంప్యూటర్ తయారు చేసాడు. దీనికి మార్క్-1 కంప్యూటర్ అని నామకరణం చేసారు. ఇది ఇంతకు ముందున్న వాటికంటె వేగవంతముగా విశ్లేషణలను అందించేంది. దీనిలో మాగ్నటిక్ రిలేలు ఉపయోగించబడినది.

**1946**లో శాస్త్రవేత్తలు బ్రాడీన్, బ్రాట్టెన్ , షాక్‌లె ట్రాన్సిస్టర్‌ను కనుగొనటము వలన ఎలక్ట్రానిక్స్ రంగంలో విప్లవాలు సృష్టించబడ్డాయి. ఇవి కంప్యూటర్స్‌లో ప్రధాన భాగాలుగా వాడబడ్డాయి. వీటివలన కంప్యూటర్ల సైజు తగ్గింది. మెమొరి పెరిగింది, ఫలితాలను తెలపడం వేగవంతం అయింది.

**1949** నుంచి **1955** కాలంలో (మొదటి తరం) కంప్యూటర్స్‌లో వాక్యూమ్ ట్యూబ్స్ వాడేవారు. **1956** నుంచి **1965** వరకు **2**వ తరంలో ట్రాన్సిస్టర్స్‌ను వాడటము మొదలుపెట్టారు. **1966** నుంచి **1975** ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్‌ను వాడేవారు. (ట్రాన్సిస్టర్స్‌లో వాడబడే జర్మేనియమ్ పదార్ధానికి బదులుగా సిలికాన్‌ను వాడి సిలికాన్ ట్రాన్సిస్టర్స్ తయారీ ప్రారంభమయింది) దీనివలన ఎక్కువ సంఖ్యలో ట్రాన్సిస్టర్స్, డయోడ్స్, కెపాసిటర్స్, రెసిస్టర్లను చాలా చిన్న సైజులో ఉన్న చిప్‌గా తయారు చేస్తారు. దీన్ని మూడో జనరేషన్ కంప్యూటర్ అన్నారు.

**1975** నుంచి తయారైన కంప్యూటర్స్ మైక్రో ప్రాససెర్‌ను ఉపయోగించి చేయబడినయి. అంటే కంప్యూటర్‌కు అవసరమైన సర్క్యూట్ మొత్తాన్ని ఒకే సిలికాన్ చిప్‌మీద ఉంటుంది. ఇది **4**వ తరం కంప్యూటర్.

ఐదో తరం కంప్యూటర్లు కూడా రాబోతున్నాయి. ఈ విధంగా టెక్నాలజీ అభివృద్ధి చెందుటవలన కంప్యూటర్స్ వ్యాపారములో, వైద్యంలో, వ్యవసాయము మొదలైన రంగాలలో, పరిశోధనలకు, ఉపగ్రహాలు, అణుబాంబుల తయారీలోను, ఇంజనీరింగ్ మొదలగు రంగాలలో ఎన్నోరకాలుగా ఉపయోగపడుతున్నాయి. నేడు సంగీతం వ్యాప్తికి కూడా కంప్యూటర్లదే ప్రధాన పాత్ర.

## ఇంటర్‌నెట్

నెట్‌వర్క్ అంటే కొన్ని కంప్యూటర్లను ఒక భవనంలోగాని లేదా ఊరిలో కాని అనుసంధానించడం. పెద్దసంస్థలలో అనేక విభాగాలలో ఉన్న కంప్యూటర్లను అనుసంధానము చేసి ఆయా విభాగాలలో జరిగే పనులను తెలుసుకొనవచ్చును. ఇంతేకాక దూరముగా ఉన్న బ్రాంచీల కార్యకలాపాలను కూడా తెలుసుకోవచ్చు. ఇది **1970**లో ప్రారంభమైంది కానీ పెద్ద పెద్ద సంస్థలకు మాత్రమే పరిమితమయినది. కంప్యూటర్లను ప్రపంచవ్యాప్తంగా ఒకదానికొకటి అనుసంధానము చేసి ఎన్నో

విషయాలను తెలుసుకోవచ్చు. ఈ ప్రక్రియను ఇంటర్‌నెట్ అంటారు. దీనివలన ప్రపంచంలోని పరిజ్ఞానం చాలామందికి అందుబాటులోనికి వచ్చింది.

ఈ ఇంటర్నెట్ రూపకల్పన అభివృద్ధికి కారణమైన శాస్త్రజ్ఞులు ఐదుగురు ఉన్నారు. వారు క్లేడి షానన్, పాల్ బేరన్, బాబ్ టేలర్, డగ్లస్ ఏంగెల్ బార్డ్, లారీ రాబర్ట్స్. వీరిలో ఎవరు కృషి చేయకున్నా ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేది కాదు.

ఈ ఇంటర్‌నెట్ ద్వారా ఒకరికొకరు మెయిల్స్ పంపుకోవచ్చు. చాటింగ్ చేయవచ్చు. ఏ విషయాన్ని అయినా విపులంగా తెలుసుకోవచ్చు. సినిమాలు చూడవచ్చు. సంగీతం వినవచ్చు. టి.వి.సీరియల్స్ చూడవచ్చు. రేడియో కార్యక్రమాలు వినవచ్చు. వార్తలు చదువుకోవచ్చు, వినవచ్చు, రైల్వేటికెట్స్, సినిమా టికెట్స్ కొనవచ్చు ఇలాగా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఈ రోజులలో పర్సనల్ కంప్యూటర్స్ లేని గృహము లేదేమో అనిపిస్తుంది.

## ఐ-పాడ్ (I-POD)

ఆమెరికాలోని ప్రముఖ సంస్థ ఏపిల్ ఐపాడ్‌ను 2001లో కనుగొన్నది. దీని సృష్టికర్త అయిన స్టీవ్ జాబ్స్ యిటీవలే మరణించారు. ఇందులో సంగీతాన్ని డిజిటల్ పద్ధతిలో రికార్డ్ చేస్తారు. అందువలన శబ్దము నాణ్యత బాగుంటుంది. దీనిలో వున్న చిన్న హార్ట్ డిస్క్‌లో సాలిడ్ స్టేట్ టెక్నాలజీ ద్వారా డాటా స్టోరేజ్ చేస్తారు. సంగీతాన్ని కంప్రెస్ చేసి నిలువ చేస్తారు అందుకని చాలా తక్కువ స్పేస్‌లోనే వేల సంఖ్యలో పాటలు నిలువ చేయవచ్చును. పాటలు వినేటప్పుడు 'అన్‌కంప్రెస్' అయి వినిపిస్తాయి.

ఐపాడ్‌లో మ్యూజిక్ స్టోరేజ్ మాత్రమే కాకుండా కావలసిన పాట ఎక్కడ ఉన్నదో కూడా తెలుసుకొని వినవచ్చును. కంప్యూటర్ పద్ధతిలోనే సంగీతం రికార్డు అవుతుంది. ఈ సంగీతాన్ని ఇయర్‌ఫోన్స్ ద్వారా కాని, స్పీకర్స్ ద్వారా కాని వినవచ్చును. ఐపాడ్‌ను ఫోటోలు తీయడానికి, గంటల తరబడి వీడియోలను స్టోర్ చేసుకోవడానికి కూడా ఉపయోగించవచ్చును.

మొదట్లో దీనిలో స్టోరేజి కెపాసిటీ 5 జిబి వుండేది. 10 సంవత్సరాలలో 160

జిబికి చేరింది. కంప్యూటర్ పరిభాషలో మెమరీని బైట్స్‌లో కొలుస్తారు. కిలోబైట్ (కెబి), మెగా బైట్ (ఎంబి), జిగా బైట్ (జిబి). యిలా పెరిగిన కొద్దీ మెమరీ అధికమవుతూ ఉంటుంది.

## ఆండ్రాయిడ్


ఇది ప్రపంచములో ప్రసిద్ధిగాంచిన మొబైల్ ప్లాట్‌ఫామ్. ఈ డివైస్‌తో గూగుల్‌లో ఉన్న సమాచారాన్ని అంతటిని మొబైల్ ఫోన్‌లో వాడుకోవచ్చు. దీనితో వెబ్ బ్రౌజింగ్, హోమ్ సెర్చ్, ఇ-మెయిల్ మొదలైనవన్ని ఉంటాయి. ఇవే కాకుండా వేలకొలది పాటలు, సినిమాలు, వీడియో గేమ్స్ మొదలయినవి కూడా ఉంటాయి. అంటే ప్రపంచం మొత్తము మన గుప్పిటలో ఉన్నట్లుంటుంది. దీన్ని మినీ కంప్యూటర్ అంటారు.

## ఉపగ్రహం ద్వారా సినిమా ప్రదర్శన

సినిమాను సినిమా హాలులో చూడాలంటే ఫిల్మ్ ఉండాలి. దానిని వేసేందుకు సినిమా ప్రొజెక్టర్ ఉండాలి. ఒక సినిమా అనేక ఊళ్లలో, అనేకమైన థియేటర్లలో ప్రదర్శనలు చేయాలంటే ఫిలిమ్ ప్రింట్స్ చేయించాలి. ఖరీదుతో కూడుకున్న పని. అయితే విదేశాలలో మాదిరి శాటిలైట్ ద్వారా సినిమాను ప్రసారం చేసే సౌకర్యం భారతదేశంలో కూడా వచ్చింది. కంప్యూటర్‌ను ఆన్ చేస్తే అదే సినిమాను సినిమాహాలులో ఎక్కడైనా ప్రదర్శించవచ్చును. ప్రొజక్టర్ల అవసరముండదు. ఈ పద్ధతిలో ఫిల్మ్‌ప్రింట్స్ తీయనవసరము లేదు.

ఈ డిజిటల్ సినిమాలో ఒక ప్రింట్ చాలు. ఈ ప్రింట్ నుంచి టెలిసినీకి, ఆ తర్వాత డిజిటల్ మాస్టర్‌గా కన్వర్ట్ చేస్తారు. దీనిని శాటిలైట్‌కు అనుసంధానిస్తారు. అక్కడ నుండి శాటిలైట్ ద్వారా ఏయే సినిమా థియేటర్లలో ప్రదర్శించాలో అక్కడ ఉన్న సర్వర్ల లోనికి డౌన్‌లోడ్ చేస్తారు. థియేటర్లలో ఉండే ఇ-చిప్ ప్రొజక్టర్, సౌండ్ సిస్టమ్ ద్వారా సినిమా ప్రదర్శన జరుగుతుంది.

ఈ డిజిటల్ పద్ధతి వలన ఫిల్మ్ అవసరం ఉండదు. త్వరలో ఈ పద్ధతి రావచ్చు. శాటిలైట్ ద్వారా చిత్రాలు భారతదేశములో కొన్ని వందల థియెటర్స్‌లో



గ్రామఫోన్ రికార్డ్స్ కలక్టర్ డి.ఎస్. శంకర్ (వక్కలంక)




కనిగిరిలో గ్రామఫోన్ రికార్డ్స్ కలక్టర్ జె. మధుసూదన శర్మగారికి ఆత్మీయ సత్కారం

ప్రదర్శించబడుతున్నాయి. మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని థియేటర్ల యాజమాన్యము ఈ పద్ధతి ద్వారా చిత్రప్రదర్శనలు చేస్తున్నారు.

## ముగింపు

**'సంగీత ప్రపంచం'** పుస్తకాన్ని రచించాలనేది నా చిరకాల వాంఛ. కొన్ని సంవత్సరాల కృషి ఈనాటికి ఫలించింది. 'Err is Human' అంటారు. కనుక ఈ పుస్తకంలో తప్పులుండవచ్చు. ఉంటాయికూడ. ఆ తప్పులను మంచి మనస్సుతో మన్నించి నా కృషిని అభినందిస్తారని ఆశిస్తున్నాను.

గ్రామఫోన్ అన్నా, గ్రామఫోన్ రికార్డులన్నా నాకు ప్రాణం. కనుమరుగవుతున్న గ్రామఫోన్, వాటి రికార్డుల చరిత్రను తెలియచేయాలనే ఉద్దేశ్యమే ఈ పుస్తక ప్రచురణకు స్ఫూర్తి.

ఏమి సౌకర్యాలు లేని రోజులలో ఎందరో మహానుభావులు శబ్దాన్ని రికార్డు చేసి, నిల్వ ఉంచే పద్ధతులను తిరిగి ఆ శబ్దాన్ని వినే యంత్రాలను, సినిమా ప్రొజక్టర్లను అహోరాత్రులు శ్రమించి పరిశోధనలు చేసి కనుగొన్నారు. వారి కృషి ఫలితాన్ని మనము ఈనాడు అనుభవిస్తున్నాము, ఆనందిస్తున్నాము. కాని వారిని మనము తలుచుకోము, గుర్తుంచుకోము. వారిని గురించి తెలుసుకునే ప్రయత్నము కూడా చేయము.

అలాగే సంగీతానికి పునాదులు వేసి దినదినాభివృద్ధికి ఎందరో కళాకారులు శ్రమించారు.

ఆనాటి దేశ సంస్కృతీ సంపదలను ఈనాడు కూడా అందుబాటులో ఉంచే ప్రయత్నంలో ఎన్నో రికార్డింగ్ సంస్థలు (ఆడియో, వీడియో), ఇతర మాధ్యమాలు ఎంతో శ్రమిస్తున్నాయి.

ఈ సంస్థలు సాహసించి ఈ ప్రయత్నాలు చేయకపోతే ఆనాటి స్వర్గయుగ సంగీతముతో బాటుగా అనేక అద్భుత చిత్రాలను, వాటిలో నటించిన నటీనటులను, తెర వెనక ఉండి నడిపించిన నిర్మాతలను, దర్శకులను, రచయితలను, సంగీత దర్శకులను, గాయనీ గాయకులను, టెక్నీషియన్స్‌ను ... ఇలాగ ఎందరినో శాశ్వతముగా


మరచిపోయే ప్రమాదము ఉండేది. ముందు తరాల వారికి ఆనాటి వారి యొక్క గొప్పతనాన్ని తెలియచేసే అవకాశముండేదికాదు.




**ఎడిసన్ కనిపెట్టిన ఫోనోగ్రాఫ్**

ఫోనోగ్రాఫ్‌ను కనుగొని దాని ద్వారా శబ్దము రికార్డు చేసి, భద్రపరచి, తిరిగి వినగలిగే ప్రక్రియకు నాంది పలికి సంగీత ప్రపంచానికి పూలబాట వేసిన థామస్ అల్వా ఎడిసన్ చిరస్మరణీయుడు

ఇంతటి గొప్ప చరిత్రను సృష్టించిన మేథావులందరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఆ మహానుభావులను ఈ పుస్తకము ద్వారా పాఠకులు ఒకసారైనా తలుచుకునే అవకాశము కలుగుతుందని ఆశిస్తున్నాను.



సంగీత దర్శకుడు ఒ.పి.నయ్యర్‌గారితో డా॥ కె.వి.రావు



సంగీత దర్శకుడు ఎం.ఎస్.విశ్వనాథన్‌గారితో డా॥ కె.వి.రావు

# HIS MASTER'S VOICE



ఈ చిత్రంలోని కుక్క పేరు నిప్పర్. ఇంగ్లండ్ దేశములోని బ్రిస్టల్ నగరంలో 1884లో జన్మించింది. 1895లో మరణించింది.

1900 సంవత్సరమునుండి ఈ చిత్రాన్ని గ్రామఫోన్ కంపెని, లండన్‌వారు కంపెని "లోగో"గా వాడుతున్నారు.

జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ఈ విశాల ప్రపంచమంతా తరాలుగా, కోటానుకోట్ల మానవ హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని చరిత్ర సృష్టించింది.

1984లో గ్రామఫోన్ కంపెని (లండన్) వారు నిప్పర్ శత జయంతిని ఘనంగా జరిపారు.

ఇంతటి అదృష్టాన్ని పొందిన ఈ మూగజీవి నిప్పర్‌కు "జేజేలు". కుక్కపిల్లని పెంచిన యజమాని మార్క్ బరాడ్, చిత్రాన్ని గీచిన అతని సోదరుడు ఫ్రాన్సిస్ బరాడ్, "లోగో"గా వాడుతున్న గ్రామఫోన్ కంపెనీ వారు చరితార్థులు.



₹ 180/-